సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 227

శుక్రవారం 8-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'


జనహృదయనేతకు జన్మదిన శుభాకాంక్షలు
తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు
నిరంతరం అలుపెరుగక శ్రమిస్తున్న
మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
గాలి అనిల్‌కుమార్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 227
శుక్రవారం 8-11-2024


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



సఫారీ గడ్డపై సమరానికి సై
డర్బన్‌లో నేడు దక్షిణాఫ్రికా జట్టుతో భారత్ తొలి టి20 మ్యాచ్. -17లో



'ఫెడ్'కు ముందు అమ్మకాలు
బ్యాంకులు, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పోరాటం ఆపబోను
విజయతీరాలకు కాస్తంత దూరంలో నిలిచినా పోరాటం మాత్రం ఆపేదిలేదని డెమొక్రటిక్ నేత కమలా హారిస్ వ్యాఖ్యానించారు.
- వివరాలు 6లో ▶



బలోపేతం చేసుకుందాం
భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని మోదీ, ట్రంప్ నిర్ణయించుకున్నారు.
- వివరాలు 6లో ▶



ప్రమాణాలను మధ్యలో మార్చలేరు
ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలైన తర్వాత మధ్యలో అర్హతా ప్రమాణాలు మార్చడానికి వీల్లేదని సుప్రీం కోర్టు చెప్పింది.
- వివరాలు 6లో ▶



కశ్మీర్ అసెంబ్లీలో గందరగోళం
జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలన్న తీర్మానంపై అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు, మార్షల్స్ మధ్య తోపులాట చోటుచేసుకుంది.
- వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

నేడు సీఎం 'మూసీ' యాత్ర



రేవంత్‌రెడ్డి శుక్రవారం రైతులతో కలిసి మూసీ నది వెంట పాదయాత్ర ద్వారా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకుని మూసీ పరీవాహక ప్రాంత రైతులతో కలిసి కాల్వల్ని సందర్శిస్తారు.
- వివరాలు 2లో ▶

వచ్చే నెలలో పాదయాత్రలు, సభలు



రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతోపాటు ఎన్నికల హామీలను అమలుచేయకపోవటాన్ని ఎండగడుతూ డిసెంబర్ మొదటివారంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, సభలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.
- వివరాలు 2లో ▶

ఇన్ని స్కూళ్లెందుకు?



విద్యా కమిషన్ పాఠశాలలు కుదిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన ముందుకు తీసుకురావడం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో చాలా పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
- వివరాలు 7లో ▶

టెట్ ఫీజు తగ్గింపు



ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజును ప్రభుత్వం తగ్గించింది. గతంలో పేపర్‌కు రూ. వెయ్యి ఉన్న ఫీజును రూ.750గా చేశారు. పేపర్-1, పేపర్-2 రాసే అభ్యర్థులు గతంలో రూ. 2 వేలు చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు రెండింటికీ కలిపి రూ. వెయ్యి చెల్లిస్తే సరిపోతుంది.
- వివరాలు 2లో ▶



కేటీఆర్‌పై కేసుకు అనుమతినివ్వండి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ

ఫార్ములా-ఈ ఆపరేషన్స్‌కు రూ.55 కోట్ల చెల్లింపు వ్యవహారం

2018 అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతి కోరిన సర్కారు

- గవర్నర్ పరిశీలనలో లేఖ
- త్వరలో నిర్ణయం తీసుకునే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా- ఈ రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీ రామారావుపై కేసు నమోదు, విచారణకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు లేఖ రాసింది. ఈ లేఖ ప్రస్తుతం గవర్నర్ పరిశీలనలో ఉంది. దీనిపై ఆయన తీసుకునే నిర్ణయం కీలకంగా మారనుంది. ఈ-కార్ రేస్ వ్యవహారంపై 'కేటీఆర్ చుట్టూ 'ఫార్ములా-ఈ' ఉచ్చు' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. కాగా 2024 ఫిబ్రవరిలో ఈ కార్ రేస్ నిర్వహణ కోసం ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు జరిపిన రూ.55 కోట్ల చెల్లింపులపై విచారించడానికి 2018 అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17(ఏ) కింద అనుమతి కోరింది. ఈ చెల్లింపులకు అప్పటి హెచ్ఎండీఏ పాలకమండలి ఆమోదం కూడా లేదని, అంతేకాక ఈ నిధులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా విదేశీ మారకం రూపంలో చెల్లించినట్లు ప్రభుత్వం గవర్నర్‌కు రాసిన
మిగతా 2వ పేజీలో ▶

ఏమిటీ సెక్షన్ 17(ఏ)..

ప్రభుత్వాలు మారినప్పుడు గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు తీసుకున్న నిర్ణయాల్లో అవినీతి జరిగిదంటూ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేసులు నమోదు చేసి విచారణ చేసేందుకు అవకాశం ఉండడంతో.. ఆ కక్ష సాధింపును నివారించేందుకు 2018లో కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్ 17(ఏ)ను కొత్తగా చేర్చింది. ముఖ్యమంత్రి, మంత్రులను తొలగించే అధికారం గవర్నర్‌కే ఉన్నందున, వారు అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలపై, వారు మాజీలైన తర్వాత కేసులు నమోదు చేయాలన్నా, గవర్నర్ అనుమతి తప్పనిసరి. కాగా 2018లో చట్ట సవరణ తర్వాత నమోదు చేసే కేసులకు మాత్రమే ఇది వర్తిస్తుందని పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టం చేసింది.

ఆటంబాంబు పేలబోతోంది..

ఆ బాంబులు తుస్సుమనలేదు.. ప్రజలను మోసగించేందుకే కేటీఆర్ పాదయాత్ర డ్రామాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వర్ధన్నపేట/తొర్రూరు: తుప్పు బాంబు కాదు.. లక్ష్మీబాంబు కాదు.. రాజకీయ ఆటంబాంబు పేలబోతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుగా బీఆర్ఎస్ నేత (కేటీఆర్) తీరు ఉందన్నారు. తనను జైలుకు పంపిస్తారని.. జైలులో జిమ్ చేసి పాదయాత్ర చేస్తానని కేటీఆర్ చెప్పడాన్ని మంత్రి ఎద్దేవా చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా చోట్ల మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎవరినీ జైలుకు పంపించాలనే ఉద్దేశం ప్రభుత్వానిది కాదని, తప్పు చేస్తే ఉపేక్షించడం ఉండదన్నారు. తప్పు చేసిన వాళ్లపై ఆటంబాంబు పేలబోతోందని హెచ్చరించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయన్న తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, ఆ బాంబులు
మిగతా 2వ పేజీలో ▶

దేనికైనా రెడీ!

ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి నన్ను అరెస్టు చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది

కేసు పెడితే పెట్టుకో.. ఏ విచారణకైనా సిద్ధం

సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని రాజ్‌భవన్‌లో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు

నన్ను అరెస్టు చేస్తే జైల్లో యోగా చేస్తా.. ట్రిమ్‌గా వస్తా.. పాదయాత్ర చేస్తా

రేస్ నిర్వహణ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెంచేందుకే రూ. 55 కోట్లు ఖర్చు చేసినట్లు వివరణ

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా ఈ రేస్ నిర్వహణకు సంబంధించి నన్ను అరెస్టు చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. కేసు పెడితే పెట్టుకో. రెండు నెలలు లోపల వేసి పైశాచిక ఆనందం పొందుతానంటే, జైలులో మంచిగా యోగా చేసి ట్రిమ్‌గా వస్తా. ఆ తర్వాత పాదయాత్ర చేస్తా. ఉడుత ఊపులకు బెదరం. రాజ్‌భవన్‌లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్‌ను ఎలా ఖతం చేయాలని అనుకున్న మాట వాస్తవం. నా అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం ఆయన విచక్షణకు సంబంధించిన అంశం. ఏ విచారణకైనా సిద్ధం. దేనికైనా రెడీగా ఉన్నా. ప్రజల తరపున పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల దృష్టిని మళ్లించే
మిగతా 2వ పేజీలో ▶

పోలీసులకు 'ఆంబిస్' అస్త్రం!

నేర దర్యాప్తులో దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఏఐ టెక్నాలజీ వాడకం

నేరస్తుల ఫింగర్ ప్రింట్, ఐరిస్, పాదముద్రలు, ముఖ చిత్రాల సేకరణ

రష్యన్ నిపుణులతో ఇప్పటికే 60 మందికి శిక్షణ పూర్తి

పైలట్ ప్రాజెక్టు కింద ఐదు పోలీస్ స్టేషన్లలో ఆంబిస్ అమలు



సాక్షి, హైదరాబాద్: అత్యాధునిక టెక్నాలజీ వినియోగంలో ఎల్లప్పుడూ ముందుండే తెలంగాణ పోలీసులు మరో కీలక ముందడుగు వేశారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీసులు ఆంబిస్ (ఆటోమేటెడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టం)ను వాడేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరోకు చెందిన 60 మంది సిబ్బందికి రష్యన్ స్పెషల్ ట్రైనర్లతో టీఓటీ (ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్) శిక్షణ పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా కమిషనరేట్లలో కలిపి ఐదు పోలీస్ స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టు కింద ఆంబిస్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నట్లు ఒక పోలీస్ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అవసరమైన సాఫ్ట్‌వేర్లను సైతం అప్‌గ్రేడ్ చేసినట్టు చెప్పారు. ఆంబిస్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయని, అవసరమైన సమాచారాన్ని నూతన సెర్చింగ్ పద్ధతుల్లో పొందేలా సాంకేతిక ఏర్పాట్లు పూర్తయినట్టు వెల్లడించారు.

ఏమిటీ ఆంబిస్?

నేర దర్యాప్తులో కీలకమైన వేలిముద్రలు, అర చేతిముద్రలను విశ్లేషించి నివేదిక ఇచ్చేందుకు తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరో 2017 నుంచి ఆఫిస్ (ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం) సాంకేతికతను వినియోగిస్తోంది. దీన్ని మరింత ఆధునీకరిస్తూ ఆంబిస్ (ఏఎంబీఐఎస్)ను అందుబాటులోకి తెచ్చారు. కేంద్రం ఇటీవల తెచ్చిన నూతన క్రిమినల్ ప్రొసీజర్ ఐడెంటిఫికేషన్ చట్టం-2022 ప్రకారం
మిగతా 8వ పేజీలో ▶

ఫీజు పైసల్... ముందే వసూల్!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం
- దీంతో విద్యార్థుల నుంచే వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలు
- ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే విద్యార్థి ఖాతాలో జమ

3లో



శత్రు దేశాల ఉపగ్రహాల పాలిట డెత్ స్టార్



'స్టార్ వార్స్'తరహాలో సూపర్ వెపన్ 'డెత్ స్టార్' అభివృద్ధి చేసిన చైనా!

శాటిలైట్లపై మైక్రోవేవ్ ఎనర్జీతో దాడి చేసేలా ప్రణాళిక

ఫైబర్ ఆప్టిక్ టెక్నాలజీ సాయంతో అంతరిక్షంలో ఏడు 'యంత్రాల' అనుసంధానం.. వాటి నుంచి ఏకకాలంలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్ నిర్దేశిత లక్ష్యంపై విడుదల

ఇప్పటికే విజయవంతంగా ప్రయోగాలు పూర్తి

8లో



చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారా? లేదా?

'మార్గదర్శి'కి తెలంగాణ హైకోర్టు సూటి ప్రశ్న

- అలా వసూలు చేయడం నేరమా?.. కాదా?
- డిపాజిట్లు వెనక్కి ఇచ్చేయడం వేరు.. చట్ట విరుద్ధంగా వసూలు చేయడం వేరు
- ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది
- తుది విచారణలో ఈ విషయాన్ని తేలుస్తాం
- పూర్తి వివరాలతో కౌంటర్ల దాఖలుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు ఆదేశం
- అదనపు కౌంటర్ దాఖలుకు ఆర్‌బీఐకి అనుమతి
- డిసెంబర్ 20 కల్లా మొత్తం ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశం
- తదుపరి విచారణ జనవరి 3కి వాయిదా.. అదే రోజు తుది విచారణ తేదీ ఖరారు చేస్తామని వెల్లడి

14లో

ఉండవల్లికి పెన్‌డ్రైవ్ ఇవ్వాల్సిందే

హార్డ్ కాపీ ఉన్నప్పుడు ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఇవ్వటానికి ఏం ఇబ్బంది?

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ఇక్కడ వర్తించదు

డిసెంబర్ 15 కల్లా పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

> 'డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారు సరే..! అసలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడమే నిబంధనలకు విరుద్ధమని ఆర్‌బీఐ చెబుతోంది కదా? వసూలు చేసిన డిపాజిట్లను వెనక్కి ఇచ్చేయడం వేరు.. చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేయడం వేరు. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది. డిపాజిట్ల వసూలు చట్ట విరుద్ధంగా జరిగిందా.. లేదా? అలా వసూలు చేయడం నేరమా? కాదా? అన్నదే ముఖ్యం.'
> - మార్గదర్శినుద్దేశించి తెలంగాణ హైకోర్టు వ్యాఖ్య



'వుయ్ స్టాండ్ ఫర్ ట్రూత్' నినాదంతో కార్యకర్తలకు మద్దతు తెలియజేస్తూ.. న్యాయ సహాయం అందించే ఫోన్ నంబర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రశ్నించే స్వరం వినిపించకూడదా?

మీ మోసాలు, అక్రమాలు, వైఫల్యాలపై నిలదీస్తే అక్రమ కేసులా?

సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వారం రోజుల్లో 101 మంది సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తారా?

రాష్ట్రంలో చీకటి రోజులు నడుస్తున్నాయి .. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

పోలీసు సోదరులారా మీ టోపీపై కనిపించే మూడు సింహాలకే సెల్యూట్ చేయండి..

- న్యాయం, ధర్మం వైపు నిలబడండి
- చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయకండి
- తప్పుడు కేసులు బనాయించిన పోలీసులను సప్త సముద్రాల అవతల ఉన్నా రప్పిస్తాం.. చట్టం ముందు దోషులుగా నిలబెడతాం
- సూపర్ సిక్స్‌లు, సెవెనులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే కేసులా?
- ఎల్లకాలం ఈ ప్రభుత్వమే అధికారంలో ఉండదని గుర్తుంచుకోవాలి..

14లో

అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు చెల్లవు

అప్పీళ్లు దాఖలు చేసే అర్హత ఆయనకు లేదు..సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయలేరు

'అనర్హత'పై హైకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాదనలు



సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపుల అంశంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీళ్లు దాఖలు చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాదనలు వినిపించారు. స్పీకర్ ముందు అనర్హత పిటిషన్లు ఉంచడం పబ్లిక్ సర్వెంట్‌గా ఆయన విధి అని, ఎలాంటి అర్హత లేకుండా వేసిన అప్పీళ్లు చెల్లవని చెప్పారు. అనర్హత పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను ఖరారు చేయాల్సింది స్పీకర్ అని, కోర్టు ఉత్తర్వులను అమలు చేయడమో లేదో తేల్చుకోవాల్సింది ఆయనేనని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా అసెంబ్లీ కార్యదర్శి సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయలేరని పేర్కొన్నారు. అధికారాలను అనుభవిస్తూ.. విధులను మాత్రం నిర్వహించను అనడం సహించరానిదని అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, కొత్తగూడెం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో
మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

విలక్షణ నేత రేవంత్

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: చిన్న వయసులోనే రాజకీయాల్లో ఎదిగిన డైనమిక్ నేత రేవంత్ రెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రశంసించారు. రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వేణుగోపాల్ రెడ్డి, విజయ్ ఆర్కే రచించిన 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని గురువారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విలక్షణమైన నేత రేవంత్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన సాగించిన కేసీఆర్‌పై అలుపెరుగని పోరాటం చేసి ప్రజాశీర్వాదం పొందారని అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌కు టీపీసీసీ తరపున పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

సర్పంచ్‌ల ఆత్మహత్యల పాపం మీదే..

బీఆర్‌ఎస్‌పై మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు పనుల బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను రోడ్ల మీదకు తెచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ పెద్దలే ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. చిన్నచిన్న పనులకు స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌లే స్వయంగా ఆ పనులు చేశారని, కానీ అప్పటి పాలకులు బిల్లులు మంజూరు చేయక అప్పుల పాల్జేసి ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పెండింగ్ బిల్లులతో వడ్డీలు పెరిగి అప్పులుతీర్చే మార్గం లేక 60 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మరో 200 మంది ఆత్మ హత్యాయత్నాలు చేస్తే.. అప్పటి గుడ్డి పాల కుల నుంచి కనీస స్పందన కరువైందని ధ్వజమెత్తారు. అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లకు కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపితే రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొడు తున్నారని శోకాలు పెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్ నాయకులదని శ్రీధర్ బాబు విమర్శించారు. సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలను చెల్లి స్తామనే చెబుతున్నామని, దశలవారీగా నిధు లు విడుదల చేస్తామని వెల్లడించారు. మాజీ సర్పంచ్‌లెవరూ రెచ్చగొట్టే వారి మాటలు నమ్మి ధర్నాలు, ఆందోళనలు చేయొద్దన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే కులగణన


ప్రజల ఆస్తులు, వ్యక్తిగత వివరాలు ఎందుకు?: ఎంపీ డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయలబ్ధి కోసమే కులగణన చేపడుతోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. కులగణనలో ప్రజల ఆస్తులు, భూములు, వ్యక్తిగత వివరాలు ఎందుకు సేకరిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ స్థానిక ఎన్నికల వర్క్‌షాపులో పాల్గొన్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, కులగణనలో ఎవరు ఏ రాజకీయ పార్టీలో ఉన్నారనే వివరాలు సర్కార్‌కు ఏమి అవసరమని నిలదీశారు. అసలు ఈ సర్వేను ఎందుకోసం నిర్వహిస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేయడానికే ఈ సర్వే అని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కులగణనలో ఈ ప్రశ్నలన్నీ ఎందుకో అర్థం కాలేదన్నారు. ప్రజలను బలవంతపెట్టి వివరాలు సేకరించొద్దని, ఆ విధంగా చేస్తే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

బీసీలపై కుట్రలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



చౌటుప్పల్: బీసీ కులాలపై కొంత మంది నాయకులు కుట్రలు పన్నుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. అలాంటి కుట్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కుట్రలకు పాల్పడే నాయకులు తక్షణమే తమ తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కులగణనను తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. కులాలవారీగా వివరాలు లేకుంటే బీసీలకు కోటా దక్కదని అన్నారు. కులగణన విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీలంతా గణనకు సహకరించాలని కోరారు.

చలికాలంలో చిటపటలు!

రాష్ట్రంలో ఒక్కసారిగా పెరిగిన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శీతాకాలం ప్రారంభం వేళ విచిత్ర వాతావరణ పరిస్థితి నెలకొన్నది. చలి పెరగాల్సిన సమయంలో పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. చలికాలంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టాల్సి ఉండగా.. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. దాదాపు వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నది. ప్రస్తుత సీజన్‌లో నమోదు కావాల్సిన దాని కంటే 2 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ మేర అధికంగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, వేగంగా వీస్తున్న గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి. ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదైంది. మెదక్, నిజామాబాద్‌లో 3 డిగ్రీలు, హైదరాబాద్, అదిలాబాద్, భద్రాచలంలో 2 డిగ్రీలు, వరంగల్, హన్మకొండలో ఒక డిగ్రీ సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదైంది. గురువారం గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 34.5 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 16 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. సాధారణంగా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు శీతాకాలం ఉంటుంది.

శీతాకాలం ప్రారంభ వేళ విచిత్ర వాతావరణ పరిస్థితి

సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత

కాలుష్యం, తీవ్ర గాలులే కారణమంటున్న నిపుణులు

మరో నాలుగు రోజులపాటు ఇదే తరహా వాతావరణం

నెలాఖరు నుంచి క్రమంగా తగ్గనున్న గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు



గురువారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అదిలాబాద్	31.8	17.2
భద్రాచలం	33.0	22.2
దుండిగల్	32.2	18.0
హకీంపేట్	32.2	18.0
హనుమకొండ	32.0	18.5
హైదరాబాద్	32.4	18.4
ఖమ్మం	34.5	21.4
మహబూబ్‌నగర్	30.5	21.0
మెదక్	33.5	16.0
నల్లగొండ	31.0	22.0
నిజామాబాద్	34.1	19.5
రామగుండం	31.6	19.3

వాతావరణంలో మార్పులతో..

సాధారణంగా సీజన్ మారుతున్న సమయంలో వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రస్తుతం ఈశాన్య రుతుపవన కాలం మధ్యస్థానికి చేరుకుంది. రుతుపవనాల ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, దీనికి తోడు సీజనల్ యాక్టివిటీస్‌తో వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరగడంతో ఆ ప్రభావం ఉష్ణోగ్రతలపై పడినట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అందువల్లనే గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణానికి కాస్త అటుఇటుగా నమోదవుతున్నాయి. ఈ ప్రభావం మరో వారం రోజులపాటు ఉండొచ్చని అధికారులు అంటున్నారు. నవంబర్ నెలాఖరు నుంచి ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుముఖం పడతాయి. దీంతో చలి తీవ్రత కూడా పెరుగుతుంది. ఈ ఏడాది చలికాలంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే ఉంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. డిసెంబర్ నెలాఖరు నాటికి ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గిపోతాయని, ఆ సమయంలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చలి తీవ్రత అధికంగా ఉంటుందని ఐఎండీ వెల్లడించింది.

కాస్త ఎక్కువగానే గరిష్ట ఉష్ణోగ్రతలు

రాష్ట్రానికి తూర్పు, ఈశాన్య దిశల నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు వాయుకాలుష్యం పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణం కంటే కాస్త ఎక్కువగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెలాఖరు నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతాయి. డిసెంబర్ నెలతో పాటు జనవరి నెలాఖరు వరకు ఉష్ణోగ్రతలు సాధారణం కంటె తక్కువగా నమోదవుతాయని అంచనాలున్నాయి.

– శ్రావణి, వాతావరణ శాఖ అధికారి

వచ్చే నెల్లో పాదయాత్రలు, సభలు

సర్కారుపై బీజేపీ పోరుబాట

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యం
- వచ్చే నాలుగేళ్లు నేతలంతా ప్రజల్లోనే ఉండాలి
- బీజేపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో నిర్ణయం
- రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఖతం చేస్తాం
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డీకే అరుణ, కే లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ఎన్నికల హామీలను అమలుచేయకపోవటాన్ని ఎండగడుతూ డిసెంబర్ మొదటివారంలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, సభలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. వచ్చే నాలుగేళ్లపాటు (2028లో అసెంబ్లీ ఎన్నికల వరకు) నిరంతరం ప్రజల్లోనే ఉంటూ, ప్రజా సమస్యలపై పోరాడాలని తీర్మానించింది. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రాష్ట్ర పార్టీ సంస్థాగత ఎన్నికల స్టేట్ లెవల్ వర్క్ షాప్ లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నందున శనివారం రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు సందర్శించాలని నిర్ణయించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించాలని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో.. ఆ ప్రాంతాల్లోని ఇళ్లల్లో బీజేపీ నేతలు 'మూసీ నిద్ర' చేసి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సర్కార్ దృష్టికి తీసుకురావాలని నిర్ణయించారు.

11 నెలల్లోనే సర్కార్‌పై వ్యతిరేకత: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టుగా తయారైందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. గతంలో తెలంగాణను పట్టి పీడించిన బీఆర్‌ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పు చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భూములు తాకట్టు పెట్టి అప్పుల కోసం అన్వేషణ సాగిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీజేపీనే సరైన రాజకీయ ప్రత్యామ్నాయమని తేలిపోయిందని అన్నారు. పార్టీని సంస్థాగతంగా గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూనే, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలతో ప్రజలకు అండగా నిలవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే నాలుగేళ్లపాటు ప్రజల పక్షాన నిలిచి పోరాడదామని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం ఎన్ని వేల కోట్లయినా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగాఉన్నా రాష్ట్ర ప్రభుత్వం దళారులు, మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు.

ఒక్క ఇల్లు కూలగొట్టినా ఊరుకోం

'మూసీ ప్రక్షాళన చేయాల్సిందే.. శుద్ధ నీళ్లు ఇవ్వాల్సిందే.. కృష్ణా, గోదావరి నుండి నీటిని తీసుకొచ్చినా అభ్యంతరం లేదు. అయితే ఒక్క ఇల్లు కూలగొట్టినా ఊరుకునేది లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒప్పుకోం' అని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. పార్టీ వర్క్‌షాప్ అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఖతం చేస్తామని ప్రకటించారు. త్వరలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభిస్తారని తెలిపారు.

బీజేపీని ప్రజలే కోరుతున్నారు: డా.కే లక్ష్మణ్

తెలంగాణలో అతి తక్కువ సమయంలో 30 లక్షల మంది బీజేపీ సభ్యులుగా చేరారని, దీన్నిబట్టే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అర్థమవుతోందని ఆ పార్టీ నేత డా.కె.లక్ష్మణ్ అన్నారు. ఈ వర్క్‌షాపులో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హరీష్‌బాబు, రామారావు పటేల్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ యెండల లక్ష్మీనారాయణ, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, ఎం.ధర్మారావు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డి.ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటంబాంబు పేలబోతోంది

▶ మొదటి పేజీ తరువాయి

ఇంకా తుస్సుమనలేదని చెప్పారు. కొద్దిరోజుల్లో తాను పేల్చిన బాంబు ఏంటో మీరే చూస్తారని స్పష్టం చేశారు. అరెస్టు చేయాలా.. జీవితకాలం జైలులో పెట్టాలా అనేది చట్టం చూసుకుంటుందన్నారు. తాతలు, తండ్రుల ఆస్తుల్లాగా చట్టాలను అతిక్రమించి సంపాదించారని, వారంతా ఫలితాలు అనుభవిస్తారని చెప్పారు. పేదల సొమ్ము విదేశాలకు పంపుకున్నారని, రూ.55 కోట్లు ఎవరి ద్వారా ఎవరికి వెళ్లాయో, ఎవరి ఖాతాలో వేసుకున్నారో ప్రజల ముందు తమ ప్రభుత్వం పెట్టి చూపిస్తుందన్నారు.

అవి చౌకబారు విమర్శలు

ఈడీ దాడులు చేస్తోందని..అదాని కాళ్లు పట్టుకుంటున్నాడని తనపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నాడని మంత్రి పొంగులేటి అన్నారు. తాను ఎవరి కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదని, బీఆర్‌ఎస్‌లో చేరినప్పుడు మాత్రమే కేసీఆర్ కాళ్లకు నమస్కరించానని చెప్పారు. అది వయసుకు ఇచ్చిన గౌరవంతోనేనన్నారు. పదేళ్లు సామాన్యులను వంచించిన చరిత్ర బీఆర్‌ఎస్‌కే దక్కిందని, పేదల మద్దతు కూడగట్టేందుకు కేటీఆర్ పాదయాత్ర పేరిట డ్రామా చేస్తున్నాడన్నారు. పాదయాత్ర చేసినా.. మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు వారిని నమ్మబోరని తెలిపారు. వైఎస్సార్ తన హయాంలో 19 లక్షల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదలకు అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు కట్టించనుందన్నారు. ఆయా సమావేశాల్లో ఎంపీలు కడియం కావ్య, బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పాల్గొన్నారు.

దేనికైనా రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

ఆటలతో ఎక్కువ రోజులు తప్పించుకోలేవు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ దెబ్బతీయకు. గాసిప్ పక్కన పెట్టి గవర్నెన్స్ మీద దృష్టి పెట్టు..'అని సీఎం రేవంత్ ని ఉద్దేశించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. 'ఫార్ములా ఈ రేస్‌లో ఏం జరిగిందనే విషయాన్ని నా బాధ్యతగా ప్రజలకు వివరించాలని అనుకుంటున్నా. హైదరాబాద్, తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకున్నాం. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదు. నాకు ఏసీబీ నుంచి ఎలాంటి నోటీసు అందలేదు..'అని కేటీఆర్ స్పష్టం చేశారు. గురువారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విలేకరుల ప్రశ్నలకు జవాబిచ్చారు.

రూ.55 కోట్ల ఫైల్‌పై సంతకం నేనే చేశా...

'ఫార్ములా ఈ రేస్ నిర్వహణకు నిర్వహణ సంస్థ ఎఫ్ఐఏ, హెచ్ఎండీఏ, స్పాన్సరర్ అయిన గ్రీన్ కో నడుమ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. తమకు లాభం రాలేదనే కారణంతో రెండో విడత రేస్ నుంచి గ్రీన్‌కో తప్పుకోవడంతో రేస్ నిర్వహణ ద్వారా హైదరాబాద్ బ్రాండ్‌ఇమేజీ పెంచేందుకు ప్రభుత్వం తరపున రూ.55 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో నాటి హెచ్ఎండీఏ కార్యదర్శి అర్వింద్ తప్పేమీ లేదు. ఫైల్‌పై నేనే సంతకం చేశా. రూ.55 కోట్లు చెల్లించమని నేనే చెప్పినందున నాదే బాధ్యత.

కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతులు అక్కర్లేదు

పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నడుమ అంతర్గతంగా డబ్బు సర్దుబాటు చేసుకోవచ్చు. సర్వ స్వతంత్ర సంస్థ హెచ్ఎండీఏకు సీఎం చైర్మన్‌గా, పురపాలక శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా, కమిషనర్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. హెచ్ఎండీఏ నిర్ణయాలు దేనికీ కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతులు అవసరం లేదు. రేవంత్ సీఎం పదవి చేపట్టిన వెంటనే నా మీద ఉన్న కోపంతో ఫార్ములా ఈ ఒప్పందాన్ని రద్దు చేశారు. దీంతో జాగ్వార్, నిస్సాన్ వంటి కంపెనీలు సిగ్గుచేటు అని ప్రకటించగా, ప్రపంచం ముందు హైదరాబాద్ పరువు పోయింది. ఈ రేస్ రాకుండా రేవంత్ తీసుకున్న నిర్ణయంతో రూ.700 కోట్ల నష్టం వచ్చింది. హైదరాబాద్ ఇమేజీని దెబ్బతీసి నష్టం చేసినందుకు రేవంత్ పైనే కేసు పెట్టాలి. సీఎం రేవంత్ మొగోడైతే మేఘా కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి మీద కేసు పెట్టాలి. రూ.55 కోట్ల చుట్టూ రాజకీయం చేస్తున్న రేవంత్ రూ.లక్షల కోట్లు ఖర్చయ్యే ఒలింపిక్స్ నిర్వహిస్తారట..'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

మొబిలిటీ రాజధానిగా మార్చేందుకే..

'హైదరాబాద్‌లో 'ఎఫ్ వన్'కార్ల రేసును నిర్వహించేందుకు 2003లో ప్రయత్నించి ప్రత్యేకమైన ట్రాక్ కోసం గోపన్‌పల్లిలోని 400 ఎకరాల్లో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులోని 129 సర్వే నంబర్‌లో సీఎం రేవంత్‌కు చెందిన 31 ఎకరాల భూమి కూడా ఉంది. అయితే రైతుల అభ్యంతరాలతో భూసేకరణపై హైకోర్టులో కేసు నడుస్తోంది. మేం కూడా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెంచి ఎలక్ట్రిక్ వాహన రంగానికి నగరాన్ని 'భారత్‌లో మొబిలిటీ రాజధాని'గా మార్చాలని అనుకున్నాం. గొప్ప నగరాల జాబితాలో హైదరాబాద్‌ను చేర్చాలనే తపనతో సియోల్, జోహెన్నస్‌బర్గ్‌లతో పోటీ పడి హైదరాబాద్‌కు 'ఫార్ములా ఈ'ని రప్పించాం. తొలి దశ రేసింగ్ తర్వాత రాష్ట్రానికి రూ.700 కోట్ల మేర లబ్ధి జరిగింది. ఫార్ములా ఈ రేస్, మొబిలిటీ ప్రోగ్రామ్‌తో రూ.2,500 కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ఇతర సంస్థలు కూడా తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టాయి..'అని కేటీఆర్ వివరించారు.

కేటీఆర్‌పై కేసుకు అనుమతినివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

లేఖలో స్పష్టంగా పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ చెల్లింపులకు అనుమతినిచ్చినందున ఇప్పుడు ఆయన విచారణకు గవర్నర్ అనుమతి తప్పనిసరైంది. కేటీఆర్ ఆదేశాల మేరకు అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్ కూడా అయిన అర్వింద్‌కుమార్ చెల్లింపులు చేశారు.

గవర్నర్‌తో రేవంత్ భేటీలోనూ 'విచారణ' ప్రస్తావన!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయిన సంగతి తెలిసిందే. కాగా ఈ సందర్భంగా కూడా కేటీఆర్ విచారణ అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా ప్రభుత్వం రాసిన లేఖపై గవర్నర్ త్వరగానే ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారవర్గాల సమాచారం. గురువారం మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఫార్ములా–ఈకి రూ.55 కోట్లు చెల్లింపునకు సంబంధించిన బాధ్యత పూర్తిగా తనదేనంటూ ప్రకటించగా, ఖమ్మంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే అటం బాబు పేలబోతుందంటూ వ్యాఖ్యానించడం.. రాష్ట్రంలో రాజకీయ సంచలనానికి సంకేతాలనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.

అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు డీవోపీటీ అనుమతి తప్పనిసరి!

ఫార్ములా–ఈ రేస్ వ్యవహారానికి సంబంధించి అర్వింద్‌కుమార్‌తో పాటు సంబంధిత ఇంజనీర్లపై విచారణకు ప్రభుత్వం ఇదివరకే అనుమతి ఇచ్చిన విషయం విదితమే. కాగా విచారణ అనంతరం ఐఏఎస్ అధికారిని ప్రాసిక్యూషన్ చేయడానికి మాత్రం కేంద్ర సిబ్బంది శిక్షణా విభాగం (డీవోపీటీ) అనుమతి తప్పనిసరి అని చెబుతున్నారు. డీవోపీటీకి మాత్రమే ఐఏఎస్‌ను ఉద్యోగం నుంచి తొలగించే అధికారం ఉన్నందున వారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల శాఖ కమిషనర్‌గా పనిచేసిన బీపీ ఆచార్య ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన వ్యవహారంలోనూ ముందస్తు అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన విషయం విదితమే.

టెట్ ఫీజు తగ్గింపు

ఒకే పేపర్ రాయాలనుకుంటే రూ.750.. రెండు పేపర్లకు కలిపి రూ. వెయ్యి

గతంలో టెట్ రాసిన వారికి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజును రాష్ట్ర ప్రభుత్వం తగ్గించింది. గతంలో పేపర్–1 లేదా పేపర్–2 పరీక్ష రాసేందుకు రూ. వెయ్యిగా ఉన్న ఫీజును రూ. 750కి తగ్గించింది. పేపర్–1, పేపర్–2 పరీక్షలు రాసే అభ్యర్థులకు గతంలో రూ. 2 వేలుగా ఉన్న ఫీజును రూ. తాజాగా వెయ్యికి తగ్గించింది. అలాగే టెట్ రాసిన అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు టెట్ నోటిఫికేషన్‌ను విద్యాశాఖ గురువారం అర్ధరాత్రి విడుదల చేసింది. దీంతోపాటు సమగ్ర సమాచార బులెటిన్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. టెట్ పేపర్‌లో 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వాటికి 150 మార్కులుంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్, లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ నుంచి ఒక్కో విభాగం నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 60 శాతం, బీసీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలు ఇతర రిజర్వేషన్ కేటగిరీలు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందినట్లుగా పరిగణిస్తారు. టెట్ పరీక్ష 2025 జనవరి 1 నుంచి 20 వరకు జరగనుంది. హాల్‌టికెట్లను డిసెంబర్ 27 నుంచి 2025 జనవరి 20 మధ్య డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు కల్పించారు. ఫలితాలను ఫిబ్రవరి 5న వెల్లడిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇది ఈ నెల 20వ వరకు కొనసాగుతుంది. టెట్ అర్హత సర్టిఫికెట్ జీవితకాలం చెల్లుబాటులో ఉంటుంది. ఉపాధ్యాయ నియామకంలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు చెల్లవు

▶ మొదటి పేజీ తరువాయి

చేరడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు వేశారు. అలాగే దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. సింగిల్ జడ్జి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి గత నెల హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

8 నెలలు కావొస్తున్నా ఏ నిర్ణయం లేదు..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'ప్రజాస్వామ్య పరిరక్షణకు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న వాదన చట్టబద్ధమే. కైశమ్ మేఘచంద్ర సింగ్ కేసులో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణీత గడువులోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. మూడు నెలల గడువులోగా స్పీకర్ తన ముందున్న పిటిషన్లను పరిష్కరించాలి. శాసనసభ కాలపరిమితి పూర్తయ్యే ఐదేళ్ల వరకు స్పీకర్ వేచిచూస్తూ ఉంటే కోర్టులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదు. స్పీకర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళితే అవకాశం ఇవ్వలేదు. కార్యాలయంలో పిటిషన్లు తీసుకోలేదు. విధిలేని పరిస్థితిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదు చేసి దాదాపు 8 నెలలు కావొస్తున్నా స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోలేదు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేయాలి..' అని కోరారు. అంతకుముందు సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్ రెడ్డి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

నేడు సీఎం 'మూసీ' యాత్ర

పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్టలో పూజలు

- సంగెంలో రైతులతో సమావేశం..సభ



సాక్షి, హైదరాబాద్/సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం రైతులతో కలిసి మూసీ నది వెంట పాదయాత్ర ద్వారా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శించనున్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తొలుత ఉదయం 8.45 గంటలకు కుటుంబ సమేతంగా హెలికాప్టర్‌లో శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చేరుకుని తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం 10 గంటలకు వైటీడీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. యాదాద్రి ఆలయంతో పాటు జిల్లా అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై చర్చించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకుని మూసీ పరీవాహక ప్రాంత రైతులతో కలిసి కాల్వల్ని సందర్శిస్తారు. తర్వాత రైతులు, కుల వృత్తిదారులతో సమావేశమై వారి యోగక్షేమాలు, మూసీ జలాలతో జరిగే నష్టాన్ని అడిగి తెలుసుకుంటారు. సంగెంలో 10 వేలమందితో ఏర్పాటు చేసే సభలో సీఎం ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

గుట్టకు రెండోసారి

సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు రావడం ఇది రెండోసారి. మొదట మార్చి 11న యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున మంత్రులతో కలిసి సందర్శించారు. కాగా శుక్రవారం సీఎం పర్యటన దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ, జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. సంగెం వద్ద మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, యాదాద్రిలో ఈఓ భాస్కర్‌రావు ఏర్పాట్లు పరిశీలించారు.

ప్రజల జీవన స్థితిగతులు మార్చాలన్నదే ఆశయం: తుమ్మల

మూసీ పునరుజ్జీవం ద్వారా లక్షలాది మంది ప్రజల జీవన స్థితిగతులు మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయమని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సంగెం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మూసీ పరివాహక రైతులు, ప్రజలు, కులవృత్తుల వారి ఈతి బాధలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి మేలు చేసేందుకే సీఎం పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు పడుతున్నాం

కాలుష్యం, ఇతర సమస్యలపై రైతు కమిషన్‌కు రైతుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాల్లోని ఇథనాల్ పరిశ్రమల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌కు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ పరిశ్రమల వల్ల ఆరోగ్య సమస్యలతోపాటు పంటల దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బీఆర్‌కే భవన్‌లో రైతు కమిషన్ ఆధ్వర్యంలో ఇథనాల్ ఉత్పత్తి, పర్యావరణ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ ఎదుట పరిశ్రమవర్గాలు, రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గడుగు గంగాధర్, భవానీరెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్ తోపాటు ఎమ్మెల్సీ కోదండరాం, కేఎల్ఆర్, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, రైతులు, పర్యావరణవేత్తలు, ఇండస్ట్రీ యాజమాన్యంతోపాటు అగ్రికల్చర్, పొల్యూషన్ కంట్రోల్, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకున్న కమిషన్ త్వరలోనే ఇథనాల్ ఇండస్ట్రీ ఏరియాల్లో పర్యటించాలని నిర్ణయించింది.



ఫీజు పైసల్... ముందే వసూల్ !

- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం
- దీంతో విద్యార్థుల నుంచే వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలు

సాయివర్ధన్ (పేరుమార్పాం) పాలీసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీటు దక్కించుకున్నాడు. కాలేజీలో రిపోర్టింగ్ చేసేందుకు వెళ్లిన ఆ విద్యార్థికి యాజమాన్యం షాక్ ఇచ్చింది. కన్వీనర్ కోటాలో సీటు వచ్చినా, ట్యూషన్ ఫీజు చెల్లించాలని, లేకుంటే అడ్మిషన్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలైన తర్వాత, ఆ మొత్తాన్ని విద్యార్థి ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేయడంతో తప్పనిసరి పరిస్థితిలో రూ.52 వేల రూపాయలు చెల్లించి అడ్మిషన్ పొందాడు.

వికారాబాద్ జిల్లాకు చెందిన టి.మానస (పేరుమార్పాం) డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈడీ) కోర్సు పూర్తి చేసింది. కన్వీనర్ కోటాలో సీటు వచ్చినా, యాజమాన్య ఒత్తిడితో ఫీజు చెల్లించింది. ఏడాది క్రితం కోర్సు పూర్తి కావడంతో ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కాలేజీకి వెళితే ఫీజు బకాయిలు చెల్లించాలని చెప్పారు. దీంతో మళ్లీ డబ్బు కట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.46 వేలు ఇప్పటికీ అందలేదు.

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుకునే విద్యార్థులకు ఆర్థికభారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తోంది. దీని కింద అర్హత సాధించిన విద్యార్థులు ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండా నేరుగా కాలేజీలో ప్రవేశం పొంది కోర్సు పూర్తి చేయొచ్చు. కానీ ప్రస్తుతం కాలేజీల్లో పరిస్థితి తారుమారైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద అర్హత సాధించినా సరే... అడ్మిషన్ సమయంలో ట్యూషన్ ఫీజు పూర్తిగా చెల్లించాల్సిందే. సీనియర్ విద్యార్థులయితే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే చెల్లించాలి. ప్రభుత్వం రీయింబర్స్ నిధులు కాలేజీకి విడుదల చేసినప్పుడు... సదరు విద్యార్థుల బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేయడమో... లేక చెక్కు రూపంలో విద్యార్థికి అందిస్తామంటూ యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని వృత్తి విద్యాకాలేజీలు ఇదే తరహా ముందస్తుగా ఫీజు వసూళ్లు చేస్తున్నాయి. ఉచితంగా ఉన్నత చదువులు చదవాలనుకున్న విద్యార్థులకు తాజా పరిస్థితులు సంకటంగా మారాయి.

ఏటా 12లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో 5,539 పోస్టుమెట్రిక్ కాలేజీలున్నాయి. ఇందులో 2,641 జూనియర్ కాలేజీలు, 1,514 డిగ్రీ, పీజీ కాలేజీలున్నాయి. 235 ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు కాగా, 217 పారా మెడికల్ కాలేజీలున్నాయి. ఇతర వృత్తివిద్యా కేటగిరీల్లో మిగిలిన కాలేజీలున్నాయి. వీటి పరిధిలోని 12 లక్షల మంది విద్యార్థులు ఏటా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. జూనియర్, డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు ముందస్తు వసూళ్లకు దూరంగా ఉంటున్నా, వృత్తి విద్యా కళాశాలలు మాత్రం అడ్మిషన్ల సమయంలోనే ఫీజులు వసూలు చేస్తున్నాయి. ,ఇంత జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కాలేజీలకు వెళ్లి ఫీజులపై తనిఖీలు కూడా చేయడం లేదు.

ఏటా ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల సగటు ఇలా...

సంక్షేమ శాఖ	ఫ్రెషర్స్	రెన్యూవల్
ఎస్సీ	87,246	12,6122
ఎస్టీ	54,556	76,320
బీసీ	2,65,346	3,82,401
డిజేబుల్	22	45
ఈబీసీ	18,360	41,929
మైనార్టీ	67,700	86,920

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల చెల్లింపుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.1,550 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు చెల్లిపులు చేస్తున్నాం. మా కార్యాలయానికి విద్యార్థులు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ అదనపు సంచాలకులు

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి

ముందస్తు ఫీజు వసూలపై సంక్షేమ శాఖల అధికారులు సీరియస్‌గా పరిగణించాలి. కాలేజీల వారీగా విచారణ చేపట్టాలి. అలా వసూళ్లకు పాల్పడిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులెవరూ ముందస్తుగా ఫీజులు చెల్లించొద్దు.

– ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

బకాయిలు పేరుకుపోవడంతోనే ఈ పరిస్థితి

ఫీజు రీయింబర్స్ నిధులు విడుదల చేయకపోవడంతోనే యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. సకాలంలో ఫీజు నిధులు విడుదల చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

– కందడి శ్రీరామ్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు



ఎవరు విశ్వసించి సత్కార్యాలు చేస్తారో వారిని మేము క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలోకి తీసుకుపోతాము. అందులో వారు కలకాలం, శాశ్వతంగా ఉంటారు. ఈ అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. అల్లాహ్ కంటే సత్యమైన మాట పలికేదెవరు?

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 8 నవంబర్ 2024

లక్ష్యసాధన కోరుతున్న చిత్తశుద్ధి

కొన్ని నివేదికలు, గణాంకాలు పాలకులైనా, ప్రజలకైనా గట్టి మేలుకొలుపులు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇటీవల విడుదల చేసిన 'ప్రపంచ క్షయవ్యాధి (టీబీ) నివేదిక' అలాంటిదే. ప్రపంచవ్యాప్త టీబీ కేసుల్లో 26 శాతం భారత్‌లోనే ఉన్నాయట! ఒక్క గడచిన 2023లోనే మన దేశంలో 25.5 లక్షల కొత్త టీబీ కేసులు నమోదయ్యాయి. 1960లలో టీబీపై నియంత్రణకు ఉపక్రమించినప్పటి నుంచి ఇప్పటి దాకా ఇది అత్యధికం. ఇది మన మత్తు వదిలించే మాట. దానికి తోడు పలు ఔషధాలకు లొంగకుండా తయారైన టీబీ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీ – ఎండీఆర్ టీబీ) సరికొత్త ప్రజారోగ్య సంక్షోభంగా తయారైంది. ఆ కేసులూ మన దేశంలోనే ఎక్కువన్న సంగతి ఆందోళన కలిగిస్తోంది. పేరుకు 85 శాతానికి పైగా టీబీ రోగులకు చికిత్స చేరువైనా, ఖరీదైన మందులతో సామాన్యుల ఇల్లు, ఒళ్ళు గుల్లవుతున్నాయి. దాదాపు 20 శాతం మంది రోగులు తమ వార్షికాదాయంలో 20 శాతం పైగా ఈ చికిత్సకే ఖర్చు చేస్తున్నారట. దీనికి తోడు కొన్నేళ్ళుగా టీబీ నియంత్రణ నిధులు కూడా 13 లక్షల డాలర్ల మేర తగ్గడం శోచనీయం. ఈ చేదు నిజాలన్నీ అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని మన ప్రభుత్వాలకు గుర్తు చేస్తున్నాయి.

గడచిన 2023 లెక్కల ప్రకారం భారత్‌లో దాదాపు 27 లక్షల టీబీ కేసులున్నట్టు అంచనా. వాటిలో 25.1 లక్షల మంది రోగులు మందులు వాడుతున్నారు. అలా చూస్తే టీబీ సోకినవారిలో నూటికి 85 మందికి పైగా చికిత్స పొందుతూ ఉండడం చెప్పుకోదగ్గ విషయమే. నిరుడు అత్యధిక కేసులు నమోదైన సంగతి పక్కన పెడితే... గత ఎనిమిదేళ్ళలో భారత్‌లో టీబీ కేసులు 18 శాతం తగ్గినట్టు డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా 8 శాతం మేర కేసులు తగ్గితే, భారత్‌లో అంతకు రెట్టింపు కన్నా ఎక్కువగా కేసులు తగ్గాయట. సంతోషకరమే. కానీ, అది సరిపోతుందా అన్నది ప్రశ్న. 2025 నాటి కల్లా దేశంలో టీబీ లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్ అనుకున్నది సాధించాలంటే ఇది సరిపోదన్నది నిపుణులు తేల్చిచెబుతున్న నిష్ఠురసత్యం. వ్యాధి నిర్ధారణ పరీక్షల వసతుల్ని మరింత మెరుగుపరచడమే కాక, నిధుల కొరతను తీర్చడం, మరింత మందికి చికిత్స అందించడం లాంటివి చేసినప్పుడే టీబీ నిర్మూలన లక్ష్యం వైపు అడుగులు వేయగలం. ఈ వ్యాధిని కేవలం ఆరోగ్య సమస్యగానే చూడలేం. దారిద్ర్యం, పౌష్టికాహార లోపం, అంతంత మాత్రపు ఆరోగ్య వసతులు లాంటి సామాజిక – ఆర్థిక కారణాలూ ఇది ముదరడానికి కారణమని విస్మరించలేం.

నిజానికి, గత ఆరు దశాబ్దాల కాలంలో మన దేశంలో టీబీ నిర్మూలన కార్యక్రమం కింద లబ్ధి పొందిన రోగుల సంఖ్య తక్కువేమీ కాదు. ఆ సంఖ్య పెరుగుతోంది. అయితే, ఆర్థికంగా బాగా వెనుకబడినవారికి అందుతున్న సాయం ఇప్పటికీ అంతంత మాత్రమే. టీబీ సోకినవారిలో అయిదోవంతు కన్నా ఎక్కువ మందికి సాయం అందడం లేదని ప్రభుత్వ గణాంకాలే ఒప్పుకుంటున్నాయి. అంతకన్నా విషాదం ఏమిటంటే, టీబీ నిర్మూలన లక్ష్యం గురించి పైకి గొప్పగా చెబుతున్నా, తీరా ఆచరణలో అందుకు కేటాయించాల్సిన నిధుల్ని గణనీయంగా తగ్గించేస్తూ ఉండడం. లెక్క తీస్తే, 2019లో మన దేశంలో ఈ నిర్మూలన కార్యక్రమానికి 43.26 కోట్ల డాలర్ల కేటాయింపులు ఉండేవి. తీరా గడచిన 2023కు వచ్చేసరికి ఆ నిధుల మొత్తాన్ని 30.28 కోట్ల డాలర్లకు తగ్గించేశారు. ఆలోచనకూ, ఆచరణకూ మధ్య ఉన్న ఈ వ్యత్యాసాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇది అచ్చంగా 'దుత్తలో కూడు దుత్తలోనే ఉండాలి. చంకలో పిల్లాడు మాత్రం దుడ్డులా ఉండాల'న్నట్టుగా ఉంది. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలంటున్నది అందుకే. పైగా, కరోనా అనంతరం, గత ఏడాది ఒక్కసారిగా అన్ని కొత్త టీబీ కేసులు ఎందుకు నమోదయ్యాయో లోతుగా అధ్యయనం చేయాలి.

టీబీని నిర్మూలన లక్ష్యం గొప్పదే అయినా అందుకు సవాళ్ళు అనేకం. ప్రభుత్వం అందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. కృతనిశ్చయంతో ఉన్నా ప్రజల్లో ఈ వ్యాధిపై తగినంత చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. మనకున్న వైద్య వసతులూ అంతంత మాత్రమే. ఇక, పౌష్టికాహార లోపం సైతం టీబీ నిర్మూలనకు పెను అవరోధంగా మారింది. కేవలం పౌష్టికాహార లోపం వల్లనే ఏటా వయోజనుల్లో 35 నుంచి 45 శాతం మేర కొత్త టీబీ కేసులు వస్తున్నాయని నిరుడు 'లాన్సెట్' నివేదిక ఒకటి స్పష్టం చేయడం గమనార్హం. అలాగే, సరిగ్గా మందులు వాడకపోవడం వల్ల కీలక ఔషధాలకు పని చేయకుండా పోయిన ఎండీఆర్–టీబీ కేసుల్లోనూ కేవలం 44 శాతమే తగిన చికిత్సకు నోచుకుంటున్నాయి. అదీ మరింత ఖరీదైన, విషతుల్యమైన వాటిని దీర్ఘకాలం వాడాల్సిన అగత్యం ఏర్పడుతోంది. ఈ సవాళ్ళను అధిగమించడానికి చర్యలు చేపట్టడం అవసరం. అందుకు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, కొత్తగా ఆలోచించక తప్పదు. సరికొత్త వైద్యవిధానాల్ని ఆశ్రయించడమూ ముఖ్యమే.

ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకాన్ని టీబీ రోగులకు, మరీ ముఖ్యంగా ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉన్నవారికి వర్తించేలా చేయాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇది మంచి సూచనే. దేశంలో టీబీ నిర్మూలనకు ఇది దీర్ఘకాలంలో బాగా ఉపకరించే ఆలోచన. రోగుల విషయంలో వ్యక్తి కేంద్రితంగా సమగ్ర వైఖరిని అవలంబించాలని శాస్త్రవేత్తలు చెబుతున్న మాటకు చెవి ఒగ్గాలి. అలాగే, ఫార్మసీ రంగాన్ని పెద్ద ఆదాయ వనరుగా చూస్తున్న పాలకులు వైద్య, ఆరోగ్య రంగంలో కీలకమైన పరిశోధనలకూ, కొత్త ఔషధాలు, చికిత్సలకూ ఏపాటి ప్రోత్సాహమిస్తున్నారు? గణనీయంగా నిధులు కేటాయించి, సమన్వయంతో కృషి చేస్తేనే మన దేశంలో టీబీ నివారణ అయినా, నిర్మూలనైనా సాధ్యమవుతుంది. మానవాళిని పట్టిపీడిస్తున్న ప్రాణాంతక వ్యాధులను సమర్థంగా ఎదుర్కోవాలంటే, ప్రపంచ దేశాలన్నీ కలసికట్టుగా నిలబడడమే మార్గం.

'కొత్త' ట్రంప్ ఎలా పాలిస్తారు?

విశ్లేషణ



సంజయ బారు

ట్రంప్ గతంలో అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో కొలువుదీరినప్పటికీ ఇప్పటికీ ప్రపంచం మారిపోయింది. అదే సమయంలో గతం హయాంలోని చాలామంది సహచరులను ఆయన వదిలేశారు, చాలామంది ఆయనను వదిలి వెళ్లారు. కాబట్టి ట్రంప్ 2.0 పాలన, ట్రంప్ 1.0 పాలన కంటే భిన్నంగా ఉంటుందని ఆశించాలి. అయితే, ట్రంప్ పదవిలో ఉన్న మొదటి సంవత్సరం బైడెన్ చివరి సంవత్సరం కంటే నిశ్శబ్దంగా ఉంటుందనైతే చెప్పవచ్చు. ట్రంప్ మునుపటి లాగే చైనాతో కఠినంగా ఉండవచ్చు, భారతదేశం పట్ల స్నేహపూర్వకంగా ఉండవచ్చు. కానీ అది ఆయన తక్షణ ప్రాధాన్యం కాకపోవచ్చు. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లలో చేసినట్లుగా, అమెరికా రాజకీయాల చిక్కుల్లో పడకుండా మోదీ ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయడం మంచిది.

అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలు ఆకర్షించినంత ఎక్కువగా మరే దేశ ఎన్నికా ప్రపంచ దృష్టిని ఆకర్షించలేదు. ప్రపంచంలోనే అత్యంత ప్రధానమైన దేశంగా అమెరికా కొనసాగుతోంది. దీని అధ్యక్షుడు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వ్యక్తి. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, అతిపెద్ద సాంకేతిక, శాస్త్రీయ కేంద్రం, అతిపెద్ద సాయుధ దళాలను అమెరికా అధ్యక్షుడు నడుపుతారు. అయినప్పటికీ దేశాధ్యక్షురాలిగా ఒక మహిళను ఎన్నుకునేందుకు అమెరికా ఇంకా సిద్ధంగా లేదు. డోనాల్డ్ ట్రంప్‌కు స్త్రీలను ద్వేషించే వ్యక్తిత్వం ఉన్నప్పటికీ హిల్లరీ క్లింటన్, కమలా హ్యారిస్‌లను ఓడించగలిగారు. జాతి, వర్గ ఆధిపత్య రాజకీయాలలో, లింగానికి వెనుక సీటు దక్కింది. ఎన్నికల ఒపీనియన్ పోల్స్ మరోసారి తలకిందులైపోయాయి.

కొత్త ముఖాల ప్రభుత్వం

బెర్లిన్ నుండి టోక్యో వరకు, మాస్కో నుండి బీజింగ్ వరకు, టెల్ అవీవ్ నుండి టెహ్రాన్, నిజానికి, న్యూఢిల్లీ వరకు, ప్రతి ప్రభుత్వం ట్రంప్ ఎన్నుకునే జట్టును నిశితంగా గమనిస్తుంది. ఇది ట్రంప్ రెండవ టర్మ్ అయినప్పటికీ, గతంలోని చాలామంది సహచరులను ఆయన వదిలేశారు. చాలామంది ఆయనను వదిలి వెళ్లారు. అధ్యక్షుడి చుట్టూ ఇప్పుడు కొత్త ముఖాలు ఉంటాయి. వైట్‌హౌస్‌లో ఆయన గతంలో కొలువు దీరినప్పటితో పోల్చితే ఇప్పటి పరిస్థితులు మారినందున ట్రంప్‌ను ప్రపంచం కొత్తగా అంచనా వేయడం జరుగుతుంది.

స్వదేశంలో, ట్రంప్ మొదటి బాధ్యత స్థిరత్వాన్ని సాధించడం; పెద్దగా ప్రాధాన్యత లేని తన మద్దతుదారులకు, ముఖ్యంగా శ్రామిక వర్గానికి ఆశను కల్పించడం. అమెరికా ఆర్థిక వ్యవస్థ పెద్ద వృద్ధి లేకపోయినా స్థిరంగానే ముందుకు సాగుతోంది. వృద్ధి 2 శాతానికి పైగా ఉంది. అయినప్పటికీ, నిరుద్యోగం పెద్ద ఆందోళనగా ఉంది. ఒక వైపు తన సొంత తరగతి మిలియనీర్లు, బిలియనీర్ల దురాశనూ, మరో వైపు తక్కువ ఆదాయం కలిగిన, సామాజికంగా, ఆర్థికంగా అణగారిన తన మద్దతుదారుల అవసరాన్నీ ట్రంప్ ఎలా సమతుల్యం చేస్తారో చూడాలి.

విదేశాలతో ఎలా వ్యవహరిస్తారు?

విదేశాల్లో, ముఖ్యంగా యూరప్, పశ్చిమాసియాలో విభేదాలను పూర్తిగా పరిష్కరించడంలో ట్రంప్‌పై పెను భారం ఉంటుంది. ఆర్థిక, విదేశాంగ విధానంపై 'వాషింగ్టన్ ఏకాభిప్రాయం' నుండి బయట పడతానని ఆయన హామీ ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను చేరుకోవాలని భావిస్తున్నారు. అదే సమయంలో చైనాతో కఠినంగా ఉండవచ్చు, అధిక సుంకాలను విధించవచ్చు. కానీ వైరుధ్యాలతోనే స్నేహాన్ని కోరుకోవచ్చు. పశ్చిమాసియాలో, ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుంటారనీ, బహుశా పాలన మార్పు కోసం ఒత్తిడి తెస్తారనీ భావిస్తున్నారు. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కూడా అదుపులో ఉంచవచ్చు.



రాబోయే నాలుగేళ్లలో 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని ట్రంప్ వాగ్దానం చేసినందున, ఆయన ప్రతి ఒక్క చర్య కూడా అమెరికాకు, ప్రపంచానికి దీర్ఘకాలిక పరిణామాలను కలిగిస్తుంది. ట్రంప్ మూడో సారీ అధికారంలోకి వచ్చేందుకు వీలుగా రాజ్యాంగంలో మార్పు కోసం ప్రయత్నిస్తారా అనేది ట్రిలియన్ డాలర్ల ప్రశ్న. ఏమైనప్పటికీ, వయస్సు, సమయం ఆయన పక్షాన లేనందున ట్రంప్ 2.0 పాలన ట్రంప్ 1.0 పాలన నుండి భిన్నంగా ఉంటుందని ఆశించాలి.

అమెరికా ఎలా పరిపాలించబడుతుందనే దానిపై ట్రంప్ శాశ్వత ప్రభావాన్ని కలిగిస్తారు. కానీ అమెరికాకు ప్రపంచాన్ని రూపొందించే సామర్థ్యం పరిమితంగా ఉంది. అమెరికా తన మిత్రదేశాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ట్రంప్ అధ్యక్ష పదవిపై యూరప్, జపాన్ రెండూ ఆందోళనగా ఉన్నాయి. ట్రంప్ గత హయాంలో యూరప్‌లో ఏంజెలా మెర్కెల్, జపాన్ లో షింజో అబే ఉన్నారు. ప్రస్తుతం, ట్రంప్‌ను ఎదిరించే లేదా ఆయన్ని నిలువరించగల సామర్థ్యం ఉన్న యూరోపియన్ లేదా తూర్పు ఆసియా నాయకులు ఎవరూ లేరు. వారు బహుశా ట్రంప్‌కు అనుగుణంగా నడుచుకోవచ్చు.

పుతిన్‌ను ఊపిరి పీల్చుకోనిస్తారా, జెలెన్‌స్కీని కాస్త తగ్గమని అడుగుతారా అనేది ట్రంప్, ఆయన సలహాదారులు... యూఎస్ 'డీప్ స్టేట్'పై, మిలిటరీ–ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌పై, జో బైడెన్ రష్యా విధానం వెనుక ఉన్న ప్రభావశీల వ్యక్తులపై ఎంత నియంత్రణను కలిగి ఉంటారు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఏమైనప్పటికీ, పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇద్దరూ కనీసం మొదట్లోనైనా ట్రంప్ యంత్రాంగంతో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలని కోరుకుంటారు. విరోధాభాస ఏమిటంటే, ట్రంప్ పదవిలో ఉన్న మొదటి సంవత్సరం బైడెన్ చివరి సంవత్సరం కంటే నిశ్శబ్దంగా ఉండవచ్చు.

ఇండియాతో వైఖరి?

అదృష్టవశాత్తూ, అధ్యక్షుడు ట్రంప్‌తో భారతదేశం మంచి సమీకరణాన్ని కలిగి ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇద్దరూ ట్రంప్ చుట్టూ ఉన్న వ్యక్తులతో సంబంధాలు కలిగి ఉన్నారు. అయినప్పటికీ ట్రంప్ 2.0 అన్ని సంభావ్యతలలోనూ, ట్రంప్ 1.0 లాగా ఉండదనే ఎరుకతో భారత నాయకత్వం ముందుకు సాగాలి. ట్రంప్ వాస్తవికతా విధానం, 'అమెరికా ఫస్ట్' విధానం... వాణిజ్యం, వలసలు, వాతావరణ మార్పు వంటి భారత్‌కు ఆసక్తి ఉన్న రంగాలపై సవాళ్లు విసురుతాయి. నేను ఉదారమైన అమెరికా వీసా విధానం పట్ల గొప్ప ఔత్సాహికుడిని కాదు. ఇది భారతదేశం నుండి ప్రతిభను హరించడానికి దోహదపడింది. అయితే ట్రంప్ పాత సలహాదారులలో కొందరు, ముఖ్యంగా అమెరికా మాజీ వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైట్‌థైజర్ వంటి వ్యక్తులు తిరిగి కార్యాలయంలోకి వస్తే ఇరు దేశాల మధ్య వాణిజ్యం సవాలుగా మారవచ్చు.

అమెరికా నుంచి రక్షణ పరికరాలను కొనుగోలు చేయడం, సరఫరా గొలుసులతో అనుసంధానం కావడాన్ని భారతదేశం కొనసాగిస్తుంది. ఏది ఏమైనప్పటికీ, గత నాలుగేళ్లలో చేసినట్లుగా, అమెరికా రాజకీయాల చిక్కుల్లో పడకుండా జాగ్రత్తగా అడుగులు వేయాలని మోదీ ప్రభుత్వానికి సూచించడం మంచిది. గురుపత్వంత్ సింగ్ పన్నూన్ కేసు ఇప్పటికే కోర్టులో ఉన్నందున అది వీడిపోకపోవచ్చు. దాని అలలు భారత తీరాలను తాకుతూనే ఉంటాయి.

ట్రంప్ 1.0 సమయంలో షింజో అబే మొదట వైట్ హౌస్ తలుపులు తట్టారు, స్నేహపూర్వక హస్తాన్ని చాచారు, అహంభావిని పొగిడారు, భారత దేశానికి ప్రయోజనం కలిగించే క్వాడ్ వంటి ఆలోచనలను చేశారు. అబే రాజనీతిజ్ఞుడు, భారతదేశానికి స్నేహితుడు. ఆయన వారసులు కేవలం రాజకీయ నాయకులు, పైగా భారత్‌కు అనుకూలమైనవారు కాదు. ట్రంప్ భారత్ పట్ల స్నేహపూర్వకంగా ఉండవచ్చు, కానీ మన దేశానికి ఆయన తక్షణ ప్రాధాన్యత ఇచ్చే అవకాశం లేదు. కాబట్టి మోదీ వంటి మిత్రులు కాసేపు వేచివుండి, అమెరికా మిత్రదేశాలు, ముఖ్యంగా యూరోపియన్లు వైట్‌హౌస్‌లో తమ ఆందోళనతో కూడిన సంభాషణలను ముగించేందుకు అనుమతించడం ఉత్తమం.

దేవుడు తనను కాపాడాడు కాబట్టే వైట్‌హౌస్‌కు తిరిగి వస్తున్నట్లు ట్రంప్ చెప్పుకొన్నారు. తమను తాము 'దేవుడు, విధిచే ఎన్నుకోబడిన' వారిగా భావించే రాజకీయ నాయకులు తరచుగా మంచి కంటే ఎక్కువ హాని చేస్తారు. అలాంటివారితో ఉన్న స్నేహాన్ని ప్రదర్శించుకోవడం కంటే, ముందు వాళ్లను తమ పనిలో తలమునకలు కానివ్వడం మంచిది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, విధాన విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసు'లోని మాటలు తాజాగా ఇలా...!

ప్రశ్నల కోసం...



రాజ్యసభ కోసం ఆహార కల్తీ గురించిన పరిశోధన కావాలంటూ (ఇన్ఫోసిస్) సుధామూర్తి మేడమ్ నన్ను సంప్రదించడం నాకు దక్కిన పెద్ద గౌరవం. రానున్న రాజ్యసభ శీతాకాల సమావేశాల కోసం ఈ పరిశోధనలో సహకరించడానికి ఉత్సాహంగా ఉన్నాను. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతులు ఉమ్మడిగా ఏది సరైనదో దానికోసం పోరాడితే ఎలా ఉంటుందో ఊహించండి!

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

మారాల్సిన ఆచారాలు



ఛఠ్ పూజ అనేది మా బిహారీలకు చాలా ప్రాధాన్యం కలిగినది. కానీ ఆ ప్రమాదకరమైన మురికి యమునా నదికి వెళ్లడం అనే ఆలోచనే ఒంట్లో వణుకుపుట్టిస్తుంది. పూజకు అనుమతి లేదని హైకోర్టు చెప్పడం సంతోషం. హిందువులం మన ఆచారాలను కాలానుగుణంగా మార్చుకోవాలి.

– యశోవర్ధన్ ఝా ఆజాద్, మాజీ ఐపీఎస్ అధికారి

పాట లేని చోటు



కేవలం కొన్నేళ్ల క్రితమే అఫ్గాన్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థుల గొంతులతో కాబూల్ ప్రతిధ్వనించింది. ఇప్పుడు అక్కడ మౌనం రాజ్యమేలుతోంది. తాలిబన్లు పాఠశాలను మూసేశారు. సంగీతాన్ని నిషేధించారు. మహిళలు, బాలికలను పాడకుండా చేశారు. ఒక దేశపు హృదయ స్పందనను నిలిపేశారు.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

వెనక్కి పోదాం!



పదహారేళ్ల లోపువారిని సోషల్ మీడియా వాడకుండా ఆస్ట్రేలియా నిషేధించనుంది. దీనివల్ల పాఠశాల చదువులు మెరుగుపడతాయి. డిప్రెషన్, ఆత్మహత్యలు తగ్గుతాయి. పుస్తకాలు చదవడం మళ్లీ సాధారణం అవుతుంది. మనం పెద్దవాళ్లు కూడా సోషల్ మీడియా కోసం సమయ పరిమితి విధించుకోవాలి.

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

విశ్వాసమే ముఖ్యమా?



చాలామంది తమ విశ్వాసాలకు అనుగుణంగా వాస్తవాలను సవరిస్తారు; అంతేగానీ వాస్తవాలకు అనుగుణంగా విశ్వాసాలను సవరించుకోరు.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

వాయులీన వైతాళికుడు

భారతీయ సంగీతానికి వాయులీనం వాద్యం ద్వారా విశేష సేవలందించిన వైతాళికులు ద్వారం వెంకటస్వామి నాయుడు. 1893 నవంబర్ 8న బెంగుళూరులో ఆయన జన్మించారు. తండ్రి, తాతలు ఇరువురూ వృత్తిరీత్యా మిలిటరీ వాళ్లయినా వాయులీన విద్వాంసులు. ప్రాథమిక విద్యాభ్యాసంలో ఉన్న సమయంలో తండ్రి బెంగుళూరు నుండి ఖాసింకోటకు (అనకాపల్లి దగ్గర) మకాం మార్చారు. అక్కడ అయన ఒకటవ ఫారం చదువుతున్న రోజులలో దృష్టి లోపం వల్ల, చదువు మాన్పించి వయోలిన్ వాద్యాన్ని నేర్పించారు. తాను నేర్చి, ఏర్పరచుకొన్న బాణీ సుస్థిరమయ్యేందుకు ప్రతీ రోజు సుమారు ఏడు గంటల పాటు... పదకొండేళ్లు కఠోరమైన క్రమశిక్షణ, దీక్షతో గతి తప్పకుండా సాధన చేశారాయన.



ద్వారం వెంకటస్వామి నాయుడు

విజయనగరంలో 1919లో ప్రప్రథమ సంగీత కళాశాలను మహారాజావారు స్థాపించినప్పుడు దానిలో అధ్యాపకులుగా చేరి తర్వాత ప్రిన్సిపాల్‌గానూ వ్యవహరించారు. అయన వయోలిన్ వాయిస్తే... పంచదశ గమకాలు విని పిస్తూ అందులో రవ్వ, పాడి ప్రత్యేకంగా శ్రావ్యంగా ఉంటాయి. ఎవరి వాద్యంలో విన పడని నాదశుద్ధి నాయుడి చేతిలోనే వినపడుతుంది. పక్కవాద్యపు కచేరీలలో ఒదిగి ఉండే ఆయన సోలో కచేరీలలో విశ్వరూపం చూపేవారు. దక్షిణాదిన ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు, ట్రావెంకోర్ ఆస్థాన విద్వాంసులు కుంభకోణం రాజ మాణిక్యం పిళ్లై ఒకసారి నాయుడి సోలో కచేరీ ఆసాంతం విని చివరలో చేతులు జోడించి 'అయ్యా మేము పొట్టకొరకు వయోలిన్ వాయించుకుంటున్నాము, మీరు సంగీతం కొరకు వాయిస్తున్నారు' అని ప్రశంసించారు. భైరవి వంటి ఘన రాగాలు అయన ప్రస్తారం చేసినప్పుడు మంద్రంలో నాదపుష్టి మేఘపు ఉరుమును, అతితారంలో వారు చూపే కొన్ని ద్రుత ప్రక్రియలు మెరుపును స్ఫురింప చేసేవి. కమాను తేల్చి రాగప్రస్తారం చేసేవారాయన.

వీరి శిష్యులు అనేకులు ఉన్నప్పటికీ... శ్రీపాద పినాకపాణి, నూకల చిన సత్యనారాయణ, ద్వారం నరసింగరావునాయుడు, మారెళ్ళ కేశవరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు, పి. సుశీల, రాధా నారాయణన్, టి.ఎమ్. పట్నాయక్ వంటివారు ముఖ్యులు. ఐదు దశాబ్దాల సంగీత సేవ అనంతరం 1964 నవంబర్ 25వ తేదీన తుది శ్వాస విడిచిన మహోన్నత వ్యక్తికి జాతి ఏమిస్తే ఋణం తీర్చుకోగలదు!

– యనమండ్ర వేంకట కృష్ణయ్య | 98499 86679
(నేడు ద్వారం వెంకటస్వామి నాయుడు జయంతి)

ఇదేనా ప్రజా పాలన అంటే?

అభిప్రాయం



నైనాల గోవర్ధన్

రాజకీయ రంగస్థలంపై మూసీ ప్రక్షాళన, పారదర్శకత లోపించి తీవ్ర వివాదాస్పద మవుతోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదల ఇండ్ల కూల్చివేతకు సంబంధించి హైడ్రాపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అగ్రహం ప్రకటించింది. 'రికార్డులు పరిశీలించకుండా కూల్చివేతకు యంత్రాలు ఇవ్వడం ఏమిటని, ఆదివారం కూల్చివేతలు ఎలా చేపడుతారని, రాజకీయ భాష్యాలు చెప్పినట్లు చేస్తే జైళ్లకు పంపుతామ'ని హెచ్చరించింది. పెద్దలను వదిలేసి పేదలను కొడుతున్నారనీ, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తున్నారనీ. ప్రభుత్వంపై, కమిషనర్ రంగనాథ్‌పై, అమీన్పూర్ తహసిల్దార్‌పై హైకోర్టు అగ్రహం వ్యక్తం చేసింది.

మూసీ ఆక్రమణల కూల్చివేత విషయంలో ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్.టి.ఎల్. నిర్ధారించిన తర్వాతే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఎఫ్.టి.ఎల్ బయట ఇల్లు నిర్మించుకున్న వారికి నోటీసులు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించింది. చట్ట ప్రకారమే ముందుకు వెళ్లాలని ఆదేశించింది.

'అసలు మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరిట జరుగుతున్న సుందరీకరణ లక్ష్యం ఏమిటి? మూసీ నదిని, ఆ నదిలో కలిసే వాగులను (గృహ, హోటల్, వ్యాపార, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం, మురుగునీటిని) పూర్తి (ఐరోపా ప్రమాణాల) స్థాయిలో ప్రక్షాళన (శుద్ధి) చేసి స్వచ్ఛమైన జలాలు (నది)గా మార్చే లక్ష్యం ఏమైనా ఉందా? ప్రాజెక్టు పూర్తి అయితే, అంటే ఆ మురుగు నీటిని మూసీ నదిలో కలిసే నాటికి పరిశుభ్రమైన తాగునీటిగా మార్చే ప్రక్రియ ఇందులో ఉందా? లేదా హైదరాబాద్ జంట నగరాలలోని మురుగు నీటిని శుద్ధి చేయకుండా మూసీలోకి వదిలేసి ఆ మురుగు నీటి ప్రవాహంపైనే, సుందరీకరణ చేపడతారా? ఈ అనుమానాలను నివృత్తి చేయాలి. సమగ్రమైన ప్రాజెక్టు పూర్తిస్థాయి నివేదిక (డీపీఆర్)ను ప్రజల ముందు ఉంచాలి.

ప్రజల నివాసాలకు నష్టం కలిగే ఏ ప్రాజెక్టులో నైనా ముందు పునరావాసం కల్పించే ప్రక్రియ పూర్తయిన తరువాతనే, ఆ ప్రాజెక్టుకు సంబంధించిన వారి నివాసాలను చివరలో ఖాళీ చేయించే కార్యక్రమాన్ని మొదలుపెడతారు. కానీ, అందుకు భిన్నంగా సామాన్య పేద, మధ్యతరగతి ప్రజలు జీవితమంతా కష్టించి నిర్మించుకున్న ఇండ్లను ప్రాజెక్టు ప్రారంభంలోనే ఎందుకు కూల్చుతున్నారు? ఇదేనా కేసీఆర్ విధానాలకు ప్రత్యామ్నాయ ప్రజారాజ్యం?

సామాన్య, మధ్యతరగతి వారికి ఒక ఇల్లు అనేది వారి మొత్తం జీవితపు కల. ఆ కల నిజం చేసుకోవడానికి జీవితంలో చాలా మూల్యం చెల్లిస్తారు. పట్టణంలో ఇల్లనే కల సాకారం కోసం సొంత ఊళ్ళలో ఉన్న పొలాలను, ఇతర ఆస్తులను అమ్ముతారు. అప్పులు తెస్తారు. అనేక కష్టాలతో వారి స్తోమతకు తగ్గ ఇల్లు నిర్మించుకుంటారు. ప్రాజెక్టు పేరుతో, పునరావాసం, ఉపాధి కల్పించకుండా ప్రభుత్వం అకస్మాత్తుగా ఆ ఇళ్లను కూల్చివేయడం ప్రజా పరిపాలన అవుతుందా?



ప్రభుత్వాల, పెద్దల రియల్ ఎస్టేట్ దందాతో 10, 20 గజాల నేలపై ఇల్లు కట్టుకోవడం సామాన్య మధ్య తరగతికి ఒక గగన కుసుమంగా మారింది. అందుకే వీరు మురికివాడలకు, దుర్గంధ నదుల పరివాహ ప్రాంతాలకు తరలుతున్నారు. చౌకగా వస్తుందని దుర్గంధపూరిత నది అంచునే స్థలం కొని, భారీ డబ్బుతో క్రమబద్ధీకరణ చేసుకొని, ఇండ్లు నిర్మించుకున్నారు. కూల్చివేతల భయంతో గుండె పోటు చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు. 8 నెలల నిండు గర్భిణీ అనే కనికరం లేకుండా ఆమె ఇల్లు కూల్చడం దుర్మార్గం. ఒక బాధిత కుటుంబం 25 ఏళ్లగా మూసీ పరివాహక ప్రాంతంలోనే ఉంటూ నలుగురు కొడుకులకు పెళ్లి చేసింది. నిర్వాసితులైన వీరందరికీ ఒకే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లభించింది. ఒక్క ఇంట్లో ఇన్ని కుటుంబాలు ఎలా నివసించాలని వేదనకు గురవుతున్నారు వారు. హైడ్రాతో ప్రభుత్వానికి వచ్చిన కీర్తి, మూసి పేదల ఇళ్ల కూల్చివేతతో పాతాళంలోకి పోయింది.

జల వనరులను, ప్రభుత్వ స్థలాలను, పార్కులను రక్షించవలసిందే. కానీ వాటిని ఆక్రమించి భారీ ఆస్తులుగా చేసుకున్నది సామాన్య పౌరులు కాదు. అధికారంలో ఉన్న బడా బాబులు, పెద్దలే. మూసీ నదీ గర్భంలో ఉన్న ఇళ్ల గుర్తింపునకు సంబంధించి మార్కింగ్ ప్రక్రియను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొంతమంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లడానికి ఆసక్తి చూపినా, మరికొందరు ఇండ్లను వదిలిపెట్టడానికి ససేమిరా సిద్ధంగా లేరు. ఇక డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఆశించిన స్థానిక ప్రజలు వాటిని తమకే కేటాయించాలని ఆందోళన చేస్తున్నారు. మూసి నిర్వాసితులు, డబుల్ బెడ్ రూమ్ సమీప ప్రజల మధ్య ఉద్రిక్తత నెలకొంది.

బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అక్రమ నిర్మాణాలను గుర్తించి దాదాపు 15 వేల కుటుంబ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని 2022లోనే నిర్ణయించింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసి పరివాహక ప్రాంతంలో పది వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని తేల్చారు. ఆ నిర్వాసితులందరికీ వారి నివాసానికి, ఉపాధికి అనువైన చోట అన్ని మౌలిక వసతులతో కూడిన పునరావాస సౌకర్యాలను ప్రభుత్వం నిర్వాసితులకు కల్పించాలి. దౌర్జన్యంతో కాకుండా నిర్వాసితులను అన్ని విధాల ఒప్పించి మెప్పించి పునరావస కాలనీకి తరలించాలి.

శుద్ధీకరణ అంటే, మురుగు నీటిలో ఉన్న అశుద్ధ మూలకాలను, కాలుష్యాన్ని తొలగించడం. శుద్ధి చేసిన తర్వాత ఆ నీరు త్రాగడానికి అనువైన విధంగా 100% సురక్షితంగా ఉండాలి. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో నేటి ప్రభుత్వం ఆ నది మురుగు జలాలను అలా స్వచ్ఛమైన తాగునీరుగా మారుస్తుందా? దేశంలోని చాలా నగరాల్లో మురుగు నీటి శుద్ధీకరణ వ్యవస్థలు ఎన్నో ఉన్నప్పటికీ, ఎక్కడా మురుగు నీటిని స్వచ్ఛ జలాలుగా మార్చిన చరిత్ర నేటికీ లేనేలేదు. ఈ విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ తమ ప్రభుత్వ హయాంలో అంగీకరించారు. సీవరేస్ ట్రీట్మెంట్ ప్లాంట్స్‌ల ద్వారా మురుగునీటి శుద్ధీకరణ 30–35% కంటే మించదనీ, తెలంగాణలోనే కాదు, దేశమంతా ఇదే పరిస్థితని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ పథకానికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అనీ, మూసీ సుందరీకరణ ప్రాజెక్టనీ, మూసీ ప్యూరిఫికేషన్ ప్రాజెక్ట్ అనీ రకరకాల పేర్లతో మంత్రులు, అధికారులే గందరగోళం చేస్తున్నారు. మూసీ నదిని పూర్తి స్థాయిలో ఒక ఎకలాజికల్ ప్రాజెక్టు (ఒక స్వచ్ఛమైన నది)గా తీర్చిదిద్దాలనే లక్ష్యం ఏమైనా ప్రభుత్వానికి ఉందా?

మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్, నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్ ఒక మేన్యువల్‌ను 1997లో ప్రకటించింది. 'డిజైన్ మేన్యువల్ ఫర్ వేస్ట్ స్టెబిలైజేషన్ పాండ్స్ ఇన్ ఇండియా' (దేశంలోని వ్యర్థాల స్థిరీకరణ చెరువుల కోసం డిజైన్ మాన్యువల్). ఇది ప్రకటించి 27 ఏళ్ల అయింది. దీని అర్థం ఏమిటంటే... మురుగు నీటిని శుద్ధి చేయలేమని చేతులెత్తేసి, ఆ నీటిని తాగునీరులో కలవకుండా మురుగునీటిని కుంటలుగా స్థిరపరుస్తామని చెప్పడం.

కోటిమంది హైదరాబాద్ నగర వాసులు వాడిన మురికి నీరు, వ్యాపార సముదాయాల వ్యర్థాలు, పరిశ్రమలు వెదజల్లే విష పదార్థాలు మూసీ ద్వారా కృష్ణా నదిలో యధేచ్ఛగా కలుస్తున్నాయి. ఆ కలుషిత నీటినే ప్రజలు జీవజలంగా సేవిస్తున్నారు. మురుగు నీటి శుద్ధీకరణ పథకాలకు ఎంత అందమైన పేర్లు పెట్టినా శుద్ధీకరణ వట్టిదేనని 75 ఏళ్ల దేశ చరిత్ర రుజువు చేస్తోంది. ఇది కఠిన వాస్తవం. మరి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రక్షాళన ఏ రకమైనదో... డీపీఆర్‌ను తెలంగాణ ప్రజల ముందు ఉంచాలి.

వ్యాసకర్త తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్
మొబైల్: 97013 81799

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.సప్తమి రా.7.35 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.03 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.01 నుండి 2.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.09 వరకు, తదుపరి ప.12.09 నుండి 12.57 వరకు, **అమృత ఘడియలు:** రా.10.33 నుండి 12.06 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 5.24.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం-VI (ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరావాసం, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు న్యాయమైన పరిహారం పొందే హక్కు చట్టం- 2013, కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు రూల్ 13 ప్రకారం)

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నెం. E2/1752/2019 తేది: 28/10/2024
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నెం. F/183/2023 తేది: 18/10/2024
గెజిట్ నెంబరు. 142/2024 తేది: 28/10/2024

... సిద్దిపేట జిల్లా, ములుగు మండలంలోని కొక్కొండ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.236.32గుంటలు గల భూమి ... TGIIC కొరకు ... 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన ... ప్రభుత్వ జి.ఓ. నెం.4388/IP&INF/A2/2018, తేది. 05.11.2018 ద్వారా ఇండస్ట్రియల్ & కామర్స్ (IP&INF)-TGIIC వారు 10-A ...

షెడ్యూల్-I

గ్రామము: కొక్కొండ   మండలము : ములుగు   జిల్లా : సిద్దిపేట

1	2	3	4	5	6	7	8	9	10	11
1	289	పట్టాలేండ్ భూమి	మెట్ట/ ఖుష్కీ	0.2900	చింతల రవీందర్ S/o కృష్ణ	284 283 282	...	...	364	...
2	289	పట్టాలేండ్ భూమి	మెట్ట/ ఖుష్కీ	0.2900	చింతల లక్ష్మి W/o కృష్ణ	284 283 282	...	...	364	...
3	289	పట్టాలేండ్ భూమి	మెట్ట/ ఖుష్కీ	0.3700	... S/o ...	284 283 282	...	...	364	...
127	364	పట్టాలేండ్ భూమి	మెట్ట/ ఖుష్కీ	0.0650	చింతల ... S/o ...	357, 304, 356	...	259	363, 361	...
128	364	పట్టాలేండ్ భూమి	మెట్ట/ ఖుష్కీ	0.0650	చింతల రాజు S/o రాములు	357, 304, 356	...	259	363, 361	...
పట్టాభూములు పూర్తి విస్తీర్ణం				81.32						
...				8.08						
...				4.06						
... విస్తీర్ణం				36.07						
...				8.20						
... పూర్తి విస్తీర్ణం				136.13						

సం/- తహశీల్దారు ములుగు మండలం

సం/- అధీకృత అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి గజ్వేల్

సం/- అదనపు కలెక్టర్ సిద్దిపేట జిల్లా

సం/- జిల్లా కలెక్టర్ సిద్దిపేట జిల్లా

R.O.No.351/LA/PP/ADVT/AGENCY/2024-25

పోరులో వెనకబడ్డా.. పోరాటం ఆపబోను

ఓటమిని అంగీకరిస్తున్నా

శాంతియుతంగా అధికార మార్పిడి చేస్తాం | హోవార్డ్ వర్సిటీలో కమలా హారిస్ ప్రసంగం | ఎన్నికల ఫలితాలపై తొలిసారిగా స్పందించిన డెమొక్రటిక్ నాయకురాలు



వాషింగ్టన్: విజయతీరాలకు కాస్తంత దూరంలో నిలిచిపోయినా పోరాటం మాత్రం ఆపేదిలేదని డెమొక్రటిక్ నాయకురాలు కమలా హారిస్ వ్యాఖ్యానించారు. హోరాహోరీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ చేతిలో పరాజయం పాలైన హారిస్ ఫలితాల తర్వాత తొలిసారిగా స్పందించారు. గురువారం వాషింగ్టన్‌లోని హోవార్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వేలాది మంది పార్టీ మద్దతుదారుల సమక్షంలో ఆమె భావోద్వేగ ప్రసంగం చేశారు. 60 ఏళ్ల హారిస్ గతంలో ఇదే వర్సిటీలో రాజనీతి, ఆర్థికశాస్త్రం చదువుకున్నారు.

నా హృదయం నిండిపోయింది

''దేశంపై ప్రేమతో, దేశం కోసం పాటుపడుతూ మీరంతా నాపై ఉంచిన నమ్మకం, ప్రేమతో ఈ రోజు నా హృదయం నిండిపోయింది. ఈ ఎన్నికల్లో మనం ఆశించిన ఫలితం దక్కలేదు. నిజానికి ఇలాంటి ఫలితం కోసం మనం పోరాడలేదు. మీరంతా ఓటేసింది కూడా ఇలాంటి ఫలితం కోసం కాదు. అయితే ఒక్కటి మాత్రం నిజం. అమెరికా అభ్యున్నతి కోసం మనందరం చేసిన ప్రతిజ్ఞా జ్వాల ఎప్పటికీ మండుతూనే ఉంటుంది. ఓడిపోయాక పార్టీ అశేష అభిమానుల్లో పెల్లుబికి వస్తున్న భావోద్వేగాలను అర్థంచేసుకోగలను. అయినాసరే ఈ ఫలితాలను అంగీకరించక తప్పదు. ఫలితం ఎలా ఉన్నా ఆమోదించడం ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రం. నేను ఈ ఫలితాలను, ఓటమిని అంగీకరిస్తున్నా. అయితే పోరాటాన్ని మాత్రం ఆపబోను'' అని అన్నారు.

ట్రంప్‌ను విష్ చేశా

గత ఎన్నికల్లో ఓడినాసరే ఓటమిని అంగీకరించకుండా ట్రంప్ ప్రభుత్వం సాఫీగా అధికార మార్పిడి జరక్కుండా అడ్డుకున్న అంశాన్ని హారిస్ ప్రస్తావించారు. '' అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి గెలిచిన ట్రంప్‌కు స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పా. కాలపరిమితి ముగిశాక శాంతియుతంగా అధికార మార్పిడికి మా ప్రభుత్వం సాయపడుతుందని హామీ ఇచ్చా. మన దేశంలో ఒక అధ్యక్షుడికో, రాజకీయ పార్టీకో నిబద్ధులై ఉండాల్సిన పనిలేదు. కానీ దేశ రాజ్యాంగానికి ఖచ్చితంగా మనం బద్ధులమై ఉండాలి. ఎన్నికలు ముగియడంతో మన పోరాటం ముగిసిపోలేదు. మన పోరాటం కొనసాగుతుంది. అగ్రరాజ్య ఆవిర్భావానికి పునాదులైన సూత్రాలకు కట్టుబడి ఉందాం. కొన్నిసార్లు పోరాటం అనేది సుదీర్ఘకాలం కొనసాగొచ్చు. అంతమాత్రాన మనం గెలవబోమని కాదు. గెలిచేదాకా పోరాటం ఆపకపోవడమే ఇక్కడ ముఖ్యం. స్వేచ్ఛా, అవకాశాలు, పారదర్శకత, ప్రజలకు మెరుగైన జీవితం అందించేదాకా మన పోరాటం కొనసాగుతుంది. ప్రజాస్వామ్యం, శాంతి, సమానత్వం, న్యాయం కోసం నా పోరు ఆగదు. స్వేచ్ఛ కోసం జరిపే సమరం చాలా శ్రమతో కూడుకొని ఉంటుంది. ఇలాంటి కష్టాన్ని మనం ఇష్టపడతాం. మన దేశం కోసం ఆమాత్రం కష్టపడటం సబబే. ఫలితాల తర్వాత మనం ఓటమి చీకట్లోకి జారుకుంటున్నామని చాలా మంది భావించి ఉండొచ్చు. కానీ ఈ కష్టకాలం పెద్ద విషయమే కాదు'' అని అన్నారు.

సభలో గంభీర వాతావరణం

పార్టీ ఓటమితో డెమొక్రాట్లలో ఒకింత నైరాశ్యం నిండింది. సభకు వేలాది మంది వచ్చినా సరే కొన్ని నిమిషాలు నిశ్శబ్దం రాజ్యమేలింది. మధ్యమధ్యలో హారిస్ తన ఉత్సాహభరితమైన ప్రసంగంతో వాళ్లలో హుషారు నింపే ప్రయత్నంచేశారు. పార్టీ సీనియర్ నేతలు కొందరు ప్రసంగించారు. దిగువసభ మాజీ మహిళా స్పీకర్ నాన్సీ పెలోసీ, డీసీ మేయర్ మురేల్ బౌసర్ తదితరులు మాట్లాడారు. పార్టీ గెలుపుపై గంపెడాశలు పెట్టుకున్న కొందరు యువ ఓటర్లు, మద్దతుదారులు సభలోనే కన్నీటిపర్యంతమయ్యారు.





ట్రంప్‌కు 50.8 శాతం హారిస్‌కు 47.5 శాతం

ట్రంప్‌కు 295, హారిస్‌కు 226 ఎలక్టోరల్ ఓట్లు

2 రాష్ట్రాల్లో తేలాల్సి ఉన్న ఫలితం ● వాటిలోని 17 ఎలక్టోరల్ ఓట్లూ ట్రంప్‌కే!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజేతగా నిలిచిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన మెజారిటీని మరింతగా పెంచుకునే దిశగా సాగుతున్నారు. విజయానికి 270 ఎలక్టోరల్ ఓట్లు అవసరం కాగా ఆయనకు ఇప్పటికే 295 ఓట్లు సాధించారు. ఆయన ప్రత్యర్థి, డెమొక్రాట్ అభ్యర్థి కమలా హారిస్ 226 ఓట్లు సాధించారు. మొత్తం 50 రాష్ట్రాల్లోనూ ఇంకా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నా 48 రాష్ట్రాల్లో ఇప్పటికే ఫలితం తేలింది. అరిజోనా, నెవడాల్లో మాత్రమే తేలాల్సి ఉంది. ఆ రెండు రాష్ట్రాల్లో కూడా ట్రంపే ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వాటిలోని 17 ఎలక్టోరల్ ఓట్లు కూడా ఆయన ఖాతాలోనే పడితే ఆయన మొత్తం 312 ఓట్లు సాధిస్తారు. ఇది 2016లో తొలిసారి అధ్యక్షునిగా నెగ్గినప్పుడు సాధించిన ఓట్ల కంటే (304) అధికం. ట్రంప్‌కు ఇప్పటిదాకా 50.8 శాతం, హారిస్‌కు 47.5 శాతం ఓట్లొచ్చాయి. ఆయన 7,27,34,149 ఓట్లు, హారిస్ 6,80,49,758 ఓట్లు సాధించారు.

కాంగ్రెస్‌లో...

అధ్యక్షునితో పాటు కాంగ్రెస్‌కు కూడా ఎన్నికలు జరిగాయి. సెనేట్‌లోని 100 స్థానాల్లో 34 సీట్లకు, ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు పోలింగ్ జరిగింది. వీటితో పాటు 11 రాష్ట్రాల గవర్నర్ పదవులకు, పలు రాష్ట్రాల అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు జరిగాయి. బిల్లుల ఆమోదంలో అత్యంత కీలక పాత్ర పోషించే సెనేట్‌లో నాలుగేళ్ల అనంతరం రిపబ్లికన్లు మెజారిటీ సాధించారు. ఇప్పటిదాకా వెల్లడైన ఫలితాల్లో వారి స్థానాల సంఖ్య మెజారిటీ మార్కును దాటి 52కు చేరింది. డెమొక్రాట్లకు 45 స్థానాలకు పరిమితమయ్యారు. డెమొక్రాట్లు ఇప్పటికే 3 సీట్లను రిపబ్లికన్లకు కోల్పోయారు. ప్రతినిధుల సభలో కూడా రిపబ్లికన్ల హవాయే సాగుతోంది. మెజారిటీకి 218 సీట్లు కావాల్సి ఉండగా వారికిప్పటికే 206 సీట్లు దక్కాయి. డెమొక్రాట్లు 192 సీట్లే గెలుచుకున్నారు. వారిప్పటికే 4 సీట్లను రిపబ్లికన్లకు కోల్పోయారు. మరో 37 స్థానాల్లో ఫలితాలు రావాల్సి ఉంది.

ఏ రాష్ట్రం ఎవరి ఖాతాలో...

ట్రంప్ (29 రాష్ట్రాలు)

టెక్సాస్ (40 ఓట్లు)	ఓక్లహామా (7)
ఫ్లోరిడా (30)	ఉటా (6)
పెన్సిల్వేనియా (19)	మిసిసిపీ (6)
ఒహాయో (17)	అర్కన్సాస్ (6)
జార్జియా (16)	అయోవా (6)
నార్త్ కరోలినా (16)	కాన్సాస్ (6)
మిషిగన్ (15)	ఇదాహో (4)
ఇండియానా (11)	మొంటానా (4)
టెనెసీ (11)	వెస్ట్ వర్జీనియా (4)
మిసోరీ (10)	నెబ్రాస్కా (4)
విస్కాన్సిన్ (10)	వ్యోమింగ్ (3)
అలబామా (9)	అలస్కా (3)
సౌత్ కరోలినా (9)	నార్త్ డకోటా (3)
లూసియానా (8)	సౌత్ డకోటా (3)
కెంటకీ (8)	మెయిన్ (1)

హారిస్ (19 రాష్ట్రాలు)

కాలిఫోర్నియా (54)	కనెక్టికట్ (7)
న్యూయార్క్ (28)	న్యూ మెక్సికో (5)
ఇలినాయీ (19)	రోడ్ ఐలండ్ (4)
న్యూజెర్సీ (14)	హవాయి (4)
వర్జీనియా (13)	న్యూ హాంప్‌షైర్ (4)
వాషింగ్టన్ (12)	డీసీ (3)
మసాచుసెట్స్ (11)	డెలావేర్ (3)
మేరీలాండ్ (10)	మెయిన్ (3)
కొలరాడో (10)	వెర్మాంట్ (3)
మిన్నెసోటా (10)	నెబ్రాస్కా (1)
ఒరెగాన్ (8)	

నోట్: నైష్పత్తిక పద్ధతిన నెబ్రాస్కాలోని 5 ఓట్లలో ట్రంప్‌కు 4, హారిస్‌కు 1 వచ్చాయి. మెయిన్‌లో ట్రంప్ 1, హారిస్ 3 ఓట్లు సాధించారు.

హారిస్ గెలిచిన జాబితాలోని డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా రాష్ట్రం కాదు

ఫలితం తేలాల్సిన రాష్ట్రాలు

అరిజోనా (11 ఓట్లు)
నెవడా (6 ఓట్లు)

శాంతియుతంగా అధికార మార్పిడి: బైడెన్

ఫలితాల తర్వాత తొలిసారిగా జాతినుద్దేశించి ప్రసంగం



వాషింగ్టన్: మరో 11 వారాల్లో అమెరికా అధ్యక్ష పీఠం నుంచి తప్పుకోనున్న జో బైడెన్ తన పర్యవేక్షణలో శాంతియుతంగా అధికార మార్పిడి ప్రక్రియను పూర్తి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఫలితాల తర్వాత ఆయన గురువారం తొలిసారిగా జాతినుద్దేశించి ప్రసంగించారు. గత ఎన్నికల్లో ట్రంప్ ఓటమిని జీర్ణించుకోలేని ఆయన మద్దతుదారులు పార్లమెంట్‌పై దాడికి తెగబడటం, అధికార మార్పిడికి ట్రంప్ తీవ్ర అవరోధాలు సృష్టించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ''ట్రంప్‌తో మాట్లాడా. శాంతియుతంగా అధికార మార్పిడికి యంత్రాంగం మొత్తం సహకరిస్తుందని హామీ ఇచ్చా. అమెరికా ప్రజలు కోరుకుంటున్నదీ ఇదే'' అని బైడెన్ అన్నారు.

భారత్, అమెరికా సంబంధాలు బలోపేతం చేసుకుందాం

- కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకుందాం
- ప్రధాని మోదీ, ట్రంప్ నిర్ణయం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. అమెరికా ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, ఇందుకోసం కలిసికట్టుగా పనిచేయాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. సాంకేతికత, రక్షణ, ఇంధనం, అంతరిక్షంతోపాటు వేర్వేరు కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని తీర్మానించుకున్నారు. భారత్, అమెరికా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాలతోపాటు మొత్తం ప్రపంచ శాంతికి, స్థిరత్వానికి అత్యంత కీలకమని ఇరువురు నేతలు మరోసారి అంగీకారానికొచ్చారు. ట్రంప్ భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల మోదీ హర్షం వ్యక్తంచేశారు. ట్రంప్ నాయకత్వం, దార్శనికత పట్ల అమెరికా ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికలు ఒక ప్రతీక అని పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ మరోసారి నెగ్గడంతోపాటు రిపబ్లికన్ పార్టీ విజయం తనకు ఆనందం కలిగిస్తోందని ఉద్ఘాటించారు. ట్రంప్‌తో తన స్నేహాన్ని, తమ మధ్య జరి గిన సమావేశాలను మోదీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 2019 సెప్టెంబర్‌లో అమెరికాలో జరిగిన హౌడీ మోదీ, 2020 ఫిబ్రవరిలో అహ్మదా బాద్‌లో జరిగిన నమస్తే ట్రంప్ కార్యక్రమాన్ని ప్రస్తావించారు. ఈ మేరకు మోదీ, ట్రంప్ ఫోన్ సంభాషణపై భారత విదేశాంగ శాఖ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా, బుధవారం రాత్రి ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. తమ మధ్య గొప్ప సంభాషణ జరిగిందని పేర్కొన్నారు.



భారత కాన్సులర్ క్యాంప్‌లు రద్దు

భద్రత కల్పించలేమన్న కెనడా అధికారులు



టొరంటో: భారత్, కెనడా మధ్య సంబంధాలు క్షీణిస్తున్న తరుణంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కెనడాలో భారత్‌కు సంబంధించిన కొన్ని షెడ్యూల్డ్ కాన్సులర్ క్యాంప్‌లు రద్దయ్యాయి. ఈ విషయాన్ని టోరంటోలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా గురువారం వెల్లడించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేసింది. క్యాంప్‌లకు, వాటి నిర్వాహకులకు కెనడా ప్రభుత్వం తగిన భద్రత కల్పించడం లేదని, అందుకే వాటిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేసింది. క్యాంప్‌లకు కనీస భద్రత కూడా కల్పించలేమంటూ కెనడా ప్రభుత్వ అధికారులు చేతులెత్తేశారని పేర్కొంది. కెనడాలోని భారతీయ సంఘాలతో కలిసి భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించే కార్యక్రమాలనే కాన్సులర్ క్యాంప్‌లు అంటారు. ఈ నెల 3న కెనడాలోని బ్రాంప్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఖలిస్తానీ మద్దతుదారులు అలజడి సృష్టించిన సంగతి తెలిసిందే.

కెనడాలో 'ఆస్ట్రేలియా టుడే'పై నిషేధం

జైశంకర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను ప్రసారం చేయడమే కారణం



భారత అధికార ప్రతినిధి జైస్వాల్

న్యూఢిల్లీ: భారతదేశం పట్ల వ్యతిరేకతను కెనడా ప్రభుత్వం బహిరంగంగా ప్రదర్శిస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు బలహీనపడుతున్నా లెక్కచేయడంలేదు. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను ప్రసారం చేసినందుకు ఆస్ట్రేలియా మీడియా సంస్థ అయిన 'ఆస్ట్రేలియా టుడే'పై కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కెనడాలో ఆ సంస్థ ప్రసారాలు, వార్తలు ప్రజలకు అందకుండా బ్లాక్ చేసింది. అలాగే మరికొన్ని సోషల్ మీడియా ఖాతాలపైనా నిషేధం విధించింది. తాజాగా ఆస్ట్రేలియాలో జరిగిన జైశంకర్ మీడియా సమావేశాన్ని ప్రసారం చేయడమే ఇందుకు కారణం. కెనడా చర్యపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కెనడాలో భావ ప్రకటన స్వేచ్ఛ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. మీడియా స్వేచ్ఛను గౌరవిస్తున్నామని సుద్దులు చెప్పే కెనడా ప్రభుత్వం ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భారత్‌పై కెనడా చేస్తున్న అసంబద్ధ ఆరోపణలను ఆస్ట్రేలియా గడ్డపై జైశంకర్ ఎండగట్టడాన్ని కెనడా ప్రభుత్వం సహించలేకపోతోందని ఆరోపించారు.

షారుఖ్ ఖాన్‌కూ బెదిరింపులు



ముంబై/రాయ్‌పూర్: బాలీవుడ్‌లోని మరో ప్రముఖ నటుడికి చంపేస్తామంటూ బెదిరింపు అందింది. సల్మాన్ ఖాన్‌కు ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో హెచ్చరికలు రావడం తెలిసిందే. అలాంటి హెచ్చరికే ఈసారి షారుఖ్ ఖాన్‌కు వచ్చింది. రూ.50 లక్షలు ఇవ్వకుంటే షారుఖ్‌ను చంపేస్తామంటూ బాంద్రా పోలీసుల సెల్‌ఫోన్‌కు మెసేజీ వచ్చింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజాన్ ఖాన్ అనే లాయర్ పేరుతో ఉన్న ఫోన్ నుంచి ఆ మెసేజీ వచ్చినట్లు గుర్తించారు. బలవంతపు వసూళ్ల సహా వివిధ ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు బాంద్రా పోలీస్ స్టేషన్‌లో జరిగే విచారణకు రావాల్సిందిగా ఆయనకు నోటీసిచ్చారు. 'షారుఖ్ ఖాన్‌కు వచ్చిన బెదిరింపు మెసేజీపై విచారణ కోసం ముంబై పోలీసులు గురువారం ఉదయం రాయ్‌పూర్‌కు వచ్చారు. బెదిరింపు మెసేజీ ఫైజాన్ పేరుతో రిజిస్టరైన ఫోన్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆ మేరకు రాయ్‌పూర్‌లోని పండ్రి పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఫైజాన్ ఖాన్‌కు నోటీసు అందజేశారు'అని రాయ్‌పూర్ సీనియర్ ఎస్పీ సంతోష్ సింగ్ చెప్పారు. అయితే, ఆ మెసేజీ తాను పంపలేదని, తనపై ఎవరో కుట్ర చేస్తున్నారని ఫైజాన్ ఖాన్ తెలిపారు.

అర్హతా ప్రమాణాలను మధ్యలో మార్చలేరు

- ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు తీర్పు
- ముందుగా చెప్పకుండా రూల్స్ మార్చడానికి వీల్లేదన్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలైన తర్వాత మధ్యలో అర్హతా ప్రమాణాలు మార్చడానికి వీల్లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నియామక ప్రక్రియ మధ్యలో అవసరాన్నిబట్టి నిబంధనల్లో మార్పులు చేస్తామని ముందుగా సమాచారం ఇవ్వకుండా నిబంధనలను మార్చకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పింది. గురువారం తేజ్ ప్రకాష్ పాఠక్ వర్సెస్ రాజస్థాన్ హైకోర్టు కేసును జడ్జీలు సుప్రీంకోర్టు జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్‌రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ మనోజ్ మిశ్రాల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. రాజస్థాన్ హైకోర్టు 2007 సెప్టెంబర్ 17వ తేదీన 13 అనువాదకుల పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీచేసింది. తొలుత ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తామని, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి వ్యక్తిగత ఇంటర్వ్యూలు చేపట్టడం ద్వారా నియామక ప్రక్రియ ముగుస్తుందని పేర్కొంది. ఆ పరీక్షకు మొత్తం 21 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో మూడు ఉద్యోగా లకు ముగ్గురిని ఎంపిక చేశారు. కనీసం 75 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులనే ఉద్యోగాలకు ఎంపిక చేశామని హైకోర్టు తన ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే నోటిఫికేషన్‌లో 75 శాతం మార్కులు తప్పనిసరి అనే విషయాన్ని స్పష్టం చేయలేదు. నిబంధనలు సవరించిన తర్వాత ఆ ముగ్గురిని మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేశారని మిగతా అభ్యర్థులు ఆరోపించారు. తమకు అన్యాయం జరిగిందంటూ బాధిత అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2010 మార్చిలో ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. దీంతో అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు గత ఏడాది జూలై 18వ తేదీన తీర్పును రిజర్వ్‌చేసి గురువారం వెలువరించింది. '' ఏదైనా నియామక ప్రక్రియ అనేది దరఖాస్తుల స్వీకరణకు ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్ ప్రకటనతో మొదలవుతుంది. పోస్టుల భర్తీతో ముగుస్తుంది. ఈ మధ్య కాలంలో నియమాలను మార్చడానికి వీల్లేదు. ఒకవేళ మార్చాల్సి వస్తే నోటిఫికేషన్ వెలువ డటానికి ముందే మార్చాలి. లేదంటే మధ్యలో మార్చాల్సి రావొచ్చేమో అని విషయాన్ని నోటిఫికేషన్‌లోనే ప్రస్తావించాలి. అలాంటివేవీ చెప్పకుండా హఠాత్తుగా అభ్యర్థులను హతాశులను చేసేలా ఆట నియమాలను మార్చొద్దు. ఒకవేళ మారిస్తే అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను, వివాదాలను తట్టుకుని నిలబడగలగాలి'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా 2008లో సుప్రీంకోర్టు ఇచ్చిన పాత '' కె మంజుశ్రీ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు' తీర్పును కోర్టు సమర్థించింది. దీంతోపాటు సుభాష్‌చంద్ మార్వా కేసునూ కోర్టు ప్రస్తావించింది. '' సెలక్ట్ జాబితా నుంచి ఉద్యోగుల ఎంపికను మార్వా కేసు స్పష్టంచేస్తే, సెలక్ట్ జాబితాలోకి ఎలా చేర్చాలనే అంశాలను మంజుశ్రీ కేసు వివరిస్తోంది'' అని పేర్కొంది.





అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్

కశ్మీర్ అసెంబ్లీలో మళ్లీ గందరగోళం

- ప్రత్యేక ప్రతిపత్తి తీర్మానంపై బీజేపీ సభ్యుల నిరసన
- మార్షల్స్‌తో బయటకు పంపించిన స్పీకర్ రథేర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో గురువారం రెండో రోజూ గందరగోళ పరిస్థితులు కొనసాగాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలన్న తీర్మానంపై బీజేపీ ఎమ్మెల్యేలు, మార్షల్స్ మధ్య తోపులాట చోటుచేసుకుంది. అదే సమయంలో, పీడీపీ, పీపుల్స్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఎమ్మెల్యేలు తక్షణమే ఆర్టికల్స్ 370, 35ఏలను యథాతథంగా పునరుద్ధరించాలంటూ మరో తీర్మానాన్ని స్పీకర్ రథేర్‌కు అందజేశారు. గురువారం ఉదయం అసెంబ్లీ సమావేశం మొదలుకాగానే బుధవారం ఆమోదించిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు నినాదాలు మొదలుపెట్టారు. ఆ తీర్మానం అక్రమమని నినాదాలు చేశారు. ఏదైనా సభ ద్వారా జరగాల్సిందే తప్ప, తీర్మానాన్ని వాపసు చేసే అధికారం తనకు లేదని స్పీకర్ రథేర్ తెలిపారు. బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ సభలో ప్రసంగిస్తుండగానే, అవామీ ఇత్తెహాద్ పార్టీ నేత ఖుర్షీద్ ఆర్టికల్ 370ను పునరుద్ధరించాలని ఉన్న బ్యానర్‌తో వెల్‌లోకి చేరారు. దీంతో, బీజేపీ సభ్యులు కూడా వెల్‌లోకి దూసుకెళ్లి, ఆ బ్యానర్‌ను చించేశారు. ఆ సమయంలో ఖుర్షీద్, బీజేపీ ఎమ్మెల్యేల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో, ఖుర్షీద్‌ను కాపాడేందుకు పీపుల్స్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే సజాద్ లోనె ప్రయత్నించారు. ఈ గందరగోళం నడుమ స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. తిరిగి సభ మొదలయ్యాకా బీజేపీ నిరసన కొనసాగింది. ప్రత్యేక ప్రతిపత్తి కావాలంటూ నేషనల్ కాన్ఫరెన్స్ చేస్తున్న డ్రామా ఆగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సునీల్ శర్మ అనడంతో సభ బీజేపీ, ఎన్‌సీ సభ్యుల నినాదాలతో మారుమోగింది. ఈ సమయంలో స్పీకర్ ఆదేశాలతో అక్కడికి చేరుకున్న మార్షల్స్‌తో బీజేపీ సభ్యులు ఘర్షణ పడ్డారు. అధికార సభ్యులు బల్లలు చరుస్తుండగా మార్షల్స్ బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు పంపివేశారు. కొద్దిసేపటి తర్వాత స్పీకర్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

త్వరలో ఉగ్రవాద వ్యతిరేక విధానం

- ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పటిష్టమైన వ్యూహం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి



న్యూఢిల్లీ: ఉగ్రవాదులను ఏరిపారేయడంతోపాటు వారి నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. త్వరలో జాతీయ స్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక విధానం తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పటిష్టమైన వ్యూహంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. ఉగ్రవాద నియంత్రణపై గురువారం ఢిల్లీలో జరిగిన సదస్సులో అమిత్ షా మాట్లాడారు. రాష్ట్రాల డీజీపీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా, నిఘా సంస్థల అధినేతలు పాల్గొన్నారు. శాంతి భద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశమే అయినప్పటికీ, రాష్ట్రాలు భౌతికమైన సరిహద్దులు కలిగి ఉన్నప్పటికీ, రాజ్యాంగపరంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. ఉగ్రవాదానికి అలాంటి సరిహద్దులు, పరిమితులు ఉండవని అమిత్ షా గుర్తుచేశారు. అందుకే ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వ్యూహాలు, నిఘా సమాచారాన్ని పంచుకోవడం, పరస్పర సమన్వయం వంటి చర్యలు అవసరమని సూచించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం మోడల్ ఉగ్రవాద వ్యతిరేక స్క్వాడ్ (ఏటీఎస్), మోడల్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) తీసుకురావాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఉగ్రవాదాన్ని ఎదిరించడానికి ఇవి ఉమ్మడి వేదికలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న యాంటీ-టెర్రరిజం పాలసీ, స్ట్రాటజీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా సిబ్బంది, పోలీసుల పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

రేపు రాబోం

'వక్ఫ్' జేపీసీ కమిటీ భేటీపై విపక్షాలు

కోల్‌కతా/న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై సమీక్ష చేపడుతున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ నవంబర్ 9వ తేదీ నుంచి మొదలుకానున్న తదుపరి సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు కమిటీలోని విపక్ష సభ్యులు ప్రకటించారు. కమిటీ సభ్యులు కల్యాణ్ బెనర్జీ, నదీముల్ హక్ గురువారం కోల్‌కతాలో మాట్లాడారు. ''విరామం ఇవ్వకుండా, సమీక్షలకు మేం సిద్ధమయ్యే అవకాశం లేకుండా చైర్మన్, బీజేపీ నేత జగదాంబికా పాల్ సమావేశాలకు తేదీలు ఖరారు చేశారు. వేర్వేరు రాష్ట్రాల్లో గువాహటి, భువనేశ్వర్, కోల్‌కతా, పట్నా, లక్నోల్లో ఆరు రోజుల్లో సమావేశాలకు రమ్మంటున్నారు. పాల్ ఏకపక్ష నిర్ణయాలను మేం వ్యతిరేకిస్తున్నాం. అందుకే ఈ దఫా భేటీలను మేం బహిష్కరించబోతున్నాం'' అని అన్నారు.



గురువారం గోవా తీరంలోని అరేబియా సముద్ర జలాల్లో యుద్ధవిమాన వాహకనౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్‌పై నావికా దళం సన్నద్ధతను సమీక్షించిన సందర్భంగా యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

క్లుప్తంగా...

పత్తి అమ్మకాల్లో సమస్యలుంటే 8897281111 నంబరుకు వాట్సాప్ చేయండి

• వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పత్తి అమ్మే సమయంలో సమస్యలు ఎదురైతే రైతులు 8897281111 నంబరుకు వాట్సాప్ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన సచివాలయంలో పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లా అధికారులు జిన్నింగ్ మిల్లుల ను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. వరి కొను గోలు కేంద్రాల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాల ను కూడా పర్యవేక్షించాలని చెప్పారు. రైతుల కు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, మేజర్ మార్కెట్ కమిటీలను ఆధునీకరించాలని ఆదేశించారు. మార్కెటింగ్ సెంటర్లలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని, దగ్గరలోని సీసీఐలోనే పత్తిని అమ్ముకోవాలని రైతులకు సూచించారు. పత్తి కొనుగోళ్లపై సమగ్ర వివరాలు అందించే విధంగా ఒక వెబ్‌పోర్టల్ తయారు చేశామన్నారు. దీని ద్వారా సీసీఐ ఇప్పటి వరకు ఎంత పత్తిని కొనుగోలు చేసిందో, ఎంత తిరస్కరించిందో పొందుపరిచిందని తెలిపారు.

ఈ-కామర్స్ సంస్థల్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఈ-కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై వచ్చిన అనేక ఫిర్యాదుల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దేశవ్యాప్తంగా 19 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించింది. ఫెమా ఉల్లంఘనలపై దర్యాప్తు ప్రారంభించి.. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హరియాణాలోని పంచకులలో సోదాలు చేపట్టినట్టు ఈడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సదరు సంస్థలు వస్తువులు లేదా సేవల విక్రయ ధరను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేయడం ద్వారా ఎఫ్‌డీఐ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయన్న అభియోగాలపై ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు.

పోలీస్ కొట్టాడని యువకుడి ఆత్మహత్య

ఠాణా ఎదుట బంధువుల ఆందోళన



కిషన్

అల్లాదుర్గం(మెదక్): ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కానిస్టేబుల్ కొట్టి పంపించాడని మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కిషన్ (32) అనే వ్యక్తి ఫోన్ పోయింది. దీంతో మంగళవారం రాత్రి అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. అయితే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సాయిలు తనను కొట్టి పంపించాడని, తనకు న్యాయం జరగలేదని, సత్యం చచ్చిపోయిందని, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డికి సెల్యూట్.. అంటూ సూసైడ్ నోట్ రాసి తన బైక్‌లో పెట్టాడు. బుధవారం రాత్రి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూసైడ్ నోట్ చూసిన బంధువులు గురువారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. సీఐ రేణు కారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి బాధితులను సముదాయించారు. కిషన్ మృతికి కారణమైన కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మృతుని బంధువులు డిమాండ్ చేయడంతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. మృతుడికి భార్య రేణుక, ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా, మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని రాంపూర్ గ్రామంలో కిషన్ బంధువులు మరోసారి ఆందోళన చేపట్టారు. అల్లాదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు అప్పు.. తల్లి కిడ్నాప్

• మహారాష్ట్రకు తరలింపు... రంగంలోకి పోలీస్ ప్రత్యేక బృందాలు
• కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మహిళ క్షేమం



శ్రీనివాస్ తల్లిని వాహనంలో తీసుకెళుతున్న నాగోరావు, అనుచరులు. (ఇన్‌సెట్‌లో) భీమాబాయ్

వేములవాడఅర్బన్: కొడుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని కిడ్నాప్ చేసిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కొడుముంజలో కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ కుటుంబం కొన్నేళ్ల క్రితం వలస వచ్చి కొడుముంజలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. శ్రీనివాస్ ఛత్తీస్‌గఢ్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన నాగోరావుతో శ్రీనివాస్‌కు పరిచయం ఉంది. నాగోరావు కర్ణాటకలో చెరకు తోటలను కోసే పనులు కాంట్రాక్ట్ తీసుకోగా, కూలీల అవసరం ఉండడంతో శ్రీనివాస్‌ను సంప్రదించాడు. కూలీలను తీసుకొస్తానని చెప్పి శ్రీనివాస్ రూ.3.80 లక్షలు నాగోరావు వద్ద ఏడాది క్రితం తీసుకున్నాడు. కూలీలను పంపించకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీంతో బుధవారం రాత్రి నాగోరావు తన అనుచరులతో కలిసి శ్రీనివాస్ అద్దెకు ఉంటున్న ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంటి వద్ద లేకపోగా, అతని భార్య వారిని చూసి పరారైంది. అక్కడే ఉన్న శ్రీనివాస్ తల్లి పల్లపు భీమాభాయ్‌ని బలవంతంగా కారులో తీసుకెళ్లాడు. ఈ క్రమంలో తమ నాన్నమ్మను తీసుకెళ్లద్దని పిల్లలు కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. డబ్బులు ఇచ్చి శ్రీనివాస్ తల్లిని తీసుకెళ్లండంటూ నాగోరావు వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు వేములవాడటౌన్ సీఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కిడ్నాప్ కేసు నమోదు చేసి మహారాష్ట్రకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని పంపించారు. కిడ్నాపర్లను అదుపులోకి తీసుకొని భీమాబాయ్‌ని, నాగోరావుతోపాటు అనుచరులను వేములవాడ ఠాణాకు తీసుకొస్తున్నట్టు సీఐ వివరించారు.

ఇన్ని స్కూళ్లెందుకు?

• కొన్ని పాఠశాలలను విలీనం చేద్దాం
• మండలానికి నాలుగు పెద్ద స్కూళ్లు చాలు!
• ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులతో విద్యా కమిషన్ చైర్మన్!
• ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ..



సాక్షి, హైదరాబాద్: ఒక్క పాఠశాల కూడా మూసేది లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకవైపు ప్రకటిస్తుంటే.. మరోవైపు విద్యా కమిషన్ మాత్రం పాఠశాలలు కుదిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన ముందుకు తీసుకురావడం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో చాలా పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'ఇన్ని స్కూళ్లెందుకు? విద్యార్థులు తక్కువున్న పాఠశాలలు కొన్నింటిని కలిపి పెద్ద స్కూల్‌గా చేద్దాం. మండలానికి ఇలాంటి నాలుగు స్కూళ్లు మాత్రమే ఉంటే బాగుంటుంది..' అని కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం ఉపాధ్యాయ సంఘం టీఎస్ యూటీఎఫ్ ప్రతినిధులు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, పలువురు సీనియర్ ఉపాధ్యాయులతో చైర్మన్ సమావేశమయ్యారు. పాఠశాలల పనితీరు, బలోపేతంతో పాటు పలు అంశాలపై చర్చించారు. పెద్ద స్కూళ్లలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. విద్యార్థి కేంద్రంగానే విద్యావ్యవస్థ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు స్కూళ్లు 2 వేల మంది విద్యార్థులతో ఒకే ప్రిన్సిపల్‌తో నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్న తీరును ఆయన ప్రస్తావించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘ నేతలు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రభుత్వం వీధికో స్కూల్ పెడతానని వేదికలపై చెబుతుంటే, స్కూళ్లు తగ్గించే ఆలోచన ఏంటంటూ సంఘం నేతలు అడిగినట్లు సమాచారం.

టీచర్లలో జవాబుదారీతనం పెరగాలి

మండలానికి నాలుగు స్కూళ్లు ఉంటే విద్యార్థులు కిలోమీటర్ల కొద్దీ వెళ్ళాల్సిన పరిస్థితి తలెత్తుతుందనే అభిప్రాయం సంఘం నేతలు వ్యక్తం చేశారు. దీంతో ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులు ఎన్ని కిలోమీటర్లయినా బస్సులు, ఆటోల్లో వెళ్తున్నారంటూ, ప్రభుత్వ స్కూళ్లకు కూడా రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని చైర్మన్ ఆరా తీశారు. ఉపాధ్యాయుల పనితీరుకు సంబంధించి ఈ సందర్భంగా అనేక అంశాలు లేవనెత్తినట్టు ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తెలిపారు. టీచర్ల బోధన విధానంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. సరైన బోధన చేస్తుంటే విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు ఎందుకు వెళ్తున్నారని అడిగినట్లు సమాచారం. టీచర్లలో జవాబుదారీతనం పెరగాలనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ప్రజాభిప్రాయం సేకరిస్తున్నాం: చైర్మన్

'ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అన్ని వర్గాల నుంచి అభిప్రాయం సేకరిస్తున్నాం. అన్ని వసతులతో పెద్ద స్కూళ్లు ఉండాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మండలానికి మూడు నాలుగు పెద్ద స్కూళ్లు అన్ని హంగులతో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఉపాధ్యాయ సంఘాల వద్ద చర్చించా..' అని చైర్మన్ మురళి తెలిపారు.

కార్పొరేట్ విద్యా వ్యాపారం అరికట్టాలి : యూటీఎఫ్

కార్పొరేట్ విద్యా వ్యాపారం అరికట్టాలని విద్యా కమిషన్‌ను టీఎస్ యూటీఎఫ్ కోరింది. చైర్మన్‌తో భేటీ వివరాలను సంఘం నేతలు జంగయ్య, చావా రవి, మీడియాకు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని, తరగతికొక టీచరు, గది ఉండాలని, పట్టణీకరణ నేపథ్యంలో పాఠశాలల రీ లొకేషన్ జరగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆకర్షణీయమైన పాఠశాలలు, పటిష్టమైన పర్యవేక్షణ, సమర్థవంతమైన బోధన ఉండాలని సూచించారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రాజీనామా

• బోర్డుకు విలువ లేదని నిరసన

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్‌లోని ఏడుగురు డైరెక్టర్లలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన రంగారావు.. తీవ్ర అసంతృప్తితో పాలకవర్గానికి రాజీనామా చేశారు. చైర్మన్ సహా డైరెక్టర్లు ఎవరికీ విలువ లేదని, రైతుల కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా అధికారులు పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన వైదొలిగినట్లు చెబుతున్నారు. గతంలో డైరెక్టర్ల బోర్డులో మార్క్‌ఫెడ్ జీఎంను తొలగించాలని విన్నవించినా వ్యవసాయశాఖ ఉన్నతాధికారి అడ్డం పడ్డారని, ఇలాగైతే తామెందుకని ఆయన తన రాజీనామా లేఖలో నిలదీశారు. పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశం నిర్వహించలేదు. నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్వహించకుంటే ఏడాది పూర్తయిన మరునాడే ఆ పాలకవర్గం చట్టరీత్యా రద్దు కావాలి. కానీ అలా జరగలేదు. దీనిపై కోర్టులోనూ పిటిషన్లు దాఖలవడం తెలిసిందే. రవాణా టెండర్ల విషయంలో భాగస్వాముల్ని చేయకపోవడంలోనూ అసంతృప్తి నెలకొంది.

హైకోర్టు తీర్పు అమలుకు రూ.లక్షన్నర

• ఫైల్ ఆర్జేడీ ఆఫీస్‌కు పంపడానికి మరో రూ.50 వేలు
• ఉపాధ్యాయురాలి భర్త నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన డీఈఓ



ఏసీబీకి పట్టుబడిన డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి భర్త నుంచి లంచం తీసుకుంటూ మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన ఓ మహిళ కొకుంట్ల మండల పరిధిలోని అప్పంపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. 2 నెలల క్రితం జరిగిన సీనియారిటీ పదోన్నతి జాబితాలో ఆమె పేరు లేదు. ఈ విషయంపై బాధితురాలు తనకన్నా సీనియారిటీ, వయసులో తక్కువగా ఉన్న జూనియర్‌కు ఎలా పదోన్నతి ఇస్తారని డీఈఓ రవీందర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన కోర్టుకు వెళ్లమని సలహా ఇవ్వగా.. ఆమె హైకోర్టుకు వెళ్లడంతో అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం సీనియారిటీలో ఆమె పేరు పెట్టడానికి డీఈఓ రూ.1.50 లక్షలు లంచంగా తీసుకున్నాడు. కాగా.. మళ్లీ పదోన్నతి జాబితాలో జూనియర్ పేరు కంటె ఆమె పేరు పైవరుసలో పెట్టడంతో పాటు సదరు ఫైల్‌ను ఆర్జేడీ కార్యాలయానికి పంపడానికి మరో రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీ అధికారులను సంప్రదించింది. దీంతో దాదాపు వారం పాటు ఏసీబీ బృందం రెక్కీ నిర్వహించింది. మహబూబ్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్న డీఈఓ రవీందర్ ఇంట్లో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రూ.50 వేలు సదరు ఉపాధ్యాయురాలి భర్త ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ క్రమంలో డీఈఓ ఇంటిపై నుంచి దూకి పారిపోయేందుకు ప్రయత్నించగా.. అక్కడే ఉన్న ఏసీబీ కానిస్టేబుల్ అడ్డుకొని పట్టుకున్నట్టు తెలిసింది. శుక్రవారం వైద్య పరీక్షలు పూర్తి చేసి హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

గుట్ట స్వర్ణగోపురం రాష్ట్రానికే గర్వకారణం

• మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత ఎత్తయిన స్వర్ణగోపురం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానిదే కావడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి కొండా సురేఖ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో అధికారులతో గురువారం మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఉన్నతాధికారులు శైలజా రామయ్యర్, దాన కిషోర్, హనుమంత్ కొండిబా, కిషన్‌రావు పాల్గొన్నారు. గాలి గోపురం విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇస్తున్న పరిహారంపై మంత్రి ఆరా తీశారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి వాటిని లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

60 కిలోల బంగారం.. రూ.8 కోట్లు

విమాన గోపురం బంగారం తాపడం పనుల వివరాలపై మంత్రి ఆరా తీశారు. ఈ నెల 15 నుంచి విమాన గోపురానికి బంగారు తాపడం అమర్చే పనులు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు. బంగారు తాపడం నిమిత్తం 60 కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ చార్జీలకు కలిపి మొత్తం రూ. 8 కోట్లు వెచ్చిస్తున్నట్టు వివరించారు.

భూములిచ్చేందుకు రైతుల అంగీకారం

ఖిలావరంగల్: మామునూరు విమానాశ్రయానికి భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. గురువారం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్ సత్యశారదలతో కలిసి మంత్రి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం రన్‌వే పొడిగింపుతో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులతో సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి లేదా, ప్రభుత్వ ధరకు మరో 30 శాతం కలిపి చెల్లిస్తామని చెప్పడంతో..అంగీకరించిన రైతులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

పీజీ మెడికల్ సీట్ల బ్లాకింగ్‌పై ఈడీ దూకుడు

• మల్లారెడ్డి మెడికల్ కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్‌రెడ్డిని ప్రశ్నించిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో పీజీ మెడికల్ సీట్ల బ్లాకింగ్ కుంభ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్‌రెడ్డిని గురువారం విచారించారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సురేందర్ రెడ్డిని ప్రశ్నించారు. 2016 నుంచి 2022 మధ్య కాలంలో మెడికల్ కాలేజ్ అడ్మిషన్లలో అవకత వకలు జరిగాయని, మెడికల్ సీట్లు నిబంధన లకు విరుద్ధంగా విక్రయించారన్న ఆరోపణలపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎంబీ బీఎస్, పీజీ మెడికల్ సీట్లను మేనేజ్‌మెంట్, కన్వీనర్, ఎన్‌ఆర్‌ఐ కోటా కింద భర్తీ చేసిన విధా నంపై సురేందర్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై గత ఏడాది జూన్ 22న మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడి కల్ సైన్సెస్ సహా రాష్ట్ర వ్యాప్తంగా 10 మెడికల్ కాలేజీల్లో ఈడీ సోదాలు చేసిన విషయం తెలి సిందే. ఆ సోదాల్లో మల్లారెడ్డి మెడికల్ కాలేజ్‌లో రూ.1.4 కోట్ల నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బ్యాంక్ ఖాతాల్లోని రూ.2.89 లక్షలు ఫ్రీజ్ చేశారు.

ఈడీ ముందుకు మాజీ ఆర్డీఓ

• నాగారం భూదాన్ భూముల కుంభకోణంలో విచారణ

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్స్ కేసు దర్యాప్తులో భాగంగా అప్పటి ఆర్డీఓ వెంకటాచారిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. గురువారం ఉదయం ఆయన ఈడీ కార్యాలయానికి వచ్చి ఈడీ అధికారులు అడిగిన పలు పత్రాలను, బ్యాంకు స్టేట్‌మెంట్లను సమర్పించినట్టు తెలిసింది. ఈ భూ కుంభకోణానికి సంబంధించి ఐఏఎస్ అధికారి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో మూడు రోజులపాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధికారుల విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగానే తాజాగా మాజీ ఆర్డీఓ వెంకటాచారిని ప్రశ్నించినట్టు తెలిసింది. కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అమోయ్‌కుమార్ నుంచి మీకేమైనా ఆదేశాలు ఉండేవా? ఈ భూ కుంభకోణానికి సంబంధించి మీతో ఏవైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా? ఇంకా ఎవరైనా రాజకీయ నాయకులకు ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్నాయా? ఇలా పలు కోణాల్లో ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అవసరం మేరకు మరోమారు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని వెంకటాచారికి సూచించినట్టు సమాచారం.

శత్రు దేశాల ఉపగ్రహాల పాలిట డెత్‌స్టార్

'స్టార్ వార్స్'తరహాలో సూపర్ వెపన్ 'డెత్ స్టార్' అభివృద్ధి చేసిన చైనా!


శాటిలైట్లపై మైక్రోవేవ్ ఎనర్జీతో దాడి చేసేలా ప్రణాళిక

ఫైబర్ ఆప్టిక్ టెక్నాలజీ సాయంతో అంతరిక్షంలో ఏడు 'యంత్రాల' అనుసంధానం

వాటి నుంచి ఏకకాలంలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్ నిర్దేశిత లక్ష్యంపై విడుదల

ఇప్పటికే విజయవంతంగా ప్రయోగాలు పూర్తి

హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ ఫ్రాంచైజీ 'స్టార్ వార్స్'చూశారా? అందులో సూపర్ వెపన్ అయిన 'డెత్ స్టార్' అనే అంతరిక్ష కేంద్రం భారీ లేజర్ కిరణాలతో ఏకంగా గ్రహాలనే నామరూపాల్లేకుండా చేయడం గుర్తుందా? అచ్చం అలాగే అంతరిక్షంలోని శత్రు దేశాల ఉపగ్రహాలను నిర్వీర్యం చేసే నిజమైన 'డెత్ స్టార్'ను చైనా శాస్త్రవేత్తలు రూపొందించారు! ఈ దిశగా ప్రయోగాలను కూడా విజయవంతంగా పూర్తిచేశారు!! ఈ అత్యాధునిక ఆయుధానికి సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా ఉంచినప్పటికీ అంతరిక్షంలో ఉపయోగించేందుకే ఈ తరహా ఆయుధాల అభివృద్ధి జరుగుతున్నట్లు పలు చైనా జర్నల్స్ చెబుతున్నాయి. ఇంతకీ దాన్ని ఎలా రూపొందించారు.. అందులో వాడే టెక్నాలజీ ఏమిటి?



సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం ఈ సూపర్ వెపన్.. మైక్రోవేవ్ ఎనర్జీ (ఒక రకమైన ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్)ని ప్రసరించే ఏడు 'యంత్రాలను' ఉపయోగిస్తుంది. అంతరిక్షంలో దూరదూరంగా ఉండే ఈ ఏడు యంత్రాలు ఫైబర్ ఆప్టిక్స్ ద్వారా అనుసంధానమై ఉంటాయి. ఒక్కో యంత్రం ఒకే ఒక్క శక్తివంతమైన ఎలక్ట్రో మ్యాగ్నెటిక్‌వేవ్‌ను శత్రు లక్ష్యంపై విడుదల చేస్తుంది. ఇలా ఏడు యంత్రాల నుంచి ఏకకాలంలో ఏడు తరంగాలు విడుదలై నిర్దేశిత లక్ష్యాన్ని నాశనం చేస్తాయి. అయితే ఇలా ఏకకాలంలో లక్ష్యాన్ని ఢీకొట్టాలంటే ఆ యంత్రాల నుంచి తరంగాలు కచ్చితంగా ఒకే సమయానికి విడుదల కావాలి. ఎంత కచ్చి

ఎలా పనిచేస్తుందంటే..

తత్వంతో అంటే అవి ఒక సెకనులో 170 లక్షల కోట్లవ వంతు కాలంలో విడుదల కావాలన్నమాట!! ప్రస్తుతం అత్యాధునిక జీపీఎస్ శాటిలైట్లలోని అటామిక్ గడియారాలు కొన్ని వందల కోట్ల ఏళ్లలో ఒకే ఒక్క సెకనును మాత్రమే మిస్ అవుతున్నాయి. వాటికన్నా ఎన్నో రెట్ల కచ్చితమైన కాలాన్ని లెక్కించడం అసాధ్యమని ఇప్పటివరకు భావిస్తుండగా చైనా శాస్త్రవేత్తలు ఈ అడ్డంకిని కూడా అధిగమించారు. గతేడాదే వారు సుమారు 1,800 కిలోమీటర్ల పరిధి నుంచి ఒక సెకనులో 10 లక్షల కోట్లవ వంతు కాలానికి సమానమైన కచ్చితత్వాన్ని సాధించారు. నిర్దేశిత లక్ష్యంలోని ఒకే భాగాన్ని ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్ తాకేందుకు ఈ ఆయుధంలో లేజర్ పొజిషనింగ్ పరికరాలు కూడా ఉన్నాయి. లక్ష్యం ఉన్న దూరం, దాన్ని ఢీకొట్టేందుకు అవసరమైన కచ్చితత్వంతో కూడిన సమయాన్ని లెక్కించాక మొబైల్ కమాండ్ సెంటర్ నుంచి దాడి చేయాలని సంకేతం పంపగానే ఆయుధంలోని యంత్రాలు వాటి పని కానిస్తాయి. కేవలం ఒక గిగావాట్ శక్తిని విడుదల చేసే సామర్థ్యంగల ఒక ఆయుధం ద్వారా భూమికి సమీపంలోని ఉపగ్రహాలను నాశనం చేయడం సాధ్యమవుతుందని ఇప్పటికే పలు అధ్యయనాలు తేల్చాయి.

కమ్యూనికేషన్ నిర్వీర్యమే ఉద్దేశం..

మైక్రోవేవ్ ఆయుధాలు నిర్దేశిత లక్ష్యాలను పేల్చేసే బదులు శక్తివంతమైన ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ రేడియేషన్‌ను విడుదల చేయడం ద్వారా ఆయా లక్ష్యాల్లో ఉండే ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్ సర్క్యూట్లను దెబ్బతీస్తాయి. దీంతో ఉపగ్రహాల వంటి సమాచార వ్యవస్థల్లో గ్రౌండ్ సెంటర్లతో కమ్యూనికేషన్ నిలిచిపోతుంది. డ్రోన్ల వంటి చిన్న లక్ష్యాలపై ఈ తరహా ఆయుధాలు సమర్థంగా పనిచేసినట్లు ఇప్పటికే పలు ప్రయోగాల్లో తేలింది. అమెరికా ఎయిర్ ఫోర్స్ రీసెర్చ్ ల్యాబ్ అభివృద్ధి చేసిన థోర్ (ద టాక్టికల్ హైపవర్ ఆపరేషనల్ రెస్పాండర్) కొన్ని వందల డ్రోన్లను ఏకకాలంలో నిర్వీర్యం చేయగలదు. అగ్రరాజ్యం గత నెలలోనే రష్యా లేదా చైనా శాటిలైట్ సిగ్నళ్లను నిలువరించగల మెడోలాండ్స్ అనే జామర్ ఆయుధాన్ని సమకూర్చుకుంది. మరోవైపు యూకే సైతం డ్రాగన్‌ఫైర్ లేజర్ వెపన్‌ను అభివృద్ధి చేసింది. గాల్లో ఎగిరే డ్రోన్లను కూల్చేసే సామర్థ్యాన్ని దీనికి ఉంది. అలాగే ఏకంగా 1.5 కి.మీ. దూరం నుంచే ఒక నాణెం సైజులో ఉండే లక్ష్యాన్ని కూడా కచ్చితత్వంతో దాడి చేయగల సామర్థ్యం దీని సొంతం.

– సాక్షి సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

దయచేసి బదిలీల కోసం రావొద్దు: మంత్రి పొన్నం


సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న పొన్నం

హుస్నాబాద్: టీచర్లు, ఆర్టీసీ కార్మికులు బదిలీల కోసం రావొద్దని, ఈ విషయంలో తానేమీ చేయలేనని, తనను క్షమించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురికి కాలువల పనులకు గురువారం ఆయన కలెక్టర్ మనుచౌదరితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, విద్యాశాఖలో పలువురు ఉపాధ్యాయులనుంచి తమకు అనుకూలమైన చోటుకు బదిలీ చేయాల్సిందిగా ఒత్తిడి వస్తోందని, ఈ రెండు శాఖలు మినహా మరే సమస్యను తన దృష్టికి తెచ్చినా పరిష్కరిస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో వర్షాలకు వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సర్వే ప్రజల సమస్యలు, వారి స్థితిగతులు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

'ఓటుకు–నోటు' కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: 'ఓటుకు–నోటు'కేసుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. ఇటీవల తాను ఈ కేసును విచారించలేనంటూ జస్టిస్ సతీస్‌చంద్ర శర్మ తప్పుకున్నారు. దీంతో గురువారం ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్ కుమార్, ప్రతివాది తరపున ఏఓఆర్ ప్రియాంక ప్రకాశ్ హాజరయ్యారు. ఈ కేసులో కొంత సమయం కావాలని ఇరు పక్షాలు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం కేసు విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. తనను ఈ కేసు నుంచి తప్పించాలని జెరూసలేం మత్తయ్య గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కేసు నుంచి జెరూసలేం మత్తయ్య పేరును క్వాష్(తొలగించడం) చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 2016, జూలై 6న తెలంగాణ యాంటీ కరెప్షన్ బ్యూరో (ఏసీబీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం కార్యవర్గం ప్రకటన

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ విద్యావంతుల ఫోరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. ఇటీవల ఓయూలో జరిగిన సమావేశంలో ఫోరం నాయకులు.. తెలంగాణ మహిళ విద్యావంతుల వేదిక ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలిగా హైకోర్టు లాయర్ డాక్టర్ స్వర్ణలత వద్దిరాజుల, ప్రధాన కార్యదర్శిగా గురుకుల టీచర్ తల్ల మల్ల శ్వేతహసేన్, కోశాధికారిగా నిజాం కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ ద్వారిక స్వప్న, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గురుకుల కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రేష్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా లెక్చరర్ నాగపూరి రోజా తదితరులను ఫోరం గౌరవాధ్యక్షురాలు, ఓయూ విశ్రాంత అధ్యాపకురాలు ప్రొఫెసర్ కస్తూరి లక్ష్మి ప్రకటించారు. డిసెంబరు 20న చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నెట్‌జీరో సిటీ @ రూ.12,972 కోట్లు

ఫార్మాసిటీ భూముల్లో హరిత నగర నిర్మాణం

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రానిక్స్, ఏఐ, హెల్త్, లైఫ్‌సైన్స్, ఎడ్యుకేషన్ జోన్లు.. కేంద్ర సాయం కోసం 16వ ఆర్థిక సంఘానికి ప్రతిపాదనలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన నెట్‌జీరో (కాలుష్య రహిత) సిటీ అభివృద్ధికి రూ.12,972 కోట్లు అవసరమని ఓ అంచనాకు వచ్చింది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏ పనికి ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆర్థిక సహాయం కోసం కేంద్రానికి సిఫార్సు చేయాల్సిందిగా 16వ ఆర్థిక సంఘాన్ని అభ్యర్థించింది. 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల పరిధిలో 14,000 ఎకరాల భూమిని సేకరించింది. ఫార్మాతో ఆ ప్రాంతమంతా కాలుష్యమయం అవుతుందని రైతులు, స్థానికులు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఆ మేరకు ఫార్మాసిటీ స్థానంలో ఫార్మా విలేజీలతో కూడిన ఫోర్త్‌సిటీ, నెట్‌జీరో సిటీని తెరపైకి తెచ్చింది. దీనిలో భాగంగా ఇప్పటికే మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఇటీవల స్కిల్ యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎలక్ట్రానిక్, ఉత్పత్తి తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్‌సైన్స్, ఎడ్యుకేషన్, యూనివర్సిటీ జోన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించడం వల్ల యువతకు ఉపాధి అవకాశాల కల్పించొచ్చని యోచించింది. అంతేకాదు హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేలా మరో కొత్త నగరం ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలో ఈ ప్రాంతం ఉండటం, విశాలమైన భూములు అందుబాటులో ఉండటం కలిసి వచ్చే అంశం.

అంతర్జాతీయ ప్రమాణాలతో..: అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసింది. దీనిలో భాగంగా భూసేకరణ, గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం, అందమైన భవనాలు, మంచినీటి సరఫరా వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెద్ద ఎత్తున పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అందుకు సహకరించాలని 16వ ఆర్థిక సంఘానికి నివేదించింది. అయితే కేంద్రం దీనికి ఏ మేరకు నిధులను కేటాయిస్తుందనేదీ వేచి చూడాల్సిందే.

రూ.1,000 కోట్లతో స్పోర్ట్స్ హబ్

ఫోర్త్‌సిటీలో భాగంగా 200 నుంచి 250 ఎకరాల్లో అత్యాధునిక స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, 16వ ఆర్థిక సంఘానికి పంపింది. క్రీడాకారులకు అత్యాధునిక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పంపి, వారు సాధించే పతకాలతో దేశానికి గుర్తింపు తీసుకురావాలని యోచిస్తోంది. అంతేకాదు ఫోర్త్‌సిటీ వేదికగా 2036లో ఒలింపిక్స్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చే స్థాయిలో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. విశాలమైన స్టేడియాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇది క్రీడాపోటీలకు ఎంతో అనువైన ప్రదేశం. రక్షణ పరంగానే కాకుండా వాతావరణ పరంగానూ నాలుగో నగరం అనుకూలం. స్పోర్ట్స్ హబ్ అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం తగిన ఆర్థిక సహాయం అందించాల్సిందిగా 16వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- యూపీఎస్సీ మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష ప్రోత్సాహకం అందిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


రాప్స్ అకాడమీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చిక్కడపల్లి(హైదరాబాద్): ఎన్నికల ముందు ప్రకటించినట్టుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో రాప్స్ అకాడమీ సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే 50 ఉద్యోగాలు భర్తీ చేశామని, దేశంలో ఎక్కడా లేని తరహాలో ఉద్యోగాల భర్తీకి ఏటా వార్షిక కేలండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రూప్–1 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, త్వరలో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించబోతున్నామని వెల్లడించారు. తెలివి ఉన్నా, నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించడంలో ఇబ్బందులు పడుతున్నారని, వారిని గుర్తించి ఆర్థికంగా ప్రోత్సహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా మన రాష్ట్రం నుంచి మెయిన్స్‌కు ఎంపికైన వారికి ఇంధనశాఖ పక్షాన ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకంగా అందించినట్టు తెలిపారు. యూపీ కేడర్‌లో పనిచేస్తున్నా, ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్‌రావు, అరుణల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో యూపీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాప్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావ్(ఐఏఎస్), అరుణ మోహన్‌రావ్(ఐపీఎస్) తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణలో పర్యటించండి: జూపల్లి


తెలంగాణ స్టాల్‌లో కేంద్రమంత్రి షెకావత్‌తో మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలు చేపడుతున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మూడు రోజులుగా లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలున్నాయని వెల్లడించారు. లండన్‌లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రీన్‌విచ్‌లో నిర్వహించిన చలో ఇండియా కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, యూకేలో భారత హైకమిషనర్ విక్రమ్ దురైస్వామి, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్దసిన్హా, గోవా పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖంటే తదితరులతో కలిసి మంత్రి జూపల్లి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు అండగా నిలవాలి: స్పీకర్

ఆస్ట్రేలియాలో మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా నిలవాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం ఆస్ట్రేలియా తెలంగాణ కమ్యూనిటీ ఆధ్వర్యంలో సిడ్నీలోని ఉడ్ క్రాఫ్ట్ కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన 'మీట్ అండ్ గ్రీట్', దీపావళి సంబరాల్లో ఆయనతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డా.వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకున్నా.. ఉన్న వనరులతోనే ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఆరోగ్య శ్రీ పరిమితి పది లక్షలకు పెంపు అమలు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 2 లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారని వివరించారు. మూసీ పునరుజ్జీవం, హైడ్రా ద్వారా చెరువుల పరిరక్షణ కోసం యుద్ధమే చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన రాజశేఖర్‌రెడ్డి మన్యం, నవనీత్‌రెడ్డి, దేవిప్రసాద్ మేక, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు 'ఆంబిస్' అస్త్రం!

▶ మొదటి పేజీ తరువాయి

నేరస్థుల వేలి ముద్రలు, చేతి ముద్రలతోపాటు ఐరిష్ స్కాన్, ముఖ చిత్రాలు (ఫేషియల్ ఇమేజెస్), కాలి ముద్రలు, సంతకం, చేతిరాతను సైతం సేకరించడం తప్పనిసరి చేశారు. ఇలా వేలిముద్రలతోపాటు ఇతర బయోమెట్రిక్ వివరాల సేకరణకు తెలంగాణ పోలీసులు ఈ నూతన ఆంబిస్ సాంకేతికను అందుబాటులోకి తెచ్చారు. ఆంబిస్ పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేస్తుంది. ఇది న్యూరల్ నెట్వర్క్ ఆధారిత ఫింగర్‌ప్రింట్ అల్గారిథమ్స్ ఆధారంగా నడుస్తుంది. నేరస్థులకు సంబంధించిన డేటాను విశ్లేషించడం లోనూ ఈ సాంకేతికత ఎంతో వేగంగా స్పందిస్తుంది. సమాచార సేకరణలో అవసరమైన విధంగా వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు నేరం జరిగిన స్థలంలో దొరికిన వేలిముద్రలను మాత్రమే పోల్చాలనుకుంటే అవి మాత్రమే పోల్చి ఫలితాన్ని ఈ సాంకేతికత ఇస్తుంది. గతంలో ఉన్న సాంకేతికతతో పోలిస్తే ఈ ఆంబిస్ సాంకేతికత కచ్చితత్వం మరింత పెరుగుతుంది. ఇప్పటికే పోలీస్ డేటాబేస్‌లో అందుబాటులో ఉన్న ఫేషియల్ రికగ్నిషన్ డేటాను సైతం అనుమానితుల ఫేషియల్ ఇమేజ్‌లతో పోల్చేందుకు ఇందులో వీలుంది. ఈ తరహా న్యూరల్ నెట్వర్క్ టెక్నాలజీని ప్రస్తుతం రష్యాలో మాత్రమే వినియోగిస్తున్నారు. రష్యా తర్వాత భారత్‌లో తొలిసారిగా తెలంగాణ పోలీసులు ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడం గమనార్హం.

తప్పు చేసినవారికి జైలే: కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్

సాక్షి, హైదరాబాద్: 'మీరు అరెస్టు అవుతారా?'.. అని ప్రజలు, మీడియా పదేపదే అడుగుతున్నందున ప్రెస్‌మీట్ పెట్టి నిజాలు చెబుతున్నానని మాజీమంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్రావు ఎద్దేవా చేశారు. మీరు డ్రగ్స్ తీసుకుంటారా? అని పదేపదే ప్రజలు ప్రశ్నించినప్పుడు మీడియా ముందుకొచ్చి ఎందుకు స్పందించలేదని ఆయన నిలదీశారు. వెంకట్ గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మంత్రినని, తండ్రి సీఎం కాబట్టి ఏం చేసినా చెల్లుతుందన్న అహంభావంతో.. కేటీఆర్ ఫార్ములా రేస్‌లకు ఇష్టారాజ్యంగా నిధులు కేటాయించారని ఆరోపించారు. తప్పు చేసిన వారు ఎవరైనా కటకటాల పాలు కాకతప్పదన్నారు. తప్పు చేశారు కాబట్టే జైలుకు పోతానని కేటీఆర్ అంటున్నారన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ జైలుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు.

జనవరి వరకు ఈపీఎఫ్ఓ ఎస్ఆర్‌డీ

- పీఎఫ్ బకాయిల వసూళ్లకు స్పెషల్ రికవరీ డ్రైవ్
- పీఎఫ్, పెన్షన్ బకాయిలు, డీఎల్ఐ వాటా కేటగిరీలకు ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) స్పెషల్ రికవరీ డ్రైవ్ (ఎస్ఆర్‌డీ) ప్రక్రియకు ఉపక్రమించింది. వాటాదారుల చెల్లింపులకు సంబంధించి యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిపై కొరడా ఝులిపించనుంది. నవంబర్ నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కొనసాగించాలని నిర్ణయించిన ఈపీఎఫ్ఓ.. ఇప్పటికే చర్యలు వేగవంతం చేసింది. ఉద్యోగులకు సంబంధించి పీఎఫ్, పెన్షన్ బకాయిల చెల్లింపులు, డిపాజిట్ లింక్ ఇన్సూరెన్స్ పథకాల వాటాల జమలో అంతరాలను తొలగించడమే లక్ష్యంగా స్పెషల్ రికవరీ డ్రైవ్ ప్రక్రియ చేపడుతోంది. ఈ చెల్లింపుల విషయంలో యాజమాన్యాలు ఉదాసీనంగా వ్యవహరిస్తే సంస్థ ఆస్తులను జప్తు చేసుకోవడంతో పాటు సదరు సంస్థ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు సైతం ఈపీఎఫ్ఓకు అధికారం ఉంది.

తల్వార్ మొబైల్ డైరెక్టర్ అరెస్టు

ఉద్యోగుల భవిష్యనిధి చందాను జమచేయడంలో నిర్లక్ష్య వహించిన ఓ సంస్థపై ఈపీఎఫ్ఓ అధికారులు కఠిన చర్యల తీసుకున్నారు. తాజాగా నిర్వహించిన ఎస్ఆర్‌డీ కార్యక్రమంలో తల్వార్ మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బర్రెపూడి శ్రీనివాస్‌ను ఈపీఎఫ్ఓ అధికారులు అరెస్టు చేశారు. ఉద్యోగుల పీఎఫ్ బకాయిలకు సంబంధించి రూ.1.23 కోట్లు ఈపీఎఫ్ఓకు జమచేయని కారణంగా అరెస్టు చేసినట్లు ఆ సంస్థ అధికారులు తెలిపారు. సంస్థ మరో డైరెక్టర్ సరల్ తల్వార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉద్యోగుల ఈపీఎఫ్ఓ వాటాల చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఈపీఎఫ్ఓ అధికారులు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీకాళహస్తిలో అఘోరీ ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు
- రాత్రి ప్రోటోకాల్‌తో స్వామి దర్శనం


పెట్రోల్ పోసుకుంటున్న అఘోరీ

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో గురువారం అఘోరి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచలనంగా మారింది. తనను ఆలయంలోకి అనుమతించకుండా అవమానించారని ఆరోపిస్తూ ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఈమె గురువారం దర్శనానికి రాగా.. పాతాళ గణపతి ఆలయం దాటాక భద్రతా సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకున్నారంటూ ఆమె ప్రశ్నించగా ఆలయంలోకి ఎవరు వివస్త్రగా వెళ్లకూడదన్నారు. దీంతో ఆమె వెంటనే తన కారు దగ్గరకు వచ్చి లోపల క్యాన్‌లో ఉంచిన పెట్రోల్‌ను తన మీద, తన కారు మీద పోసి నిప్పటించే ప్రయత్నం చేసింది. వెంటనే భద్రతా సిబ్బంది ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. పోలీసులు ఆమెను వెళ్లిపోవాలని సూచించగా.. 'నేను వెళ్లను, ఏం చేసుకుంటారో చేసుకోండి'.. అని మండిపడింది. 'నేను రెండు నిమిషాల్లో దర్శనం చేసుకుని వెళ్లిపోయేదాన్ని. నన్ను అడ్డుకోవడంవల్లే ఇంత రాద్ధాంతం జరిగింది. అందరూ ఒకలాగా ఉండరు. అలా ఉంటే మూడున్నరేళ్ల బాలిక మీద తిరుపతి సమీపంలో అఘాయిత్యం ఎలా జరుగుతుంది'అని ప్రశ్నించింది. ఆలయ అంబులెన్సులో తమిళనాడు సరిహద్దుల్లోకి ఆమెను తరలించి అక్కడ వదిలేశారు. అనంతరం.. 'వస్త్రం ధరించి శ్రీకాళహస్తీశ్వరానికి సాయంత్రం వచ్చి దర్శించుకుంటా. ఎవరైనా ఆపితే ఊరుకోను'అంటూ అఘోరీ సోషల్ మీడియాకు సమాచారమివ్వగా రాత్రి వచ్చి జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుణ్ణి ప్రోటోకాల్ దర్శనం చేసుకున్నారు.

ఫైర్‌సేఫ్టీ అందరి బాధ్యత

- ఫార్మా పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీపై సెమినార్‌లో ఆ శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి


సెమినార్‌లో పాల్గొన్న నాగిరెడ్డి, జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఫైర్ సేఫ్టీ అనేది మనందరి బాధ్యత అని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ఫార్మా సూటికల్ కంపెనీల్లో భద్రత చాలా ముఖ్యమైనదని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్‌పై 2 రోజుల సెమినార్ ప్రారంభమైంది. ఈ సెమినార్ భారతదేశంలోనే అతిపెద్దదని చెబుతారు. ఈ సెమినార్‌ను నాగిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఫార్మా కంపెనీలు.. ఇతర పరిశ్రమలతో పోలిస్తే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా కెమికల్స్ వినియోగం, వాటిని తరలించే ప్రక్రియలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని వివరించారు. రిమోట్ మానిటరింగ్, మెయింటెనెన్స్, విజిలెన్స్ విషయంలో నూతన సాంకేతికత వినియోగించాలని పేర్కొన్నారు. అనేక ఫార్మా కంపెనీలు సరైనా ఈఎస్‌జీ మార్గదర్శకాలు పాటించట్లేవని, అందుకే ఈ కంపెనీలు యురోపియన్ రెగ్యులేటర్ల వాచ్‌లిస్టులో ఉన్నాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. వాటిని పాటించకపోతే భారత్ నుంచి ఆయా దేశాలు ఫార్మాసూటికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకోరని హెచ్చరించారు. ఎఫ్ఎస్ఏఐ ఆధ్వర్యంలో ఫైర్ సురక్ష ఇండెక్స్‌ను రూపొందించామని, దీని ద్వారా భవనాల ఫైర్‌సేఫ్టీని అంచనా వేయొచ్చని జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి వెల్లడించారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



ప్రతి 'నిమిష'ం.. సినిమా ధ్యాసే..
అంతర్జాతీయ స్థాయిలో ఔరా అనిపిస్తోంది లక్ష్మీ నిమిషా గుమ్మడి. తాజాగా ఆమె ప్రొడక్షన్ డిజైనర్‌గా రూపొందించిన 'డాస్ బ్రోస్ ఫోర్స్' ఫీచర్ ఫిల్మ్ 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలిచింది. - సిటీప్లస్‌లో



సర్వీస్ టు 'సై'బర్..
ప్రస్తుతం విద్యార్థులు, యువతరం సోషల్ సర్వీస్ స్థానంలో 'సైబర్' సర్వీస్ ప్రారంభించారు. ఇటీవలి కాలంలో ఈ ట్రెండ్ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/19.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.









భక్తిశ్రద్ధలతో ఛట్ పూజలు

సికింద్రాబాద్ నెక్లెస్ రోడ్డులోని బతుకమ్మ ఘాట్‌లో గురువారం బిహార్ అగర్వాల్ సంఘ్ సహకారంతో బిహార్ సమాజ్ సేవా సంఘ్ చేపట్టిన ఛట్ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. సూర్య భగవానుడికి పూలు, పండ్లు నివేదించి.. దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నెక్లెస్ రోడ్డు ప్రాంతం బిహారీ మహిళలతో సందడి నెలకొంది. పూజల్లో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు. - బన్సీలాల్‌పేట్

కలెక్టర్ ఇంటికి 'సర్వే' స్టిక్కర్



సమగ్ర సర్వే స్టిక్కర్‌ను పరిశీలిస్తున్న అనుదీప్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్-13లోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నివాసానికి ఎన్యుమరేటర్లు వెళ్లారు. బుధవారం కుటుంబ సర్వే ప్రారంభం కాగా గురువారం బంజారాహిల్స్ బ్లాక్ సూపర్‌వైజరీ అధికారి భావ్‌సింగ్, ఎన్యుమరేటర్ లక్ష్మిలు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంటికి స్టిక్కర్ అంటించారు. అంతకుముందు ఇంటి నంబర్‌తో పాటు కుటుంబ యజమాని పేర్లను నమోదు చేసుకున్నారు. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ ఇంటికి సైతం సర్వే సిబ్బంది స్టిక్కర్ అంటించారు. ఈ నెల 12న తాను అందుబాటులో ఉంటానని, ఆ రోజు వివరాలు నమోదు చేసుకోవాలంటూ మిట్టల్ సూచించారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు: డీఈఓ



చెకుముఖి సైన్స్ ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

పంజగుట్ట: విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని హైదరాబాద్ డీఈఓ రోహిణి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా గురువారం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల స్థాయి ప్రశ్నపత్రాన్ని ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలనే కుతూహలంతో ఉండాలని, ప్రతీ విషయాన్ని పరిశోధించాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్తారని సూచించారు. గత 30 ఏళ్లుగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను జన విజ్ఞాన వేదిక వెలికితీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, డిప్యూటీ ఈఓ శామ్యూల్ రాజ్, స్కూల్ ఇన్‌చార్జి ఆర్.గోపాల్, ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర రావు, డాక్టర్ రజని, లింగస్వామి, ఎం.రవీంద్రబాబు, వై.యాదగిరి, చాగంటి సాయి తదితరులు పాల్గొన్నారు.

13,35,673 ఇళ్లకు స్టిక్కర్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం నుంచి గురువారం వరకు 13,35,673 ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. సర్వేకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచుకోవాల్సిందిగా ఇళ్లలోని వారికి తెలిపారు. మిగతా ఇళ్లకు శుక్రవారం వరకు స్టిక్కర్లు అంటించడం పూర్తిచేసి శనివారం నుంచి సర్వే వివరాలు నమోదు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. సర్వే తీరును డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు మరో పదిమందిని నోడల్ అధికారులుగా నియమించారు. ఆయా ప్రాంతాల్లో స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని గురువారం ఉన్నతాధికారులు పరిశీలించారు.

తీసినకొద్దీ సిల్ట్

- ఇప్పటి వరకు 710 కి.మీ మేర డ్రైనేజీ పైపులైన్ క్లీనింగ్
- 6,140 ప్రాంతాల్లో 50 వేల మ్యాన్‌హోళ్ల ద్వారా డీసిల్టింగ్
- కొనసాగుతున్న సీవరేజీ స్పెషల్ డ్రైవ్



సైదాబాద్‌లో



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్ డ్రైనేజీ ఆపరేషన్‌లో తీసిన కొద్దీ.. సిల్ట్ బయటపడుతోంది. గురువారం సైదాబాద్ సెక్షన్‌లోని ధోబీఘాట్ రోడ్ ప్రాంతంలో పెద్ద ఎయిర్‌టెక్ యంత్రాలతో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ పైపులైన్ డీసిల్టింగ్ చేపట్టగా పెద్ద ఎత్తున మురుగు పూడిక బయటపడింది. పలు ప్రాంతాల్లో సైతం భారీగా మురుగు బయటపడింది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అత్యంత సమస్యాత్మక డ్రైనేజీ పైపులైన్ మార్గాల్లోనే డీసిల్టింగ్ జరుగుతుండటంతో దీర్ఘ కాలిక సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తోంది.

90 రోజుల స్పెషల్ డ్రైవ్..

సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా కొనసాగుతున్న 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 30 రోజుల్లో సుమారు 710 కిలోమీటర్ల మేర 6,140 ప్రాంతాల్లో 50 వేల మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ జరిగినట్లు జలమండలి ప్రకటించింది. మొత్తం మీద జలమండలి పరిధిలో సీవరేజీ పైపులైన్ వ్యవస్థ సుమారు 9,769.74 కిలోమీటర్ల వరకు ఉండగా, అందులో 612 కి.మీ ట్రంక్‌లైన్ ఉంది. పైపులైన్‌కు అనుసంధానంగా సుమారు 6,31,398 మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. ప్రస్తుతం రోజువారీగా 2,815 ఎంఎల్‌డీ మురుగు ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం పైపులైన్ క్లినింగ్ కోసం సుమారు 212 జెట్టింగ్ మెషీన్లు ఉండగా.. మ్యాన్‌హోళ్లలో తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించేందుకు 160 సిల్ట్ కార్టింగ్ వాహనాలు ఉన్నాయి. 700 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

ఎండీ అభినందన

సీవరేజీ పైపులైన్ డీ సిల్టింగ్ పనుల్లో నిబద్ధతపై అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. అందరూ అంకిత భావంతో పని చేస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా గత 15 రోజులుగా పనితీరు బాగుందని కొనియాడారు. ఇదే స్ఫూర్తి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు.

గ్రీన్‌ఫీల్డ్‌కు మార్కింగ్

షురూ

ఫోర్త్‌సిటీ కోసం రహదారి నిర్మాణం

- రెవెన్యూ శాఖ గెజిట్ జారీ
- క్రయ విక్రయాల నిలిపివేత
- 449.27 ఎకరాల సేకరణ
- ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఆరు లేన్ల రోడ్డు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీ కోసం ఎలివేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రహదారికి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు మండలాల పరిదిలోని తొమ్మిది గ్రామాల మీదుగా ఆరు లేన్లు (300 అడుగుల వెడల్పు)లో రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం (రెవెన్యూశాఖ) భూ సేకరణ కోసం ఇటీవల (నవంబర్ 2న) (జీ2/349/2024)నోటిఫికేషన్ జారీ చేసింది. భూసేకరణ చట్టం 2016 (యాక్ట్21/2017)తో పాటు పునరావాస కల్పన చట్టం-2013 (యాక్ట్ 20/ 2013) ద్వారా భూ సేకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూ యజమానులెవరూ.. చట్టంలోని సెక్షన్ 11(4) కింద ఈ భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొంది. రుణాల కోసం కూడా ఈ భూములను తాకట్టు పెట్టొద్దని సూచించింది. నోటిఫికేషన్ వెలువడిన 60 రోజుల్లో అభ్యంతరాలు దాఖలు చేయాలని స్పష్టం చేసింది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెంటే.. మెట్రో రైలు విస్తరణ పనులు చేపట్టనుంది.

- ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేటలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయాలని భావించిన స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 6 లేన్ల రోడ్డు నిర్మాణానికి 449.27 ఎకరాల భూమి అవసరమని అంచనా వేసింది. ఈ మేరకు మహేశ్వరం మండలం కొంగరకుర్దు-ఎ, ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్ గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలం లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ వరకు 449.27 ఎకరాల భూమి సేకరించనున్నట్లు పేర్కొంది.

ఎక్కడ.. ఎన్ని ఎకరాలు..?

- ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడ రెవెన్యూ పరిధిలో మొత్తం 84 మంది రైతుల నుంచి 1.03 ఎకరాలు సేకరించనుంది. కొంగర కలాన్‌లో 361 మంది రైతుల నుంచి 55.05. మహేశ్వరం మండలం కొంగరఖుర్దులో 278 మంది రైతుల నుంచి 53.20, కందుకూరు మండలం లేమూరులో 497 మంది రైతుల నుంచి 84.28 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే.. తిమ్మాపూర్ రెవెన్యూ పరిధిలో 290 మంది రైతుల నుంచి 47.02 ఎకరాలు, రాచులూరు రెవెన్యూ పరిధిలో 351 మంది రైతుల నుంచి 87.22, గుమ్మడవెల్లి రెవెన్యూ పరిధిలో రిజర్వు ఫారెస్ట్ స్థలం 32.11 ఎకరాలు, పంజాగూడ రెవెన్యూ పరిధిలో టీజీఐఐసీ నుంచి 18.33 ఎకరాలు సేకరించనుంది. మీర్‌ఖాన్‌పేటలో 48 మంది రైతుల నుంచి 62.08 ఎకరాల చొప్పున సేకరించనుంది. ఇప్పటికే ఆయా మార్గాల్లో మార్కింగ్ కూడా చేసింది.

బెంగళూరులో హైడ్రా బృందం

చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణపై అధ్యయనం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జల వనరుల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో అధ్యయనం చేస్తోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోని బృందం గురువారం అక్కడికి చేరుకుంది. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా హైడ్రా అధికారులు చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించే విధానాలను పరిశీలించనున్నారు. తొలి రోజు రంగనాథ్ బృందం అక్కడి కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించింది. వర్షం కురవడానికి ముందే ఎంత ప్రమాణంలో, ఎక్కడెక్కడ కురిసే అవకాశం ఉందనే సమగ్ర సమాచారాన్ని ప్రజలకు చేర్చడం, వరద ముంచెత్తే ప్రాంతాల వాసుల్ని అప్రమత్తం చేయడం, ట్రాఫిక్ జామ్‌పై అలెర్ట్స్, ప్రత్యామ్నాయ రహదారులను సూచించే విధానాలపై సమగ్ర అధ్యయనం చేసింది. కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ (కేఎస్ఎన్‌డీఎంసీ) ప్రాంగణంలో ఉన్న వర్షపాతం నమోదు, గాలి వేగం, ఉష్ణోగ్రతల లెక్కింపు యంత్రాలను హైడ్రా టీమ్ పరిశీలించింది. యలహంక చెరువును సందర్శించిన అధికారులు దాని పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం బెంగళూరు అధికారులు తీసుకున్న చర్యల్ని పరిశీలించారు. కమిషనర్ రంనాథ్ వెంట వెళ్లిన బృందంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్లు వి.పాపయ్య, ఎ.జయప్రకాష్, ఏఈ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆదిత్య తదితరులు ఉన్నారు.

డిజాస్టర్ ఫోర్‌కాస్ట్‌కు ప్రాధాన్యం



కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ పని తీరు అద్భుతంగా ఉంది. ఇలాంటి విధానం హైదరాబాద్‌లోనూ అమలుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. డిజాస్టర్ ఫోర్‌కాస్ట్‌కు కీలక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. దీనికోసం సర్కారుతో సంప్రదింపులు జరుపుతాం.

– ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

నాలా పనులకు కదలిక

- రూ.75 కోట్లతో టెండర్లు
- త్వరలో పనులు ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: కొంత కాలంగా నిలిచిపోయిన నాలాల ఆధునికీకరణ, నిర్మాణ పనులను తిరిగి చేపట్టేందుకు జీహెచ్ఎంసీలోని వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) విభాగం సిద్ధమైంది. వర్షాకాలం ముగియడం.. నిర్మాణాలకు ఇప్పటి నుంచి వేసవి వరకు అనుకూల సమయం కావడంతో పనులకు టెండర్లు పిలిచింది. నగరంలో ముంపు సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా ఎస్ఎన్‌డీపీని ఏర్పాటు చేశారు. తొలి దశలో దాదాపు రూ.985 కోట్లతో చేపట్టిన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెండో దశలో ప్రాధాన్యతల మేరకు రూ.500 కోట్లతో పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం వాటిని చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో తొలిదశలో తాజాగా దాదాపు రూ.75 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. టెండర్లు ముగియగానే పనులు చేపట్టనున్నారు. వీటిలో కొన్ని బాక్స్‌డ్రెయిన్ల నిర్మాణ పనులకు గతంలోనే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మరోసారి టెండర్లు పిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్ఎన్‌డీపీ పేరు మార్చి నగరంలో చేపట్టే అన్ని అభివృద్ధి పనులను హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) పేరిట చేస్తోంది.

వీటికి టెండర్లు పిలిచారు..

- తిరుమల హాస్పిటల్ నుంచి సాగర్ రింగ్ రోడ్ జంక్షన్ వరకు వరద నీటి కాల్వ నిర్మాణం. అంచనా వ్యయం రూ.12.94 కోట్లు. ఏడాదిలోగా పూర్తి చేయాలనేది లక్ష్యం.
- రామంతాపూర్ చెరువు- ఉస్మానియా యూనివర్సిటీ వరకు వరదనీటి కాల్వ నిర్మాణం. అంచనా వ్యయం రూ. 12.61 కోట్లు. దీన్ని కూడా వచ్చే వర్షాకాలంలోగా పూర్తి చేయాలి.
- పర్కిచెరువు (ధరణినగర్) నుంచి కూకట్‌పల్లి నాలా (ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్) వరకు ఆధునికీకరణ పనులు. అంచనా వ్యయం రూ.8.76 కోట్లు.
- డబీర్‌పురా దర్వాజ -ఫర్హత్‌నగర్ వరకు వరద నీటి కాల్వ నిర్మాణం. అంచనా వ్యయం రూ.11.55 కోట్లు.
- ఐడీఎల్ సర్‌ప్లస్ నాలా నుంచి కూకట్‌పల్లి నాలా (బస్‌డిపో) వరకు వరదనీటి కాల్వ ఆధునికీకరణ. అంచనా వ్యయం రూ.17.37 కోట్లు. దీన్ని 18 నెలల్లో పూర్తి చేయాలనేది లక్ష్యం.
- నేరేడ్‌మెట్‌లో సాయి ఎన్‌క్లేవ్ కరెంట్ ఆఫీస్ వరకు వరద కాల్వ నిర్మాణం. అంచనా వ్యయం రూ.6.26కోట్లు. దీని నిర్మాణ సమయం 9 నెలలు.
- కాలాపత్తర్ మహబూబ్ డెయిరీ నుంచి ఫాతిమా హాస్పిటల్ వరకు వరదకాల్వ అంచనా వ్యయం. రూ. 1.11కోట్లు. దీనికి గతంలో టెండరు పిలిచినా కాంట్రాక్టర్లు రాకపోవడంతో తిరిగి పిలిచారు.

బాక్స్ డ్రెయిన్ల పనులు.. రీ టెండర్లు

నాలాలకు సంబంధించి పలు బాక్స్ డ్రెయిన్ల పనులకు గతంలో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దాంతో వాటిల్లో కొన్నింటిని ఆర్నెల్లలో పూర్తి చేసే నిబంధనతో రీ టెండర్లు పిలిచారు.

అవి ఏమిటంటే..

- ఉప్పుగూడ ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటల్ -సుహానా ఫంక్షన్ హాల్. అంచనా వ్యయం రూ.72.87 లక్షలు.
- చిరాగ్ అలీ లేన్. అంచనా వ్యయం రూ.76.62 లక్షలు.
- ముమ్మిడికుంట-మిల్లత్ నగర్- సాదత్‌నగర్. అంచనా వ్యయం: రూ.1.60 కోట్లు.
- ఇస్లామియా కాలేజీ వెనుక వైపు నుంచి సాదత్ నగర్ వరకు. అంచనా వ్యయం రూ.88.21 లక్షలు.
- చాంద్రాయణ గుట్టలో సవేరా హోటల్-మాజిద్ ఇ అఫ్జల్ వరకు. అంచనా వ్యయం .రూ.82.37లక్షలు.

నవజాత శిశువు అపహరణకు యత్నం

నిందితురాలి అరెస్ట్


నిందితురాలు అక్సరీ బేగం

సుల్తాన్‌బజార్: అప్పుడే పుట్టిన నవజాత శిశువును కిడ్నాప్ చేసేందుకు యత్నించిన పాత నేరస్తురాలిని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది టీజీఎస్‌పీఎఫ్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని సుల్తాన్‌బజార్ పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చార్మినార్ రైన్‌బజార్‌కు చెందిన అక్సరీ బేగం(45) ఇళ్లల్లో పని చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడేది. ఆమె కుమార్తె ఫాతిమా ప్రసవం కోసం సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రిలో చేరింది. ఈ తరుణంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి తనకు అప్పుడే పుట్టిన శిశువు కావాలని అందుకు రూ.50 వేలు ఇస్తానని చెప్పడంతో అందుకు అంగీకరించిన అక్సరీ బేగం ఈ నెల 5న ఆసుపత్రి నూతన భవనంలోని లేబర్ రూమ్‌కు వెళ్లి శిశువును అపహరించేందుకు యత్నించింది. అయితే అక్కడ టీజీఎస్‌పీఎఫ్ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది ఉండడంతో తన ప్రయత్నాన్ని విరమించుకుంది. 6న ఉదయం మరోసారి లేబర్ రూమ్‌లోకి వెళ్లిన ఆమె శిశువును ఎత్తుకెళుతుండగా గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారించగా శిశువును కిడ్నాప్ చేస్తున్నట్లు అంగీకరించింది. సెక్యూరిటీ సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు అక్సరీ బేగంను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆమెపై చార్మినార్, తుకారాంగేట్, అబిడ్స్, మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో సవతి తండ్రికి 30 ఏళ్ల జైలు

డబీర్‌పురా: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో సవతి తండ్రికి 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి టి.అనిత గురువారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ. 5 లక్షలు పరిహారం అందించాలని ఆదేశించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే ఓ మహిళకు ముగ్గురు సంతానం. సదరు మహిళ ఆమె భర్తకు విడాకులు ఇచ్చి గుల్జార్‌అలీని రెండో వివాహం చేసుకుంది. ఈమె చిన్న కూతురు (9) రెండో తరగతి చదువుతోంది. 2022 సంవత్సరం మే 20న గుల్జార్ అలీ సదరు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తల్లికి చెప్పవద్దని బెదిరించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితురాలి తల్లి డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన డబీర్‌పురా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం గురువారం నిందితుడికి 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

అంకుర్ రాణా చిక్కాడు!

- వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో నిందితుడు
- నగరంలో చంపి కర్ణాటకలో మృతదేహం దహనం
- క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం తీసుకొచ్చిన పోలీసులు
- పోచారంలోని లాడ్జి నుంచి తప్పించుకున్న అంకుర్
- రాజస్థాన్‌లో అరెస్టు చేసిన కొడగు పోలీసు బృందం


నిందితుడు అంకుర్ రాణా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో కీలక నిందితుడిగా ఉండి, పోచారంలో కర్ణాటక పోలీసు కస్టడీ నుంచి తప్పించుకున్న అంకుర్ రాణా ఎట్టకేలకు చిక్కాడు. ఐదు రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో గాలించిన కొడగు పోలీసులు బుధవారం రాత్రి రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. ఇతను తప్పించుకుని పారిపోవడంపై పోచారం ఐటీ కారిడార్ ఠాణాలో కేసు నమోదై ఉండటంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాణాను ప్రిజనర్స్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌పై తీసుకురావడానికి రాచకొండ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన రమేష్ కుమార్ పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో నివాసం ఉండేవాడు. భువనగిరికి చెందిన ఆకుల లత అలియాస్ నిరుపమ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసేది. మాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన వీరు 2018లో వివాహం చేసుకున్నారు. రమేష్‌కు నిహారిక రెండో భార్య కాగా... నిహారికకు రమేష్ మూడో భర్త. బెంగళూరులోని రామమూర్తి నగర్‌లో వెటర్నరీ డాక్టర్‌గా స్థిరపడిన నిఖిల్ మైరెడ్డితో నిహారికకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కాగా తన రెండో భర్తతో కలిసి ఓ నేరంలో హరియాణా జైలుకు వెళ్లిన నిహారికకు తన సహ ఖైదీ ద్వారా అంకుర్ రాణాతో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రమేష్‌ను చంపి, అతడి వద్ద ఉన్న నగదు కాజేయడం కోసం గత నెల 1న అంకుర్‌తో కలిసి నిహారిక హైదరాబాద్ వచ్చింది. ఈ నెల 3న రమేష్‌తో కలిసి అతడి కారులో బయలుదేరిన వీరు పీర్జాదిగూడ కమాన్ సమీపంలో తమ పథకాన్ని అమలు చేశారు. రమేష్‌కు ఉరి బిగించి చంపేసి... నిఖిల్ సలహాతో మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి ఊటీ సమీపంలోని సుంటికొప్పలో (కర్ణాటక) ఉన్న కాఫీ ఎస్టేట్‌లో పెట్రోల్ పోసి కాల్చేశారు. గత నెల 8న సగం కాలిన మృతదేహానికి సంబంధించి కొడగు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిహారిక, నిఖిల్, అంకుర్‌లను అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో వీరిని కస్టడీలోకి తీసుకుని క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం గత గురువారం సిటీకి తీసుకువచ్చారు. పోచారంలోని బృందావన్ లాడ్జిలోని మూడో అంతస్తులో ఉన్న గదిలో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తుండగా తన చేతికి ఉన్న సంకెళ్లు తీసేసిన అంకుర్ కిటికీ నుంచి కిందికి దూకి పరారయ్యాడు. దీనిపై పోచారం ఐటీ కారిడార్ ఠాణాలో కేసు నమోదైంది.

ఐదు రాష్ట్రాల్లో గాలించి పట్టుకున్నాం



అంకుర్ రాణా తనతో పాటు పోలీసులకు సంబంధించిన ఓ సెల్‌ఫోన్ కూడా ఎత్తుకెళ్లాడు. ఈ విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమయ్యాం. అతడిని పట్టుకోవడానికి ఆరు బృందాలను రంగంలోకి దింపాం. అంకుర్ హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. అక్కడి నుంచి ఉత్తరాఖండ్, ఢిల్లీ, హరియాణాల్లో సంచరించాడు. ఎన్ని రాష్ట్రాల్లో తిరుగుతున్నా నీడలా వెంటాడాం. ఎట్టకేలకు రాజస్థాన్‌లో మా ప్రత్యేక బృందానికి చిక్కాడు. అతడి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నాం. అంకుర్ అరెస్టు విషయంపై అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చాం.

- 'సాక్షి'తో ఫోన్‌లో కొడగు ఎస్పీ కె.రామరాజన్

హెరాయిన్ పట్టివేత

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: నార్కోటిక్ డ్రగ్స్ విక్రయిస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. వారి నుంచి 70 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజ్మల్ హుస్సేన్, నూర్ ఆజంఖాన్, ఎస్‌కె సురోజ్ ఉన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

అత్తాపూర్: డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ నమోదు తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించేందుకు ఆర్డీవో కార్యాలయ సమీపంలోని అటవీ శాఖ భూములను పరిశీలించాలని ఆదేశించారు. యుద్ధ ప్రతిపాదికన స్థల సేకరణ చేసి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ టి.శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీట్లు ఖాళీ.. విద్యార్థులేరీ..

- ప్రైవేట్ పీజీ కాలేజీల్లో నిరాశాజనకం
- 29 కళాశాలల్లో జీరో అడ్మిషన్లు
- ఫారెస్ట్రీ కొత్త కోర్సులో ఐదుగురే..
- నేడు చివరి జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ప్రతి ఏటా పీజీ కాలేజీల సంఖ్య పెరుగుతోంది. కానీ విద్యార్థులు మాత్రం చేరడం లేదు. అన్ని వర్సిటీల పరిధిలో 272 పీజీ కాలేజీలు ఉండగా అందులో 29 కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. హాస్టల్ వసతి, అధ్యాపకుల కొరత కారణంగా పీజీ కోర్సుల్లో విద్యార్థులు చేరడం లేదు. కాగా.. నేటి సాయంత్రం టీజీసీపీజీఈటీ-2024 కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థుల చివరి జాబితాను విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. కామారెడ్డిలోని ఆర్ట్స్ అండ్ కాలేజీ (అటానమస్)లో బీఎస్సీ బాటనీ అర్హతతో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ప్రవేశ పెట్టిన ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సులో 60 సీట్లకు కేవలం 5 మంది మాత్రమే విద్యార్థులు చేరినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

యూనివర్సిటీల కాలేజీలకే ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని వర్సిటీల క్యాంపస్ కాలేజీల్లో చేరేందుకు మాత్రమే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదని ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. అన్ని వర్సిటీల్లో 50 వేల సీట్లకు రెండు విడతల్లో జరిగిన కౌన్సెలింగ్‌లో మొత్తం 18,120 సీట్లు భర్తీ కాగా అందులో అమ్మాయిలు రెండింతలు అధికంగా 13,458 మంది పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందగా అబ్బాయిలు కేవలం 4,662 మంది మాత్రమే చేరినట్లు వివరించారు. సుమారు 32 వేల సీట్లు మిగిలినట్లు చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థుల్లో రెండు వేల వరకు రూ.800 ఫీజును చెల్లించి చేరలేదు. మరో 4,651 మందికి సీట్లు వచ్చినా చేరలేదన్నారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులకు ఈ విషయం తెలిసినా కొత్త కాలేజీలకు అనుమతించడం దారుణమని సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. కాలేజీ సంఖ్యను కుదించి ఉన్నత విద్య ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

ధార్మిక సేవా సంస్థలు ఒకే వేదికపై రావడం శుభ పరిణామం

చినజీయర్ స్వామి

గన్‌ఫౌండ్రీ: సనాతన ధర్మానికి, సంప్రదాయానికి చెందిన ధార్మిక, సేవా సంస్థలు ఒకే వేదికపైకి రావడం శుభపరిణామమని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హిందూ ఆధ్యాత్మిక సేవా ఫౌండేషన్ల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బృహత్‌మేళా సేవా ప్రదర్శన ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రస్తుత సమాజంలో స్వతంత్ర స్వేచ్ఛా ధోరణిని మరిచిపోయి బానిస ఆలోచనా తత్వాన్ని అలవర్చుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బానిస ధోరణితో సాంకేతికతను అరువు తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. సమాజంలో ఆధ్యాత్మికత కోసం కృషి చేస్తున్న సంస్థలు, సేవా సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి నాలుగు రోజుల పాటు ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రదర్శన 10 వరకు కొనసాగుతుందని చివరి రోజు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామీజీ శితికంఠానంద స్వామి, మాజీ ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు భాగయ్య, ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మాజీ మేనేజరే సూత్రధారి

- ఎస్‌బీఐ చీటింగ్ కేసులో 8 మంది అరెస్ట్
- నకిలీ పత్రాలతో రూ.4.8 కోట్లు రుణం
- గుట్టురట్టు చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సనత్‌నగర్ బ్రాంచ్‌లో లోన్ ఫ్రాడ్ స్కీమ్ కేసు గుట్టురట్టయింది. ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో బ్యాంక్ మాజీ మేనేజరే అనధికారికంగా రూ.4.8 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు గుర్తించారు. ఇప్పటికే మాజీ మేనేజర్ కార్తీక్ రాయ్‌ను గత మే నెలలో సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా 8 మంది నిందితులను గురువారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

- ఎండీ వాజీద్ అనే వ్యక్తి అక్రమంగా బ్యాంక్ సొమ్మును కొట్టేయాలని పథకం రూపొందించాడు. ఈ క్రమంలో బ్యాంక్ మాజీ మేనేజర్ కార్తీక్‌తో జట్టుకట్టాడు. అనంతరం వారు లోన్ ఏజెంట్ దాగల రాజు, మట్లపల్లి శ్రీకాంత్, పోలె విశాల్, సుధాంషు శేఖర్ పరిడ, యా సునీల్ కుమార్, భాస్కర్ గౌడ్, ఆమంచి ఉపేందర్‌లతో కలిసి బృందంగా ఏర్పడ్డారు.
- శ్రీకాంత్, విశాల్ తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ గరల్స్ ఉద్యోగులుగా నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారు. బేగంపేట ప్రకాశ్ నగర్‌లోని మ్యాచ్‌వెల్ జిరాక్స్ సెంటర్ యజమాని ఉపేందర్ సహకారంతో లోన్ ఏజెంట్ రాజు నకిలీ శాలరీ స్లిప్స్, ఐడీ కార్డులను సిద్ధం చేశారు. వివిధ కస్టమర్ల పేర్లతో సునీల్ కుమార్, భాస్కర్ గౌడ్, ఉపేందర్ నకిలీ రబ్బర్ స్టాంప్‌లు, ఇతరత్రా డాక్యుమెంట్లను సమకూర్చారు.

అసలు కస్టమర్లకు తెలియకుండా..

టాపప్ లోన్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మృతుల క్లెయిమ్‌లు, మ్యూచువల్ ఫండ్స్ తదితరాలను అసలు ఖాతాదారులకు తెలియకుండా ఆయా సొమ్మును మాజీ మేనేజర్ కార్తీక్ ఈ గ్యాంగ్ దరఖాస్తు చేసిన థర్డ్ పార్టీ రుణ గ్రహీతలకు బదిలీ చేశాడు. 2020 జూన్ నుంచి 2023 జూన్ మధ్య కాలంలో నకిలీ శాలరీ స్లిప్‌లు, గుర్తింపు కార్డులతో రుణ దరఖాస్తులను ఆమోదించి, అనధికారికంగా రూ.4.8 కోట్లు కాజేసిన వీరు సొమ్మును 67 ఖాతాలకు బదిలీ చేశారు. ఎస్‌బీఐ సనత్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ రామచంద్ర రాఘవేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు.

ఏడు గంటల్లో రూ.48 లక్షలు స్వాహా

- ప్రభుత్వ ఉద్యోగిని నిండా ముంచిన సైబర్ నేరగాళ్లు
- అక్రమ ద్రవ్యమార్పిడి కేసు అంటూ డిజిటల్ అరెస్టు
- ఫిక్స్‌డ్ డిపాజిట్లూ రద్దు చేసి చెల్లించిన బాధితుడు
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి (55) సైతం డిజిటల్ అరెస్టు ఫ్రాడ్ బారినపడ్డారు. దాదాపు ఏడు గంటల పాటు అతడిని 'నిర్బంధించిన' సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.48 లక్షలు కాజేశారు. సుప్రీం కోర్టు అనుమతిస్తే ఆ మొత్తం తిరిగి వచ్చేస్తుందంటూ నమ్మబలికారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. సదరు ప్రభుత్వ ఉద్యోగికి ఢిల్లీ నుంచి సీబీఐ అధికారి పేరుతో ఓ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి మనీలాండరింగ్‌తో పాటు ఇతర అక్రమాలకు సంబంధించి బాధితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పాడు. ఢిల్లీలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో బాధితుడి పేరుతో ఓ ఖాతా ఉందని, దాని ద్వారా రూ.30 కోట్ల వరకు మనీలాండరింగ్ జరిగిందని భయపెట్టాడు. దీని ఆధారంగా నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసి అరెస్టు చేస్తామని, ఈ విషయంలో ఎవరూ ఏమీ చేయలేరంటూ చెప్పాడు. అదే జరిగితే ప్రభుత్వ ఉద్యోగం పోవడం ఖాయమంటూ బెదిరించాడు. ఈ కేసులో నేరం నిరూపణ అయితే మూడు నుంచి ఏడేళ్ల వరకు శిక్షపడుతుందని హెచ్చరిస్తూ బాధితుడిని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆపై సైబర్ నేరగాడు ఆ కాల్‌ను ఓ మహిళకు బదిలీ చేశాడు. బాధితుడు ఢిల్లీలోని కోర్టుకు రావాల్సి ఉంటుందని చెప్పిన ఆమె అరెస్టు ముప్పు తప్పాలంటే నిర్దోషిత్వం నిరూపించుకోవాలని సూచించింది. దీనికోసమంటూ బాధితుడి కుటుంబ, ఉద్యోగ వివరాలతో పాటు బ్యాంక్ ఖాతాల నెంబర్లు తెలుసుకుంది. ఆర్టీజీఎస్ ద్వారా రూ.50 లక్షలు చెల్లించాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం విచారణ చేస్తామని చెప్పింది. అందులో నేరం చేయనట్లు తేలితే ఆ నగదు తిరిగి వస్తుందని పేర్కొంది. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న నగదుతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా రద్దు చేసి రూ.48 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. ఇలా దాదాపు ఏడు గంటల పాటు అతడిని డిజిటల్ అరెస్టు చేసిన సైబర్ నేరగాళ్లు ప్రతి గంటకు వీడియో కాల్ చేయాలని, త్వరలో మఫ్టీ పోలీసులు వచ్చి విచారిస్తారని చెప్పారు. కొద్దిసేపటికి తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

రూ.65 కోట్ల స్థలానికి కబ్జా చెర నుంచి విముక్తి..

మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు..


అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది..


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-14లోని శబ్దాలయ స్టూడియో సినీమ్యాక్స్ వెనుక ఉన్న అర ఎకరం (20 గుంటలు) స్థలాన్ని రికార్డింగ్ స్టూడియో కోసం అప్పటి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కేఎస్ చక్రవర్తికి కేటాయించగా ఆ స్థలంలో ఉద్దేశించబడిన నిర్మాణాలు చేపట్టక పోవడంతో కొందరు కబ్జాదారులు అందులో పాగా వేశారు. ఇది తమ స్థలమేనంటూ అద్దెలకు ఇచ్చారు. దీనిపై ఫిర్యాదు అందడంతో షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు గురువారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటుచేశారు. 1984 జూన్ 14న అప్పటి ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2, 14లలో దర్శకుడు కే రాఘవేందర్‌రావు, నిర్మాత కే కృష్ణమోహన్‌రావు, దర్శక నిర్మాత ఎంఎస్‌రెడ్డి, సంగీత దర్శకుడు కేఎస్ చక్రవర్తికి ఒక్కొక్కరికి 20 గుంటల చొప్పున రికార్డింగ్ స్టూడియోలు, సినిమా థియేటర్ల కోసం ఎకరం రూ.8,500 చొప్పున కేటాయించింది. షేక్‌పేట విలేజ్ సర్వే నెంబర్ 403లో ఈ స్థలాన్ని కేటాయించగా చక్రవర్తి రికార్డింగ్ స్టూడియోను నిర్మించుకోలేదు. ఆయన చనిపోయిన తర్వాత ఆయన కొడుకు శ్రీనివాస్ చక్రవర్తి కూడా స్థలాన్ని వినియోగించుకోకపోగా గాలికొదిలేశారు. తదనంతరం శ్రీనివాస్‌చక్రవర్తి కూడా మృతి చెందడంతో ఈ స్థలం విషయంలో కుటుంబంలో విబేధాలు రావడంతో స్థలం ఖాళీగా ఉండిపోయింది. దీనిపై కబ్జాదారులు కన్నేశారు. 40 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలంపై అక్రమార్కులు నకిలీ దస్తావేజులతో చొరబడి ఇటీవల కిరాయికి ఇచ్చి నెలకు రూ.2 లక్షల దాకా వసూలు చేస్తున్నట్లుగా తహశీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. ఈ స్థలం ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించడం జరుగుతుందని ఈ సందర్భంగా తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు. ఎవరైనా మళ్లీ కబ్జా చేయాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ స్థలాన్ని రీ రికార్డింగ్ స్టూడియో కోసం కేటాయించగా సదరు భూమిని చక్రవర్తి వినియోగించుకోకపోగా గాలికొదిలేశారని ఆమె అన్నారు. ఇదిలా ఉండగా దర్శకుడు కే రాఘవేందర్‌రావు నిర్మించిన పీవీఆర్ సినీప్లెక్స్ థియేటర్ల పక్కన ఆయన సోదరుడు నిర్మాత కే కృష్ణమోహన్‌రావుకు కూడా 20 గుంటల స్థలం కేటాయించారు. అది కూడా ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని రాఘవేందర్‌రావు తన పీవీఆర్ సినీప్లెక్స్ థియేటర్ల కోసం ఇందులో ఏర్పాటు చేసిన వాణిజ్య సముదాయాల కోసం పార్కింగ్‌గా వాడుకుంటున్నారు. ఈ స్థలాన్ని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఇక్కడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మించాలని డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు లేవు. ఖాళీగా ఉన్న ఈ రెండు ప్లాట్లను ఈ రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు కేటాయిస్తే బాగుంటుందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

'తీన్మార్ మల్లన్న కాదు.. చిల్లర మల్లన్న'

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచి అదే పార్టీ నాయకులను దూషిస్తున్న తీన్మార్ మల్లన్నకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు గూడూరు నిఖిల్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన వీడియోలు అన్ని ఆధారాలతో సహా త్వరలోనే ఢిల్లీ ఏఐసీసీకి పంపుతామని, ఇతనిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న నాగుపాము లాంటి వాడని అతన్ని ఎవ్వరూ నమ్మరాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారి చమటోడ్చి ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంగ్రెస్ సీనియర్ నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాడన్నారు. ఎన్నికలకు ముందు పార్టీని, పార్టీ నాయకులను ఎంతో పొగిడిన మల్లన్న ఇప్పుడు చిల్లర మల్లన్నగా మారాడన్నారు. మల్లన్న ఒక ఊసరవెల్లి అని అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే రకమని, ఇతడిపై పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాంచంద్రారెడ్డి, కిరణ్, సందీప్ పాల్గొన్నారు.

వాకర్లు, సందర్శకుల కోసం 'పర్గోలా' నిర్మాణం


పర్గోలా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

బంజారాహిల్స్: కేబీఆర్ జీహెచ్ఎంసీ వాక్‌వేను అధికారులు మరింత సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు వాకర్లు, సందర్శకుల కోసం అందమైన బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వైపు వెళ్ళే వాక్‌వేలో వాకర్లు, సందర్శకులు సేద తీరేందుకు పర్గోలా (షెడ్డు)ను నిర్మిస్తున్నారు. 15 అడుగుల వెడల్పు, 15 అడుగుల పొడవుతో నిర్మించే ఈ షెడ్డు నిర్మాణం ఆకర్షణీయంగా ఉండబోతుందని జీహెచ్ఎంసీ సర్కిల్–18 జూబ్లీహిల్స్ డీఈ హరేరామ్ తెలిపారు. వారు గురువారం ఇక్కడ పర్యటించి నిర్మాణ స్థలాన్ని గుర్తించి పనులను పరిశీలించారు.

రేపు రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడిగా ద్వారకానాథ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


దువ్వూరి ద్వారకనాథ్‌రెడ్డి

బంజారాహిల్స్: ప్రముఖ ఈఎన్‌టీ వైద్యనిపుణులు, డాక్టర్ దువ్వూరు ద్వారకానాథరెడ్డి తెలంగాణ రాష్ట్ర ఐఎంఎ అధ్యక్షుడిగా ఈనెల 9వ తేదీన బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ ఐఎంఎ నార్త్ బ్రాంచ్ ఎంతో అట్టహాసంగా గచ్చిబౌలిలోని ఎఐజీ హాస్పిటల్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయి సైంటిఫిక్ సెషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సంబంధమైన వ్యాధులకు మూలకారణమైన హెచ్ పైలూరి బ్యాక్టీరియాను కనుగొన్న శాస్త్రవేత్త, ప్రొఫెసర్ బారీ జేమ్స్ సైంటిఫిక్ ప్రసంగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని ఐఎంఎ నార్త్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేంద్రనాథ్ వెల్లడించారు.

మురుగుపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు


సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ


ఫిలించాంబర్ ముందు పారుతున్న మురుగు

ఫిలింనగర్: గడిచిన రెండు నెలలుగా ఫిలింనగర్ సొసైటీ కాంప్లెక్స్‌తో పాటు ఫిలించాంబర్ పరిసరాలు మురుగు ప్రవాహంతో నిండిపోయి కనిపిస్తున్నాయని సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ ఆరోపించారు. ఎన్నిమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని దీంతో స్థానికంగా దుర్వాసన, దుర్గంధంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అపోలో ఆస్పత్రి నుంచి వచ్చే మురుగు చాంబర్ గేటు వద్ద ఉన్న మ్యాన్‌హోల్ నుంచి పొంగుతూ చాంబర్ ఆవరణలోకి వచ్చి చేరుతున్నదని ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారినిక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి


ఇందిరానగర్ ఫేజ్–2 సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీల్లోని మౌలిక సమస్యల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్‌లోని బ్రహ్మశంకర్, కార్మికనగర్, ఇందిరానగర్ ఫేజ్–2 తదితర బస్తీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్డు, డ్రైనేజీ, మంచినీటి లాంటి ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు ఇప్పటికే నివేదికలు రూపొందించడం జరిగిందని గుర్తుచేశారు. నిధులు మంజూరు కోసం మరోమారు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, ఏఈ భరత్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'చరిత్రలో నిలిచిపోయిన అక్టోబర్ విప్లవం'

కాచిగూడ: అక్టోబర్ విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు బాసటగా నిలిచిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హిమాయత్‌నగర్ లోని సిపిఐ కార్యాలయంలో అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల, భూస్వాముల గుండెల్లో ప్రకంపనలు సృష్టించిందన్నారు. ప్రపంచ పరిణామాల దశను, దిశను మార్చి ప్రపంచ మానవాళి చరిత్రను మలుపుతిప్పిన ఘటన అక్టోబర్ విప్లవమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్.బాలమల్లేష్, కేవియల్, పల్లె నరసింహ, రాపోలు సుదర్శన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో తనిఖీలు

24 సబ్‌స్టేషన్ల పరిధిలో లోపాలను సరిచేస్తున్న సిబ్బంది


సబ్‌స్టేషన్ల తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ అధికారులు



బంజారాహిల్స్: విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు ప్రతియేటా నవంబర్, డిసెంబర్ నెలల్లో టీజీఎస్పీడీసీఎల్ నిర్వహణ సిబ్బంది చేస్తుంటారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ సంబంధిత సిబ్బంది ఆయా విద్యుత్ ఫీడర్ల వద్దకు వెళ్లి ముందస్తుగా నిర్వహణ పనులను పరిశీలించి ఏదైనా లోపం తలెత్తితే వెంటనే సరిదిద్దుతారు. నట్ బోల్టులు, ఇతర వైర్లు లూజుగా ఉంటే వాటిని బిగిస్తారు. చలికాలానికి ముందే సంబంధిత సిబ్బంది అన్ని ఫీడర్లకు వెళ్లి ఈ మరమ్మతు పనులు పూర్తిచేస్తారు. ఈ క్రమంలో టీజీఎస్పీడీసీఎల్ బంజారాహిల్స్ డీఈ పరిధి కిందికి వచ్చే 24 సబ్‌స్టేషన్ల పరిధిలో నాలుగు రోజుల నుంచి నిర్వహణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులు చేపట్టే సమయంలో ఆయా ప్రాంతాల్లో కొద్దిసేపు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నారు. సీబీడీ అధికారుల ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతున్నాయి. బంజారాహిల్స్ టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 24 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. బంజారాహిల్స్ ఏడీఈ (లైన్స్) సవరయ్య, ఏఈ (లైన్స్) సురేందర్, ఏఈ (సీబీడీ) లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది ఈ మెయింటెనెన్స్ పనులు చేస్తున్నారు. రోజుకు ఒక సబ్‌స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలు చేపడుతున్నారు. ఈ నెలాఖరు వరకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్ పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

ఇక్కడ నిర్వహణ చేపడుతున్న సబ్‌స్టేషన్లు ఇవే..

అయ్యప్ప సొసైటీ, బోరబండ, బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఫిలింనగర్, రోహెజా, రవీంద్ర సొసైటీ, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12, రోడ్డునెంబర్–13, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–22, శ్రీనగర్‌కాలనీ, టోలిచౌకి, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయం, కళ్యాణ్‌నగర్, కృష్ణానగర్, ఎల్వీప్రసాద్.

హెల్మెట్ లేకుండా రోడ్లపైకి రావొద్దు

- హెల్మెట్ ధరించకుండా పట్టుబడ్డ 205 మంది
- వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

బంజారాహిల్స్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గురువారం హెల్మెట్ ధరించకుండా తిరుగుతున్న వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల ఉల్లంఘన కింద రూ.200 జరిమానా విధించారు. మరోసారి హెల్మెట్ ధరించకుండా రోడ్లపైకి రావద్దని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉల్లంఘనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, దీని వల్ల ఇతరుల ప్రాణాలుపోయే ప్రమాదం ఉందని, తమకు కూడా ప్రమాదాలు పొంచి ఉంటాయని హెచ్చరించారు. ఎస్ఐలు గోపీ, అశోక్ కూడా పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించని స్కూటరిస్టులు 205 మంది..

గురువారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ పెట్టుకోకుండా బైకులు నడుపుతున్న 205 మందిపై వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో కేసులు నమోదయ్యాయి. పంజగుట్ట ట్రాఫిక్ పరిధిలో 55 మంది, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 38 మంది, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 51 మంది, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 61 మంది హెల్మెట్ ధరించకుండా పట్టుబడ్డారు. అలాగే వెస్ట్‌జోన్ పరిధిలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తూ 66 మంది పట్టుబడ్డారు. సైరన్లు ఏర్పాటు చేసుకున్న 16 మందిపై కేసులు నమోదయ్యాయి. సైరన్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 వాహనాలకు అక్రమంగా ఏర్పాటు చేసిన సైరన్లు తొలగించారు.

ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగిన పైపులైన్ వివాదం


వెంకటేశ్వరనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వెంకటేశ్వరనగర్‌లో కమ్యూనిటీ హాల్ వీధిలో నిర్మించతలపెట్టిన మంచినీటి పైప్ లైన్ పనుల నిర్మాణ వివాదం ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగింది. ఇక్కడ 15 నుంచి 20 ఇళ్లకు మంచినీటి పైప్‌లైన్ లేదని ఇటీవలనే జలమండలి అధికారులు నాలుగు ఇంచుల పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయితే గతంలో ఉన్న పైప్ లైన్ బాగానే ఉందని, కొత్త పైప్‌లైన్ ఎందుకు అంటూ కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో జలమండలి అధికారులు రెండు రోజుల క్రితం అక్కడికి చేరుకుని కొత్తగా వేస్తున్న పైపులను తొలగించేందుకు నిర్ణయించారు. ఇదే విషయంపై గురువారం స్థానికులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి కొత్త పైప్ లైన్ వేయాలని, ఇంకా కొద్ది దూరం పైప్‌లైన్ పెంచాలని కోరారు. సెక్షన్ మేనేజర్ శివకుమార్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే ఇప్పుడు వేస్తున్న పైప్ లైన్ అలాగే కొనసాగించాలని, ఇంకా రెండు మూడు పైపులు అదనంగా పెంచాలని కూడా ఆదేశించారు. దీంతో గత వారం రోజుల నుంచి కొనసాగుతున్న పైప్‌లైన్ వివాదానికి తెరపడింది. కొత్తగా వేస్తున్న పైప్‌లైన్ నిర్మాణాన్ని ఇంకా కొద్ది దూరం పెంచాలని అధికారులు నిర్ణయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆస్తి కోసం మేనకోడలికి బెదిరింపులు

వెంగళరావునగర్: ఆస్తికోసం మేనకోడలిని మేనమామ చంపుతానని బెదిరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు ప్రాంతానికి చెందిన యువతి మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ సినిమాల్లో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తుంది. చిన్నతనంలోనే తండ్రి నుంచి విడిపోయి అమ్మమ్మ వద్ద ఉంటుంది. 2017లో ఆమె వివాహం నిశ్చయం కాగా వివాహానికి ఆమె తండ్రితోపాటు మిగిలిన బంధువులు కూడా రాలేదు. పెళ్ళయ్యాక తండ్రి అప్పులన్నీ తీర్చాలని పెద్దలు చెప్పగా ఆమె తీర్చింది. 2019లో ఆమె తండ్రి మృతి చెందాడు. దీంతో శంకర్‌పల్లిలోని ఆమె తండ్రికి చెందిన భూమి కావాలంటూ యువతిని ఆమె మేనమామ బాచుపల్లి యాదగిరి ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నాడు. ఈ విషయంపై శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ పట్టించుకోలేదు. దీంతో వేధింపులు మరింత ఎక్కువ కావడంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

13 మంది అరెస్టు.. రూ.1.34 లక్షలు స్వాధీనం


జూబ్లీహిల్స్‌జూద గృహంలో పేకాటరాయుళ్లు

బంజారాహిల్స్: గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లను జూద గృహాలుగా మార్చి పేకాట ఆడుతున్న రెండు గృహాలపై వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాడి చేసి రూ.1.34 లక్షలు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహ్మద్ నయీముద్దీన్ (63)యూసుఫ్‌గూడలో కొంతకాలంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ పి.జంగయ్య, ఎస్ఐ జీ నవీన్‌ల ఆదేశాల మేరకు సిబ్బంది ఇక్కడ దాడులు చేసి పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేశారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్‌లో కొంతకాలంగా మధురానగర్‌కు చెందిన వెన్నపూసల మల్లారెడ్డి (35) ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వీరిని అరెస్టు చేశారు. వెన్నపూసల మల్లారెడ్డి గత జులై 8వ తేదీన జూద గృహం నిర్వహిస్తూ జూబ్లీహిల్స్ పోలీసులకు పట్టుబడడం విశేషం. గతంలో అరెస్టయినా ప్రవర్తన మార్చుకోకుండా ఈసారి ఫిలింనగర్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తూ రెండోసారి పట్టుబడ్డాడు. జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండు చోట్ల నిర్వహించిన దాడుల్లో 13 మందిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.1.34 లక్షలు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.

కులం, మతం లేనివారికి ప్రత్యేక కాలం ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో ఏ కులము, ఏ మతము పాటించని వారిని కూడా లెక్కించాలని మతం, కులం లేని వారిని లెక్కించేందుకు ప్రస్తుత సర్వేలో తగిన ఏర్పాటు చేయాలని కుల నిర్మూలన సంఘం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సలహాదారులు సి.ఎల్.ఎన్.గాంధీ, అధ్యక్షులు యం.డి వహీద్, ప్రధాన కార్యదర్శి డి.ఎల్.కృష్ణ చంద్‌లు మాట్లాడుతూ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సమూహంగా ఏ మతాన్ని, కులాన్ని పాటించని వారు ఉన్నారని వారు గుర్తుచేశారు. ప్రస్తుత కులగణనలో కులాంతర వివాహం చేసుకున్న వారి గూర్చి ఒక కాలం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అదే తరహాలో కులం, మతం నమ్మని వారి గూర్చి కూడా ఒక కాలం ఇవ్వాలని సూచించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పోలీసుల అదుపులో యువకులు

వెంగళరావునగర్: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ఆరుగురు యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఈనెల 5వ తేదీ రాత్రి జవహర్‌నగర్ వీడియోగల్లీలో గొడవ జరుగుతున్నట్టు మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు వచ్చింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి అక్కడ రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగిన యువకులను అదుపులోనికి తీసుకున్నారు. వీరిలో బి.సంపత్, ఎస్.సందీప్, ఎస్.సంజయ్, షేక్ ఆరీఫ్, షేక్ మహబూబ్, షేక్ అమీర్‌లు ఉన్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ డీసీసీ ఎస్.అశోక్ కుమార్


వాహనదారులకు గులాబీపూలు అందజేస్తున్న ఎస్.అశోక్ కుమార్

కాచిగూడ: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్ సూచించారు. గురువారం బషీర్‌బాగ్ చౌరస్తాలో రాంగ్‌రూట్ ప్రయాణం, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు నిబంధనలు పాటించే వారికి గులాబీ పూలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్నచిన్న తప్పిదాల వల్ల పెద్దస్థాయిలో మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజీద్, నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్: టీ తాగడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన కె.రాంబాబు అతని తండ్రి సత్తిబాబుతో కలిసి వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉంటున్నాడు. తండ్రి, కుమారులు ప్రైవేట్ జాబ్ చేస్తుంటారు. సత్తిబాబు గత నెల రోజుల నుంచి తాను కాకినాడ వెళ్ళాలనుకుంటున్నానని కుమారుడితో చెబుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో టీ తాగివస్తానని సత్తిబాబు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. తండ్రి కోసం రాంబాబు చుట్టుపక్కల, తెలిసినా వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే సత్తిబాబు వద్ద వద్ద రూ.36 వేలు నగదు ఉన్నాయి. కాకినాడ వెళ్ళాడని అనుకొని బంధువులకు ఫోన్ చేస్తే అక్కడకు కూడా రాలేదని తెలిసింది. దీంతో రాజాబాబు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన సిబ్బందికి అన్ని వివరాలు తెలపాలి

బాబా ఫసియుద్దీన్



సదస్సులో ప్రసంగిస్తున్న బాబా ఫసియుద్దీన్, డీఎంసీ జకీయా సుల్తానా

రహమత్‌నగర్ (బోరబండ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమం చారిత్రాత్మక నిర్ణయమని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పేర్కొన్నారు. కులగణనలో భాగంగా తమ నివాసాల వద్దకు వచ్చే సిబ్బందికి తమ వివరాలు అందించాలని ఆయన డివిజన్ వాసులను కోరారు. బోరబండ సైట్–1 షాహీద్ తుర్రే బాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ కులగణనతో రాష్ట్రంలో వివిధ వర్గాల జనాభా లెక్కించబడుతుందని, తద్వారా ఆయా కులాల జనాభా ప్రతిపాదికన ప్రభుత్వ ఫలాలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. కులగణన అధికారులకు అడిగిన ధ్రువీకరణ పత్రాలు చూపించాలని నమోదు చేయించుకోవాలని సూచించారు. డీఎంసీ జకీయా సుల్తానా మాట్లాడుతూ బస్తీలో వాలంటీర్లు, సూపర్ వైజర్లు, ఆశావర్కర్లు కులగణన చేపడ్తున్నారని వారికి ప్రజలు సహకరించి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఓ వెంకట్‌కిషన్‌రావు, వార్డు ఇన్‌చార్జి విశ్వపతి, ఆశావర్కర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ గృహాల గుర్తింపు పూర్తి

ఎమ్మెల్యే ఇంటికి స్టిక్కర్ వేసిన సిబ్బంది


దానం నాగేందర్ నివాసానికి స్టిక్కర్ అంటిస్తున్న ఎన్యుమరేటర్

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అంటించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసానికి ఎన్యుమరేటర్లు వెళ్ళి సర్వే వివరాలను తెలియజేసి ఇంటికి స్టిక్కర్ వేశారు. సర్వేకు మళ్ళీ వస్తామని వివరాలు అందజేయాలని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ నివాసాలను గుర్తిస్తూ వాటికి స్టిక్కర్లు వేశారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు సైతం ఎన్యుమరేటర్లు వెళ్ళి సర్వేకు సంబంధించిన వివరాలను వారికి తెలియజేశారు.

పేదలకు సేవలందిస్తున్న సంస్థలకు అండగా నిలవాలి


మంత్రి రాందాస్ అత్వాలను సత్కరిస్తున్న ఆదినారాయణ

లిబర్టీ: సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం సేవలందిస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్. ఆదినారాయణ కోరారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అత్వాలను ఆదిలీలా ఫౌండేషన్ ప్రతినిధి బృందం కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. నిరుపేదలకు చేయూతను ఇవ్వడంతోపాటు ఆర్థిక, సామాజిక రంగంలో సేవలు అందిస్తున్నామని ఆయన వివరించారు. సాంస్కృతిక, సామాజిక రంగాలకు చెందిన వారిని ప్రోత్సహిస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని మంత్రికి విన్నవించారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆదినారాయణ తెలిపారు.

చిన్నారి గుండెకు 'ఫైవ్ ఫింగర్స్' సాయం



బంజారాహిల్స్: చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు ఫిలింనగర్‌కు చెందిన 'ఫైవ్ ఫింగర్స్' స్వచ్ఛంద సంస్థ అండగా నిలబడటంతో ఆ చిన్నారి గుండె శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయింది. బీహార్‌కు చెందిన అనిల్ టోలిచౌకిలోని గెలాక్సీ థియేటర్ సమీపంలో కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అనిల్ కుమారుడు అనురాగ్ ఠాకూర్ పుట్టుకతోనే గుండెలో రంధ్రంతో పుట్టడంతో తనకున్న స్తోమతకు ఎక్కడా కూడా వైద్యం చేయించకోలేకపోయాడు. ఇక్కడ ఏ ఆస్పత్రికి వెళ్ళినా స్థానికత సమస్య ఎదురుకావడంతో ఫైవ్ ఫింగర్స్ ఆర్గనైజేషన్‌ను సంప్రదించాడు. దీంతో స్పందించిన ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి కొంతమంది దాతల సహకారంతో ఆ చిన్నారికి గుండెకు శస్త్ర చికిత్సను చేయించారు. ఇప్పుడు ఆ చిన్నారి ఆనందంగా ఉన్నాడు. దీంతో అనురాగ్ ఠాకూర్ తండ్రి ఫైవ్ ఫింగర్స్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపాడు.

అంగన్‌వాడీల్లో తనిఖీలు తప్పనిసరి

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓలు, సూపర్‌వైజర్లు ప్రతి నెలా నిర్దిష్టమైన తనిఖీలు చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. పిల్లల బరువు, తీవ్ర లోప పోషణ, సరిగా బరులేని పిల్లల గురించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఐసీడీఎస్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం కోసం ఒక నిర్ణీత రోజును కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సొంత, కమ్యూనిటీ భవనాల్లో నిర్వహిస్తున్న వాటిలో తాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. లేని వాటి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. స్పెషల్ గ్రోత్ మానిటరింగ్ నిర్వహించిన డేటా శాతాన్ని సమర్పించాలని అన్నారు. సీడీపీఓలు సూపర్‌వైజర్లు ప్రతినెలా నిర్దిష్టమైన తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. పిల్లల బరువు, తీవ్ర లోపపోషణ, సరిగా బరులేని పిల్లల సంఖ్య ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై మరింత చైతన్యం రావాలి



డీఆర్ఆర్ కేర్ చానెల్ లోగోను ఆవిష్కరిస్తున్న మహేష్ కుమార్‌గౌడ్

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్

లక్డీకాపూల్: ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించే క్రమంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. హైటెక్‌సిటీలోని కోహినూర్ క్లబ్‌లో ఇండియన్ అమెరికన్ మెడికల్ ఫౌండేషన్‌కి చెందిన డీఆర్ఆర్ కేర్ యూట్యూబ్ ఛానెల్ లోగోను బుధవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు మన దేశంలో స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. విదేశాల్లో వైద్య వృత్తిలో రాణిస్తూ తాను సంపాదించిన ఆదాయంలో కొంత భాగం ప్రజాసేవకు అంకితం చేయడం గొప్ప విషయమన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ నీరెళ్ల దామోదర్ మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టిన తాను తన తల్లి కలను నెరవేర్చేందుకు ఎంబీబీఎస్ పూర్తి చేసి.. వైద్య వృత్తిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఫౌండేషన్ ద్వారా మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కాగా వ్యాధులు రాకుండా ముందుగానే టెస్టులు చేయించుకోవడం వల్ల వాటిని గుర్తించి చికిత్స తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు జీఎస్ సీతారామరాజు, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక రంగంవైపు దృష్టి సారించాలి

జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ప్రొ.విజయకుమార్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ రంగంవైపు మాత్రమే కాకుండా, పారిశ్రామిక రంగం వైపు కూడా దృష్టి సారించాలని జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ప్రొ.విజయకుమార్‌రెడ్డి అన్నారు. 4వ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ అండ్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ అంతర్జాతీయ సదస్సును జేఎన్‌టీయులో గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు డా.మంజూర్ హుస్సేన్, డైరెక్టర్ డా.కుతుబ్దీన్, వీబీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా.సంజయ్, హితమ్ ప్రిన్సిపాల్ డా.అరవింద్ తదితరులు మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుతో పాటు అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.



సదస్సును ప్రారంభిస్తున్న విజయకుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు

యాదవుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మేకల రాములు యాదవ్

పంజగుట్ట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణ ఏర్పడిన తర్వాత యాదవులు లేని మంత్రివర్గం లేదని, తొలిసారి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో యాదవులు లేని మంత్రివర్గం కొనసాగడం బాధాకరమని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విషయమై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందించామని, 20 రోజుల్లో స్పందించి యాదవులకు మంత్రివర్గంలో స్థానం, మూడు ఎమ్మెల్సీలు, ఐదు కార్పొరేషన్ చైర్మన్లు, యాదవ కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల నిధులు ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆయన హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీకృష్ణ యాదవ్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమతో సమావేశమై తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారని, దీంతో జనాభాలో 20 శాతం ఉన్న యాదవులు, కురుమలు కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించామని గుర్తుచేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిప్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. నాయకులు చిలుక శ్రీనివాస్ యాదవ్, రాములు యాదవ్, గుడిసె శ్రీనివాస్ యాదవ్, గంగుల ఐలేష్ యాదవ్, రవి, లక్ష్మి, మంజుల, మారబోని శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను వ్యతిరేకించే పార్టీల భరతం పడతాం

గన్‌ఫౌండ్రీ: కులగణన వ్యతిరేకించే రాజకీయ పార్టీల భరతం పడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. బీసీ కులగణనపై బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కులగణన ఒక యజ్ఞంలా సాగుతుంటే దానికి రాజకీయ రంగు పూసి అడ్డుకోవాలని చూస్తే సహించబోమని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేస్తుంటే బీజేపీ నాయకులు పూటకు ఒక్కరు కులగణపై విషం కక్కుతూ అడ్డుపడటం మంచిది కాదని హితవు పలికారు. కులగణను దేశవ్యాప్తంగా చేసి కులాల లెక్కలు తీయాలని బీజేపీకి సూచించారు. కులగణను అడ్డుకోవాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు టి.విక్రమ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బషీర్‌బాగ్‌చౌరస్తాలో మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ నాయకులు

ప్రతిచెట్టుకూ పక్కా లెక్క

- ఎలివేటెడ్ కారిడార్ రూట్‌లో చెట్లపై హెచ్‌ఎండీఏ అధ్యయనం
- సుమారు 10 వేల చెట్లను గుర్తించిన నిపుణులు, పర్యావరణవేత్తలు
- వాటిలో 40 శాతానికిపైగా రీలొకేషన్‌కు ప్రణాళికలు
- త్వరలో ట్రీ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణంపై మరో ముందడుగు పడింది. ఈ రూట్‌లో తొలగించాల్సిన నిర్మాణాలపై ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చిన హెచ్‌ఎండీఏ ప్రస్తుతం ఈ రూట్‌లోని చెట్లపై దృష్టిసారించింది. ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు 5.5 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 18.5 కి.మీల మార్గంలో మరో కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. రక్షణశాఖ నుంచి సేకరించాల్సిన భూములను గుర్తించడంతో పాటు తొలగించాల్సిన నిర్మాణాలపై హెచ్‌ఎండీఏ ఇప్పటికే క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టింది. ఇప్పుడు తాజాగా ట్రీ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చెట్ల రక్షణకు శ్రీకారం చుట్టింది. అటవీశాఖ అధికారులు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, వన్యప్రాణి సంరక్షణ సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ, ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చెట్ల సంరక్షణ కమిటీ పనిచేస్తోంది. ఈ కమిటీ ప్రతినిధులు వారం రోజుల పాటు ఈ రెండు మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం తొలగించాల్సిన చెట్లపైన అధ్యయనం చేపట్టారు. ఈ మార్గాల్లోని చెట్లను వివిధ విభాగాలుగా విభజించినట్లు అధికారులు తెలిపారు.

ప్రతి చెట్టుకు జియో కార్డినేట్స్..

ఈ మార్గాల్లో సుమారు 10 వేలకు పైగా చెట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో కొన్ని వందల ఏళ్ల నాటి మహా వృక్షాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా కంటోన్మెంట్‌లోని రక్షణశాఖ స్థలాల్లో ఇలాంటి విలువైన వృక్షాలున్నాయి. వందలకొద్దీ మర్రి, రావి, వేప, మద్ది వంటి స్థానిక జాతులకు చెందిన చెట్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రతి చెట్టును మ్యాపింగ్ చేయడంతో పాటు జియో కార్డినేట్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే.. చెట్టు ఎత్తు, దాని వయస్సు, ఏ జాతికి చెందిన చెట్టు వంటి అన్ని వివరాలను నమోదు చేసినట్లు హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీకి చెందిన ఓ అధికారి వివరించారు. ప్రస్తుతం అన్ని చెట్ల డాటా సేకరణ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ట్రీ ప్రొటెక్షన్ కమిటీ సేకరించిన వివరాల ఆధారంగా త్వరలో చర్యలు చేపట్టనున్నారు. ఈ చెట్లలో సుమారు 6 వేల వరకు తొలగించాల్సిన అవసరం ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా 4 వేల చెట్లను మాత్రం తొలగించాల్సి వస్తుంది. ఇలా తొలగించే వాటిని సాధ్యమైనంత వరకు హెచ్‌ఎండీఏ నర్సరీల్లో రీలొకేట్ చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు ప్రాథమికంగా అవగాహనకు వచ్చినప్పటికీ తొలగించాల్సిన వాటి జాబితాలో మార్పులు, చేర్పులు ఉండవచ్చు.

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో ప్రయోజనాలు

ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజుకు సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ ఫర్ డే -పీసీయూ) పయనిస్తుంటే, ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో 72,687 వాహనాలు పయనిస్తున్నాయి. ఇరుకైన రహదారి కావడం, ఇంత పెద్ద మొత్తంలో వాహన రాకపోకలతో నిత్యం వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. తరచూ రహదారి ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రులవుతున్నారు. అత్యవసర సమయాల్లో గమ్యాన్ని చేరుకోలేక ప్రయాణికులు తీవ్ర ఒత్తిడి, అసహనానికి గురవుతున్నారు. వాహనాల రద్దీతో గంటలకొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో సమయం కలిసి రావడంతో పాటు ఇంధనంపై అయ్యే వ్యయం తగ్గుతుంది. ప్రమాదాల సంఖ్య తగ్గిపోనుంది. మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

త్వరలో ట్రీ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం

అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా చెట్ల సంరక్షణకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టనుంది. ఈ క్రమంలో స్థానిక జాతులకు చెందిన చెట్లపైన కొంతవరకు ఆందోళన నెలకొంది. కంటోన్మెంట్‌లోని రక్షణశాఖ భూముల్లో ఉన్న ఏళ్లనాటి వృక్షాల తొలగింపు పట్ల పర్యావరణ వేత్తలు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. వందేళ్లు దాటిన వృక్షాలు వందలకొద్దీ ఉన్నాయి. అలాంటి విలువైన వృక్షరాజాల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో అలాంటి విలువైన చెట్లను తొలగించాల్సిన అవసరం లేకుండానే అలైన్‌మెంట్ ఉండేవిధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం తనిఖీలు పూర్తి కావడంతో మరో రెండు, మూడు రోజుల్లో ట్రీ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. తొలగించాల్సిన చెట్లపై సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏ చెట్లను ఎక్కడ ఎలా రీలొకేట్ చేయాలనేది కూడా తేలనుంది.

నగరంలో నేడు

- ★ హిందూ ఆధ్యాత్మిక, సేవా ఫౌండేషన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో బృహత్ మేళా, సేవా ప్రదర్శిని సాంస్కృతిక కార్యక్రమాలు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి.
- ★ కేపీహెచ్‌బీ కాలనీలోని జేఎన్‌టీయూహెచ్‌లో 4వ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ అండ్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ అంతర్జాతీయ సదస్సు ఉంటుంది.
- ★ మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్(ఫెసా) జాతీయ సెమినార్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వ్యవసాయంలో లింగ సమానత్వంపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్), ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఆర్ఆర్ఐ), జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫామ్‌ల సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యంగా మహిళా రైతులకు సాధికారిత కల్పించడానికి తీసుకోవాల్సిన విషయాలు, వ్యవసాయ విస్తరణ, సలహాలు, సూచనలు, పంపిణీలో తీసుకురావాల్సిన విప్లవాత్మక మార్పులపై చర్చించారు. దీంతో పాటు మహిళా రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి తప్పనిసరిగా వారికి మద్దతు ఇచ్చే విధంగా ఉండాలని నిర్ణయించారు. ఇందులో మన దేశంతో పాటు ఇతర దేశాల వ్యవసాయ పారిశ్రామికవేత్తలు పాల్గొని వారి దేశాల్లో మహిళా పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న సూచనలు తెలిపారు. ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శరవన్‌రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కాచిగూడ: జలమండలి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ అనుబంధ జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి నేతృత్వంలో యూనియన్ నేతలు, కార్మికులు గురువారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వ హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న మూడు వేల పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్‌గ్రేడ్ ప్రమోషన్లు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు కె.రామరాజు, భూమయ్య, సురేష్‌బాబు, సురేష్, ఆర్.సీతయ్య, బిల్డర్ శ్రీనివాస్, జంగారెడ్డి, గణేష్, రఘు, నరేంద్ర, కుమార్, అర్జున్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌కు సమస్యలను వివరిస్తున్న జలమండలి కార్మికులు

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి వీలుగా ఎస్ఇఐడి

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమల్లో భావి గేమ్‌చేంజర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శామ్‌సంగ్ ఎకో సిస్టమ్ ఫర్ ఇంజనీర్డ్ డేటా(ఎస్ఇఐడి) పేరిట ల్యాబ్స్‌ను నెలకొల్పుతున్నట్లు శామ్‌సంగ్ ఆర్అండ్‌డి ఇన్‌స్టిట్యూట్ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవలే బెంగళూర్‌లో గార్డెన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఒక ల్యాబ్‌ను ఇప్పటికే ప్రారంభించామని, అలాగే 4 సీడ్ ల్యాబ్స్‌ను కూడా పలుచోట్ల ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు ఫ్యాకల్టీ సభ్యులు సీనియర్ ఇంజినీర్లతో అవగాహన, స్పీచ్ టెక్స్ట్, రికగ్నిషన్ మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాలపై ఉమ్మడి ప్రాజెక్ట్‌లపై పనిచేసిన అనుభవాన్ని దక్కించుకుంటారన్నారు.

వ్యభిచారం కూపంలోకి దింపిన ఆరుగురికి జీవితఖైదు

సిటీ కోర్టులు: బంగ్లాదేశ్‌కు చెందిన యువతులను అక్రమంగా దేశంలోకి తీసుకొచ్చి వ్యభిచార కూపంలోకి దింపిన ఆరుగురికి నాంపల్లి ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జీవితఖైదు విధించింది. ఛత్రినాకలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా రాకెట్ గుట్టురట్టు అయిన దాదాపు ఐదేళ్ల తర్వాత ఇద్దరు మహిళలతో సహా ఆరుగురు బంగ్లాదేశ్ జాతీయులను నాంపల్లిలోని ఎన్ఐఏ సెషన్స్ కోర్టు బుధవారం దోషులుగా నిర్ధారించింది. ఇందులో మొత్తం ఆరుగురు దోషులకు జీవితఖైదు విధించడంతోపాటు రూ.24వేల జరిమానా విధించింది.

పూర్తి వివరాలు..

మహ్మద్ యూసుఫ్, అతడి భార్య బితిబేగం 2019 ఆగస్టులో ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందికల్‌గేట్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని బంగ్లాదేశ్ నుంచి తీసుకొచ్చిన ఐదుగురు యువతులతో వ్యభిచారం చేయిస్తుండగా స్థానిక పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమ రవాణకు సంబంధించిన అంశం కావడంతో ఎన్ఐఏ అధికారులు ఈ కేసును 2019 సెప్టెంబర్ 17న రీరిజిస్టర్ చేసి అనైతిక అక్రమ రవాణా చట్టం 1986లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మంచి ఉద్యోగం ఆశ చూపించి యువతులను పశ్చిమ బెంగాల్ మీదుగా ఇక్కడికి తరలించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసు విచారణ ఐదేళ్లుగా నాంపల్లి కోర్టులో జరిగింది. అయితే బుధవారం నాంపల్లి కోర్టు విచారణ చేపట్టి సెక్షన్ 370 (ట్రాఫికింగ్) కింద ఆరుగురు (మహ్మద్ యూసుఫ్‌ఖాన్, బితి బేగం, సోజిబ్ రహుల్, అమీన్‌ధాలీ, ఖోన్లా జస్టిన్, శివలీ ఖాతూన్)లను దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది.

ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్‌కు ఏడాది జైలు

2013 సంవత్సరంలో రూ.20 వేల లంచం తీసుకున్న కేసులో..

రాజేంద్రనగర్: లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్‌కు హైదరాబాద్ ఏసీబీ కోర్టు సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. వివరాల ప్రకారం.. 2013 సంవత్సరంలో శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన వ్యక్తి మ్యూటేషన్ కోసం రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మ్యూటేషన్ చేసేందుకు సీనియర్ అసిస్టెంట్ జె.వెంకటేశ్వర్‌రావు రూ.20 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా వెంకటేశ్వర్‌రావును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. కేసులో ఏసీబీ న్యాయమూర్తి గురువారం నిందితుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వేసవి డిమాండ్‌ను తట్టుకునేలా..

- ఈ వేసవిలో 20 నుంచి 25 శాతం పెరగనున్న డిమాండ్
- అంచనా వేసిన డిస్కం.. ఏర్పాట్లు చేయాలని సూచన
- సంక్రాంతిలోపే లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలి
- సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వేసవిలో ఏర్పడే అధిక విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ సంబంధిత అధికారులకు సూచించారు. మింట్‌కాంపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ట్రాన్స్ కో డైరెక్టర్/ ట్రాన్స్‌మిషన్ జగత్‌రెడ్డితో కలిసి ఇతర ఇంజినీర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతుంది. గతేడాది 3756 మెగావాట్లుగా ఉన్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16శాతం వృద్ధితో 4352 మెగావాట్లుగా నమోదైంది. 2023లో 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం 2024లో దాదాపు 12 శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతంలో కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో సుమారు 20 నుంచి 25 శాతం వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు.

ఎల్సీల విషయంలో సమన్వయంతో ముందుకెళ్లాలి

గ్రేటర్ శివారు ప్రాంతాలైన నెమలినగర్, గోపన్‌పల్లి, కోకాపేట్, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, మాన్సాన్‌పల్లి, అజీజ్‌నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతుంది. ఆ ప్రాంతాల్లో అవసరానికి తగ్గట్టు 220/132/33 కేవీ సబ్‌స్టేషన్స్ ఏర్పాటు, ఇతర నెట్‌వర్క్‌ను పటిష్టం చేయడానికి చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు సీఎండీ దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్వహణ మరమ్మతుల్లో నాణ్యత ప్రాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. నిర్వహణ పనుల కోసం తీసుకుంటున్న లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌సీలు తీసుకునేటప్పుడు ట్రాన్స్‌కో, డిస్కం ఇంజినీర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సంక్రాంతిలోపు 100 శాతం నిర్వహణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్ రాంజీ, చక్రపాణి పాల్గొన్నారు.

రెసిడెంట్ వెల్ఫేర్ సదస్సుకు సీఎంకు ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీఆర్‌డబ్ల్యూఏ)కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంస్థ ప్రతినిధులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో జరగనున్న ఈ సదస్సుకు సీఎం హాజరవుతారని ప్రతినిధులు తెలిపారు. లగ్జరీ రిసార్ట్ చెయిన్ క్షేత్ర, భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య(క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. రెండు రోజుల ఈ సదస్సులో వ్యర్థాల నిర్వహణ, లోకల్ గవర్నెన్స్, పర్యావరణ మార్పులు తదితర అంశాలపై నిపుణులు చర్చిస్తారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హెచ్ఎస్ఎస్ ఫెయిర్

సాక్షి, సిటీబ్యూరో: హిందూ స్పిరిచువల్ అండ్ సర్వీస్ ఫౌండేషన్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నగరం వేదికగా ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజులపాటు హెచ్ఎస్ఎస్ ఫెయిర్ నిర్వహించనున్నారు. నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా ఈ నెల 8, 9, 10 తేదీల్లో దేశం దైవం ధర్మం పేరుతో ఈ ఫెయిర్ నిర్వహించనున్నారు. భారత్‌లోని ఆధ్యాత్మికత, ధర్మం ప్రాధాన్యతను ప్రదర్శించేలా ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారతీయత ఉట్టిపడేలా భారత ఆధ్యాత్మికత విలువలను ప్రతిబింబించేలా విభిన్న సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఘనంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్‌డే



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక, ఫ్లాగ్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని సౌత్ లాలాగూడ రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్, జీఆర్ఎస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెండా ఊపి వాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు కలిసి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ఫ్లాగ్ డే స్టిక్కర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన 75 సంవత్సరాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకల డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను ఆవిష్కరించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, ఉన్నతాధికారులు పద్మజ, లోకేష్ విష్ణోయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం శుక్రవారం జరగనుంది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వి.నంజుండేశ్వర ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొంటారు. ఆగస్టు 24న జరిగిన సాధారణ సమావేశంలో అనంతరం చేపట్టిన పాలనాపరమైన సర్క్యులర్ ఎజెండాలకు ఆమోదంతో పాటు పలు కీలక అంశాలపై బోర్డులో చర్చించి నిర్ణయాలు తీసుకోన్నారు. ముఖ్యంగా కంటోన్మెంట్ పరిధిలోని జాతీయ రహదారి-44, రాష్ట్ర రహదారి-01 మార్గాల్లో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ మార్గాల్లో రోడ్డు విస్తరణను 60 మీటర్లకు బదులుగా, 40 మీటర్లకు కుదించాలంటూ గత సమావేశంలో చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అయితే 60 మీటర్లకు రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాలను రక్షణశాఖ ఈ పాటికే అప్పగించిందని, ఈ పరిస్థితుల్లో ప్రైవేటు స్థలాలు ఉన్న ప్రాంతాల్లో విస్తరణను కుదించడం సాధ్యం కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో రోడ్డు విస్తరణకు సంబంధించి బోర్డు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కుల గణనపై వదంతులు నమ్మవద్దు

సాక్షి, సిటీబ్యూరో: కులగణనపై వదంతులు నమ్మవద్దని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ గురువారం విజ్ఞప్తి చేశారు. కులగణనను ఎన్ఆర్‌సీకి అనుసంధానం చేస్తారని కొందరు భయాందోళన సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ జహీర్ లలానీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణనకు పౌరసత్వ పత్రాలకు సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారన్నారు. ముస్లిం వెనుకబడిన తరగతుల వారు బీసీ-ఈ కేటగిరిని ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధించే పెద్ద మిషన్‌లో భాగంగా కులగణనను నిర్వహించాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చేసిన ప్రతిజ్ఞను ఆయన గుర్తు చేశారు. ఇది కేవలం సర్వే మాత్రమే కాదు, సజావుగా సాగే భారతదేశానికి ఇది కీలకమైన ముందడుగు అన్నారు. కులగణనలో సమగ్ర సమాచారం అందించి భాగస్వాములు కావాలన్నారు.

ఇంద్రసేన్‌రెడ్డి మృతి తీరని లోటు



ఇంద్రసేన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్.ఇంద్రసేన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎంతో మంది నాయకులను కాంగ్రెస్ పార్టీకి అందించిన ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఇంద్రసేన్‌రెడ్డి సంస్మరణ సభ గురువారం జరిగింది. హాజరైన మహేష్‌గౌడ్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవ్‌రావు, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు(వీహెచ్), మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, రాజ్యసభ సభ్యుడు ఎంఏ.ఖాన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులతో కలిసి హాజరై అక్కడ ఏర్పాటు చేసిన దివంగత నేత ఇంద్రసేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంద్రసేన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, సీనియర్ నాయకులు రాజేశంగౌడ్, రాజలింగంగౌడ్, టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ పటేల్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్ రెడ్డి, ఎడ్ల నరేందర్‌రెడ్డి(ఏఎన్ఆర్), చింతల ధనార్జున్‌రెడ్డి(సీడీఆర్), దేవిరెడ్డి విజితారెడ్డి, రామ్మోహన్‌రావు నివాళులర్పించారు.

చిత్ర పరిశ్రమలో దర్శకత్వ విభాగంలో సక్సెస్ కావాలంటే, అందులోనూ ఓ మహిళ ఆ స్థాయిలో అవ్వాలంటే సామర్థ్యంతో పాటు సృజనాత్మకత తప్పనిసరి. సమకాలీన అంశాలను అర్థవంతంగా తెరకెక్కిస్తేనే ప్రేక్షకాదరణ పొందుతుంది. అలాంటిది హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే ఎంతో అంకితభావం, చిత్తశుద్ధితో పాటు ధైర్యసాహసాలు కావాలి. ఒకటి కాదు రెండు కాదు వందలాది అంతర్జాతీయ అవార్డ్‌లతో ఔరా అనిపిస్తోంది మన తెలుగమ్మాయి లక్ష్మీ నిమిషా గుమ్మడి. తాజాగా ఆమె ప్రొడక్షన్ డిజైనర్‌గా రూపొందించిన 'దాస్ బ్రోస్ ఫోర్స్' ఫీచర్ ఫిల్మ్ అత్యంత ప్రతిష్టాత్మకమైన 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలిచింది. ఇది చాలదూ.. హాలీవుడ్‌లో లక్ష్మీ సత్తా ఏంటో చెప్పేందుకు!?

- సాక్షి, సిటీబ్యూరో



సిటీ స్కూల్స్‌కి ఐడబ్ల్యూబీఐ గుర్తింపు..

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్నేషనల్ వెల్ బిల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యూబీఐ) నుంచి ప్రతిష్టాత్మక వెల్ హెల్త్–సేఫ్టీ రేటింగ్ (వెల్ హెచ్ఎస్ఆర్) అందుకున్న తొలి భారతీయ పాఠశాలలుగా శిక్షణా సంస్థ క్రిమ్సన్ ఆధ్వర్యంలోని 3 సిటీ స్కూల్స్ నిలిచాయి. ఈ విషయాన్ని క్రిమ్సన్ ప్రతినిధులు తెలిపారు. సుచిత్ర, కీసర, అల్వాల్‌లో ఉన్న తమ పాఠశాలల్లోని భవనాలు, ఫిల్టర్స్ సౌకర్యాలు, పరిశుభ్రమైన గాలి, శుద్ధి చేసిన నీరు, శానిటైజేషన్ విధానాలు, అత్యవసర పరిస్థితులకు సంసిద్ధత తదితర 29 ప్రమాణాల్లో 16 ప్రమాణాలను అందుకోవటం ద్వారా ఈ సర్టిఫికేట్ సాధించామని, ప్రపంచవ్యాప్తంగా 14 విద్యా, వృత్తిపరమైన శిక్షణా సంస్థలు మాత్రమే ఈ సర్టిఫికేషన్ అందుకున్నాయన్నారు.

శ్రీఅభయాంజనేయుడి సన్నిధిలో జాన్వీకపూర్

వెంగళరావునగర్: అలనాటి ప్రముఖ సినీ నటి శ్రీదేవి కుమార్తె, ప్రస్తుత బాలీవుడ్ నటి అయిన జాన్వీకపూర్ గురువారం ఉదయం వెంగళరావునగర్ మధురానగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన కుమారస్వామి ఆమెతో వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేయించారు. అనంతరం ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. పూజా కార్యక్రమాల్లో పవన కుమారస్వామితో పాటుగా అర్చకులు సత్యం స్వామి, శర్మ, మహేష్‌శర్మ ఉన్నారు. జాన్వీకపూర్ వచ్చిన విషయం తెలుసుకున్న ఆమె అభిమానులు, స్థానికులు ఆలయం వద్ద గుమిగూడారు. అనంతరం ఆమెతో సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు.

నేటి నుంచి.. వృక్ష-నేచర్ హీల్స్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ చిత్రకారుల కళాత్మక ప్రతిభకు అద్దం పట్టే 'వృక్ష–నేచర్ హీల్స్' చిత్ర ప్రదర్శన నగరంలో నేడు ప్రారంభం కానుంది. లక్డీకాపూల్‌లోని డౌన్‌టౌన్ మాల్‌లో ఉన్న పులి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటవుతున్న ఈ ప్రదర్శనలో ప్రొఫెసర్ అంజనీరెడ్డి, పూసపర్తి పరమేశ్వరరాజు, తదితర 9 మంది చిత్రకారులు గీసిన చిత్రాలు కొలువుదీరనున్నాయి. ఈ చిత్ర ప్రదర్శనకు ప్రముఖ చిత్ర/శిల్ప కళాకారుడు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎంవి.రమణారెడ్డి ముఖ్యఅతిథిగా, జీహెచ్ఎంసీకి చెందిన అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్ సుభద్రాదేవి, జెఎన్ఎఫ్ఎయు ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్‌లు గౌరవ అతిథులుగా హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు.



ప్రతి నిమిషం... సినిమా ధ్యాసే..

హాలీవుడ్‌లో తెలుగమ్మాయి హవా





- ప్రొడక్షన్ డిజైనర్‌గా లక్ష్మీ నిమిషా సత్తా
- అమెరికాలో తెలుగు ఫీచర్, షార్ట్ ఫిల్మ్స్‌తో బిజీ
- మ్యూజిక్ వీడియోలతో యువతలో ప్రజాదరణ
- ఇప్పటికే వందలాది అంతర్జాతీయ అవార్డులు సొంతం
- 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలో 'దాస్ బ్రోస్ ఫోర్స్'



హైదరాబాద్‌లోని సంఘమిత్ర స్కూల్, ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో +12 వరకూ చదివిన లక్ష్మీ.. ఆ తర్వాత కర్నాటకలోని మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, కాలిఫోర్నియాలోని అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎఫ్ఐ)లో 'ప్రొడక్షన్ డిజైన్'లో ఎంఎస్ పూర్తి చేసింది. సమకాలీన డిజైన్స్‌తో సాంస్కృతిక అంశాలను మిళితం చేసే సామర్థ్యం ఈమె సొంతం.



తెర వెనక పాత్రల గురించి తెలిసి..

చిన్నతనంలో సినిమాలు చూసేటప్పుడు క్యారెక్టర్స్‌లో లీనమై అతిగా భావోద్వేగానికి లోనయ్యేదానినని తరుచూ స్నేహితులు ఆమెను ఆటపట్టించేవారు. చిన్నతనం నుంచే తనపై సినిమాల ప్రభావం ఉండటంతో నటి కావాలని అనుకునేది. ఆ వయసులో తెరవెనక దర్శకులు, సినిమాటోగ్రాఫర్లు, నిర్మాతల పాత్ర గురించి ఆలోచించే స్థాయిలేదు కానీ, పెద్దయ్యాక సినిమా మేకింగ్ గురించి తెలిసిన తర్వాత ఆమె ఆసక్తి నటన నుంచి ప్రొడక్షన్ వైపు మళ్లింది.

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ 'తహనన్'..

అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారం అవుతున్న 'తహనాన్' అనే ఫీచర్ ఫిల్మ్ లక్ష్మీ రూపొందించిందే. దీనికి లాస్ ఏంజిల్స్‌లోని కల్వర్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ చలనచిత్ర అవార్డ్ వరించింది. అమెరికాలో మ్యూజిక్ వీడియోలు, వాణిజ్య ప్రకటనలు కూడా ఈమె రూపొందిస్తోంది. టేలర్ స్విఫ్ట్స్, ఫోర్ట్‌నైట్, రెడ్ క్రిస్మస్, రోబోట్, ఎలిఫెంట్ ఇన్ ది డార్క్, స్టక్ వంటి ఎన్నో మ్యూజిక్ వీడియోలకు లక్ష్మీ పనిచేసింది. అలాగే ఎలక్ట్రానిక్ ఉపకరణాల సంస్థ డీఈఎక్స్ వంటి పలు బహుళ జాతి కంపెనీలకు వాణిజ్య ప్రకటనలు రూపొందించింది.

ఈజిప్ట్, ఫ్రాన్స్, పోర్చుగల్, జర్మనీ, ఇస్తాంబుల్, యూకే వంటి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 50 ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 15 అంతర్జాతీయ అవార్డ్‌లు లక్ష్మీ సొంతం. తాజాగా 'డాస్ బ్రోస్ ఫోర్స్' చిత్రం వచ్చే ఏడాది మేలో జరగనున్న ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలిచింది. అర్జున్ ది స్టూడెంట్, మీన్ గోల్స్, ది హల్కైన్ డేస్, బాడీ చెక్ వంటి ఎన్నో ఫీచర్, షార్ట్ ఫిల్మ్‌స్‌ను రూపొందించింది. ఇండియాతో పాటు కెనడా, గ్రీస్, టర్కీ, అమెరికా, ఫ్రాన్స్, యూకే వంటి దేశాల్లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డ్‌లను దక్కించుకుంది. రవికుమార్

తెలుగు చిత్రం రిలీజ్..

వాసు దర్శకత్వంలో శివకుమార్ రామచంద్ర వరపు కథానాయకుడిగా తెరకెక్కిన తెలుగు చలనచిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



సర్వీస్ టు సైబర్!

పంథా మారిన సామాజిక సేవ

- మొగ్గు చూపుతున్న విద్యార్థులు
- నిరోధానికే ప్రాధాన్యమిస్తూ ఇలా
- ఇటీవల కాలంలో పెరిగిన వైనం



సామాజిక సేవ.. ఒకప్పుడు కేవలం స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికులకు మాత్రమే పరిమితం. ఆపై ఐటీ ఉద్యోగులు, డిగ్రీ, పీజీ చేసే విద్యార్థులు కూడా దీనిపై మక్కువ పెంచుకున్నారు. కొన్నేళ్లుగా యువతరానికి ఇదో హాబీలా మారిపోయింది. కొన్నాళ్ల క్రితం వరకూ రోగులు, జంతువులు, రైతులతో పాటు కొన్ని వర్గాలకు చెందిన వారికి సేవ చేయడం, పర్యావరణ పరిరక్షణా చర్యలు మాత్రమే సోషల్ సర్వీస్‌గా ఉండేవి. ప్రస్తుతం విద్యార్థులు, యువతరం సోషల్ సర్వీస్ స్థానంలో 'సైబర్' సర్వీస్ ప్రారంభించారు. ఇటీవలి కాలంలో ఈ ట్రెండ్ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

రొటీన్‌కు భిన్నంగా ఉండాలనే తపన.. విద్యార్థులతో పాటు యువతలో ఇటీవల కాలంలో పెరుగుతోంది. రీల్స్, వీడియోలు, ఫొటోలు అనేవి రొటీన్‌కు భిన్నంగా ఉండాలనే తపన, ప్రయత్నంలో ఒక కోణం మాత్రమే. వీటి ద్వారా సోషల్‌మీడియాలో ప్రాచుర్యం పొందాలని, 'ఈ'తరుల కంటే భిన్నంగా ఉండాలనే ప్రయత్నాల్లో భాగంగా రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ధోరణిలో భాగంగానే కొందరు యువత భిన్నమైన హాబీలను ఎంచుకుంటున్నారు. ఇలా తెరపైకి వచ్చిందే 'సైబర్' సర్వీస్ కాన్సెప్ట్. ప్రధానగా ఐటీ రంగానికి చెందిన వారితో పాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వాళ్లు ఈ తరహా సేవలపై ఆసక్తి చూపుతున్నారు.



ఆ విషయం తెలిసిన నాటి నుంచే..

సైబర్ నేరాల్లో బాధితులుగా మారుతున్న వారిలో 55 శాతం ఐటీ ఉద్యోగులతో పాటు విద్యాధికులు ఉన్నారని తెలిసి ఆందోళన కలిగింది. ఈ తరహా నేరాల్లో ఆర్థికంగా నష్టపోవడం ఎంత తేలికో.. న్యాయం జరగడం అంత కష్టం. భవిష్యత్తులో వ్యవస్థలతో పాటు వ్యక్తులకు సవాల్‌గా మారబోయేవి సైబర్ నేరాలే. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకునే సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నా. కొన్నాళ్లుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో కార్యక్రమాలు చేపడుతున్నా. ప్రస్తుతం ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నా. సెలవులకు వచ్చినప్పుడు వివిధ ప్రైవేట్ కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలకు నేరుగా వెళ్లి అవగాహన కల్పిస్తా. అలా నేను కలిసి వారితో నిరంతరం టచ్‌లో ఉంటూ ఆన్‌లైన్‌లోనే వీడియోలు, ఫొటోల ద్వారా అప్రమత్తం చేస్తుంటా.

- కృతిక బుసిరెడ్డి, హైదరాబాద్



నేర్చుకుంటూ.. నేర్పిస్తూ..



సైబర్ నేరాలపై అవగాహన కల్పించే సామాజిక సేవా పంథాను ఎంచుకుంటున్న యువత ఎక్కువగా నేరాల నిరోధించే విషయాలపైనే దృష్టి పెడుతోంది. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్' అన్నట్లు ఓ వ్యక్తి ఈ నేరం బారినపడిన తర్వాత న్యాయ సహాయం అందించడం కంటే అసలు ఆ నేరం బారినపడకుండా అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు. ఈ కోణంలో పని చేస్తున్న యువత సైబర్ నేరాలకు సంబంధించిన అంశాలను ఆన్‌లైన్‌తో పాటు అధికారులను సంప్రదించడం ద్వారా తాము నేర్చుకుంటూ.. పలువురికి నేర్పిస్తున్నారు. ప్రైవేట్ కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో నేరుగా వెళ్లి అవగాహన కల్పిండంతో మొదలుపెట్టి ఆన్‌లైన్ విధానంలోనూ అవగాహనా శిబిరాలు కొనసాగిస్తున్నారు.

టేక్ ఇట్ ఈజీ.. టెక్‌బుక్

'లీడ్'ఎడ్‌టెక్ సంస్థ తెలివైన ఆవిష్కరణ

ప్రతి అంశం పిల్లలకు గుర్తుండిపోయేలా...

- కృత్రిమ మేధ సాయంతో పాఠాలు నేర్పించేలా రూపకల్పన
- ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్ పాఠ్యాంశాలు అందుబాటులోకి
- 1 నుంచి 8వ తరగతి వరకూ పుస్తకాలు...

సాక్షి, సిటీబ్యూరో: ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయి.. ఏం చదివినా గుర్తు ఉండట్లేదు. పుస్తకాలు ముందేసుకుని బట్టీ పట్టాల్సిందేనా.. బట్టీ పట్టినా అప్పటివరకే మళ్లీ గుర్తుకు వస్తుంటుందో కూడా తెలియదు.. అదే ప్రతి పాఠం కూడా కళ్ల ముందు కదులుతూ ఉంటే ఎంత చక్కగా గుర్తుంటుందో కదూ.. మరి పాఠాలు ఎలా కదులుతాయనే కదా మీ అనుమానం. దానికి పెద్దగా ఆలోచించాల్సిన పని లేదు.. మేమున్నాం అంటూ వచ్చేసింది 'లీడ్' అనే సంస్థ. ఎడ్‌టెక్ కంపెనీ అయిన ఈ లీడ్.. తాజాగా స్కూల్ పిల్లల కోసం వినూత్న ఆవిష్కరణ చేసింది. టెక్ బుక్ పేరిట సరికొత్త పుస్తకాలను పిల్లల కోసం అందుబాటులోకి తెచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పుస్తకాలను లీడ్ సంస్థ వ్యవస్థాపకుడు సుమిత్ మెహతా ఆవిష్కరించారు.



విప్లవాత్మక మార్పు..

పిల్లలు పాఠాలు నేర్చుకునే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో లీడ్ సంస్థ కృత్రిమ మేధ సాయంతో పలు పరిశోధనలు చేసి ఈ పుస్తకాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సుమిత్ మెహతా వివరించారు. ఈ టెక్ బుక్ సాయంతో పిల్లలు సులువుగా కాన్సెప్ట్‌లను నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే వారు ఎంతవరకూ నేర్చుకున్నారనే విషయాన్ని కూడా అంచనా వేయొచ్చని చెప్పారు. ఇందుకోసం ఓ యాప్ రూపొందించామని, పుస్తకంలోని ఏదైనా టాపిక్‌పై స్కాన్ చేస్తే దానికి సంబంధించిన వీడియో, ఆడియో (త్రీడీ) రూపంలో పిల్లలకు కనిపిస్తాయని తెలిపారు. అయితే ఇప్పుడు కేవలం స్కూళ్లకు అందుబాటులో ఉంచామని, త్వరలోనే రిటైల్‌గా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. దీని ద్వారా తరగతి గదుల్లో పిల్లలకు సులువుగా పాఠాలు చెప్పడమే కాకుండా విద్యార్థి అర్థం చేసుకున్న తీరును కూడా విశ్లేషించే వీలు కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం స్కూళ్లలో బోధిస్తున్న సిలబస్ ప్రకారమే తాము కూడా టెక్ బుక్స్‌ను రూపొందించామని, టెక్‌బుక్‌తో కర్రిక్యులమ్‌లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవన్నారు. వచ్చే మూడేళ్లలో తెలంగాణ, ఏపీలోని ప్రధాన నగరాల్లోని 500 స్కూళ్లతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా మరిన్ని పాఠశాలలకు సేవలందించేందుకు ప్రయత్నిస్తున్నామని సుమీత్ పేర్కొన్నారు. ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), ఇండిపెండెంట్ రీడింగ్ అసిస్టెన్స్, పర్సనలైజ్డ్ ఇంటరాక్టివ్ ఎక్సర్‌సైజ్ అనే సాంకేతికతల సాయంతో ఈ యాప్ పనిచేస్తుందని ఆయన వివరించారు.

జలవిద్యుత్ ఉత్పత్తిపై కృష్ణాబోర్డు సీరియస్!

- పోటీపడి శ్రీశైలం, సాగర్ ఖాళీ చేస్తున్న తెలుగు రాష్ట్రాలు
- విద్యుదుత్పత్తి నిలిపేయాలంటూ చేసిన సూచనను పెడచెవిన పెట్టడంతో ఆర్‌ఎంసీ సమావేశం నిర్వహించాలని బోర్డు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు జలవిద్యుదుత్పత్తితో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలను పోటీపడి ఖాళీ చేస్తుండటంపై కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) తీవ్రంగా స్పందించింది. విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసి తాగు, సాగునీటి అవసరాలకు జలాశయాల్లోని నిల్వలను పరిరక్షించాలని ఇటీవల చేసిన సూచనను రెండు రాష్ట్రాలు పెడచెవిన పెట్టడంతో బోర్డు చర్యలకు ఉపక్రమించింది. రెండు రాష్ట్రాల నీటిపారుదల అధికారులతో మళ్లీ రిజర్వాయర్ నిర్వహణ కమిటీ (ఆర్‌ఎంసీ) సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా ఈ సమావేశం నిర్వహిస్తామని బోర్డు సభ్యుడు ఆర్‌ఎన్ శంఖువా ఇరు రాష్ట్రాలకు లేఖ రాయగా, ఏపీ విజ్ఞప్తితో వాయిదా పడింది. 25వ తేదీ తర్వాత ఈ సమావేశం జరగనుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వల పర్యవేక్షణ కోసం జలవిద్యుత్ కేంద్రాల నిర్వహణకు మార్గదర్శకాలను ఖరారు చేయడం ఆర్‌ఎంసీ భేటీ ప్రధాన ఉద్దేశం. దీనితో పాటు మరో రెండు బాధ్యతలను ఆర్‌ఎంసీకి గతంలో కృష్ణా బోర్డు అప్పగించింది. శ్రీశైలం, సాగర్ నిర్వ హణకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రూపొందించిన ముసాయిదా నిబంధనలను పరిశీలించి అవసరమైన సవరణలతో తుదిరూపు ఇవ్వడం, జలాశయాలన్నీ నిండిన తర్వాత రెండు రాష్ట్రాలు జరిపే మిగులు జలాల వినియోగాన్ని లెక్కల్లోకి తీసుకోకుండా మినహాయింపు కల్పించడంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఆర్‌ఎంసీని కోరింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌ఎంసీ పలుదఫాలుగా సమావేశమై చర్చలు జరిపినా ఏకాభిప్రాయం కుదరలేదు. మళ్లీ ఏడాదికి పైగా విరామం తర్వాత కృష్ణా బోర్డు ఆర్‌ఎంసీ సమావేశాన్ని తలపెట్టడం గమనార్హం.

21న కృష్ణా బోర్డు సమావేశం

కృష్ణా బోర్డు 19వ సమావేశం ఈ నెల 21న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. బోర్డు చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు.

పట్టిసీమపై ఖర్చు సంగతేంటి?

- పోలవరం పూర్తయితే దాని ఉపయోగం ఉండదు కదా?
- కృష్ణా ట్రిబ్యునల్–2 క్రాస్ ఎగ్జామినేషన్‌లో తెలంగాణ న్యాయవాది ప్రశ్న
- ఏపీ తరఫున నో కామెంట్ అని బదులిచ్చిన సీడబ్ల్యూసీ మాజీ డైరెక్టర్
- తెలంగాణ మైనర్, మీడియం ఇరిగేషన్ అవసరాలకు రక్షణ ఉందని అంగీకారం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ద్వారా నికర జలాల సరఫరా ప్రారంభమైతే పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల మళ్లింపు ఉండదని ఏపీ ప్రభుత్వ తరఫు సాక్షిగా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) మాజీ డైరెక్టర్ అనిల్‌కుమార్ గోయల్ స్పష్టం చేశారు. అయితే, పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేసిన రూ.1,300 కోట్ల పరిస్థితి ఏమిటని తెలంగాణ తరఫు న్యాయవాది ప్రశ్నించగా, నోకామెంట్ అని బదులిచ్చారు. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 గురువారం రెండో రోజు ఢిల్లీలో నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో తెలంగాణ న్యాయవాది పాల్గొన్నారు. కేంద్రం జారీ చేసిన అదనపు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల సమ పంపిణీకి ట్రిబ్యునల్ విచారణ నిర్వహిస్తోంది. తెలంగాణలో మైనర్, మీడియం ఇరిగేషన్ అవసరాలకోసం 137.05 టీఎంసీల వినియోగానికి రక్షణ ఉందని ఓ ప్రశ్నకు అనిల్‌కుమార్ గోయల్ బదులిచ్చారు. కృష్ణా డెల్టా ఆయకట్టు నీటి అవసరాలు 152.2 టీఎంసీల నుంచి 132.9 టీఎంసీలకు తగ్గిపోయాయని.. ప్రాజెక్టు ఆధునీకీకరణ నివేదికలో పేర్కొన్న విషయం వాస్తవమే అయినా, సీడబ్ల్యూసీ తుది ఆమోదం ప్రకారం 155.4 టీఎంసీలు అవసరమని తెలిపారు. సరైన అధ్యయనాలు చేయకుండానే శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణకు మార్గదర్శకాలు (ఆపరేషన్ ప్రొటోకాల్స్) రూపొందించారని, వాటికి ఎలాంటి విలువ లేదని తెలంగాణ న్యాయవాది వాదించగా, అది అవాస్తవమని అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రశ్నించే స్వరం వినిపించకూడదా?

మీ మోసాలు, అక్రమాలు, వైఫల్యాలను నిలదీస్తే అక్రమ కేసులా? • చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కూటమి సర్కారు అక్రమాలు, మోసాలు, వైఫల్యాలపై ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తుండటం.. సామాజిక స్పృహ ఉన్నవారు, సోషల్ మీడియా కార్యకర్తలు నిలదీస్తుండటంతో సీఎం చంద్రబాబు తట్టుకోలేక ప్రశ్నించే స్వరం వినిపిస్తే చాలు అక్రమ కేసులు బనాయించి నిర్బంధిస్తున్నా రని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా కార్యకర్తలను హింసిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. రాష్ట్రంలో చీకటి రోజులు నడుస్తున్నాయని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసు సోదరులారా.. న్యాయం, ధర్మం వైపు నిలబడాలని సూచించారు. పోలీసులు టోపీపై కన్పించే మూడు సింహాలకు సెల్యూట్ చేయాలే గానీ రాజకీయ నాయకుల చెప్పినట్టు తప్పుడు కేసులు బనాయిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎల్లకాలం ఈ ప్రభుత్వమే అధికారంలో ఉండదనే విషయాన్ని గుర్తెరిగి పోలీసులు బాధ్యతతో నడుచుకోవాలని హితవు పలికారు. రిటైర్ అయిన తర్వాత వెళ్లిపోతాం అని అనుకుంటున్నారేమో..! సప్త సముద్రాల అవతల ఉన్నా రప్పించి చట్టం ముందు దోషులుగా నిలబెడతామన్నారు. దొంగ కేసులు పెడుతున్న ప్రతి పోలీస్ అధికారిపై ప్రైవేటు కంప్లైంట్లు ఫైల్ చేస్తామన్నారు. ప్రతి బాధితుడికి వైఎస్సార్ సీపీ న్యాయ సహాయం అందిస్తుందని భరోసానిచ్చారు. ఎన్నికల్లో మీరు చెప్పిన సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్‌లు ఏమయ్యాయని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపానికి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు. వారం రోజుల్లో దాదాపు 101 మంది సోషల్ మీడియా కార్యకర్త లను అక్రమంగా అరెస్టు చేశారని.. సుప్రీం కోర్టు తీర్పులను సైతం అవహేళన చేస్తున్నారని మండిప డ్డారు. తన కుటుంబ సభ్యులపై సైతం దుష్ప్రచారా నికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా చిన్నారుల, మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగు తుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? ప్రశ్నించే స్వరాలు ఉండకూడదా? అని నిలదీశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.



ఈ రోజు బాధితులంతా.. రేపు రెడ్ బుక్ పెట్టుకుంటారు...

పోలీసు అంటే గౌరవం ఉండాలి. వ్యవస్థలు బతకాలి. అధికారాలు మారుతుంటాయి. కానీ వ్యవస్థలు నీరుగారిపోకూడదు. రాజకీయ నాయకులు చెబుతున్నారని తెలిసి కూడా తప్పులు చేయడం పోలీసులకు మంచిది కాదు. తెలిసి కూడా తప్పు చేస్తే ప్రతి బాధితుడి ఉసురు మీకు తగులుతుంది. తిరుపతిలో సుబ్బారాయుడు ఉన్నాడు. చంద్రబాబు తెలంగాణ నుంచి డిప్యూటేషన్‌పై తెచ్చుకున్నాడు. ఆ తర్వాత తెలంగాణ వెళ్లిపోతామని అనుకుంటు న్నారేమో? తెలంగాణ నుంచి మళ్లీ పిలిపిస్తాం. సప్త సముద్రాల అవతల ఉన్నా కూడా రప్పిస్తాం. రెడ్ బుక్ పెట్టుకోవడం పెద్ద పనికాదు. ఈ రోజు నష్టపో యిన బాధిత కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ రెడ్ బుక్ పెట్టుకుంటారు. వాళ్లందరూ నా దగ్గరకు వచ్చి గ్రీవెన్స్ చెబుతారు. అప్పుడు నేను చూస్తూ ఊరుకోను.

పార్టీ కార్యకర్తలా డీజీపీ మాటలు..

డీజీపీ చట్టం, న్యాయం వైపు నిలబడాలి. ఇప్పుడున్న డీజీపీ మా హయాంలో ఆర్టీసీ సీఎండీ స్థానంలో పని చేశారు. మంచి పదవి ఇచ్చి బాగా చూసుకున్నాం. కానీ ఈరోజు ఏ స్థాయికి దిగజారిపోయారంటే.. లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిన పరిస్థితులు కనిపిస్తుంటే.. ఆయన అధికార పార్టీ కార్యకర్తలా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వంలో పోలీసులు సరిగా పనిచేయలేదని చెబుతున్నాడు. మరి ఆయన కూడా ఆ ప్రభుత్వంలో పనిచేశాడు కదా? మరి ఇప్పటి ప్రభుత్వం సవ్యంగా, బ్రహ్మాండంగా పని చేస్తోందా? ఆయన డీజీపీగా ఉన్న ప్రభుత్వం సవ్యంగా పని చేస్తే.. ఇన్ని హత్యలు ఎందుకు జరుగుతున్నాయి? ఎందుకు దొంగ కేసులు పెడుతున్నారు? 5 నెలలు తిరగక ముందే 91 మంది అక్క చెల్లెమ్మల మీద ఎందుకు అత్యాచారాలు జరిగాయి? ఎందుకు ఏడుగురు మహిళలు చనిపోయారు? చివరకు ప్రజల తరపున గొంతు విప్పుతున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను ఎందుకు అక్రమ నిర్బంధాలు చేస్తున్నారు?

వారిని ఎందుకు అరెస్టు చేయరు?

రెండేళ్ల క్రితం మా అమ్మ కారు టైర్ బరస్ట్ అయితే.. ఇది ఈరోజు కొత్తగా జరిగినట్లుగా చిత్రీకరించి.. తల్లిని చంపడానికి జగన్ ప్రయత్నించాడని టీడీపీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో వికృత ప్రచారం చేశారు. ఇది ఫేక్ న్యూస్ కాదా..? అది తప్పుడు కథనం అని మా అమ్మ విజయమ్మ లేఖ విడుదల చేస్తే.. ఆ లేఖను కూడా ఫేక్ లెటర్‌గా చిత్రీకరిస్తూ టీడీపీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో దుష్ప్రచారం చేయడం వాస్తవం కాదా? చివరకు మా అమ్మ వీడియో ద్వారా టీడీపీ దుష్ప్రచారాన్ని ఖండించారు. నా వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టీడీపీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తప్పుడు ప్రచారం చేస్తున్న చంద్రబా బును ఎందుకు అరెస్టు చేయడం లేదు? లోకేష్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? కడప ఎస్పీకి నా భార్య ఫోన్ చేసిందని ఆంధ్రజ్యోతిలో వార్త రాశా రు. అది తప్పుడు వార్త కాదా? ఆంధ్రజ్యోతి రాధా కృష్ణను ఎందుకు లోపల వేయరు? 'డీజీపీ..! పోలీ సు సోదరులారా..! మీ అందరికీ ఒకటే చెబు తున్నా. సీఎం చంద్రబాబు, లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడం మీ వృత్తిని మీరే కించపరిచి నట్లు అవుతుంది. ఎల్లకాలం ఈ ప్రభుత్వమే ఉండ దు.. జమిలి ఎన్నికలు వచ్చినా.. నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చేది మేమే.. తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా నిర్బంధించిన పోలీసు అధికారులు ఎక్కడున్నా వదలిపెట్టం.

ప్రశ్నిస్తే.. కేసులు, అక్రమ నిర్బంధాలా?

- విజయవాడలో వరదల నియంత్రణ, సహాయ చర్యల్లో ముఖ్యమంత్రి సహా యంత్రాంగం దారుణ వైఫల్యం చెందడంపై ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలు. వరద సహాయం పేరుతో కోట్లాది రూపాయలు మింగేసే చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పు డు కేసులు, అక్రమ నిర్బంధాలు. 1.50 కోట్ల మందికి ఆహారం అందించడానికి రూ.534 కోట్లు..! కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, మొబైల్ జనరేటర్లపై రూ.23 కోట్లు కొట్టేశారు అని అందరూ మాట్లాడారు. నీళ్లు ఉన్నప్పుడు అక్కడకు ఎలా వెళ్లారు? కరెంట్ ఇచ్చారో లేదో అందరికీ తెలుసు. కానీ.. ఈ అక్రమాలపై ప్రశ్నిస్తే చాలు అక్రమ నిర్బంధాలు. మహిళలు, బాలికలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే.. వాటిపై ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలు. ఎమ్మెల్యేలు, వారి మనుషులు రౌడీల్లా దౌర్జన్యం చేస్తుండటంపై ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలు.
- ఇసుక ఉచితంగా ఇస్తామన్నారు.. ఇప్పుడు ఇసుక ధరలు చూస్తే రెట్టింపు అయ్యాయి. ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయని ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలు. రేట్లు తగ్గిస్తామని చెప్పిన మద్యంపై ఒక్క పైసా కూడా తగ్గించకుండా, పైపెచ్చు సిండికేట్లుగా మారి ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు అమ్ముతుండటంపై ప్రశ్నిస్తుంటే కేసులు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం షాపులను ప్రైవేటు వారికి ఎందుకు అప్పగించారయ్యా? అని ప్రశ్నిస్తే కేసులు. అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామన్నారు కదా..! కానీ 5నెలలు కాకమునుపే ప్రజ లపై దాదాపు రూ.6 వేల కోట్ల భారం మోపారు. మరో రూ.11 వేల కోట్లు అదనంగా బాదేందుకు సిద్ధం కావడంపై ప్రశ్నిస్తే.. మళ్లీ అక్రమ నిర్బంధాలు.

మీరు వస్తే సంపద సృష్టిస్తామన్నారు కదా..?

ప్రజల కోసం జగన్ సృష్టించిన సంపదను ఎందుకు అమ్మేస్తున్నారు? మీ స్కామ్‌ల కోసం కొత్తగా కడుతున్న మెడికల్ కళాశాలలను అమ్మేస్తున్నారు. 3 ప్రైవేటు పోర్టులు..అందులో ఒకటి 80%, రెండు 50% పూర్తయ్యాయి.. వాటి నిర్మాణానికి నిధుల కొరత కూడా లేకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. ఇవన్నీ వస్తే కదా ప్రభుత్వాదాయాలు పెరుగుతాయి. ప్రభుత్వ సంపద పెరుగుతుంది. ఇటువంటివి ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నిస్తే.. అక్రమ నిర్బంధాలు. (సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు నమోదు చేసిన కొన్ని ఎఫ్‌ఐఆర్‌లను వైఎస్ జగన్ చదివి వినిపించారు..)

వారం రోజుల్లో.. 101 మంది అరెస్టు

వారం రోజులుగా దాదాపు 101 మంది సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు సంబంధించి సుప్రీం కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. పోలీ సులు ఇష్టమొచ్చినట్లు ఇంటికొచ్చి అరెస్టులు చేయ కూడదు. ముందు 41 ఏ నోటీసు ఇచ్చి విచారణ చేయాలి. ఒకవేళ నిజంగా అరెస్ట్ చేయాల్సి వస్తే వారంట్ జారీ చేయాలి. తర్వాత మెజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలి. ఇది సుప్రీంకోర్టు తీర్పు సారాంశం (అమేష్ కుమార్ వర్సస్ బిహార్ కేసులో 2014 జూలై 2న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును చదివి వినిపించారు). కానీ మన రాష్ట్రంలో ఈరోజు ఏం జరుగుతోంది? తప్పుడు కేసులు.. అక్రమ నిర్బంధాలు.. అరెస్ట్ చేసే అధికారం లేదని పోలీసులకు తెలుసు. 41 ఏ నోటీసు మాత్రమే ఇవ్వాలని తెలుసు. ఒక వేళ అరెస్ట్ చేయాల్సి వస్తే వారంట్ జారీ చేయాలి. మేజిస్ట్రేట్‌మెంట్ అనుమతి తీసుకో వాలి. ఇదీ పద్ధతి. కానీ.. ఎవరైనా ప్రభుత్వంపై గొంతు విప్పితే చాలు.. రాత్రికి రాత్రే.. తెల్లవారు ఝామున వారి ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకుంటు న్నారు. కుటుంబ సభ్యులను వేధిస్తున్నారు. గంటల తరబడి.. కొన్ని సమయాల్లో 2,3 రోజులు పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధిస్తున్నారు. కొట్టడం, తిట్టడం, అవమానించడం చేస్తున్నారు. ఒక వ్యక్తిపై ఏకకాలంలో పలు స్టేషన్‌లలో టీడీపీ సానుభూతిపరులతో కేసులు పెట్టిస్తూ అరెస్టు చేస్తున్నారు. 2,3 స్టేషన్లు తిప్పుతున్నారు. పోలీసుల తీరుపై స్థానికులు తిరగబడితే మరో కేసు పెట్టి అరెస్ట్ చేస్తున్నారు. ఎవరైనా అందుబాటులో లేకపోతే వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తీసుకొస్తున్నారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తీసుకొచ్చే అధికారం ఏ పోలీస్‌కూ లేదు. సీఎం, ఆయన కుమారుడు, డిప్యూటీ సీఎం మాట్లాడిన మాటలు గమనిస్తే డీజీపీపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు స్పష్టమవుతోంది. దాంతో డీజీపీ దగ్గరుండి కేసులు పెట్టించి.. అక్రమ నిర్బంధాలు చేయిస్తున్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న స్వరాలపై కేసులు పెట్టించే స్థాయికి, తట్టుకోలేని స్థాయికి వెళ్లిపోయారు.

బాధితులకు తోడుగా న్యాయ పోరాటం

ప్రభుత్వం తరఫున అన్యాయంగా బాధలకు గురైన సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రత్యేకంగా న్యాయ సహాయం అందించేందుకు ఫోన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చాం. మీ తరఫున పోరాటం చేయడానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉంది. సోషల్ మీడియా పరంగా మా మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ సుధాకర్ అండగా ఉండి కోర్టులో పోరాటం చేస్తారు. పూర్తిగా ప్రైవేటు కంప్లైంట్లు వేసే కార్యక్రమంలో తోడుగా ఉంటారు. వైఎస్సార్ సీపీ 'వియ్ స్టాండ్ ఫర్ ట్రూత్' నినాదంతో ఎక్స్‌లో యాష్ ట్యాగ్‌తో ముందుకెళ్తోంది. ఇవీ టెలిఫోన్ నంబర్లు.. జి.సుదర్శన్ రెడ్డి (సీనియర్ న్యాయవాది) **9440284455**, కొమ్మూరి కనకారావు (మాజీ చైర్మన్, మాదిగ కార్పొరేషన్) **9963425526**, దొడ్డా అంజిరెడ్డి (రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్) **9912205535**


అగ్రిగోల్డ్ కేసులో అనుబంధ చార్జిషీట్

పీఎంఎల్‌ఏ కోర్టులో దాఖలు చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్ సహా అగ్రి గోల్డ్ ఎగ్జిమ్స్ లిమిటెడ్, అమృతవర్షిణి డెయిరీ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అవ్వాస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, మాతాంగి ఇన్‌ఫ్రా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శక్తి టింబర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అవ్వా సీతారామారావు, సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, శాంక్చురీ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 నిబంధనల ప్రకారం పీఎంఎల్‌ఏ కోర్టులో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌ను న్యాయస్థానం అనుమతించింది. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్–నికోబార్ సహా పలు రాష్ట్రాల పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో దాదాపు 19 లక్షల మంది కస్టమర్లు, 32 లక్షల మంది ఖాతా దారుల నుంచి అధిక రాబడి, రెసిడెన్షియల్ ప్లాట్లు ఇస్తామంటూ డిపాజిట్లు సేకరించినట్టు అగ్రిగోల్డ్‌పై ఆరోపణలున్నాయి. డిపాజిటర్ల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోద య్యాయి. మొత్తం 32 లక్షల ఖాతాదారుల నుంచి రూ.6,380 కోట్లు వసూలు చేసినట్టు ఈడీ గుర్తించింది. పలు రాష్ట్రాల్లో రూ.4,141.33 కోట్ల ఆస్తు లను అటాచ్ చేసింది. అవ్వా వెంకటరామారావు, అవ్వా వెంకట శేషు నారాయణరావు, అవ్వా హేమ సుందర వరప్రసాద్‌లను డిసెంబర్ 2020లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఆగిపోయిన 'తోపుడుబండి'

- తోపుడుబండి ఫౌండేషన్ స్థాపకుడు సాదిక్ అలీ మృతి
- పేద విద్యార్థుల ఉన్నతికి విస్తృతంగా కార్యక్రమాలు
- ఖమ్మం జిల్లా కల్లూరులో అంత్యక్రియలు పూర్తి



తోపుడు బండిపై పుస్తకాలు తీసుకెళ్తూ విద్యార్థులతో మాట్లాడుతున్న సాదిక్‌అలీ (ఫైల్)

సాక్షి హైదరాబాద్/కల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుతో పేద విద్యార్థుల చదు వులకు చేయూతనందించేందుకు 'తోపుడుబండి ఫౌండేషన్'ను ఏర్పాటుచేసిన ఖమ్మం జిల్లా కల్లూరు కు చెందిన జర్నలిస్టు ఎస్.కే.సాదిక్ అలీ (65) గురువారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో ఆయన మృతి చెందగా, మృతదేహాన్ని కల్లూరుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కల్లూరుకే చెందిన ఉషా దయాల్‌ను సాధిక్ అలీ ప్రేమ వివాహం చేసుకోగా ఆమె అగ్రికల్చర్ జేడీఏగా విధులు నిర్వహిస్తున్నారు.

మూడు జిల్లాల్లో సేవలు

తోపుడుబండి పేరిట సేవా సంస్థను ఏర్పాటుచేసిన సాధిక్ అలీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా తొలినాళ్లలో తోపుడు బండిపై పుస్తకాలు తీసుకెళ్లి గ్రంథాలయం మాదిరి చదివించేవారు. ఆ తర్వాత హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పలు పాఠశాలలకు పుస్తకాలు, డిక్షనరీలు, స్టడీ మెటీరియల్ సమకూర్చారు. అంతేకాక విద్యార్థులకు టైలు, బెల్టులు, షూ, సైకిళ్లు, వీల్ చైర్లు పంపిణీ చేశారు. దేశ, విదేశాల్లోని స్నేహితులు, ఎన్‌ఆర్‌ఐల సహకారంతో విరాళాలు సేకరించి విద్యాభివృద్ధికి కృషి చేశారు. కరోనా సమయంలో బాధితులకు పౌష్టికాహారం అందించారు. ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్లు సాధించిన పేద విద్యార్థులకు రూ.లక్షల్లో ఆర్థికసాయం చేశారు. కల్లూరు ప్రభుత్వ కళాశాల ఆవరణలో నిర్మించిన మినీ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు సైతం దుస్తులు, ఆర్థిక సాయం, భోజనాల ఏర్పాటు, క్రీడా సామగ్రిని తోపుడుబండి ఫౌండేషన్ ద్వారా సాధిక్ అలీ సమకూర్చారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో ఆయన ఏర్పాటు చేసే తోపుడు బండికి ప్రతి సంవత్సరం విశేషమైన ఆదరణ లభించేది.

చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారా? లేదా?

'మార్గదర్శి'కి తెలంగాణ హైకోర్టు సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి, సాక్షి, హైదరాబాద్

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి అక్రమంగా రూ.వేల కోట్లు వసూలు చేసిన వ్యవహారంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ని ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు గురువారం కీలక, ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రజల నుంచి వసూలు చేసిన ఆ డిపాజిట్లను తాము వెనక్కి ఇచ్చేశామని పలుమార్లు చెప్పిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కి న్యాయస్థానం గట్టి కౌంటర్ ఇచ్చింది. 'డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారు సరే..! అసలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడమే నిబంధనలకు విరుద్ధమని ఆర్‌బీఐ చెబుతోంది కదా? వసూలు చేసిన డిపాజిట్లను వెనక్కి ఇచ్చేయడం వేరు.. చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేయడం వేరు. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది. డిపాజిట్ల వసూలు చట్ట విరుద్ధంగా జరిగిందా.. లేదా? అలా వసూలు చేయడం చేయడం నేరమా? కాదా? అన్నదే ముఖ్యం. కాబట్టి తుది విచారణలో ఈ విషయాన్ని కూడా తేలుస్తాం...' అని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు సమక్షంలో గతంలో ఉండవల్లి అరుణ్ కుమార్‌కు భౌతిక రూపంలో అందచేసిన డిపాజిటర్ల వివరాలను పెన్‌డ్రైవ్ ద్వారా కూడా ఇవ్వాలని మార్గదర్శిని ఆదేశించింది. తాము పెన్‌డ్రైవ్‌లో ఇవ్వాల్సిన అవసరం లేదన్న మార్గదర్శి వాదనను తోసిపుచ్చింది. ఈ కేసులో కోర్టుకు సహకరించేందుకు ఉండవల్లికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందని హైకోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన కోర్టుకు సరైన రీతిలో సహకరించాలంటే డిపాజిటర్ల వివరాలను పెన్‌డ్రైవ్‌లో ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. తద్వారా సాంకేతికత సాయంతో డిపాజిటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి కోర్టుకు తగిన రీతిలో సహకరించేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొంది. అయినా పెన్‌డ్రైవ్‌లో ఇవ్వాలని చెబుతున్న సమాచారం ఏమీ కొత్తది కాదని, ఆ వివరాలను ఇప్పటికే భౌతికంగా ఉండవల్లికి అందచేశారని గుర్తు చేసింది. మార్గదర్శి పెన్‌డ్రైవ్‌లో ఇచ్చే వివరాలను ఈ కేసు కోసం మినహా మరే రకంగానూ ఉపయోగించడానికి వీల్లేదని ఈ సందర్భంగా ఉండవల్లిని హైకోర్టు ఆదేశించింది. అలాగే మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. మార్గదర్శి – ఆర్‌బీఐకి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కోర్టు ముందుంచిన నేపథ్యంలో వాటికి సంబంధించి పూర్తి వివరాలతో అదనపు కౌంటర్ దాఖలు చేస్తామన్న ఆర్‌బీఐ సీనియర్ న్యాయవాది అభ్యర్థనను హైకోర్టు అనుమతించింది. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌బీఐ కౌంటర్లు దాఖలు చేయడం, వాటికి సమాధానం ఇవ్వడం లాంటి ప్రక్రియ అంతా డిసెంబర్ 20 కల్లా పూర్తి చేసి తీరాలని ఇరుపక్షాలను హైకోర్టు ఆదేశించింది. ఆ తేదీ తరువాత దాఖలు చేసే ఏ డాక్యుమెంట్లనూ తీసుకోబోమని పేర్కొంటూ తదుపరి విచారణను 2025 జనవరి 3వతేదీకి వాయిదా వేసింది. అదే రోజు ఈ వ్యాజ్యాలపై తుది విచారణ తేదీని ఖరారు చేస్తామని ప్రకటించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ హెచ్‌యూఎఫ్ కర్తగా ఉన్న రామోజీరావు మరణించినందున ఆ స్థానంలో తనను కర్తగా చేర్చాలంటూ ఆయన కుమారుడు కిరణ్ దాఖలు చేసిన సబ్‌స్టిట్యూట్ పిటిషన్లను అనుమతిస్తున్నట్లు తెలిపింది. ఈమేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

'సుప్రీం' ఆదేశాలతో తిరిగి విచారణ..

➤ ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టివేస్తూ 2018 డిసెంబర్ 31న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశాయి. హైకోర్టు తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రామోజీ, మార్గదర్శి వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును తప్పుపడుతూ దాన్ని రద్దు చేసింది. ఈ క్రమంలో సుప్రీం ఆదేశాల మేరకు ఈ కేసును తెలంగాణ హైకోర్టు తిరిగి విచారణకు చేపట్టింది.

వెనక్కి ఇచ్చేశాం: లూథ్రా

➤ మార్గదర్శి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తాజాగా వాదనలు వినిపిస్తూ సేకరించిన డిపాజిట్లలో 99.8 శాతం మొత్తాలను వెనక్కి ఇచ్చేసినట్లు చెప్పారు. రూ.5.33 కోట్లను ఎవరూ క్లెయిమ్ చేయనందున ఎస్క్రో ఖాతాల్లో ఉంచామన్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్‌ను న్యాయస్థానానికి సహకరించాలని మాత్రమే సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఈ సమయంలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా కౌంటర్లు దాఖలు చేయలేదా? అని ధర్మాసనం ప్రశ్నించడంతో తాము కౌంటర్ దాఖలు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వరరావు నివేదించారు. అదనపు కౌంటర్ దాఖలు చేస్తామని ఆర్‌బీఐ తరఫు సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణన్ రవిచందర్ కోరడంతో ధర్మాసనం అంగీకరించింది. అనంతరం లూథ్రా వాదనలను కొనసాగిస్తూ.. అప్పటి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా కథనాలు రాశామని తమపై కేసు దాఖలు చేశారని, అయితే 2007 నుంచి ఏ డిపాజిటర్ కూడా తాము డిపాజిట్లు తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదు చేయలేదన్నారు. తాము వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించకుండా ఎగవేశామా? అనే విషయాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు చెప్పాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్‌బీఐ కౌంటర్ దాఖలు చేసిన తరువాత పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. వసూలు చేసిన డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశామంటూ మీరు సమర్పించిన వివరాలతో సుప్రీంకోర్టు సంతృప్తి చెందలేదని, అందుకే ఈ వ్యవహారాన్ని మళ్లీ తేల్చాలని వెనక్కి పంపిందని లూథ్రానుద్దేశించి ధర్మాసనం పేర్కొంది. ఈ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ జోక్యం చేసుకుంటూ చందాదారుల వివరాలను మార్గదర్శి ఫైనాన్షియర్స్ పెన్‌డ్రైవ్‌లో ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే పెన్‌డ్రైవ్‌ను ఉండవల్లికి ఇవ్వడానికి వీల్లేదంటూ లూథ్రా వాదించారు. అలా ఇవ్వడం ఐటీ చట్ట నిబంధనలకు విరుద్ధమని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నాలుగు వారాల్లో అదనపు కౌంటర్ దాఖలు చేయాలని ఆర్‌బీఐని ధర్మాసనం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఆ కౌంటర్లకు సమాధానం దాఖలు చేయాలనుకుంటే చేయవచ్చునని, కానీ మొత్తం ప్రక్రియను డిసెంబర్ 20 నాటికి పూర్తి చేసి తీరాలని ఇరుపక్షాల న్యాయవాదులకు ధర్మాసనం తేల్చి చెబుతూ విచారణను జనవరి 3కి వాయిదా వేసింది.

ఉండవల్లికి పెన్‌డ్రైవ్!

మార్గదర్శికి హైకోర్టు ఆదేశం



➤ 'అరుణ్‌కుమార్‌కు సుప్రీంకోర్టు చందాదారుల వివరాలతో కూడిన హార్డ్ కాపీలు ఇచ్చిన అంశాన్ని లూథ్రా తోసిపుచ్చలేదు. అంటే పెన్‌డ్రైవ్‌లో ఇచ్చే వివరాలేమీ కొత్తగా ఇచ్చేవి కాదు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం– 2000 నియమ నిబంధనలు ఇక్కడ వర్తించవు. రేఖా మురార్కా (సుప్రా)లో సుప్రీంకోర్టు ఇదే అంశంపై తీర్పునిచ్చింది. అంతేకాదు.. హైకోర్టుకు సాయం చేయాలని సుప్రీంకోర్టు అరుణ్‌కుమార్‌ను సుప్రీం కోరింది. ఇందు కోసం ఆయన అడిగిన విధంగా పెన్‌డ్రైవ్‌లో వివరాలు డిసెంబర్ 15లోగా అందజేయాలని మార్గదర్శిని ఆదేశిస్తున్నాం. ఆయనను (ఉండవల్లి) ఎలా వినియోగించుకోవాలనేది మేం నిర్ణయిస్తాం. పెన్‌డ్రైవ్‌లో ఇచ్చిన డేటాను అరుణ్‌కుమార్ ఇతరులకు అందజేయకూడదు. పిటిషన్లు, కౌంటర్లు, అఫిడవిట్‌లతో రిజిస్ట్రీ ఓ ఐడెంటికల్ బుక్ తయారు చేయాలి. ఈ బుక్ కాపీలను పార్టీలతో పాటు అరుణ్‌కుమార్‌కు కూడా అందజేయాలి. దీనికయ్యే ఖర్చంతా మార్గదర్శి నుంచే రిజిస్ట్రీ వసూలు చేయాలి' అని మధ్యంతర ఉత్తర్వుల్లో తెలంగాణ హైకోర్టు పేర్కొంది.

రామోజీ చాలా శక్తిమంతుడు..

ఎస్క్రో అకౌంట్‌లోని సొమ్ములు ఎవరివి?

తాజా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అరుణ్ కుమార్ చదివి వినిపించారు. అసలైన పెట్టుబడిదారుల నుంచి అభ్యంతరాలను ఆహ్వానించవచ్చని హైకోర్టుకు సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. డిపాజిట్లు చెల్లించేశామని చెబుతున్నారని, మరి ఎస్క్రో అకౌంట్‌లో ఉన్న రూ.5.33 కోట్లు ఎవరివి? అని ప్రశ్నించారు. ఆ మొత్తాలను ఎవరూ క్లెయిమ్ చేయడం లేదని, దీన్నిబట్టి ఆ మొత్తాలు ఎవరివో సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. ఆ డిపాజిటర్లు ఎవరు? క్లెయిమ్ చేయడానికి ఎందుకు ముందుకు రావడం లేదో తేల్చాలన్నారు. చెల్లింపులు చేశామని మార్గదర్శి చెబుతున్న డిపాజిటర్లలో చాలా మంది నిజమైన డిపాజిటర్లు కాదన్న విషయాన్ని తాను నిరూపిస్తానన్నారు. మార్గదర్శి ఇచ్చిన 59 వేల పేజీల్లో కొన్నింటిని పరిశీలిస్తేనే వారు అసలైన డిపాజిటర్లు కారన్న విషయం అర్థమైందని, అందుకే పూర్తిస్థాయిలో పరిశీలన చేసేందుకు పెన్‌డ్రైవ్‌లో వివరాలు కోరుతున్నట్లు చెప్పారు. రామోజీరావు చాలా శక్తిమంతుడని, అతని శక్తి ఏమిటో అందరికీ తెలుసుని, అందుకే ఆయనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. 'మార్గదర్శిని గెలిపించడం కోసం లూథ్రా వాదిస్తున్నారు. కానీ నేను బాధితులు, చట్టం తరఫున హేమాహేమీలతో యుద్ధం చేస్తున్నా. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టి దాదాపు 5 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కౌంటర్ దాఖలు చేయలేదు. 2006 నవంబర్ 6న మార్గదర్శి ఉల్లంఘనలపై కేంద్రానికి ఫిర్యాదు చేశానని, బుధవారంతో 18 ఏళ్లు పూర్తయ్యాయి. అప్పటి నుంచి మార్గదర్శి ఈ కేసుల విచారణను సాగదీస్తూనే ఉంది' అని పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 8-11-2024

● స్ఫూర్తి



నడిపించేది నాన్న

కల నిజం అయ్యేది కష్టంతోనే. ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆఫ్రీన్ కుటుంబానికి కలలు కనేంత వెసులుబాటు లేకపోవచ్చు. అయినా సరే.... ఆ తండ్రి కల కన్నాడు. ఆయన కూతురు కల కన్నది. ఆ కల సాకారం అయింది. ఖమ్మంకు చెందిన షేక్ ఆఫ్రీన్ జాతీయ స్థాయిలో అథ్లెట్‌గా రాణిస్తోంది....

'ఇది వేరే ప్రపంచం' అనుకున్నారు అక్కాచెల్లెళ్లు సమ్రీన్, ఆఫ్రీన్.

ఆ ప్రపంచం పేరు.....స్టేడియం.

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కొందరు రన్నింగ్ చేస్తున్నారు. కొందరు జంపింగ్ చేస్తున్నారు. ఒకవైపు క్రికెట్ ఆడుతున్నారు. కొందరు వాలీబాల్ ఆడుతున్నారు. వారి ఒంటికి పట్టిన చెమటల మాట ఎలా ఉన్నా...అందరి కళ్లల్లోనూ అంతులేని ఉత్సాహం పొంగిపొర్లుతుంది.

ఆ ఉత్సాహమే పద్నాలుగు సంవత్సరాల ఆఫ్రీన్‌ను ఆ స్టేడియంకు దగ్గర చేసింది.

'పప్పా... మేము నీతో పాటు రోజూ స్టేడియంకు వస్తాం' అని అడిగారు.

ఆఫ్రీన్ తండ్రి రహీమ్ హోంగార్డ్. స్పోర్ట్స్ పర్సన్ కూడా. రోజూ తప్పకుండా స్టేడియంకు వచ్చి ఎక్సర్‌సైజ్‌లు చేయడం ఆయన దినచర్యలో భాగం.

కుమార్తె విన్నపాన్ని విన్న రహీమ్... 'అలాగే' అన్నాడు. దీనికి ముందు 'ఇక్కడికి వచ్చి ఏంచేస్తారు?' అన్నాడు నవ్వుతూ. 'మీలాగే ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం' అన్నారు సీరియస్‌గా.

'వీరిది ఒకటి రెండు రోజుల ఉత్సాహం. ఆ తరువాత అంతా మామూలే!' అనుకున్నాడు రహీమ్.

కానీ, అతడి అంచనా తప్పయింది. రకరకాల ఎక్సర్‌సైజ్‌లు చేయడం నుంచి ఆటల వరకు ఆఫ్రీన్‌కు స్టేడియం ప్రాణం అయింది. స్టేడియంకు రాని రోజూ అంటూ ఉండేది కాదు.

'ఎప్పుడూ స్టేడియంలోనే కనిపిస్తావు. ఎప్పుడు చదువుకుంటావు!' అని అడిగే వాళ్లు కొందరు.

'స్టేడియంలో కూడా చదువుకుంటూనే ఉన్నాను' అని ఆఫ్రీన్ అన్నదో లేదు తెలియదుగానీ స్టేడియంలో తాను ఆటల ప్రపంచాన్ని చదువుతోంది.

కట్ చేస్తే... షేక్ ఆఫ్రీన్ ప్రస్తుతం ఖమ్మంలోని 'కవిత మెమోరియల్ డిగ్రీ కాలేజ్'లో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువుతో పాటు అథ్లెటిక్స్‌లోనూ రాణిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ఎన్నో పతకాలు సాధించింది. ఎంతో మంది పేదింటి అమ్మాయిలకు రోల్‌మోడల్‌గా నిలుస్తోంది.

మొదట్లో కుమార్తెల ఉత్సాహానికి సంతోషపడిపోయిన రహీం ఆ ఇద్దరికి పరుగు పందెం నిర్వహించాడు. రన్నింగ్‌లో వారి ప్రతిభను చూసి 'ఈ వజ్రాలకు సానబెట్టాల్సిందే' అనుకున్నాడు.

అదే సమయంలో కోచ్ గౌస్....

'ఆఫ్రీన్‌కు శిక్షణ ఇస్తే మంచి అథ్లెట్ అవుతుంది' అన్నాడు. అతడి నోటి వాక్కు ఫలించింది.

ఆఫ్రీన్‌తో పాటు సమ్రీన్‌కూడా అథ్లెటిక్స్‌లో రాణించింది. జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంది.

– బొల్లం శ్రీనివాస్, సాక్షి, ఖమ్మం
ఫొటోలు: రాధారపు రాజు

ఆఫ్రీన్ ట్రాక్ రికార్డ్

2016లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 600 మీటర్ల పరుగులో మూడో స్థానం. 2017లో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 800 మీటర్ల పరుగులో మొదటిస్థానం. 400 మీటర్లలో రెండోస్థానంలో నిలిచింది. 2022లో జరిగిన తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 300 మీటర్ల పరుగులో ద్వితీయస్థానం. లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. 2023లో వరంగల్‌లో నిర్వహించిన సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రిపుల్‌జంప్‌లో 5వ స్థానంలో నిలిచింది. 2023లో కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ సౌత్‌జోన్‌అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రిపుల్ జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి 19 వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మిడిల్‌రిలేలో 3వ స్థానం సాధించింది.



● తల్లిదండ్రులతో ఆఫ్రీన్

ఇంకా ఎన్నో సాధించాలి...సాధిస్తాను

పోటీల్లో పాల్గొనేటప్పుడు ఆటపైనే ధ్యాస ఉంటుంది. ఫలితం గురించి ఆలోచించను. మా నాన్న కూడా అదే చెబుతారు. నీ వంతుగా శ్రమిస్తే ఓడిపోయినా ఫర్వాలేదని ధైర్యం చెబుతారు. నేను పోటీల్లో రాణించడానికి నాన్న, అమ్మ కష్టపడుతున్నారు. అమ్మ జమీలా అసలు చదువుకోలేదు. నేను అథ్లెటిక్స్‌లో పాల్గొన్న వీడియోలు చూస్తూ నన్ను అభినందిస్తోంది. దేశం తరుపున పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించాలనేదే లక్ష్యం. - షేక్ ఆఫ్రీన్

హెల్దీ డైట్

మలీద లడ్డు

కావలసినవి: చపాతీలు– 4; వేయించిన వేరుశనగపప్పుల పొడి– టీ స్పూన్; కొబ్బరి తురుము – టీ స్పూన్; బెల్లం పొడి– కప్పు; పాలు– అర కప్పు (ముద్ద చేయడానికి తగినంత); డ్రైఫ్రూట్స్ ముక్కలు– అర కప్పు; బాదం, పిస్తా, జీడిపప్పు – కప్పు (పలుకులు చేయాలి); పుచ్చకాయ గింజలు – టీ స్పూన్.



తయారీ: ● మలీద ముద్ద చేయడానికి చపాతీలను కొంచెం గట్టిగా చేసుకోవాలి. చల్లారిన తర్వాత వాటిని ఒక పాత్రలో వేసి చిన్న ముక్కలుగా, పొడిగా వచ్చేటట్లు చేత్తో నలపాలి ● మరొక పాత్రలో డ్రైఫ్రూట్ పలుకులు, బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, పుచ్చ గింజలు, కొబ్బరి తురుము, వేరుశనగపప్పుల పొడి వేసి కలపాలి. అవన్నీ సమంగా కలిసిన తరవాత బెల్లం పొడి వేసి కలపాలి. ఇప్పుడు చపాతీ ముక్కలను పొడితో సహా వేయాలి. ఈ మొత్తం సమంగా కలిసే వరకు స్పూన్‌తో కలిపి ఆ తర్వాత మిశ్రమంలో కొద్దిగా పాలను వేస్తూ ముద్ద చేయాలి. పై కొలతలతో 12 లడ్డూలు చేయవచ్చు.

గమనిక: ఈ పొడిని ఎక్కువ మొత్తంలో చేసి గాలి దూరని డబ్బాలో నిల్వ చేసుకుని ఏ రోజుకారోజు రెండు కప్పుల మిశ్రమం తీసుకుని తగినంత పాలతో ముద్ద చేసుకోవచ్చు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చేటప్పటికి మంచి బలవర్ధకమైన ఆహారం సిద్ధంగా ఉంటుంది.

పోషకాలు: హెల్దీ ఫ్యాట్, ప్రొటీన్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఒక్కో లడ్డూలో 80 కేలరీలు ఉంటాయి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్



రేపటి నుంచి ప్రత్యేక కథనాలు

పిల్లల్లారా... పాపల్లారా... స్ఫూర్తిగా నిలిచే కూనల్లారా...

ఈ ప్రపంచంలో అన్నింటి కంటే విలువైనది బాలల ముఖాల్లో విరిసే చిరునవ్వు. సూర్యుడు, చంద్రుడు ఈ భూమ్మీదకు తొంగి చూసేది పిల్లల ముఖాన చిరునవ్వును చూడటానికే. గాలి వీచేది వారి ముంగురులను అల్లరి పెట్టి ఆడటానికే. నీరు ప్రవహించేది వారు కేరింతలు కొట్టడానికే. పిల్లల్ని సంతోష పెట్టడానికే అడవులు ఆకుపచ్చను పులుముకుంటాయి. పిల్లల్ని కళ్లు ఇంతింత చేసుకుని చూడటానికే మృగాలు వింత ఆకారాలు ధరిస్తాయి. నడయాడే ఈ బుజ్జి దేవతల కోసమే భూమి క్రమం తప్పకుండా తిరుగుతూ విరగకాసే పంటలను ఇస్తూ వారి నోటికి గోరు ముద్దలు అందేలా చూడటానికి తపన పడేది. పిల్లల కోసమే కదా తల్లిదండ్రులు ఆజన్మాంతం కష్టపడేది.

అయితే అందరు పిల్లలకూ అన్ని భాగ్యాలు దొరకవు. ప్రకృతి వారికి పరీక్షలు పెడుతుంది. వారికి సవాళ్లు విసురుతుంది. అందరితో పాటే మీరు కూడా అన్నట్టుగా వారి వాటాకు తగ్గ కష్టాలు ఇస్తుంది. అయితే పిల్లలకు మించిన వీరులు ఉండరు. వారిని మించిన శూరులు ఉండారు. కాసేపు చిన్నబుచ్చుకుంటారు కాబోలు. ఆ తర్వాత వారు తమ లోపలి శక్తిని వెలికి తెస్తారు. సవాళ్లకు జవాబు చెబుతారు. పెద్దవాళ్లకే స్ఫూర్తిపాఠాలు నేర్పిస్తారు.

నవంబర్ 14 బాలల దినోత్సవం.

ఈ సందర్భంగా రేపటి నుంచి తమ జీవితాల్లోని సవాళ్లను, అనారోగ్యాలను, ఏకాకితనాలను తట్టుకుని నిలబడ్డ బుల్లి హీరోలను కలిసి వారి ఉత్సాహాన్ని తోడు చేసుకుని ఆ సంతోషాన్ని పాఠకులకు పంచాలని సంకల్పించింది సాక్షి. సినిమా రంగంలోని చైల్డ్ సెలబ్రిటీలను వారివద్దకు తీసుకెళ్లి సందడి చేసింది. ఆ సందడి రేపటి నుంచి.

ఈ కథనాలు సాక్షి ఫ్యామిలీలో, సాక్షి టీవీలో, సాక్షి డిజిటల్ మీడియాలో వెలువడతాయి. పాఠకులు ఈ చిన్నారి సైనికులను కలవాలని, వారి బాటకు మీదైన ప్రోత్సాహం అందించాలని మా కోరిక.

ప్రత్యేక కథనాల కోసం రేపు ఇక్కడే చూడండి.



ఫెస్టివల్ ఆన్ నెయిల్స్

● ఆర్ట్



ఈ రోజుల్లో ప్రతీ సందర్భాన్నీ స్పెషల్‌గానే చూస్తున్నారు. ఆ ప్రత్యేకతను తమ అలంకరణలో చూపాలనుకుంటున్నారు. వేసుకున్న డ్రెస్, శిరోజాల అలంకరణ పూర్తయినా అందానికి మరింత మెరుపును జోడించాలంటే మార్గం ఏమైనా ఉందా?! అని ఆలోచించేవారికి నెయిల్ ఆర్ట్ ఒక ప్రత్యేకతను చూపుతుంది. మల్టీకలర్స్, గ్లిటర్స్, ఆభరణాలు, పోల్కా డాట్స్‌తో పండగ థీమ్‌ని నెయిల్స్‌పైన అలంకరిస్తున్నారు.





పండగలు, వివాహాది సంప్రదాయ వేడుకలను వేషధారణలోనే కాదు గోళ్లపైన కూడా రూపుకట్టచ్చు అని నిరూపిస్తోంది నేటి తరం. వారి అభిరుచికి తగినట్టుగానే నెయిల్ ఆర్ట్ డిజైనర్లు సరికొత్త డిజైన్లకు రూపకల్పన చేస్తున్నారు.

ముందస్తుగా...

● గోళ్లపై ఉన్న పాత నెయిల్ పాలిష్‌ను తొలగించాలి ● గోళ్లను కత్తిరించి, ఆకృతిని సెట్ చేసుకోవాలి. ట్రాన్స్‌పరెంట్‌లో ఉండే బేస్ కోట్‌ను అప్లై చేయాలి ● మరకలు పడవకుండా, త్వరగా పాడవకుండా బేస్‌కోట్ గోళ్లను రక్షిస్తుంది ● బేస్‌కోట్ ఆరిన తర్వాత నచ్చిన నెయిల్ కలర్‌ని వేసుకోవచ్చు.

● నెయిల్ స్టికర్స్

గోళ్లపైన అందమైన డిజైన్ రావాలంటే మార్కెట్లో స్టికర్స్ లభిస్తున్నాయి. స్టికర్స్ గోరు మీద అతికించి, వీటి సాయంతో డిజైన్‌లో నచ్చిన మార్పులు తీసుకురావచ్చు. పాలిష్ ఆరిన తర్వాత స్టికర్స్ తీసేసి, టాప్ కోట్‌తో నెయిల్ డిజైన్‌ని పూర్తి చేయచ్చు.

● ఆభరణాల మెరుపు

నెయిల్ పాలిష్ వేసిన తర్వాత గోరుకు ఆభరణాన్ని సెట్ చేయవచ్చు. నెయిల్ జ్యువెలరీ మార్కెట్లో లభిస్తుంది. వీటి డిజైన్, నాణ్యత బట్టి ధరలు ఉంటున్నాయి. నెయిల్ గ్లూ సాయంతో ఈ ఆభరణాన్ని సెట్ చేసి, పాలిష్ పూర్తి చేసుకోవాలి. ఆభరణం పడిపోకుండా నెయిల్ టాప్ కోట్ వేయాలి.

● గ్లిటర్స్

నెయిల్ పాలిష్ వేసేటప్పుడే గ్లిటర్ మిక్స్ చేసి, గోళ్లకు అప్లై చేయాలి. గ్లిటర్, పాలిష్ ఆరిన తర్వాత ఒకసారి వేళ్లను విదిల్చాలి. అదనపు గ్లిటర్ పడిపోతుంది. పాలిష్ ఆరిన తర్వాత టాప్ కోట్ వేయాలి.

● చుక్కలు, డిజైన్లు

సందర్భాన్ని, పండగ సంప్రదాయాన్ని అనుసరించి ఆ డిజైన్ వచ్చేలా పాలిష్ బ్రష్‌ల సాయంతో నెయిల్స్‌ను డిజైన్ చేసుకోవచ్చు. ఫెస్టివల్ స్టికర్స్ కూడా మార్కెట్లో లభిస్తున్నాయి. వీటి సాయంతో పాలిష్ డిజైన్ ఎంచుకోవచ్చు. అమ్మవారి రూపాలు, దీపాలు, టపాసులు, పసుపు-కుంకుమల డిజైన్లను నెయిల్ ఆర్ట్‌లో తీసుకు వస్తున్నారు.

● విభిన్న డిజైన్లు

డిజైన్‌ను బట్టి వేలలో ధరలు ఉన్న నెయిల్ ఆర్ట్‌ను వేయించుకోలేకపోతే మార్కెట్లో అందుబాటులో ఉన్న రెడీ మేడ్ ఎక్స్‌టెన్షన్ నెయిల్ సెట్స్‌ను కొనుగోలు చేయవచ్చు. వీటిని నెయిల్స్‌కు అతికించి, బేస్‌కోట్‌ను అప్లై చేయాలి, సందర్భానికి తగిన డిజైన్‌నూ ఎంచుకోవచ్చు. వీటిలో ప్రతి పండగ సందర్భాన్ని అనుసరించి, నెయిల్ డిజైన్స్ వందల ధరల్లో లభిస్తున్నాయి. ఎక్స్‌టెన్షన్ నెయిల్స్ అన్నీ ఒకే సెట్‌లాగా ఉంటాయి. అవి అన్ని గోళ్లకు సెట్ అయ్యేలా ఉండకపోవచ్చు. ఇలాంటప్పుడు వాటిని కట్ చేయడం, డిజైన్ చేసుకోవడంపై కూడా శ్రద్ధ పెట్టాలి.

● సింగిల్ వన్

నెయిల్స్ అన్నింటిలో ఒకటి మాత్రమే ప్రత్యేకంగా ఉండేలా కూడా డిజైన్ చేయవచ్చు. అయితే, మిగతా అన్ని నెయిల్స్ శుభ్రంగా, అందంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే ఎదుటివారి చూపు మన ప్రత్యేకతను గుర్తిస్తుంది.

● లైఫ్‌స్టైల్

పేదోళ్ల వజ్రాల వేట

'కేజీఎఫ్' సినిమాలలో బంగారం వేటలో ఎంతోమంది బక్క జీవుల జీవితాలు ఆవిరైపోతాయి. అయితే అది సినిమా. 'పన్నా' అనేది మాత్రం నిజం. 'కేజీఎఫ్'లో పెద్ద విలన్‌లు పేదవాళ్లను బలవంతంగా బంగారు గనుల్లో దింపుతారు. అయితే మధ్యప్రదేశ్‌లోని పన్నాలో మాత్రం ఎంతోమంది పేదవాళ్లు స్వచ్ఛందగా వజ్రాల వేటలోకి దిగుతున్నారు. ఎంతమందిని అదృష్టం భుజం తట్టిందో తెలియదుగానీ దురదృష్టం మాత్రం వారి ఇంటి దగ్గర భద్రంగా ఉంటుంది....



'ఈరోజు నా భర్త శుభవార్తతో వస్తాడేమో' అని భర్త రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటుంది భగవతి.

'మా అబ్బాయికి విలువైన వజ్రం దొరకాలి' అని ముక్కోటి దేవతలను మొక్కుకుంటుంది సీమ.

'ఎప్పుడూ మీరే కష్టపడతారా....నేను కూడా ఈరోజు మీతో పాటు వస్తాను' అని భర్త, అత్తమామలతో పాటు వజ్రాల వేటకు వెళుతుంది ఆశ.

మత్స్యకారులు రోజూ చేపల వేటకు వెళ్లినట్లు అక్కడి ప్రజలు వజ్రాల వేటకు వెళతారు!

మధ్యప్రదేశ్‌లోని 'పన్నా' దేశంలోని అత్యంత వెనకబడిన ప్రాంతాలలో ఒకటి. నీటికొరత నుంచి నిరుద్యోగం వరకు ఎన్నో సమస్యలు ఉన్న ఈ ప్రాంతం పేదరికానికి పెట్టింది పేరు. పేదరికం మాట ఎలా ఉన్నా ఈ ప్రాంతం వజ్రాల నిల్వలకు నిలయంగా ప్రసిద్ధి పొందింది.

ఒకప్పుడు అరుదైన ఆవిష్కరణలకు ప్రసిద్ధి చెందిన పన్నాలోని వజ్రాల గనులు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. మితిమీరిన మైనింగ్ కారణంగా నిల్వలు క్షీణించాయి. అయినప్పటికీ ఆశావహ వ్యక్తులు వజ్రాల కోసం అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు.

తెల్లవారు జామునే తవ్వకాలు మొదలుపెడతారు. సూర్యాస్తమయం వరకు వజ్రాల కోసం జల్లెడ పడుతూనే ఉంటారు. ఈ పనిలో ప్రతి కుటుంబానికి వారి కుటుంబసభ్యులు సహాయంగా ఉంటారు. ఇందులో మహిళలు కూడా ఉంటారు. చాలామందికి వజ్రాల వేట అనేది తరతరాల కుటుంబ సంప్రదాయం.

'వజ్రాల గురించి వెదకని రోజు నేను అనారోగ్యానికి గురవుతాను. ఇదొక మత్తుమందులాంటిది' అంటాడు 67 సంవత్సరాల ప్రకాశ్ శర్మ.

నిజానికి ఇది ప్రకాశ్ మాటే కాదు...ఆ ప్రాంతంలోని వేలాది మంది ఆశావహుల మనసులో మాట!

చిన్న డౌట్: 'పన్నా'పై సినిమా వాళ్ల దృష్టి ఎందుకు పడలేదో? ప్చ్..!

● సోషల్ మీడియా

తగ్గేందుకు తగ్గేదేలే!

సక్సెస్ స్టోరీలు స్ఫూర్తినిస్తాయి. ఫెయిల్యూర్ స్టోరీలు స్ఫూర్తికి ఆజ్యం పోస్తాయి. శ్వేతా కోదండన్‌ది అలాంటి ఆజ్యం పోసే స్టోరీనే! ఇంతకీ ఆమె ఏ కంపెనీకి సీఈఓ? సీఈఓ కాదు కదా కనీసం చిరుద్యోగి కూడా కాదు. ఆమె ఒక నిరుద్యోగి. లండన్‌లో ఉద్యోగం కోసం రెండేళ్లుగా పట్టువదలని విక్రమార్కుడికి ఫిమేల్ వెర్షన్‌లా ప్రయత్నాలు చేస్తూ ఉన్న ఒక మామూలు అమ్మాయి.

చదువుకోటానికి 2021లో యూకే వెళ్లింది శ్వేత. 2022లో చదువు పూర్తయింది. అప్పట్నుంచి ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆ ప్రయత్నాలు మాత్రం పూర్తి కాలేదు! 300కి పైగా ఉద్యోగాలకు అప్లై చేసింది. ఒక్కటీ రాలేదు. విసిగిపోయింది. ఆమె వీసా గడువు కూడా రెండు నెలల్లో ముగియబోతోంది.

యూకేలోనే ఉండి పోవటం శ్వేత జీవిత ధ్యేయం. ఆ ధ్యేయం నెరవేరాలంటే ఉద్యోగంతో పాటు వచ్చే వీసా ఒక్కటే ఇప్పుడు ఆమెకు ఉన్న మార్గం. కానీ ఎంతకూ ఉద్యోగం రావటం లేదు. చివరికి... జీతం లేకుండా ఉద్యోగం చేస్తానని, తనను ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఫైర్ చేయవచ్చనీ, రోజుకు 12 గంటలు కష్ట పడతానని, వీక్లీ ఆఫ్ కూడా తీసుకోననీ, ఒక నెల రోజులు తన పని తీరును గమనించమనీ లింక్డ్ ఇన్‌లో పోస్ట్ పెట్టింది. ఆ పోస్టును రీ పోస్ట్ చెయ్యమని నెటిజన్స్‌ను కోరింది. పోస్ట్ పెట్టి కూడా నెల రోజులు అవుతోంది. (పోస్ట్ పెట్టే సమయానికి ఆమె వీసాకు మూడు నెలల గడువు మాత్రమే మిగిలి ఉంది). ఇప్పటికీ శ్వేతకు ఉద్యోగం రాలేదు కానీ సోషల్ మీడియాలో ఆమెపై విమర్శలు వస్తున్నాయి. 'టాలెంట్ ఉంటే ఉద్యోగం ఎందుకు రాదు?' అని కొందరు, 'జీతం లేకుండా ఉద్యోగం చేస్తానని అడుక్కోవటం ఏమిటి?' అని ఇంకొందరు, 'నీ వల్ల నిరుద్యోగులు చీప్ అయిపోయారు' అని మరికొందరు శ్వేత ధోరణిపై చికాకు పడ్డారు. ఏ కొద్దిమందో ఆమెను సమర్థించారు. 'తనకు వీసా ముఖ్యం. అందుకోసం జీతం లేకుండా పని చేస్తానని ఆమెకై ఆమె ఆఫర్ ఇవ్వటం బ్రిలియంట్ ఐడియా...' అని అభినందించారు. శ్వేత యూకేలోని లెస్టర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ (మెకానికల్ ఇంజినీరింగ్) చేసింది. వీసా స్పాన్సర్డ్ డిజైనింగ్ ఇంజినీర్‌గా జీతం అక్కర్లేని ఉద్యోగం అడుగుతోంది. శ్వేత ఆలోచన చూస్తుంటే... 'ఎక్కడ నెగ్గాలో కాదురా, ఎక్కడ తగ్గాలో తెలిసినోడు గొప్పోడు...' అనే సినిమా డైలాగ్ గుర్తుకు రావడం లేదూ?!



● శ్వేతా కోదండన్

● బ్యూటిప్స్

చర్మం పొడిబారకుండా..!

పొడి బారే చర్మానికి మాయిశ్చరైజర్లు పదే పదే రాయాల్సి వస్తుంది. ఆ అవసరం లేకుండా, చర్మం మృదుత్వం కోల్పోకుండా ఉండాలంటే... ● పాల మీగడలో తేనె కలిపి ముఖానికి, చేతులకు పట్టించి, మృదువుగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. చలికాలం రోజూ ఈ విధంగా చేస్తుంటే చర్మ కాంతి కూడా పెరుగుతుంది ● చర్మానికి సరైన పోషణ లేకపోతే జీవ కళ కోల్పోతుంది. పాలు, బాగా మగ్గిన అరటిపండు గుజ్జు కలిపి మిశ్రమం తయారుచేసుకొని ప్యాక్ వేసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. జిడ్డుచర్మం గలవారు పాలు-రోజ్‌వాటర్ కలిపి రాసుకోవచ్చు. తర్వాత వెచ్చని నీటితో కడిగేయాలి ● చర్మంపై ఎక్కువ మృతకణాలు కనిపిస్తే కలబంద రసంలో పది చుక్కల బాదం నూనె, నువ్వుల నూనె కలిపి ముఖానికి, చేతులకు రాయాలి. వృత్తాకారంలో రాస్తూ మర్దన చేయాలి. రాత్రంతా అలాగే వదిలేసి, మరుసటి రోజు ఉదయం వెచ్చని నీటితో కడిగేయాలి.

● టెక్.. టాక్

వివో ఎక్స్ 200 ప్రో



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
బరువు: 223 గ్రా.
రిజల్యూషన్: 1260×2800 పిక్సెల్స్
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జెడ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్

టెక్నో మెగాప్యాడ్ 10



డిస్‌ప్లే: 10.1 అంగుళాలు
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్/ 256జీబి 4జీబి ర్యామ్ బ్యాటరీ: 7,000 ఎంఏహెచ్
రిజల్యూషన్: 800×1,280 పిక్సెల్స్
బరువు: 447 గ్రా. ఓఎస్: ఆండ్రాయిడ్ 14

మల్టీపర్పస్ క్లీనింగ్ కిట్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
మెటీరియల్: ప్లాస్టిక్
కిట్ ఫీచర్స్ డిజైన్డ్ ఫర్: ల్యాప్‌టాప్, పీసీ, ఫోన్, ఇయర్ బడ్స్

గూగుల్... హెల్ప్‌మీ రైట్



బాస్‌కు సాధారణ ఇమెయిల్ రాయడం నుంచి ఏదైనా కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం పంపడం వరకు గూగుల్ 'హెల్ప్ మీ రైట్' అనేది యూజర్‌కు రకరకాలుగా ఉపయోగపడుతుంది. టైమ్ సేవ్ చేస్తుంది.

జీమెయిల్‌లో గూగుల్ 'హెల్ప్ మీ రైట్' ఫీచర్ ఇప్పుడు వెబ్‌కు రాబోతుంది. ఇది జెమిని ఏఐని ఉపయోగించి ఇమెయిల్స్‌ను సర్దుబాటు చేయడానికి యూజర్లను అనుమతిస్తుంది. యూజర్ ఒక ప్రాంప్ట్‌ను ఇన్‌పుట్ చేసిన తరువాత ఏఐ ఆ నమూనాని ఉపయోగించి దాన్ని విశ్లేషిస్తుంది. ఎలబరేట్ చేయడానికి, సంక్షిప్త వెర్షన్ కోసం ఉపయోగపడుతుంది.

● ఇన్‌స్పిరేషన్

చక్రం తిప్పిన విల్ పవర్


● బరిలో కోటేశ్వర్

'శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది' అనే మాటకు ఈ యువకుడే నిదర్శనం. నల్లగొండ జిల్లా చందంపేట మండలం ధర్మతండాకు చెందిన రమావత్ కోటేశ్వర్ నాయక్ చిన్నప్పుడే పోలియో బారిన పడ్డాడు. ఒక కాలు సహకరించకపోయినా తాను కల కన్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. చదువుకునే రోజుల్లోనే ఆటలపై ఆసక్తి పెంచుకున్న కోటేశ్వర్ వీల్ చైర్ హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ నేటి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నాడు...

కోటేశ్వర్ నాయక్ నేరేడుగొమ్ములోని గిరిజన హాస్టల్‌లో ఉండి ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు, దేవరకొండలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఆ తరువాత హైదరాబాద్‌లో డిగ్రీ, పీజీ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తున్న సమయంలో వీల్‌చైర్ స్పోర్ట్స్‌లో కోటేశ్వర్ నాయక్ ప్రతిభను కోచ్ గ్యావిన్ సోహెల్ ఖాన్ గుర్తించాడు. వీల్‌చైర్ హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇచ్చాడు. గురువు ఇచ్చిన శిక్షణతో తనలోని ప్రతిభకు మెరుగులు దిద్దుకున్న కోటేశ్వర్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

మెరుగైన ప్రదర్శనతో 2019లో తొలిసారి భారత జట్టుకు ఎంపికైన కోటేశ్వర్ పట్టాయ (థాయ్‌లాండ్)లో జరిగిన ఆసియా ఓషియానియా చాంపియన్‌షిప్‌లో మన దేశం తరుపున బరిలో దిగాడు. 2022లో నోయిడాలో వీల్ చైర్ బాస్కెట్ బాల్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2022లో పోర్చుగల్ జరిగిన వీల్ చైర్ హాండ్‌బాల్ యూరోపియన్ అండ్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహించాడు. అందులో ఒక మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' టైటిల్ సొంతం చేసుకున్నాడు. 2023లో ఏసియా కప్ పోటీలు నేపాల్‌లోని ఖాట్మాండులో జరిగాయి. అందులో బెస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు.

గ్వాలియర్‌లో ఈనెల 9 నుంచి 15 వరకు జరిగిన వీల్ చైర్ బాస్కెట్ బాల్ నాలుగో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కెప్టెన్‌గా కోటేశ్వర్ నేతృత్వంలోని టీమ్ సెమీ ఫైనల్ వరకు వెళ్లింది. ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో కోటేశ్వర్ కెప్టెన్సీలో జట్టు సిల్వర్ మెడల్ సాధించింది.

– చింతకింది గణేష్, సాక్షి, నల్లగొండ

పారాలింపిక్స్ నా లక్ష్యం

పారాలింపిక్స్‌లో మన దేశం తరపున ఆడి పతకం సాధించాలన్నదే నా లక్ష్యం. ఇందుకు నిరంతర సాధన, కఠోర శ్రమ అవసరం. దీనికి తోడు పోటీలో రాణించాలంటే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కలిగిన వీల్‌చైర్ అవసరం తప్పనిసరి. దీనికి ఏడు నుంచి ఎనిమిది లక్షలు అవుతుంది. ఇందుకు ప్రభుత్వం సహకరించాలి.

– కోటేశ్వర్ నాయక్


తల్లిదండ్రులతో కోటేశ్వర్ నాయక్

● గేమింగ్

గుండె ధైర్యంతో జెండా ఎత్తి...



కాల్ ఆఫ్ డ్యూటీ: బ్లాక్ ఆప్స్ 6 ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియో గేమ్. 'కాల్ ఆఫ్ డ్యూటీ: బ్లాక్ ఆప్స్ కోల్డ్ వార్' (2020) సిరీస్‌లో భాగంగా వచ్చిన గేమ్ ఇది. గత గేమ్స్‌లాగే తాజా గేమ్ మల్టీప్లేయర్ కంపోనెంట్, కోఆపరేటివ్ జూంబీ మోడ్‌తో ఉంటుంది. 'బ్లాక్ ఆప్స్ 6'లో కొత్త గేమ్‌ప్లే మెకానిక్స్ విషయానికి వస్తే 'ఓమ్నిడైరెక్షనల్ మూమెంట్' అనేది అందులో ఒకటి. ఇది ప్లేయర్స్‌ను ఏ దిశలో అయినా స్ప్రింట్ చేయడానికి, డైవ్ చేయడానికి, స్లైడ్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ గేమ్ వివిధ 'ఇంటెలిజెంట్ మూమెంట్'లను కూడా అందిస్తుంది,.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్ బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్

యువర్స్

Word Bank

అబెట్
తప్పు చేయడానికి, నేరం చేసేలా ప్రోత్సహించడం.
ఉదా: హీ వాజ్ నాట్ గిల్టీ ఆఫ్ మర్డర్ బట్ వాజ్ గిల్టీ ఆఫ్ ఎయిడింగ్ అండ్ అబెటింగ్ అదర్స్

మెండాసిటీ
అబద్ధాలు ఆడే గుణం
ఉదా: టు బ్లో ది విజిల్ ఆన్ మెండాసిటీ అండ్ హిపోక్రసీ

అగరి
భవిష్యత్తులో ఏంజరగనుందో తెలిపే సంకేతం, శకునం.
ఉదా: దిస్ సేల్స్ ఫిగర్స్ ఆర్ ఏ గుడ్ అగరి ఫర్ అనదర్ ప్రాఫిటబుల్ ఇయర్

కాస్టిగేట్
తీవ్రంగా మందలించడం
ఉదా: హీ వాజ్ కాస్టిగేటెడ్ ఫర్ నాట్ సెట్టింగ్ ఏ గుడ్ ఎగ్జాంపుల్

డిజిటల్ వరల్డ్

సెలబ్రిటీలు మెచ్చిన స్టార్


రేవంత్ హిమంత్ సింగ్కా

అమెరికాలో చేస్తున్న కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి స్వదేశానికి తిరిగి వచ్చిన రేవంత్ హిమంత్‌సింగ్కా ఫుడ్ లేబుల్స్ చదవడం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కలిగించడానికి, ఆరోగ్య అక్షరాస్యతను మెరుగుపరచడానికి నడుం కట్టాడు.

సర్టిఫైడ్ హెల్త్‌కోచ్ అయిన రేవంత్ జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రచారం చేయాలనే లక్ష్యంతో అమెరికా నుంచి ఇండియాకు తిరిగివచ్చాడు. ఒకప్పుడు ఫైనాన్స్, హెల్త్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్...మొదలైన వాటికి సంబంధించి సెల్ఫ్–హెల్ప్ బుక్ ప్రచురించాడు. ఇందులో ప్యాకేజ్డ్ గూడ్స్ లేబుల్స్‌పై కూడా ఒక చాప్టర్ ఉంది. సోషల్ మీడియాలో రేవంత్ ఎలా పాపులర్ అయ్యాడు అనే విషయానికి వస్తే...పిల్లల హెల్త్–డ్రింక్ బోర్న్‌విటాపై ఒక వీడియో విడుదల చేశాడు. డ్రింక్‌లో చక్కెర మొత్తాన్ని ఈ వీడియో హైలైట్ చేస్తుంది

ఇది సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్‌గా మారింది. ఈ వీడియో పుణ్యమా అని రేవంత్ రాత్రికి రాత్రే సెలబ్రిటీ అయ్యాడు. ఆ తరువాత 'ఫుడ్‌ఫార్మర్' ట్యాగ్‌లైన్‌తో మ్యాగీ, మ్యాంగో జ్యూస్‌లాంటి ప్యాకేజ్డ్ కంటెంట్‌పై అవగాహన కలిగించడానికి మరిన్ని వీడియోలు చేశాడు. సెలబ్రిటీలు కూడా ఈ వీడియోలను షేర్ చేసేవారు.

వివిధ వేదికలపై మాట్లాడే ఆహ్వానాలు రావడం, తరచూ పర్యటనలు చేయడం ఇబ్బందిగా మారడంతో కోల్‌కత్తా నుంచి ముంబైకి మకాం మార్చాడు హిమంత్‌సింగ్కా.

'పాఠశాలలో హెల్త్‌పై సబ్జెక్ట్ లేదు. వైద్యులతో కలిసి డయాబెటిస్, పీసీఓఎస్‌లాంటి సబ్జెక్ట్‌లపై కోర్సులు రూపొందించాలనుకుంటున్నాను. కోర్సుల ఫీజులను స్వచ్ఛంద కార్యక్రమాలకు వినియోగించాలనుకుంటున్నాను. ప్రజలను ఆరోగ్య అక్షరాస్యులుగా మార్చాల్సిన అవసరం ఉంది' అంటున్నాడు.

'ఫుడ్‌ఫార్మర్'గా పాపులర్ అయిన రేవంత్ తాజాగా 'ఫోర్బ్స్ ఇండియా టాప్ డిజిటల్ స్టార్స్–2024' జాబితాలో చోటు సంపాదించాడు.

సినిమా

జూన్‌లో థగ్‌లైఫ్


● 'థగ్‌లైఫ్' పోస్టర్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియన్ సినిమా 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ రెడ్ జాయింట్ మూవీస్ సమర్పణలో కమల్ హాసన్, మణిరత్నం, శివ అనంత్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్నారు. కాగా గురువారం (నవంబరు 7న) కమల్ హాసన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'థగ్ లైఫ్' సినిమా విజువల్ ఫీస్ట్ టీజర్‌ను విడుదల చేసి, ఈ సినిమాను జూన్ 5న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. ఇక 'నాయగన్'(1987)(తెలుగులో నాయకుడు) చిత్రం తర్వాత కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న 'థగ్ లైఫ్' సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

లక్కీ భాస్కర్ సంతృప్తి ఇచ్చింది - వెంకీ అట్లూరి



''నా దర్శకత్వంలో వచ్చిన మొదటి చిత్రం 'తొలిప్రేమ'(2018) విడుదలైనప్పుడు ప్రేమకథే కదా అని కొందరు కాస్త నెగటివ్‌గా మాట్లాడారు. కానీ 'లక్కీ భాస్కర్' చూసిన వారందరూ బాగుందనే మాట్లాడారు. విమర్శకుల నుంచి కూడా పాజిటివ్ రెస్పాన్స్ రావడం నా అదృష్టం. ఓ దర్శకుడిగా 'లక్కీ భాస్కర్' నాకు మంచి సంతృప్తి ఇచ్చింది'' అని వెంకీ అట్లూరి అన్నారు. దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 31న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి విలేకరులతో మాట్లాడుతూ–''లక్కీ భాస్కర్' కథ విన్నప్పుడే దుల్కర్‌గారు నన్ను నమ్మారు. షూటింగ్‌కి ప్రతిరోజూ కొత్త ఎనర్జీతో వచ్చేవారాయన. నాగవంశీగారు కూడా కథను ఎంతో నమ్మారు. నా గత చిత్రాల్లాగానే ఈ సినిమాను కూడా చక్కగా ఎడిట్ చేశారు ఎడిటర్ నవీన్ నూలి. జీవీ ప్రకాష్‌గారి సంగీతం ఈ సినిమాకు మరో ప్రధానబలం. నేను త్రివిక్రమ్‌గారి అభిమానిని. నా ప్రతి సినిమాపై ఆయన ప్రభావం ఉంటుంది. అయితే 'లక్కీ భాస్కర్' రచన విషయంలో ఆయన ప్రభావం లేదు. నా తర్వాతి సినిమా కూడా సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లోనే ఉంటుంది'' అని తెలిపారు.

ప్రేక్షక దేవుళ్ల తీర్పు కోసం వేచి చూస్తున్నాం - రామ్‌కుమార్


● రామ్‌కుమార్, చేతస్, సాయి కిషోర్

''మా చేతస్‌కి సినిమాలంటే ప్యాషన్.. అందుకే తను హీరోగా సినిమాలు చేశాం. ఈ ప్రయాణంలో 'ధూం ధాం' చిత్రం చాలా ప్రత్యేక సినిమాగా నిర్మించాం. ఈ రోజు విడుదలవుతున్న మా సినిమాకి ప్రేక్షక దేవుళ్ల ఇచ్చే తీర్పు కోసం వేచి చూస్తున్నాం'' అని నిర్మాత ఎంఎస్ రామ్‌కుమార్ అన్నారు. చేతస్ కృష్ణ, హెబ్బా పటేల్ జోడీగా సాయి కిషోర్ మచ్చా దర్శకత్వం వహించిన చిత్రం 'ధూం ధాం'. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా నేడు మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సాయికిషోర్ మచ్చా మాట్లాడుతూ– ''ధూం ధాం' సినిమా ఇంత బాగా రావడానికి రామ్ కుమార్‌గారే కారణం. గోపీ సుందర్‌గారి మ్యూజిక్, రామజోగయ్యగారి లిరిక్స్ మా మూవీకి ఆకర్షణగా నిలుస్తాయి'' అని తెలిపారు. ''మా సినిమాలో కష్టాలు, కన్నీళ్లు ఉండవు. స్వచ్ఛమైన వినోదం మాత్రమే ఉంటుంది'' అని చేతస్ కృష్ణ చెప్పారు. కథ, స్క్రీన్‌ప్లే రచయిత గోపీ మోహన్, రచయితలు రామజోగయ్య శాస్త్రి, ప్రవీణ్ వర్మ, నటుడు సాయి శ్రీనివాస్ మాట్లాడారు.

కంగువని థియేటర్స్‌లోనే చూడాలి - ఎస్ఎస్ రాజమౌళి


● జ్ఞానవేల్ రాజా, సూర్య, రాజమౌళి, శివ, వెట్రి పళనిస్వామి

''కంగువ' టీమ్ పడిన కష్టం మేకింగ్ వీడియోలో తెలుస్తోంది. సినిమా రిలీజ్ అయ్యాక ఈ కష్టానికి విజయం రూపంలో ప్రతిఫలం దక్కుతుందని నమ్ముతున్నాను. 'కంగువ' లాంటి సినిమాను థియేటర్స్‌లోనే చూడాలి. అప్పుడే ఆ సినిమాటిక్ అనుభూతిని పొందుతారు'' అని డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. సూర్య హీరోగా శివ దర్శకత్వం వహించిన చిత్రం 'కంగువ'. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన 'కంగువ' ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సినిమాను నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'కంగువ' ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **రాజమౌళి మాట్లాడుతూ**–''తెలుగు సినిమాను తెలుగుకే పరిమితం చేయకుండా మిగతా ప్రాంతాలకు తీసుకెళ్లాలని, అలాగే పాన్ ఇండియా మూవీస్ చేసేందుకు నాకు స్ఫూర్తినిచ్చింది సూర్యనే. 'గజిని' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల దగ్గరకు చేర్చడానికి తను చేసిన ప్రయత్నాన్ని కేస్ స్టడీగా నా నిర్మాతలు, హీరోలకు చెప్పేవాణ్ణి. నేను, తను గతంలో ఓ సినిమా చేయాలనుకున్నాం.. కానీ కుదరలేదు. తనతో సినిమా చేసే అవకాశం నేను మిస్ అయ్యాను'' అని చెప్పారు. ''కంగువ' ప్రీ రిలీజ్ ఈవెంట్ చూస్తుంటే ఇది సక్సెస్ సెలబ్రేషన్స్‌లా ఉంది'' అని **నిర్మాత అల్లు అరవింద్** అన్నారు. ''ఈ సినిమా విజువల్స్, కంటెంట్ చూస్తుంటే అద్భుతంగా ఉంది. 'కంగువ' ఘన విజయం సాధించాలి'' అని **నిర్మాతలు సురేష్ బాబు, 'దిల్' రాజు** తెలిపారు. ''వెయ్యేళ్ల కిందటి కథలో ఐదు తెగల మధ్య అనుబంధాలు, ప్రేమలు, ప్రతీకారం, పోరాటం వంటివన్నీ 'కంగువ'లో చూపించాం'' అన్నారు **శివ**. ''కంగువ' వంటి అద్భుతమైన సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలి'' అని **కేఈ జ్ఞానవేల్ రాజా** చెప్పారు. **సూర్య మాట్లాడుతూ**– ''రాజమౌళిగారి ఏ సినిమాతోనూ మా 'కంగువ'ని పోల్చలేం. ఆయనతో సినిమా చేసే అవకాశం మిస్ చేసుకున్నాను. కానీ, ఇప్పటికీ ఆ అవకాశం కోసం వేచి చూస్తున్నాను. 'కంగువ' నాకు మర్చిపోలేని అనుభూతి ఇచ్చింది. ఈ చిత్రం కోసం రెండేళ్లు కష్టపడ్డాను. ఎవర్ గ్రీన్ సినిమాగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని తెలిపారు. ఈ వేడుకలో డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరోలు విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ, కెమెరామేన్ వెట్రి పళనిస్వామి, రైటర్ రాకేందు మౌళి, డిస్ట్రిబ్యూటర్ అభిషేక్, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ శశి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వివేక్ కూచిబొట్ల తదితరులు మాట్లాడారు.

ఆ అంశాలు ఆకట్టుకుంటాయి - జీవీ ప్రకాష్ కుమార్



''మట్కా' సినిమా నేను చూశాను. చక్కని యాక్షన్ ఫిల్మ్. అద్భుతమైన కథ, నటన, డైరెక్షన్.. ఈ అంశాలన్నీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. వరుణ్ తేజ్‌గారు ఈ సినిమా కోసం తన కెరీర్‌లోనే బెస్ట్‌గా నటించారు. ఈ చిత్రం కచ్చితంగా బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అన్నారు. వరుణ్ తేజ్ హీరోగా, మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ–''నా తొలి ప్రాధాన్యత ఎప్పుడూ కథకే. ఆ తర్వాత డైరెక్టర్ గురించి ఆలోచిస్తాను. కరుణ కుమార్‌గారు అద్భుతమైన డైరెక్టర్. 'మట్కా' పీరియాడికల్ స్టోరీ. మ్యూజిక్ కూడా అదే తరహాలో తీసుకురావడం నాకు పెద్ద సవాల్‌గా అనిపించింది. ఈ మూవీలో రెట్రో జోన్‌లో చేసిన 'లేలే రాజా..' పాట నాకు చాలా ఇష్టం. నిర్మాతలు పెద్ద బడ్జెట్‌తో ఈ సినిమా తీశారు. నెలలో 12 రోజులు నటన కోసం కేటాయిస్తాను. మిగతా రోజులన్నీ సంగీతం కోసం కేటాయిస్తాను. తెలుగులో 'దసరా' సినిమాలో ఒక పాత్ర చేయాల్సింది. కానీ, నా డేట్స్ కుదరలేదు. మంచి కథ, క్యారెక్టర్ ఉంటే తెలుగులో నటిస్తాను. వ్యక్తిగతంగా ప్రేమకథలకు సంగీతం ఇవ్వడం నాకు ఇష్టం'' అన్నారు.

యాక్షన్ థ్రిల్లర్


● 'ఘాటీ'లో అనుష్క

అనుష్క లీడ్ రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఘాటి'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. గురువారం (నవంబరు 7న) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఘాటీ' సినిమా నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''యాక్షన్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియన్ మూవీగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘాటీ'. ఈ సినిమా చిత్రీకరణ పనులు చివరి దశలో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ రెడ్డి కాటసాని, సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్.

సరికొత్త జాతర


● శివశంకర్ రెడ్డి

రాటకొండ సతీష్‌బాబు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. ఈ చిత్రంలో దీయా రాజ్ హీరోయిన్‌గా నటించారు. గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సీ, రాధాకృష్ణ ప్రొడక్షన్ పతాకాలపై రాధాకృష్ణా రెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ–''చిత్తూరు జిల్లాలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. 18 గ్రామాలకు కాపు కాసే దేవత చుట్టూ కథ తిరుగుతుంది. చిత్రీకరణ సమయంలో వర్షం పడుతూనే ఉన్నా షూటింగ్‌కి ఆటంకం కలగలేదు. అదంతా పోలేటమ్మ మహిమ అని నమ్ముతున్నాను. ఈ సినిమా సబ్జెక్ట్ కొత్తగా ఉంటుంది'' అన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

కదలలేరు... వదలలేరు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'డోన్ట్ మూవ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ప్రేక్షకులు సినిమాని చూస్తారు. కానీ అదే దర్శకుడు సినిమాని సృష్టిస్తాడు. ఇక్కడ దర్శకుడు తన సృష్టితో పాటు ఆ సినిమాని మానసికంగా అనుభూతి పొందుతాడు. దానికి నిలువెత్తు నిదర్శనం ఈ అమెరికన్ థ్రిల్లర్ డోన్ట్ మూవ్. ఆడమ్ బ్రియో తో కలిసి రూపొందించిన ఈ సినిమా కాన్సెప్ట్ మిమ్మల్ని కన్నార్పనివ్వదు. డేవిడ్ వైట్ అందించిన కథకు వీరిరువురు ప్రాణం పోయగా, లీడ్ రోల్‌లో ఐరిస్ పాత్రలో నటించిన కెల్సీ ఈ చిత్రానికి ఊపిరూదింది. సినిమా మొత్తం మనకు కెల్సీ కనిపించదు. ఐరిస్ మాత్రమే మన కళ్లముందు కదలాడుతుంది. ఈ సినిమాలో పెద్ద కథాంశం లేదు కానీ తీసుకున్న కాన్సెప్ట్ మాత్రం అదరహో అని చెప్పవచ్చు. ఐరిస్ హైకింగ్‌లో తన కొడుకును పోగొట్టుకున్న బాధతో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఇక్కడి నుండే సినిమా ప్రారంభమవుతుంది. అప్పుడే అక్కడ తనని తాను రిచర్డ్ అని పరిచయం చేసుకున్న వ్యక్తి ఐరిస్ మీద ఓ ఇంజెక్షన్‌తో దాడి చేస్తాడు. ఆ ఇంజెక్షన్ వల్ల 20 నిమిషాలలో శరీరంలోని ఒక్కో అవయవం పని చేయకుండా పోతుందని రిచర్డ్ చెప్పి ఐరిస్‌ని బందీగా చేసుకుని తనతో పాటు కారులో తీసుకువెళుతుంటాడు. ఇంజెక్షన్ వల్ల ఒక్క కళ్లు తప్ప ఎటూ కదలలేని ఐరిస్ రిచర్డ్ బారి నుండి తప్పించుకోలిగిందా లేదా అన్నది మాత్రం డోన్ట్ మూవ్ సినిమాలోనే చూడాలి. ఒక్కసారి ఆలోచించండి మన శరీరంలో ఏ కాలో, చెయ్యో ఇబ్బంది కలిగితేనే తట్టుకోలేము అలాంటిది దాదాపుగా అన్ని అవయవాలు పని చేయడం మానేసి ఓ నరరూప రాక్షసుడి చేతిలో బందీ అవడం అంటే అంతకన్నా దారుణం ఏముంటుంది. పైన చెప్పినట్టు దర్శకులు ఈ సినిమాని ఎలా సృష్టించారో అర్థమవదు కానీ వారి ఆలోచనా పటిమకు మాత్రం ప్రేక్షకులుగా మనం హాట్సాఫ్ చెప్పి తీరాలి. ఈ సినిమా మనం చూస్తున్నంతసేపు కదలలేము, వదలలేము ఎందుకంటే ఈ సినిమా పేరు డోన్ట్ మూవ్ కాబట్టి. ఎ మస్ట్ వాచ్ థ్రిల్లర్.

ఓటిటి వేదిక... నెట్‌ఫ్లిక్స్.

– ఇంటూరు హరికృష్ణ



ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సాక్షి బిజినెస్

శుక్రవారం
8-11-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
836	284
79,542	24,199

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,237	△ 254
డోజోన్స్	43,760	△ 30
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,141	▽ 26
డాక్స్	19,362	△ 323
షాంఘై	3,417	△ 87
నికాయ్	39,381	▽ 99

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,780 ▽ 1,356
బంగారం (99.5 స్వచ్ఛత)	76,473 ▽ 1,532
వెండి (కిలో)	90,369 ▽ 2,532

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	[illegible]	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	[illegible]	107.61	110.46
€	యూరో	[illegible]	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.27	55.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	54.22	56.71
S$	సింగపూర్ డాలర్	[illegible]	61.55	66.32
SAR	సౌదీ రియాల్	[illegible]	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.04	23.81
¥	చైనా యువాన్	[illegible]	10.89	12.65

నిస్సాన్‌లో భారీగా ఉద్యోగాల కోత

- 9,000 మందికి ఉద్వాసన

టోక్యో: ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మోటార్ కార్ప్ అమ్మకాలు క్షీణించి, నష్టాలు పెరిగిపోవడంతో భారీ ఉద్యోగాలు, వేతనాల కోత దిశగా కఠిన చర్యలు ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో 9.3 బిలియన్ యెన్‌ల నష్టాన్ని మూటగట్టుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 191 బిలియన్ యెన్‌ల లాభం నుంచి, భారీ నష్టాల్లోకి వెళ్లడం గమనార్హం. అంతేకాదు త్రైమాసిక విక్రయాలు 3.1 ట్రిలియన్ యెన్‌ల నుంచి 2.9 ట్రిలియన్ యెన్‌లకు క్షీణించాయి. దీంతో అంతర్జాతీయంగా 9,000 మంది ఉద్యోగులను తగ్గించుకోనున్నట్టు నిస్సాన్ ప్రకటించింది. సంస్థకున్న 1,33,000 మంది ఉద్యోగుల్లో ఇది 6 శాతానికి సమానం. అంతేకాదు తయారీని 20 శాతం తగ్గించుకోనున్నట్టు తెలిపింది. తన వేతనంలో 50 శాతం కోత విధించుకుంటున్నట్టు కంపెనీ సీఈవో మకోటో ఉచ్చిద ప్రకటించారు. అయితే, ఏ ప్రాంతంలో సంస్థ పనితీరుపై ప్రభావం పడిందన్నది ఉచ్చిద వెల్లడించలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ కాలానికి కంపెనీ లాభం 19.2 బిలియన్ యెన్‌లకు తగ్గిపోయింది.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేట్లు అప్

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణ రేట్లను 0.05 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆటో, పర్సనల్, కన్జ్యూమర్ రుణాలకు వర్తించే ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రేటును 9.45 శాతం వద్దే కొనసాగించినట్టు బ్యాంక్ ప్రకటించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రేటును 9.10 శాతం నుంచి 9.15 శాతానికి పెంచింది. ఒక నెల ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రేటును సైతం 9.20 శాతానికి సవరించింది. కొత్త రేట్లు నవంబర్ 7 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది.



జెట్‌ కథ కంచికి..



- జెట్ ఎయిర్‌వేస్ లిక్విడేషన్‌కు సుప్రీం కోర్టు ఉత్తర్వులు
- జేకేసీ ఇన్వెస్ట్ చేసిన రూ. 200 కోట్ల జప్తునకు ఆదేశాలు

1992లో ప్రారంభం..

ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌కు సేల్స్ ఏజెంటుగా వ్యవహరించిన నరేశ్ గోయల్ 1992లో జెట్ ఎయిర్‌వేస్‌ను ప్రారంభించారు. తొలుత ముంబై–అహ్మదాబాద్ మధ్య ఎయిర్ ట్యాక్సీ సర్వీసుగా కంపెనీ కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఒక దశలో జెట్ ఎయిర్‌వేస్‌కి 120 పైగా విమానాలు ఉండేవి. 1,300 మంది పైలట్లు, 20,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉండేవారు. అయితే, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో 2019లో కంపెనీ తాత్కాలికంగా కార్యకలాపాలు నిలిపివేసింది. అప్పటికి జెట్ ఎయిర్‌వేస్ వివిధ బ్యాంకులకు రూ. 8,500 కోట్ల రుణాలతో పాటు పలువురు వెండార్లు, ప్యాసింజర్లకు ఇవ్వాల్సిన రీఫండ్‌లు, ఉద్యోగుల జీతాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బాకీ పడింది. దీంతో 2019 జూన్‌లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) జెట్ ఎయిర్‌వేస్‌పై దివాలా పిటీషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ క్రమంలో దివాలా పరిష్కార ప్రక్రియ కింద 2021లో కంపెనీని జేకేసీ దక్కించుకుంది. 2024 నుంచి కార్యకలాపాలు పునఃప్రారంభించనున్నట్లు కూడా జెట్ ఎయిర్‌వేస్ ప్రకటించింది. అయితే, నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన మొత్తాన్ని జేకేసీ సకాలంలో చెల్లించకపోవడంతో వివాదం చివరికి సుప్రీం కోర్టుకు చేరింది.

న్యూఢిల్లీ: ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్ దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కంపెనీని లిక్విడేట్ చేయాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, పరిష్కార ప్రణాళిక నిబంధనలను పాటించనందుకు గాను జలాన్ కల్రాక్ కన్సార్షియం (జేకేసీ) ఇన్వెస్ట్ చేసిన రూ. 200 కోట్ల మొత్తాన్ని జప్తు చేయాలని సూచించింది. ఇక రూ. 150 కోట్ల పర్ఫార్మెన్స్ గ్యారంటీని క్లెయిమ్ చేసుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సారథ్యంలోని కన్సార్షియానికి అనుమతినిచ్చింది. రాజ్యాంగంలోని 142 ఆర్టికల్ కింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. తాజా పరిణామాలతో పాతికేళ్ల పైగా సాగిన జెట్ ఎయిర్‌వేస్ ప్రస్థానం ముగిసినట్లేనని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ఎన్‌సీఎల్‌ఏటీకి అక్షింతలు..

జేకేసీ సమర్పించిన పనితీరు ఆధారిత బ్యాంక్ గ్యారంటీని (పీబీజీ) పాక్షిక చెల్లింపు కింద సర్దుబాటు చేసేందుకు నేషనల్ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) అనుమతించడాన్ని సుప్రీం కోర్టు ఆక్షేపించింది. దివాలా కోడ్ (ఐబీసీ) సూత్రాలకు విరుద్ధంగా పేమెంట్ నిబంధనలను పూర్తిగా పాటించకుండానే ముందుకెళ్లేందుకు జేకేసీకి వెసులుబాటునిచ్చినట్లయిందని వ్యాఖ్యానించింది. జెట్ ఎయిర్‌వేస్ పరిష్కార ప్రణాళిక ఆమోదం పొంది అయిదేళ్లు గడిచినా కూడా కనీస పురోగతి కూడా లేదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దివాలా కేసుల విషయంలో ఈ తీర్పు ఓ 'కనువిప్పు'లాంటిదని, ఆర్థికాంశాలకు సంబంధించి ఇచ్చిన హామీలను సకాలంలో తీర్చాల్సిన అవసరాన్ని ఈ ఉత్తర్వులు స్పష్టం చేస్తాయని పేర్కొంది.

గురువారం బీఎస్‌ఈలో జెట్ ఎయిర్‌వేస్ షేరు ధర 5 శాతం లోయర్ సర్క్యూట్‌తో 34.04 వద్ద క్లోజయ్యింది.

ఎంఅండ్‌ఎం లాభం జూమ్

క్యూ2లో రూ. 3,171 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 35 శాతం జంప్‌చేసి రూ. 3,171 కోట్లను తాకింది. ఆటో, ట్రాక్టర్ల అమ్మకాలు ఇందుకు సహకరించాయి. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 2,348 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10% వృద్ధితో రూ. 37,924 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 34,436 కోట్ల టర్నోవర్ అందుకుంది. స్టాండెలోన్ నికర లాభం 13% ఎగసి రూ. 3,841 కోట్లకు చేరింది. ఆదాయం 13% వృద్ధితో రూ. 27,553 కోట్లను తాకింది. క్యూ2లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 2.31 లక్షల వాహనాలను ఎంఅండ్‌ఎం విక్రయించింది. ఇది 9% వృద్ధి.



ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు 1.5% క్షీణించి రూ. 2,890 వద్ద ముగిసింది.

ఫెడ్ పాలసీకి ముందు అమ్మకాలు

- బ్యాంకులు, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ
- 1 శాతం నష్టపోయిన స్టాక్ సూచీలు



ముంబై: 'ట్రంప్ గెలుపు జోష్' స్టాక్ మార్కెట్లో ఒక్క రోజుకే పరిమితమైంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల ప్రకటనకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ బ్యాంకులు, ఆటో, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 836 పాయింట్లు నష్టపోయి 79,542 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 284 పాయింట్లు పతనమై 24,199 వద్ద నిలిచింది. దీంతో సూచీల వరుస రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, రూపాయి క్షీణత, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశరచడం తదితర సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఒక దశలో సెన్సెక్స్ 959 పాయింట్లు క్షీణించి 79,419 వద్ద, నిఫ్టీ 305 పాయింట్లు పతనమై 24,179 వద్ద కనిష్టాలు తాకాయి. ప్రైవేటు రంగ బ్యాంకు, ఆటో రంగాల షేర్లు 8–5% నష్టపోయాయి. రంగాల వారీగా అత్యధికంగా మెటల్ ఇండెక్స్ 2.50% పతనమైంది. డాలరు మారకంలో రూపాయి విలువ ఇంట్రాడేలో 7 పైసలు బలహీనపడి తాజా జీవితకాల కనిష్టమైన 84.38కి దిగివచ్చింది. చివరికి 1 పైసా నష్టంతో 84.32 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- వారాంతపు డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో ప్రైవేట్‌రంగ బ్యాంకు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీసీఐ బ్యాంక్ 2% పతనమయ్యాయి. ఆర్‌బీఎల్ 1.50%, కోటక్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ 1% చొప్పున నష్టపోయాయి.
- క్యూ2 ఫలితాల దన్నుతో అపోలో హాస్పిటల్స్ షేరు 6.50% పెరిగి రూ.7425 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఏడున్నర లాభపడి రూ.7483 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

ఆండ్రాయిడ్ క్యూఎల్‌ఈడీ టీవీలు ఆవిష్కరించిన ఇంపెక్స్

చెన్నై: ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల బ్రాండ్ ఇంపెక్స్ 'గూగుల్ ఆండ్రాయిడ్ 14 ఓఎస్' సపోర్టుతో కూడిన క్యూఎల్‌ఈడీ సిరీస్ టీవీలను ఆవిష్కరించింది. ఇందులో మెరుగైన ప్రైవసీ కంట్రోల్స్, డేటా ప్రొటెక్షన్, వాయిస్ అసిస్టెంట్‌లతో పాటు ఏఐ పర్సనలైజేషన్ ఫీచర్లు ఉన్నాయి. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో 300కు పైగా అవుట్‌లెట్‌లు కలిగిన ఎలక్ట్రానిక్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రిటైల్ చైన్ సత్య ఏజెన్సీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆధునిక సాంకేతికత ప్రయోజనాలను అందరికీ అందుబాటు ధరల్లో అందించాలనేదే ఇంపెక్స్ లక్ష్యమని కంపెనీ ఎండీ సువాస్ సీ తెలిపారు.




'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఇక రిలయన్స్ 'స్నాక్స్'! | సెయిల్ లాభం నేలచూపు

దానగుణంలో హెచ్‌సీఎల్ నాడార్ టాప్..

- ఎడెల్‌గివ్–హురున్ లిస్టులో అగ్రస్థానం
- రెండో స్థానంలో ముకేశ్ అంబానీ





ముంబై: టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ దాతృత్వంలో అంబానీ, అదానీని కూడా మించిపోయారు. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన రూ. 2,153 కోట్లు విరాళమిచ్చారు. క్రితం ఆర్థిక సంవత్సరంలో పోలిస్తే ఇది 5 శాతం అధికం. దీంతో ఎడెల్‌గివ్–హురున్ వితరణశీలుర లిస్టులో శివ్ నాడార్ అగ్రస్థానంలో నిల్చారు. ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రూ. 407 కోట్లతో రెండో స్థానంలో, వ్యాపార దిగ్గజం గౌతమ్ అదానీ రూ. 330 కోట్లతో అయిదో స్థానంలో ఉన్నారు. జాబితా ప్రకారం మొత్తం మీద 203 మంది రూ. 5 కోట్లకన్నా అధికంగా విరాళమిచ్చారు. హురున్ రిచ్ లిస్ట్ ప్రకారం రూ. 1,000 కోట్ల పైగా నికర విలువ ఉన్న మొత్తం 1,539 మంది వ్యక్తుల సంపద 46 శాతం పెరిగింది. 203 మంది ఇచ్చిన సగటు విరాళం పరిమాణం రూ. 71 కోట్ల నుంచి రూ. 43 కోట్లకు తగ్గింది. వితరణకు సంబంధించి మహిళల జాబితాలో రోహిణి నీలేకని రూ. 154 కోట్లతో అగ్రస్థానంలో నిలవగా, రూ. 90 కోట్లతో సుస్మితా బాగ్చీ రెండో స్థానంలో ఉన్నారు. రంగాలవారీగా చూస్తే విద్యారంగానికి అత్యధికంగా రూ. 3,680 కోట్లు, హెల్త్‌కేర్‌కి రూ. 626 కోట్లు లభించాయి.

రిచ్ లిస్ట్‌లో రూ. 11.6 లక్షల కోట్ల సంపదతో అదానీ అగ్రస్థానంలో, రూ. 10.14 లక్షల కోట్లతో అంబానీ రెండో స్థానంలో ఉండగా రూ. 3.14 లక్షల కోట్ల సంపదతో శివ్ నాడార్ మూడో స్థానంలో ఉన్నారు. రిచ్ లిస్టులోని ప్రమోటర్ల సారథ్యంలో ఉన్న తొమ్మిది కంపెనీలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద నిర్దేశిత 2 శాతానికి మించి ఖర్చు చేశాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 900 కోట్లు, యార్డీ సాఫ్ట్‌వేర్ ఇండియా రూ. 25 కోట్లు చొప్పున ఖర్చు చేశాయి.

సాక్షి స్పోర్ట్స్



60 నిమిషాల్లో 43 గోల్స్...

జాతీయ పురుషుల సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తమిళనాడు జట్టు ఆటగాళ్లు ఊహించనిరీతిలో అండమాన్ నికోబార్ జట్టుపై గోల్స్ సునామీ సృష్టించారు. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగు క్వార్టర్ల పాటు 60 నిమిషాలు జరిగిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 43 గోల్స్ నమోదయ్యాయి. తమిళనాడు 43–0తో అండమాన్ నికోబార్ జట్టుపై జయభేరి మోగించింది. కెప్టెన్ కార్తీ సెల్వం 13, సోమన్న, సుందరపాండి చెరో 9 గోల్స్ తుఫాన్ సృష్టించారు. మారీశ్వరన్ శక్తివేల్ 6, పృథ్వీ 3, సెల్వరాజ్ కనగరాజ్ రెండు గోల్స్ సాధించారు. శ్యామ్ కుమార్ ఒక గోల్ చేశాడు. కనీస ప్రతిఘటన చేయలేకపోయిన అండమాన్ జట్టు కనీసం ఖాతా తెరువక పోవడమే విడ్డూరంగా ఉంది. మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్... మధ్యప్రదేశ్ ధాటికి చేతులెత్తేసింది. ఏపీ జట్టును ఖాతా తెరువనీకుండా మధ్యప్రదేశ్ జట్టు 17–0తో విజయం సాధించింది.

సఫారీ గడ్డపై సమరానికి సై

దాదాపు ఐదు నెలల క్రితం... టి20 వరల్డ్‌కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి భారత్ చాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు ఆ మ్యాచ్ తర్వాత ఇరు జట్లు మరోసారి ఇదే ఫార్మాట్‌లో పోరుకు సిద్ధమయ్యాయి. వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమికి ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో మ్యాచ్‌ను ప్రతీకార సమరంగా చూడలేం. పైగా నాటి మ్యాచ్ ఆడిన టీమ్ నుంచి ఇరు జట్లలో పలు మార్పులు జరిగాయి. అయితే తర్వాతి టి20 వరల్డ్‌కప్ కోసం కొత్త జట్లను తయారు చేసే ప్రణాళికల్లో భాగంగా ఇరు జట్లూ సన్నద్ధమవుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ టి20 సమరానికి రంగం సిద్ధమైంది.

నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టి20

రాత్రి గం.8:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



టి20 సిరీస్ ట్రోఫీతో మార్క్‌రమ్, సూర్యకుమార్

డర్బన్: స్వదేశంలో ఐదు రోజుల క్రితమే టెస్టు సిరీస్‌లో చిత్తయిన భారత్ ఇప్పుడు విదేశీ గడ్డపై టి20 ఫార్మాట్‌లో సత్తా చాటేందుకు 'సై' అంటోంది. అయితే టెస్టు సిరీస్ ఆడిన వారిలో ఒక్క ఆటగాడు కూడా లేకుండా బరిలోకి దిగుతుండటంతో టీమిండియాపై ఈ ఓటమి భారం లేదు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు దక్షిణాఫ్రికాను తొలి టి20 మ్యాచ్‌లో భారత్ ఎదుర్కోనుంది. సఫారీ జట్టు పరిస్థితి చూస్తే వరల్డ్‌కప్ ఓటమి నుంచి ఇంకా కోలుకున్నట్లుగా లేదు. ఆ తర్వాత టి20ల్లోనే విండీస్ చేతిలో 0–3తో ఓడిన జట్టు ఐర్లాండ్‌తో 1–1తో 'డ్రా' చేసుకుంది. ఇప్పుడు స్వదేశంలోనైనా తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇచ్చి సిరీస్ గెలుచుకోవాలని జట్టు ఆశిస్తోంది.

సుస్థిర స్థానం కోసం...

సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను టి20 సిరీస్‌లో 3–0తో ఓడించిన భారత యువ జట్టు ఉత్సాహంతో ఉంది. సూర్యకుమార్ నాయకత్వంలో ఈ టీమ్ అన్ని విధాలా బలంగా కనిపిస్తోంది. బంగ్లాదేశ్‌పై హైదరాబాద్‌లో జరిగిన చివరి టి20 మ్యాచ్‌లో మెరుపు సెంచరీతో చెలరేగిన సంజూ సామ్సన్ అదే జోరును ఇక్కడా కొనసాగించాలని పట్టుదలతో ఉన్నాడు. యశస్వి, గిల్‌వంటి రెగ్యులర్ ఓపెనర్లు మళ్లీ వచ్చినా ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని అతను భావిస్తున్నాడు. రెండో ఓపెనర్‌గా అభిషేక్ శర్మ కూడా అదే ప్రయత్నంలో ఉన్నాడు. జింబాబ్వేపై 36 బంతుల్లోనే శతకం బాదినా... మిగిలిన ఆరు ఇన్నింగ్స్‌లలో అతను ఒక్కసారి కూడా 20 పరుగులు దాటలేదు. ఇటీవల ఎమర్జింగ్ కప్‌లో భారత టాప్‌స్కోరర్‌గా నిలిచిన అభిషేక్ ఇక్కడ రాణించడం అవసరం. సూర్య, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్‌లతో మన బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ కూడా తనను తాను మళ్లీ నిరూపించుకోవాల్సిన స్థితిలో ఉన్నాడు. అంతర్జాతీయ కెరీర్ ఆరంభంలో మంచి ప్రదర్శనలే వచ్చినా... ఆ తర్వాత చోటు కోల్పోయి ఇటీవలే మళ్లీ జట్టులోకి వచ్చాడు. ఎమర్జింగ్ కప్‌లో కెప్టెన్ హోదాలో ఆడిన తిలక్ 4 ఇన్నింగ్స్‌లలో 117 పరుగులే చేయగలిగాడు. మిడిలార్డర్‌లో పోటీ పెరిగిన నేపథ్యంలో రెగ్యులర్‌గా మారాలంటే తిలక్ మంచి స్కోర్లు సాధించాల్సి ఉంది. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు అద్భుతమైన ఫీల్డర్ అయిన రమణ్‌దీప్ సింగ్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. మెరుపు ప్రదర్శనతో ముస్తాక్ అలీ టోర్నీలో పంజాబ్, ఐపీఎల్‌లో కేకేఆర్ జట్ల విజయాల్లో కీలకపాత్ర పోషించిన అతను ఎమర్జింగ్ టోర్నీలోనూ రాణించాడు. వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ సభ్యుడైన అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌ను నడిపిస్తుండగా...అవేశ్‌కు రెండో పేసర్‌గా అవకాశం దక్కవచ్చు.

హిట్టర్లు వచ్చేశారు...

వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ తర్వాత హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్ మళ్లీ ఇప్పుడే మైదానంలోకి దిగుతున్నారు. వీరిద్దరి రాకతో పాటు మరో దూకుడైన ప్లేయర్ స్టబ్స్‌తో దక్షిణాఫ్రికా మిడిలార్డర్ పటిష్టంగా మారింది. ప్రపంచకప్ ఆడిన డికాక్, రబడ, నోర్జే ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోయినా... గాయాల నుంచి కోలుకున్న జాన్సెన్, కొయెట్జీ పునరాగమనం చేయడంతో టీమ్ మెరుగ్గా కనిపిస్తోంది. ఓపెనర్లుగా అనుభవజ్ఞుడైన హెన్‌డ్రిక్స్‌తో పాటు రికెల్టన్ శుభారంభం ఇవ్వాలని టీమ్ ఆశిస్తోంది. ఇద్దరు కొత్త ఆటగాళ్లు సిమ్‌లేన్, ఎన్‌ఖబయోమ్జి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టనున్నారు. అయితే కెప్టెన్ మార్క్‌రమ్ ఫామ్ టీమ్‌ను కలవరపరుస్తోంది. ఈ ఏడాది ఆడిన 14 ఇన్నింగ్స్‌లలో మార్క్‌రమ్ ఒకే ఒక్కసారి 25 పరుగుల స్కోరు దాటగలిగాడు. ఈ సిరీస్ ద్వారా ఫామ్‌లోకి వస్తానని అతను చెబుతున్నాడు. ఐపీఎల్ వేలానికి ముందు భారత జట్టుపై రాణించడం ద్వారా తమ సత్తాను ప్రపంచానికి చూపించేందుకు సఫారీ ఆటగాళ్లకు ఇది చక్కటి అవకాశం. ఒక్క క్లాసెన్ మినహా మిగతా వారందరూ వేలంలోకి రానున్నారు.

పిచ్, వాతావరణం

కింగ్స్‌మీడ్ మైదానం భారీ స్కోర్లకు వేదిక. మరోసారి అదే జరిగే అవకాశం ఉంది. అయితే మ్యాచ్ రోజు వర్షసూచన ఉంది.

6 దక్షిణాఫ్రికా గడ్డపై ఇరు జట్ల మధ్య 9 టి20 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో భారత్ 6 మ్యాచ్‌ల్లో నెగ్గి, 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సామ్సన్, అభిషేక్, తిలక్, పాండ్యా, రింకూ, రమణ్‌దీప్, అక్షర్, అవేశ్, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, రికెల్టన్, స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, సిమ్‌లేన్, ఎన్‌ఖబయోమ్జి, కేశవ్, బార్ట్‌మన్.

ఒక్కో మ్యాచ్‌తో రూ. 73 కోట్లు!

భారత జట్టు న్యూజిలాండ్‌తో సిరీస్ ముగిసిన వెంటనే ఆస్ట్రేలియా పర్యటన కోసం వెళ్లాల్సి ఉంది. షెడ్యూల్‌లో నిజానికి ఈ సిరీస్ లేదు. కానీ హడావిడిగా ఆదాయం కోసమే దీనిని ఏర్పాటు చేశారు. దక్షిణాఫ్రికా బోర్డు ఆర్థిక కష్టాలు గట్టెక్కించేందుకు టి20 స్పెషలిస్ట్‌లతో భారత టీమ్‌ను ఎంపిక చేశారు. ఈ సిరీస్‌లో ఒక్కో మ్యాచ్ ద్వారా దక్షిణాఫ్రికాకు 150 మిలియన్ ర్యాండ్‌ల (సుమారు రూ.73 కోట్లు) ఆదాయం వస్తుందని అంచనా. ఐపీఎల్ తరహాలో దక్షిణాఫ్రికా బోర్డు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎస్‌ఏ20 టోర్నీ ద్వారా వచ్చిన మొత్తం లాభం 54 మిలియన్ ర్యాండ్‌లతో (రూ. 26 కోట్లు) పోలిస్తే దీని విలువ ఏమిటో అర్థమవుతుంది!

ప్రపంచ రెండో ర్యాంకర్‌గా అర్జున్

2805.8 లైవ్ రేటింగ్ పాయింట్లతో ఘనత • చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో రెండో గెలుపు



సాక్షి, హైదరాబాద్: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ రెండో విజయాన్ని అందుకున్నాడు. సెర్బియా గ్రాండ్‌మాస్టర్ అలెక్సీ సరానాతో గురువారం చెన్నైలో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన అర్జున్ 37 ఎత్తుల్లో గెలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. మూడో రౌండ్ తర్వాత అర్జున్, అమీన్ తబాతబాయి (ఇరాన్) 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. తాజా ఫలితంతో 21 ఏళ్ల అర్జున్ అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) లైవ్ ర్యాంకింగ్స్‌లో 2805.8 ఎలో రేటింగ్ పాయింట్లతో ప్రపంచ రెండో ర్యాంకర్‌గా అవతరించాడు. రెండో ర్యాంక్‌లో ఉన్న అమెరికా గ్రాండ్‌మాస్టర్ కరువానా 2805 పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయాడు. 2011లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరిన భారత ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. లైవ్ రేటింగ్స్ అనేవి ప్రతి టోర్నీలో రౌండ్ రౌండ్‌కూ మారుతుంటాయి. ప్రతి నెలా ఒకటో తేదీన 'ఫిడే' ప్రచురించే అధికారిక ర్యాంకింగ్స్‌నే ప్లేయర్ తుది ర్యాంక్‌గా పరిగణిస్తారు. గత నెలలో సెర్బియాలో జరిగిన యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీ ఐదో రౌండ్ తర్వాత లైవ్ రేటింగ్స్‌లో అర్జున్ తొలిసారి 2800 పాయింట్లను అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన 16వ చెస్ ప్లేయర్‌గా అతను గుర్తింపు పొందాడు. అయితే అదే టోర్నీలోని ఆరో రౌండ్‌లో, ఏడో రౌండ్‌లో అర్జున్ తన గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో అతని లైవ్ రేటింగ్ 2800లోపు వచ్చింది. నవంబర్ 1న 'ఫిడే' అధికారికంగా వెలువరించిన ర్యాంకింగ్స్‌లో అర్జున్ 2799 రేటింగ్‌తో ప్రపంచ నాలుగో ర్యాంకర్‌గా ఉన్నాడు. చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలోని మిగిలిన నాలుగు రౌండ్లలో అర్జున్ రాణిస్తే డిసెంబర్ 1న విడుదలయ్యే తదుపరి ర్యాంకింగ్స్‌లో అధికారికంగా 2800 రేటింగ్ పాయింట్లతో మూడు లేదా రెండో ర్యాంక్‌లో నిలుస్తాడు.

ధ్రువ్ జురేల్ 80... భారత్ 'ఎ' 161 ఆలౌట్

- ఆసీస్ 'ఎ'తో రెండో అనధికారిక టెస్టు
- కేఎల్ రాహుల్, అభిమన్యు విఫలం
- పేస్ దెబ్బకొట్టిన నెసర్



ధ్రువ్ జురేల్

మెల్‌బోర్న్: త్వరలోనే ఆస్ట్రేలియా గడ్డపై జరిగే బోర్డర్–గావస్కర్ ట్రోఫీకి ముందు సన్నాహంగా అనధికారిక టెస్టుల కోసం అక్కడికి పంపిన కేఎల్ రాహుల్ (4), అభిమన్యు ఈశ్వరన్ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (16) అందివచ్చిన చక్కని అవకాశాన్ని అందుకోలేకపోయాడు. ఒకే ఒక్కడు ధ్రువ్ జురేల్ (186 బంతుల్లో 80; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారత్ 'ఎ' జట్టును ఆదుకున్నాడు. దీంతో గురువారం మొదలైన రెండో అనధికారిక టెస్టులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 57.1 ఓవర్లలో 161 పరుగులకే కుప్పకూలింది. ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన అభిమన్యుతో పాటు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (0)లను జట్టు ఖాతా తెరవకముందే నెసర్ తొలి ఓవర్ వరుస బంతుల్లోనే అవుట్ చేశాడు. రెండో ఓవర్లో రాహుల్, మూడో ఓవర్లో కెప్టెన్ రుతురాజ్ (4) నిష్క్రమించడంతో 11 పరుగులకే టాప్–4 బ్యాటర్లను కోల్పోయింది. ఈ దశలో దేవ్‌దత్ పడిక్కల్ (26; 3 ఫోర్లు)కు జతయిన జురేల్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలకుండా ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించాక పడిక్కల్‌ను నెసర్ అవుట్ చేశాడు. జురెల్ ఈసారి నితీశ్‌తో కలిసి జట్టు స్కోరును 100 దాటించాడు. భాగస్వామ్యం బలపడుతున్న సమయంలో వెబ్‌స్టర్ ఒకే ఓవర్లో నితీశ్, తనుశ్ (0), ఖలీల్ అహ్మద్ (1)లను అవుట్ చేసి భారత్‌ను ఆలౌట్‌కు సిద్ధం చేశాడు. ప్రసిధ్ కృష్ణ (14) సహకారంతో జురేల్ ఇన్నింగ్స్‌ను నడిపించడంతో భారత్ 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది. నెసర్ (4/27), వెబ్‌స్టర్ (3/19) భారత్‌ను దెబ్బ కొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా 'ఎ' ఆట ముగిసే సమయానికి 17.1 ఓవర్లలో 2 వికెట్లకు 53 పరుగులు చేసింది. హ్యారిస్ (26 బ్యాటింగ్), కాన్‌స్టాస్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



సూర్యచంద్రులను ఏకకాలంలో మోస్తూ.. తాడుపై బ్యాలెన్స్ చేస్తున్నట్లు కనిపిస్తున్న ఈ చిత్రం అద్భుతం కదూ.. అమెరికాలోని యూటా రాష్ట్రంలో సూర్యగ్రహణం సమయంలో బెల్వా హేడెన్ అనే ఫొటోగ్రాఫర్ తీసిన ఈ చిత్రం నేచర్స్ బెస్ట్ ఫొటోగ్రఫీ పురస్కారాల్లో అవుట్‌డోర్ అడ్వెంచర్ కేటగిరీలో మొదటి బహుమతిని గెలుచుకుంది.

ఈ స్మారక శిల వయసు 3,500 ఏళ్లు

సాక్షి, హైదరాబాద్: మూడున్నర వేల ఏళ్ల క్రితం నాటి స్మారక శిల (మెన్హిర్) వెలుగు చూసింది. నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం కంసానిపల్లె గ్రామ శివారులో డిండి నదీ తీరంలో దీన్ని గుర్తించారు. వారసత్వ ప్రాంతాలను పరిరక్షించాలంటూ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో భాగంగా ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గురువారం డిండి నదీ తీరాన్ని సందర్శించారు. కొండారెడ్డి పల్లి–ఉప్పునుంతల మధ్యలో నదీ తీరంలో ఈ నిలువురాయిని గుర్తించారు. భూ ఉపరితలంలో ఎనిమిది అడుగుల ఎత్తు, రెండడుగుల వెడల్పు, ఒకటిన్నర అడుగు మందంతో ఉన్న ఈ స్మారక శిల కొంతమేర పక్కకు ఒరిగి ఉంది. గ్రానైట్ శిలతో చేసిన ఈ స్మారకం 3,500 ఏళ్ల క్రితం ఇనుపయుగం నాటిదిగా ఆయన పేర్కొన్నారు. అప్పట్లో స్థానిక మానవసమూహంలో చనిపోయిన ప్రముఖుడికి గుర్తుగా దీన్ని పాతారని, గతంలో ఈ ప్రాంతంలో ఆదిమానవుల కాలం నాటి బంతిరాళ్ల సమాధులు ఉండేవని, వ్యవసాయ పనుల్లో భాగంగా అవి కనుమరుగయ్యాయని స్థానికులు తిప్పర్తి జగన్‌మోహన్‌రెడ్డి, అభిలాశ్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి తదితరులు ఆయన దృష్టికి తెచ్చారు. మన చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న ఈ నిలువు రాయినైనా కాపాడుకోవాలని ఆయన స్థానికులకు సూచించారు.



వైద్య విద్యార్థినికి మంత్రి అండ



దేవికి చెక్కు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్: మెడికల్ సీటు సాధించినా.. ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద గిరిజన విద్యార్థినికి మంత్రి పొన్నం ప్రభాకర్ అండగా నిలిచారు. 'డాక్టర్ చదువుకు డబ్బుల్లేక కూలి పనులకు'.. శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంత్రి స్పందించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం భల్లునాయక్ తండాకు చెందిన లావుడ్యా లక్ష్మి రమేశ్ దంపతుల పెద్ద కూతురు దేవికి మిట్టపల్లి సురభి వైద్య కళాశాలలో సీటు వచ్చింది. చదువుకు ఆర్థిక స్తోమత లేకపోవడంపై సాక్షి కథనానికి స్పందించిన మంత్రి గురువారం క్యాంప్ కార్యాలయంలో విద్యార్థినికి రూ.1.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సాక్షి యాజమాన్యానికి గిరిజన విద్యార్థిని దేవి కృతజ్ఞతలు తెలిపింది.

● మరో 'దారి' లేక...



పినపాక: పురిటినొప్పులతో బాధపడుతున్న ఆదివాసీ మహిళను.. 108 వచ్చే మార్గం లేక మంచంపై మోసుకెళ్తుండగా దారిలోనే ప్రసవించింది. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన గురువారం వెలుగు చూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వలస ఆదివాసీ గ్రామమైన ఉమేశ్‌చంద్ర నగర్ గ్రామానికి చెందిన గర్భిణి మడకం అనితకు నెలలు నిండడంతో.. బుధవారం సాయంత్రం దాటాక పురిటినొప్పులు మొదలయ్యాయి. 108 వాహనానికి సమాచారం ఇచ్చినా గ్రామానికి చేరే మార్గం లేక ఊరి చివరలోనే నిలిచిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి మంచంపై అనితను మోసుకెళ్తుండగా దారిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ కుమారుడిని 108 వాహనంలో జానంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని డాక్టర్ శృతి తెలిపారు.

- 108 వచ్చే దారిలేక మంచంపై మోసుకెళ్లిన గ్రామస్తులు
- దారిలోనే గర్భిణి ప్రసవం

● నూకలమ్మేసి.. లారీ వదిలేసి..



కొడిపల్లి వద్ద డ్రైవర్ వదిలేసిన లారీ

శివ్వంపేట(నర్సాపూర్): లోడ్ చేసిన నూకలను అమ్ముకుని.. లారీని వదిలేసి పోయాడొక డ్రైవర్. మెదక్ జిల్లా శివ్వంపేటలో గురువారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలివి. మెదక్ పట్టణానికి చెందిన సంతోశ్ లారీ యజమాని. ఈ నెల 5న శివ్వంపేట మండలం గోమారంలోని నటరాజు రైస్‌మిల్లు నుంచి నూకలు లోడ్ చేసుకుని వికారాబాద్‌కు వెళ్లాలని డ్రైవర్ ఇమ్రాన్‌కు సూచించాడు. అయితే.. మర్నాడు వికారాబాద్‌లో అన్‌లోడ్ చేయాల్సిన నూకల లారీ అక్కడికి రాకపోవడంతో ఆందోళన చెందిన సంతోశ్.. డ్రైవర్‌కు ఫోన్ చేసినా స్పందించలేదు. గురువారం మళ్లీ ఫోన్ చేయగా నూకలు తాండూరులో అమ్మేశానని, లారీ కొడిపల్లిలోని ఓ బంకు వద్ద వదిలేశానని చెప్పడంతో కంగుతిన్నాడు. కొడిపల్లి వద్ద లారీని గుర్తించిన సంతోశ్.. శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ అమ్మేసిన నూకల విలువ రూ.9 లక్షలుంటుందని సంతోశ్ తెలిపాడు.

● సీఎంకు స్వర్ణాభినందన



సీఎం చిత్రంతో కూడిన శాలువాను నేసిన నల్ల శ్రావణ్



తెలంగాణ రాష్ట్ర చిత్రంలో రేవంత్‌రెడ్డి ఫొటోను నేసిన వెల్ది హరిప్రసాద్

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సిరిసిల్ల సాయినగర్‌కు చెందిన నల్ల శ్రావణ్ 2 గ్రాముల బంగారు పోగులతో అగ్గిపెట్టెలో ఇమిడే శాలువాపై రేవంత్ చిత్రాన్ని నేశారు. 34 అంగుళాల పొడవు, 2 మీటర్ల వెడల్పుతో 200 గ్రాముల బరువున్న శాలువాను మూడురోజుల్లో నేశారు. సిరిసిల్లకు చెందిన మరో నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ కూడా ఐదు రోజులపాటు శ్రమించి పట్టుపోగులతో తెలంగాణ పటంలో సీఎం చిత్రాన్ని ఆవిష్కరించారు. – సిరిసిల్ల

● 'ఏకా'గ్రతతో బోధన



ముదిగొండ: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లబి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 16మంది విద్యార్థులే ఉన్నారు. వీరిలో గురువారం 1, 2, 3 తరగతుల్లో ఇద్దరు చొప్పున.. నాలుగో తరగతిలో నలుగురు హాజరయ్యారు. ఇక ఐదో తరగతిలో ఉన్నది ఇద్దరే కాగా ఒక విద్యార్థినికి గాయం కావడంతో గైర్హాజరైంది. ఇక మిగిలిన విద్యార్థినికి ప్రధానోపాధ్యాయుడు షేక్ మతిన్ బోధించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

నంబర్‌వన్ సర్వీసెస్

జాతీయ లోక్ అదాలత్ తొలి స్థానంలో టీజీఎస్ఎల్ఎస్ఏ | ప్రతీ యేటా రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం | బాధితులకు పరిహారం అందజేయడంలోనూ అగ్రగామి | 9న జాతీయ న్యాయసేవల ప్రాధికారిక దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: 99.90, 98.74, 98.88.. ఇవి పదో తరగతి ఫలితాలో, ఇంటర్ ఫలితాలో కాదు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ ఎల్ఎస్ఏ) సాధించిన రికార్డులు. వరుసగా ఒకటి, రెండో, మూడో జాతీయ లోక్ అదాలత్‌లలో దేశ వ్యాప్తంగా కేసుల పరిష్కారంలో నంబర్ వన్‌గా నిలిచింది. తెలంగాణకన్నా పెద్ద రాష్ట్రాలున్నా ఏటా రికార్డు స్థాయిలో కేసులను పరిష్కరిస్తూ మన్ననలు పొందుతోంది. కక్షిదారులకు పరిహారం చెల్లింపుల్లోనూ అగ్రగామిగా సేవలందిస్తోంది. ప్రజలకు ఉచిత న్యాయం, సత్వర న్యాయమే ధ్యేయంగా పనిచేస్తోంది. న్యాయస్థానాలకు ప్రత్యామ్నాయ పరిష్కార వేదికగా ఎదుగుతోంది. భవిష్యత్‌లో నూటికి నూరు శాతం కేసుల పరిష్కారమే కాకుండా.. గ్రామీణ ప్రజల వద్దకు చేరుకునేందుకు టీజీఎస్ ఎల్ఎస్ఏ ప్యాట్రన్ చీఫ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, టీజీఎస్ ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలో వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నెల 9న జాతీయ న్యాయ సేవల ప్రాధికారిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

భారం లేకుండా పరిష్కారం

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏటా నాలుగుసార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారు. ఈ ఏడాది సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలో అదాలత్‌లు నిర్వహించారు. న్యాయపరమైన భారాన్ని తగ్గించి, కక్షిదారులకు సత్వర న్యాయం అందజేయడమే అదాలత్‌ల లక్ష్యం. ఇక్కడ ప్రీ లిటిగేషన్(ఇంకా కోర్టులో కేసు వేయనివి), పెండింగ్ (సివిల్, రాజీ పడదగిన క్రిమినల్) కేసులను కూడా పరిష్కరిస్తారు. వ్యాజ్యాలను సామరస్య పూర్వకంగా పరిష్కారించుకోవడానికి అదాలత్ ఓ చక్కని వేదిక. కోర్టుల్లో నమోదు కాని కేసులు, క్రిమినల్ కాంపౌండబుల్ నేరాలు, ట్రాఫిక్ చలాన్లు, రెవెన్యూ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, మోటార్ ప్రమాద క్లెయిమ్‌లు, చెక్ బౌన్స్ కేసులతో సహా కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్న పలు కేసులు, కార్మిక, వివాహ వివాదాలు (విడాకుల కేసులు మినహా), భూ సేకరణ కేసులు, వినియోగదారుల విషయాలను పరిష్కరిస్తుంది.

లోక్ అదాలత్‌లో దేశవ్యాప్తంగా వచ్చిన కేసులు, పరిష్కారం

లోక్ అదాలత్	వచ్చిన కేసులు	పరిష్కారం	శాతం
మొదటిది	7,51,30,232	3,11,98,807	41.53
రెండోది	4,19,02,115	2,28,39,988	54.51
మూడోది	3,21,25,245	2,32,09,814	72.24

లోక్ అదాలత్‌ల ద్వారా దేశవ్యాప్తంగా మొత్తం కేసుల పరిష్కారం

లోక్ అదాలత్	ప్రి లిటిగేషన్	పెండింగ్	మొత్తం	నగదు పంపిణీ (రూ.కోట్లలో)
మొదటిది	2,73,31,725	38,67,082	3,11,98,807	7,482.46
రెండోది	1,86,31,391	42,08,597	2,28,39,988	16,921.32
మూడోది	1,86,56,855	45,52,959	2,32,09,814	19,247.04

తెలంగాణలో ప్రి లిటిగేషన్ కేసుల పరిష్కారం

లోక్ అదాలత్	వచ్చిన కేసులు	పరిష్కారం	పరిష్కార శాతం
మొదటిది	1,06,02,817	1,05,97,307	99.95
రెండోది	5,75,520	5,71,486	99.30
మూడోది	6,41,022	6,33,239	98.79



ఆశ్రయించండి ఇలా..

ఉచిత, సత్వర న్యాయం కోసం మండల న్యాయ సేవాధికార సంఘం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలకు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. 040–23446723 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోగాని, వ్యక్తిగతంగాగానీ న్యాయ సాయం కోరవచ్చు.

ప్రత్యామ్నాయ పరిష్కార వేదిక



లోక్ అదాలత్‌లలో కక్షిదారుల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందిస్తున్నాం. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదికగా ఎదిగేందుకు చర్యలు చేపట్టాం. ప్రచార మాధ్యమాల ద్వారా అదాలత్‌పై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నాం. అలాగే జిల్లా, మండల స్థాయిల్లో లోక్ అదాలత్‌లను ఇంకా బలోపేతం చేస్తున్నాం. మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు మెరుగుపర్చడానికి అథారిటీ ప్యాట్రన్‌చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌జస్టిస్ సుజోయ్‌పాల్ కృషి చేస్తున్నారు. వారి నేతృత్వం, సూచనలతో పెద్ద మొత్తంలో కేసుల పరిష్కారం సాధ్యమైంది. న్యాయమూర్తులు, లీగల్ సర్వీసెస్ సంస్థల సహకారంతో భవిష్యత్‌లో 100 శాతం కేసులు పరిష్కరిస్తాం.

– సీహెచ్ పంచాక్షరి, సభ్యకార్యదర్శి, టీజీఎస్ఎల్ఎస్ఏ

ఉచిత న్యాయం ఎవరు కోరవచ్చు?

న్యాయసేవాధికార చట్టం 1987లోని సెక్షన్ 12 ప్రకారం.. ఎస్టీ, ఎస్సీ, మానవ అక్రమ రవాణా బాధితులు, మహిళలు, పిల్లలు, అంగవైకల్య బాధితులు, విపత్తు బాధితులు, జాతి వైషమ్యాలతో హింసకు గురైనవారు, కులం పేరుతో వేధింపులకు గురైన వారు అథారిటీ నుంచి ఉచిత న్యాయ సాయం పొందవచ్చు

లోక్ అదాలత్‌లలోని ప్రత్యేక సేవలు

- న్యాయవాదిని నియమించుకోలేని అర్హులైన వారికి న్యాయవాదిని ఏర్పాటు చేస్తుంది.
- పిటిషన్లు, అప్పీల్ వేసేందుకు ప్యానల్ లాయర్లు అందుబాటులో ఉంటారు.
- న్యాయపరమైన అంశాలపై సలహాలు, సూచలనలు కూడా ఇస్తారు.
- తీర్పులు, ఉత్తర్వులతో పాటు ఇతర అవసరమైన పత్రాలను ఉచితంగా అందిస్తారు.

తెలంగాణలో పెండింగ్ కేసుల పరిష్కారం


లోక్ అదాలత్	వచ్చిన కేసులు	పరిష్కారం	పరిష్కార శాతం
మొదటిది	5,35,757	5,29,607	98.85
రెండోది	4,70,735	4,61,565	98.05
మూడోది	6,11,996	6,05,805	98.99

తెలంగాణలో మొత్తం కేసుల పరిష్కారం

లోక్ అదాలత్	ప్రి లిటిగేషన్	పెండింగ్	మొత్తం	నగదు పంపిణీ (రూ.కోట్లలో)
మొదటిది	1,05,97,307	5,29,607	1,11,26,914	44.37
రెండోది	5,71,486	4,61,565	10,33,051	75.31
మూడోది	6,33,239	6,05,805	12,39,044	250.19

తెలంగాణలో వచ్చిన కేసులు, పరిష్కారం


అదాలత్	వచ్చిన కేసులు	పరిష్కారం	శాతం
మొదటిది	1,11,38,574	1,11,26,914	99.90
రెండోది	10,46,255	10,33,051	98.74
మూడోది	6,33,239	12,39,044	98.88



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పూరీ తీరంలో సీఎం సైకత శిల్పాన్ని శిల్పులతో చెక్కించిన రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్..

కామ్రేడ్ల కస్సుబుస్సు!





కాంగ్రెస్ సర్కారుపై సీపీఎం, సీపీఐ అసంతృప్తి

- ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేకంగా ఉన్నాయనే భావన!
- ఆ పార్టీలకిచ్చిన హామీలు నెరవేర్చక పోవడమూ కారణమే?
- ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న తమ్మినేని
- ఐక్య పోరాటాలు నిర్వహిస్తామంటూ హెచ్చరికలు
- మిత్రపక్షం మిత్రపక్షమే..పోరాటం పోరాటమే అన్న కూనంనేని

సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు ఆ పార్టీ చేసిందేమీలేదు. ఏడాది పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు సౌకర్యం తప్ప వేటినీ అమలు చేయలేదు. దీంతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశీ పెట్టుబడిదారులకు మూసీ భూములు, ఫార్మా భూముల్ని కట్టబెట్టేందుకు మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల కోసం పని చేస్తున్న వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలు రాబోయే కాలంలో ఐక్య పోరాటాల్ని నిర్వహించేలా ఊరూరా ఎర్రజెండాను తీసుకెళ్తాం. ఈ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి స్నేహపూర్వకంగా చెప్పాం. ఇక నుండి రోడ్ల పైకి వస్తాం. మాకు గెలవడం రాకపోయినా, ఓడించడం వచ్చు..'అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవలచేసిన తీవ్రమైన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రాజేశాయి. మొన్నటి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆ పార్టీ ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయడంలో ఆంతర్యమేంటన్న చర్చ జరుగుతోంది. అయితే కాంగ్రెస్ తమకిచ్చిన హామీ నెరవేర్చక పోవడం, రుణమాఫీ, రైతు భరోసా, హైడ్రా, మూసీ సుందరీకరణ తదితర అంశాలకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు.. రైతులు, ఇతర వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని సీపీఎం భావిస్తుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇటీవల గ్రూప్–1 అభ్యర్థులపై లాఠీచార్జి వంటి మరికొన్ని అంశాలను కూడా ఆ పార్టీ గట్టిగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వంపై ఒకపక్క సీపీఎం విరుచుకు పడుతుంటే, మరోపక్క సీపీఐ కూడా వివిధ సమస్యలపై తన నిరసన వ్యక్తం చేస్తోంది.

ప్రజలకు దూరమవుతామన్న భావన..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ పొత్తు పెట్టుకొని ఒక సీటు గెలవగా, సీపీఎం పార్టీ పొత్తు కుదరక ఒంటరిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. అయితే పార్లమెంటు ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు రెండు కమ్యూనిస్టు పార్టీలు కూడా మద్దతు తెలిపాయి. సీపీఐకి ఒక ఎమ్మెల్సీ ఇస్తామని అసెంబ్లీ పొత్తుల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇవ్వగా, పార్లమెంటు ఎన్నికల్లో మద్దతు ప్రకటించినందుకు సీపీఎంకు కూడా ఎమ్మెల్సీ లేదా స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించాలన్న అవగాహన కుదిరినట్లు ప్రచారం జరిగింది. అయితే ఏడాది కావొస్తున్నా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదన్న అసంతృప్తి కామ్రేడ్లలో ఉందని అంటున్నారు. అలాగే పలు సందర్భాల్లో సమస్యలపై సీఎంకు వినతిపత్రాలు ఇచ్చినా లెక్క చేయడంలేదని వామపక్షాలు భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఒకవైపు బీఆర్ఎస్, మరోవైపు బీజేపీలు దూకుడుగా ప్రభుత్వంపై విరుచుకుపడుతుంటే.. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టే తాము మిన్నకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని, వారికి దూరం అయ్యేందుకు అవకాశం ఉందనే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. దీని ఫలితమే సీపీఎం, సీపీఐల ప్రతిస్పందనలని అంటున్నారు.

ఇటీవలి పరిణామాలేంటి..?

- బెటాలియన్ కానిస్టేబుళ్ల పనిభారాన్ని పెంచే జీవోను రద్దుచేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.
- పేదల ఇళ్లను పడగొట్టి ప్రభుత్వం వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని, ఒకవైపు ప్రజాపాలన అంటూనే ప్రజలపై నిర్బంధాన్ని కొనసాగిస్తోందని సీపీఎం విమర్శించింది.
- 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పోలీసులను, అధికారులను ప్రయోగిస్తోంది. ఇళ్ల కూల్చివేతకు ఏర్పాట్లు చేస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రభుత్వం ఇంత హడావుడిగా నిర్ణయాలు తీసుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదంటూ సీఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని వీరభద్రం లేఖ రాశారు.
- 'రైతులకు ప్రకటించిన రు.2 లక్షల రుణ మాఫీని అర్హులైనవారందరికీ అమలు చేయాలి. అలాగే పంటకాలం పూర్తవుతున్నప్పటికీ వానాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. తక్షణమే రైతు భరోసా చెల్లించాలి..'అని సీపీఎం కోరింది.
- గ్రూప్–1 అభ్యర్థులపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండించింది. వారికి న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని, అభ్యర్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.
- వానాకాలం, యాసంగికి రైతుభరోసా, రుణ మాఫీలను వెంటనే అమలు చేయాలని సీపీఐకి చెందిన రైతుసంఘం డిమాండ్ చేసింది. ఈ విషయమై జిల్లాల్లో ధర్నాలు చేపట్టింది.
- హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, మిత్రపక్షం మిత్రపక్షమే.. పోరాటం పోరాటమేనంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తేలనున్న వలస కార్మికుల సంఖ్య!

సమగ్ర సర్వేలో వారి వివరాల నమోదు

- ఏ దేశంలో ఎంత మంది తెలంగాణ కార్మికులు ఉన్నారో స్పష్టత వచ్చే అవకాశం
- లెక్క తేలితే సంక్షేమ కార్యక్రమాల అమలుకు వీలు



మోర్తాడ్‌లో సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేతో గల్ఫ్‌తో పాటు వివిధ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్య తేలనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సమగ్ర సర్వేలో వలస కార్మికుల కోసం ప్రత్యేక కాలమ్ కేటాయించడంతో తెలంగాణ నుంచి ఎంత మంది వలస వెళ్లారనే విషయంలో స్పష్టత లభించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు వలస కార్మికుల సంఖ్యపై ఏ ప్రభుత్వం వద్ద వివరాలు లేవని తెలుస్తోంది. కేవలం వలస కార్మికుల సంఘాల నాయకులు ఇచ్చే సమాచారంతోనే అంచనా వేయడం తప్ప, సరైన సమాచారం లేదని అంటున్నారు. ఇప్పుడు నిర్వహిస్తున్న సర్వేలో ఏ ఇంటి నుంచి ఎంత మంది వలస వెళ్లారు. ఏ దేశానికి వెళ్లారు, ఏ కారణం చేత వలస వెళ్లారనే వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేయనున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు 15 లక్షల మంది వరకు వలస వెళ్లి ఉంటారని అంచనా తప్ప ప్రభుత్వం వద్ద పక్కా సమాచారం ఏదీ లేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఒకేరోజు సమగ్ర సర్వేను నిర్వహించింది. అప్పట్లో వలస కార్మికుల సంఖ్యను లెక్కించినా ఆ వివరాలను బయటపెట్టలేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కేరళ, పంజాబ్ తరహాలో గల్ఫ్, ఇతర దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్యను లెక్కిస్తే వారికి ఏవైనా సంక్షేమ పథకాలు అందించడానికి ప్రణాళికను రూపొందించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు సార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ రోజు కూడా వలస కార్మికుల సంఖ్యను తేల్చడానికి సిద్ధపడలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సమగ్ర సర్వేలో వలస కార్మికుల అంశం ప్రత్యేకంగా ప్రస్తావనకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం అని పలువురు చెబుతున్నారు.

ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది



సమగ్ర సర్వేలో వలస కార్మికుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయడం మంచి విషయం. గతంలో నిర్లక్ష్యం జరిగినా ఇప్పుడు మాత్రం వలస కార్మికుల సంఖ్యను తేల్చడానికి వారి వివరాల నమోదు ఎంతో బాగుంది. సమగ్ర సర్వే పూర్తి అయిన తరువాత వలస కార్మికుల సంఖ్యను వెల్లడించాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

విద్యుత్ వెలుగులకు 'చంద్ర' గ్రహణం



బాబు గత హయాంలో అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు

- అప్పుడు అప్పుల పాలై నేటికీ వడ్డీలకు కొత్త అప్పులు చేస్తున్న విద్యుత్ సంస్థలు
- ప్రజలపైనా చార్జీల భారం..వ్యవసాయానికి క్రాప్ హాలిడే బాబు పుణ్యమే
- పరిశ్రమలకు వారంలో రెండు రోజులు పవర్ హాలిడే
- జగన్ హయాంలో ప్రజలకు నిరంతర విద్యుత్..అభివృద్ధి బాటలో విద్యుత్ సంస్థలు
- రైతులకు పగలే 9 గంటలు కరెంటు ఇచ్చిన జగన్ ప్రభుత్వం
- జగన్ హయాంలో 34,181 మిలియన్ యూనిట్లకు పెరిగిన ఉత్పత్తి సామర్థ్యం
- ఫలితంగా విద్యుత్ పంపిణీ సంస్థలకు తగ్గిన విద్యుత్ కొనుగోలు ఖర్చు

సాక్షి, అమరావతి: 2014- 2019 పాలనలో చంద్రబాబు చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలకు, విద్యుత్ సంస్థలకు శాపాలుగా మారి నేటికీ వెంటాడుతున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ రంగానికి చేసిన అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) కారణంగా విద్యుత్ సంస్థలు నేటికీ తేరుకోలేకపోతున్నాయి. విద్యుత్ కొనుగోలు ఖర్చులతో పాటు, పాత అప్పులకు వడ్డీలు కట్టేందుకు కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. ఆ భారం అంతిమంగా విద్యుత్ వినియోగదారులపైనే పడుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన (2019–2024) నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ సంస్థలను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టింది. విద్యుత్ సంస్థలకు ఆర్థికంగా చేయూతనిచ్చింది. ప్రజలపై చార్జీల భారం పడకూడదని భావించి, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరిచింది. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతోపాటు, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందుబాటులో ఉంచడంపై ప్రధానంగా దృష్టి సారించింది. అనుకున్నట్లుగానే ఐదేళ్లలో గత ప్రభుత్వం విద్యుత్ రంగంలో విప్లవాత్మక వృద్ధిని సాధించింది. పెట్టుబడుల సాధనతో పాటు, డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను అందించి, దేశంలోనే ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డులను సైతం అందుకుంది. కానీ 2024లో మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీల పిడుగు ప్రజల నెత్తిన పడింది. పాలన చేపట్టిన వంద రోజులకే సర్దుబాటు పేరుతో దాదాపు రూ.17 వేల కోట్లకు పైగానే ప్రజలపై భారం వేసింది.

జగన్‌కు.. చంద్రబాబుకు చాలా తేడా

2018–19తో పోల్చితే 2023–24 నాటికి విద్యుత్ రంగంలో వృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. ఏపీ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం చంద్రబాబు దిగిపోయే నాటికి 7,213 మెగావాట్లు ఉంటే అది జగన్ హయాంలో 8,789 మెగావాట్లకు పెరిగింది. ఇందులో కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్, నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్ ఉన్నాయి. చంద్రబాబు హయాంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తి 2018–19లో 27,197 మిలియన్ యూనిట్లు ఉంటే జగన్ హయాంలో 2023–24లో 34,181 మిలియన్ యూనిట్లుగా ఉంది. అంటే 6,984 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. అలాగే ఏపీ జెన్‌కో లాభాలు 2018–19లో రూ.2,044 కోట్లు ఉంటే, 2023–24లో రూ.2,469 కోట్లుగా ఉంది. అదే ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీపీడీసీఎల్)వి అయితే చంద్రబాబు సమయంలో కేవలం రూ.1,565 కోట్లు ఉంటే, జగన్ హయాంలో రూ.6,240 కోట్లకు చేరాయి.

నిలువునా ముంచేసిందే చంద్రబాబు..

రాష్ట్రంలో 2015–19 మధ్య 30,742 మిలియన్ యూనిట్లు మిగులు విద్యుత్ రాష్ట్రంలో ఉండేది. ఈ మొత్తం మిగులు విద్యుత్‌ను చంద్రబాబు బ్యాక్‌డౌన్ (వృథా) చేయించారు. అవసరం లేకపోయినా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లను అధిక ధరలకు కుదుర్చుకున్నారు. నిజానికి రెన్యూవబుల్ పవర్ పర్చేస్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీపీఓ) నిబంధనల ప్రకారం.. మొత్తం విద్యుత్‌లో పునరుత్పాదక విద్యుత్‌ను 5 నుంచి 11 శాతం తీసుకోవాలి. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా 23 శాతం పునరుత్పాదక విద్యుత్‌ను అత్యధిక ధరలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంది. యూనిట్ రూ 2.40కు లభిస్తున్న బొగ్గు ఆధారిత విద్యుత్‌ను వృథాచేసి, రూ.5కు బయట కొనుగోలు చేసింది. అదే సమయంలో పవన విద్యుత్‌ను యూనిట్‌కు ఏకంగా రూ.4.84కు తీసుకుంది. అప్పట్లో సౌర విద్యుత్ యూనిట్ రూ.3.54కు బదులు రూ.8.90 వెచ్చించారు. వీటికి ఫిక్స్‌డ్ చార్జీలు అదనం. ఇలా దాదాపు 8 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల విద్యుత్ సంస్థలపై 25 ఏళ్లపాటు ఏటా అదనంగా రూ.3,500 కోట్ల భారం పడుతోంది. ఈ భారాలను పూడ్చుకోవడానికి డిస్కంలు ప్రజలపై విద్యుత్ చార్జీలు వేస్తున్నాయి. చంద్రబాబు గత హయాంలో ఏపీఈఆర్సీకి సమర్పించకుండా దాదాపు రూ.20 వేల కోట్ల ట్రూ అప్ భారాన్ని మిగిల్చారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే మళ్లీ ఇంధన సర్దుబాటు చార్జీలు వేసి ప్రజలకిచ్చిన మాట తప్పుతున్నారు.

బాబు పాలనలో చీకట్లు.. జగన్ హయాంలో వెలుగులు..

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 61,347 మిలియన్ యూనిట్లు ఇవ్వడానికే ఆపసోపాలు పడి పరిశ్రమలకు వారంలో రెండు రోజులు పవర్ హాలిడేలు విధించేవారు. విద్యుత్ కోతల వల్ల రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితులు కల్పించారు. వ్యవసాయానికి రోజులో నాలుగైదు గంటలే ఇచ్చేవారు. అది కూడా రాత్రి సమయంలో ఇవ్వడం వల్ల రైతులు ప్రాణాలు పోగొట్టుకునేవారు. విద్యుత్ కోసం పొలాల్లో పడిగాపులు కాస్తూ రైతులు ప్రాణాలు పోగొట్టుకున్న ఈ చీకటి రోజుల నుంచి విముక్తి కలిగించాలని.. రానున్న 30 ఏళ్లలో అన్నదాతలకు విద్యుత్ కష్టాలు లేకుండా చేయాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి 7 వేల మెగావాట్లు తీసుకుని వ్యవసాయ రంగానికి అందించాలని నాటి సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.10 ఉంటే, సెకీ నుంచి యూనిట్ రూ.2.49కే వచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో దాదాపు రూ.3,750 కోట్లు రాష్ట్రానికి ఆదా అవుతుంది. అదే విధంగా జగన్ హయాంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే అర్హులైన ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు గత ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందజేసింది. అలాగే వెనుకబడిన వర్గాల కుటుంబాలు, ధోబీఘాట్‌లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లు, చేనేత కార్మికులు, లాండ్రీలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వృత్తిపరమైన స్వర్ణకార దుకాణాలకు ఉచిత, సబ్సిడీతో విద్యుత్‌ను సరఫరా చేసింది. చంద్రబాబు రాకతో వీటన్నింటికీ మంగళం పాడడంతో మళ్లీ ఏపీలో ఆనాటి చీకటి రోజులు మొదలవుతున్నాయి.

క్లుప్తంగా...

బీఈవీ, జెడ్ఈవీలను ప్రోత్సహించండి

ఆటోమొబైల్ కంపెనీల వినతి



రవాణా శాఖ మంత్రితో ఆటోమొబైల్ కంపెనీల ప్రతినిధులు

సాక్షి, అమరావతి: టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ, ఎంజీ మోటార్, మహీంద్రా కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డితో గురువారం విజయవాడలో సమావేశమయ్యారు. రాష్ట్ర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీలో బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు(బీఈవీలు), జీరో ఎమిషన్ వాహనాలను(జెడ్ఈవీలు) ప్రోత్సహించాలని వారు మంత్రిని కోరారు. విద్యుత్ వాహనాల ప్రయోజనాలు.. రాష్ట్రంలో రానున్న రోజుల్లో వాటి వినియోగం గురించి చర్చించారు.

ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడిగా రాజశరణ్ షాహి



రాజశరణ్ షాహి



వీరేంద్ర సింగ్

సాక్షి, అమరావతి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ అధ్యక్షుడిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రొఫెసర్ రాజశరణ్ షాహి తిరిగి ఎన్నికయ్యారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వీరేంద్ర సింగ్ సోలంకి కొత్తగా ఎన్నికయ్యారు. ఏబీవీపీ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికలు గురువారం నిర్వహించి, ఫలితాలను ఏబీవీపీ జాతీయ కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడు, ప్రొఫెసర్ ప్రశాంత్ సాఠే ముంబైలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే ఏబీవీపీ జాతీయ సదస్సులో వీరు బాధ్యతలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

మిల్లర్లో ఇరుక్కుని వ్యక్తి మృతి



హరినాథ (ఫైల్)

గాలివీడు: పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మిల్లర్లో ఇరుక్కుని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన అన్నమయ్య జిల్లా గాలివీడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు..అరవీటి వాండ్లపల్లెకు చెందిన బుడ్డా రామచంద్ర కుమారుడు బుడ్డా సోమశేఖర్ తన పొలంలో దుక్కులు చేయడానికి చిలకలూరిపేటకు చెందిన తలారి ఆదినారాయణ కుమారుడు తలారి హరినాథ(33)ను పిలుచుకున్నాడు. బుధవారం రాత్రి సోమశేఖర్ తన ట్రాక్టర్‌కు మిల్లర్ పెట్టి పొలం దున్నసాగాడు. ట్రాక్టర్‌కు మిల్లర్ అమర్చి దున్నడంలో అనుభవం లేకపోవడం, అజాగ్రత్త కారణంగా మిల్లర్ని రివర్స్ చేస్తున్న సమయంలో హరినాథ మిల్లర్లో ఇరుక్కుని మరణించాడు.

బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడి?

ఒంగోలు టౌన్: నాలుగో తరగతి బాలికపై పాఠశాల ఉపాధ్యాయుడు లైంగికదాడికి పాల్పడినట్టు తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్న ఘటన కలకలం సృష్టించింది. బాలిక తండ్రి కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు 9వ తరగతి చదువుతుండగా, పదేళ్ల కుమార్తె అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల నుంచి వచ్చిన బాలిక దుస్తులకు రక్తపు మరకలు ఉండటాన్ని గమనించిన తల్లి ఏమైందని ప్రశ్నించింది. స్కూల్లో ఓ మాస్టారు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు చెప్పడంతో పాటు బాలికకు బ్లీడింగ్ అవుతుండటంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు బాలికను ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి తల్లిదండ్రులను విచారించారు. ఆ బాలిక మాత్రం తల్లిదండ్రులతో మాట్లాడేందుకు కూడా భయపడుతోంది. ఒకసారి తన స్నేహితురాలు తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు చెబుతుండగా, మరోసారి ఉపాధ్యాయుడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని చెబుతోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉందని పోలీసులు అంటున్నారు.

దేవదాయశాఖలో 500 పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: దేవదాయశాఖలోని వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న అధికారులు, అర్చకులకు సంబంధించిన 500 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నామని దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శాఖలో ఖాళీగా ఉన్న అర్చక విభాగం, పరిపాలనపరమైన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్తీకమాసంలో నిర్దేశించిన ప్రాంతాల్లో చతుర్వేద సభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

రూ.38.43 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

- నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు విక్రయించిన స్విగ్గీ బాయ్స్
- విజయవాడలో ఐదుగురి అరెస్ట్



విశాఖ సిటీ : పార్ట్ టైం ఉద్యోగాల పేరిట టోకరా వేసిన సైబర్ నేరగాళ్ల కోసం దర్యాప్తు చేపట్టగా.. వారికి బ్యాంక్ ఖాతాలు విక్రయించిన స్విగ్గీ బాయ్స్ ఇరుక్కుపోయారు. కమీషన్ వస్తుందన్న ఆశతో బ్యాంక్ అకౌంట్లను ఇచ్చిన ఐదుగురు స్విగ్గీ బాయ్స్‌ని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ పార్ట్ టైం జాబ్ పేరుతో ప్రకటన వచ్చింది. దీంతో అతడు ఆ లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నింపాడు. తరువాత అతడికి మూడు లింక్‌లు పంపించి అందులో వీడియో చూసి లైక్ చేయమని, చేసిన తరువాత వాటి స్క్రీన్ షాట్లు పెట్టమని మెసేజ్ చేశారు. అనంతరం టెలిగ్రామ్ యాప్ గ్రూప్‌లో అతడిని యాడ్ చేసి ఆ తరువాత చేయాల్సిన టాస్కులను వివరించారు. ఆ టాస్కులు చేస్తే డబ్బులు సంపాదించవచ్చని నమ్మించారు. ముందుగా ప్రీపెయిడ్ టాస్కుల పేరుతో రూ.1,000, రూ.1,300, రూ.3,900 ఇలా నగదు అందించారు. ఇంకా అధిక కమీషన్ ఇస్తామని నమ్మించి రూ.32,500 నుంచి దఫదఫాలుగా రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్‌మెంట్ పేరిట కట్టించుకున్నారు. వారి నుంచి ఎటువంటి డబ్బు రాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో ఇప్పటివరకు సైబర్ నేరగాళ్లు రూ.38.43 లక్షలు దోచుకున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతికత సహాయంతో దర్యాప్తు చేపట్టారు. నగదు లావాదేవీల ప్రకారం.. విజయవాడకు చెందిన ఐదుగురిని పట్టుకున్నారు. వారిని విచారించగా.. వాళ్లు స్విగ్గీలో డెలివరీ బాయ్స్‌గా తేలింది. టెలిగ్రామ్ ద్వారా బ్యాంక్ ఖాతాలు విక్రయించి.. నేరగాళ్లు చెప్పిన విధంగా చేస్తున్నట్టు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయా బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా.. ఏపీతో పాటు తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, బిహార్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 93 కేసులు నమోదైనట్టు గుర్తించారు. అసలు సూత్రధారుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేతల అరెస్ట్

- అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తహశీల్దార్ ఫిర్యాదుతో అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు
- బాధితుల్ని పరామర్శించి భరోసా కల్పించిన మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



శివరాం, రామాంజనేయులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు: వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె శివరాం, మండల నాయకుడు నేట్లపల్లె రామాంజనేయుల్ని బుధవారం అర్ధరాత్రి పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిద్దరిపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మైదుకూరు మండలం నంద్యాలంపేటలోని 1910 సర్వే నంబర్‌లోని 7 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని, ఆ విషయాన్ని సూచిస్తూ తాము ఆ భూమిలో బోర్డును పాతగా నేట్లపల్లె శివరాం, రామాంజనేయులు పీకేశారని తహశీల్దార్ వి.రాజసింహ నరేంద్ర ఈ నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని పరిశీలించేందుకు తమ సిబ్బంది అక్కడికి వెళ్లగా వారిద్దరూ దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బుధవారం అర్ధరాత్రి వారిద్దరినీ అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

ముమ్మాటికీ అక్రమ కేసే

నేట్లపల్లె శివరాం, రామాంజనేయులుపై పోలీసులు బనాయించిన కేసు ముమ్మాటికీ అక్రమమేనని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మీడియాతో చెప్పారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని ధ్వజమెత్తారు. ఎఫ్ఐఆర్ కాపీ అడిగినా ఇవ్వలేదంటే ఈ కేసు ఎలాంటిదో తెలుస్తోందన్నారు. తహశీల్దార్ స్థాయిలో తప్పుడు కేసు పెట్టి హత్యాయత్నం కింద రిమాండ్‌కు పంపుతున్నారన్నారు. జైలుకు పంపలేదన్న నెపంతో జిల్లా ఎస్పీనే ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. న్యాయ పోరాటం చేసి కార్యకర్తలను ఆదుకుంటామని, అన్యాయం చేసిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా.. తహశీల్దార్ ఫిర్యాదు చేస్తే విచారించకుండానే పోలీసులు కేసు నమోదు చేయడం శోచనీయమని ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దువ్వూరు, చాపాడు ఎంపీపీలు జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య, పార్టీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మైదుకూరు మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మునిసిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్ తదితరులు పోలీసుల చర్యను ఖండించారు.

వైఎస్సార్‌సీపీలో చేరినందునే..

నేట్లపల్లె శివరాం, రామాంజనేయులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. నంద్యాలంపేటలో టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడకుండా అడ్డుకున్నందుకే వారిద్దరిపై కక్ష సాధించేందుకు అక్రమ కేసులు బనాయించారని తెలుస్తోంది. గురువారం ఉదయం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అర్బన్ సీఐ సయ్యద్ హాషంతో మాట్లాడారు. ఎందుకు వారిపై కేసు నమోదు చేశారు, ఎఫ్ఐఆర్ ఉందా అని అడిగారు. ఎఫ్ఐఆర్ రాశామని చెబుతూనే సీఐ దానిని ఇవ్వకపోవడం గమనార్హం. కాగా.. బాధితులు శివరాం, రామాంజనేయులు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో మాట్లాడుతూ.. తహశీల్దార్ చెబుతున్న భూమిని తాము చూడలేదని, భూకబ్జా చేయలేదని కన్నీటిపర్యంతమయ్యారు. తమపై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆయనకు బంధువైన తహశీల్దార్‌తో ఇదంతా చేయిస్తున్నారని ఆరోపించారు.

ఇక పోలీస్ వద్ద 'ఆధార్'

- గుర్తు తెలియని మృతదేహాల గుర్తింపునకు వెసులుబాటు
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ణయం



సాక్షి, అమరావతి: ఆధార్ డేటాను పోలీసు శాఖకు అందుబాటులోకి తేవాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. నేర పరిశోధన ప్రక్రియలో పోలీసులకు మరింత వెసులుబాటు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా వేలిముద్రలకు సంబంధించిన డేటాను పోలీసు శాఖకు అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు ఆధార్ డేటాను పర్యవేక్షించే 'యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)ను ఇప్పటికే ఆదేశించింది. యూఐడీఏఐ చట్ట ప్రకారం ఆధార్ డేటా అత్యంత గోప్యంగా ఉంచాలి. ప్రజల వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన కీలక డేటా కావడంతో ఈ మేరకు కఠిన నిబంధనలను రూపొందించింది. ఆధార్ డేటాలోని ప్రాథమికమైన వేలిముద్రలు, ఐరీష్ స్కాన్‌లను ఇతరులకు అందుబాటులోకి తేకూడదని ఆధార్ చట్టంలోని సెక్షన్ 29 (1) స్పష్టం చేస్తోంది. కాగా హైకోర్టు అనుమతితో కొంత పరిమిత డేటాను పోలీసులు పొందేందుకు సెక్షన్ 33 (1) అవకాశం కల్పిస్తోంది. దాంతో నిర్దిష్టమైన కేసుల దర్యాప్తు కోసం పోలీసులు హైకోర్టు అనుమతితో ఆధార్ డేటాను పరిశీలిస్తున్నారు. కానీ నేర పరిశోధన తీవ్రమైన జాప్యం జరుగుతోంది. ప్రధానంగా గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వలస కూలీలు, నిరుపేదలకు ఎలాంటి పత్రాలు ఉండడం లేదు. అందుకే ఆధార్ డేటాను తమకు అందుబాటులోకి తేవాలని వివిధ రాష్ట్రాల పోలీసు శాఖలు కేంద్ర హోం శాఖను కోరుతున్నాయి. దీనిపై కేంద్ర హోంశాఖ సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఆధార్ డేటాను అన్ని రాష్ట్రాల పోలీసు శాఖలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. అందుకోసం అవసరమైతే చట్ట సవరణ కూడా చేయాలని భావిస్తోంది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డుల ఉద్యమం

ఈనెల 10న ఆర్కేబీచ్‌లో ప్రారంభం

సీతంపేట: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో జరిగే 10 లక్షల పోస్టు కార్డుల ఉద్యమానికి ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పలు ప్రజా సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో పోస్టు కార్డుల ఉద్యమానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ పది లక్షల పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టామని తెలిపారు. ఒక సమస్యపై దేశ ప్రధానికి 10 లక్షల పోస్టు కార్డులు పంపడం ప్రపంచ చరిత్రలో రికార్డుగా మిగులుతుందన్నారు. ఈ నెల 10న ఆర్కేబీచ్ రోడ్ కాళీమాత ఆలయం వద్ద ఉదయం 6 గంటలకు ఈ ఉద్యమం ప్రారంభిస్తామని తెలిపారు. పోస్టు కార్డులు కావాల్సినవారు 9490690458, 8790012918 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.



పోస్టు కార్డులను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ వి.వి.రమణమూర్తి



శ్రీవారి దర్శనానికి 9 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,163 మంది స్వామివారిని దర్శించుకోగా 25,299 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముగిసిన సుబ్రమణ్యస్వామి హోమం



తిరుపతి కల్చరల్: కపిలేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన సుబ్రమణ్యస్వామి హోమం గురువారం రాత్రి ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన చేపట్టారు. సుబ్రమణ్యస్వామికి మహాభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. శుక్రవారం దక్షిణామూర్తి స్వామి హోమం జరుగనుంది.

రేపటి నుంచి భక్తజనగిరి



అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శనివారం నుంచి వరుసగా ఆరు రోజుల పాటు భక్తులు పోటెత్తనున్నారు. రెండో శనివారం, ఆదివారాలు సెలవులు, తరువాత కార్తీక సోమవారం, మంగళవారం ఏకాదశి కావడంతో ఆయా రోజుల్లో రత్నగిరికి భక్తులు లక్షలాదిగా వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకం వద్ద నిత్యం పది వేల మందికి ఉచితంగా పులిహోర, దధ్యోజనం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభం

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి ఆలయంలో నూతనంగా సహస్ర దీపాలంకరణ సేవను ఈ నెల తొమ్మిదిన ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. ఈ సేవ భక్తులకు ఈ నెల 16 నుంచి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం ఏడు గంటల నుంచి జరిగే ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ రుసుముగా రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6న జరిగిన అంతర్ కళాశాలల మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థిని జి.శృతి 64 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. జి.లావణ్య లహరి 74 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు.



నేటి నుంచి ఎస్వీయూలో యూత్ ఫెస్టివల్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో యువతరంగ్–24 పేరుతో మూడు రోజుల పాటు జరిగే ఇంటర్ కాలేజ్‌గేట్ యూత్ ఫెస్టివల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభంకానున్న యూత్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని సుమారు 30 కళాశాల నుంచి విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నట్టు వెల్లడించారు. ఐదు విభాగాల్లో జరిగే యువజనోత్సవాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు చైన్నై ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా జరిగే సౌత్‌జోన్ పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అందులోనూ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు.

రచయిత్రులకు ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ సత్కారం

నగరంపాలెం: రైతు సమస్యలపై పోరాడిన ఆచార్య ఎన్జీ రంగా జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆయన జయంతి వేడుకలు, సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ -2024 బృందావన్‌గార్డెన్స్‌లోని పద్మావతి కళ్యాణ వేదికపై నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా తెలుగు రచయిత్రుల నుంచి కథలను పోటీలకు ఆహ్వానించగా మంచి స్పందన లభించిందని అన్నారు. కథల పోటీల్లో ప్రథమ బహుమతి 'బతుకు సేద్యం' (రచయిత్రి శాంతి ప్రబోధ), ద్వితీయ బహుమతి 'పచ్చబొట్టు' (రచయిత్రి పి.సుజాత), విశిష్ట బహుమతి 'నీలంపు రాసి' (రచయిత్రి చంద్రలత) కైవసం చేసుకున్నాయి.

సాక్షి ప్లస్
శుక్రవారం ॥ 8-11-2024

సినిమా













క్షేమంగా రండి... లాభంగా వెళ్లండి!

భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం టాలీవుడ్ ముందు వరుసలో ఉంది. స్టార్ హీరోల తెలుగు సినిమాలు పాన్ ఇండియా మూవీస్‌గా ఇతర భాషల్లో రిలీజ్ అవుతున్నాయి. కథాబలం ఉన్న సినిమాలు భారీ వసూళ్లను రాబడుతున్నాయి. ఇలా ఇతర భాషల హీరోల సినిమాలు కూడా టాలీవుడ్‌లో విడుదలై, మంచి సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలుస్తున్నాయి. దీంతో కొందరు హీరోలు తెలుగు నిర్మాణ సంస్థలు, తెలుగు దర్శకులతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రేక్షకులు కూడా క్షేమంగా రండి లాభంగా వెళ్లండి అంటూ ఆదరిస్తున్నారు. ఆ వివరాలేంటో ఓ లుక్కేద్దాం...

ఆకాశంలో ఒక తార!

'మహానటి, సీతారామం', ఇటీవల 'లక్కీభాస్కర్' చిత్రాలతో దుల్కర్ సల్మాన్ తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తెలుగులో దుల్కర్ చేసిన ఈ మూడు సినిమాలు సూపర్‌హిట్స్ కావడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. దీంతో తెలుగులో సినిమాలు చేయడానికి మరింత ఆసక్తి చూపిస్తున్నారు దుల్కర్ సల్మాన్. ప్రస్తుతం 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నారాయన. పవన్ సాధినేని ఈ సినిమాకు దర్శకుడు. గీతా ఆర్ట్స్, స్వప్నా సినిమాస్, లైట్ బాక్స్ మీడియా పతాకాలపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అలాగే 'కాంత' అనే పీరియాడికల్ ఫిల్మ్‌లోనూ దుల్కర్ హీరోగా నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సముద్రఖని మరో లీడ్ రోల్ చేస్తున్నారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ సినిమాకు జాను సంగీతం అందిస్తున్నారు. కాగా దుల్కర్ తెలుగు నిర్మాతలతో సినిమాలు చేస్తున్నప్పటికీ ఆయన సినిమాలు ఇతర భాషల్లో కూడా డబ్బింగ్ అవుతున్న సంగతి తెలిసిందే.

కంగువా

హీరో సూర్య తెలుగులోనూ పాపులర్. ఆయన తమిళ చిత్రాలు ఎప్పటికప్పుడు తెలుగులో అనువాదం అవుతుంటాయి. వీలైనప్పుడు నేరుగా తెలుగు సినిమాల్లోనూ సూర్య నటిస్తారు. తాజాగా సూర్య నటించిన భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షనల్ ఫిల్మ్ 'కంగువా'. శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై తమిళ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా, తెలుగు నిర్మాతలు వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో 'కంగువ, ఫ్రాన్సిస్' అనే రెండు భిన్నమైన రోల్స్‌లో సూర్య నటించారు. దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో యోగిబాబు, బాబీడియోల్ ఇతర పాత్రలు చేశారు. ఈ నెల 14న 'కంగువా' చిత్రం విడుదల కానుంది. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. అలాగే గీతాఆర్ట్స్ సంస్థలో సూర్య 'గజిని 2' సినిమా చేస్తారని, అలాగే బోయపాటి శ్రీను దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

కుబేర

ధనుష్‌కు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉంది. ఆయన తమిళ సినిమాలు తెలుగులో అనువాదమై ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటున్నాయి. అయితే ధనుష్ తెలుగు, తమిళం భాషల్లో నటించిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ సినిమాను నిర్మించారు. 'సార్' చిత్రం వందకోట్ల రూపాయల వసూళ్లను రాబట్టి, బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. దీంతో వెంటనే తెలుగు నిర్మాతలతో మరో సినిమా చేసేందుకు ధనుష్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదే 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శ కత్వంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మిస్తున్న భారీ బడ్జెట్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాలో నాగార్జున మరో లీడ్ రోల్‌లో నటిస్తుండగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ నెల 15న 'కుబేర' సినిమా టీజర్ విడుదల కానుంది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో 'కుబేర' సినిమా రిలీజ్ కానుంది.

రాజమౌళి సమర్పణలో...

అల్లు అర్జున్ 'పుష్ప: ది రైజ్' సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న బన్వర్‌సింగ్ షెకావత్ పాత్రలో తెలుగు ఆడియన్స్‌ను మెప్పించారు మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్. ప్రస్తుతం 'పుష్ప: ది రైజ్' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప 2: ది రూల్' సినిమాలోనూ ఫాహద్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అయితే ఫాహద్ హీరోగా 'డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్, ఆక్సిజన్' అనే రెండు తెలుగు సినిమాలు రూపు దిద్దుకుంటున్నాయి. రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా పతాకంపై శోభు యార్లగడ్డ, కార్తికేయ ఈ రెండు సినిమాలను నిర్మిస్తున్నారు. 'ఆక్సిజన్' సినిమాతో సిద్ధార్థ్ నాదెళ్ల, 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాతో శశాంక్ ఏలేటి దర్శకులుగా పరిచయం అవుతున్నారు. ఈ ఏడాది మార్చిలో 'డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్, ఆక్సిజన్' సినిమాల ఫస్ట్‌లుక్స్‌ను విడుదల చేశారు మేకర్స్. అయితే ఆ తర్వాత ఈ సినిమాల గురించి మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

జై హనుమాన్


'కాంతార' సినిమాతో కన్నడ యాక్టర్ రిషబ్ శెట్టి పేరు జాతీయస్థాయిలో మార్మోగిపోయింది. ప్రస్తుతం 'కాంతార' సినిమా ప్రీక్వెల్ 'కాంతార: ఛాప్టర్ 1'తో బిజీగా ఉన్నారు రిషబ్‌శెట్టి. అయితే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కాకుండానే 'జై హనుమాన్'. ఆయన మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ సినిమాయే ఈ ఏడాది సంక్రాంతి ఫెస్టివల్‌కు విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'హను-మాన్' సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటుంది. ఈ సినిమాలో రిషబ్‌శెట్టి మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయు)లో భాగంగా 'జై హను మాన్' అనే తెలుగు సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు రిషబ్. ప్రశాంత్ వర్మ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రానా మరో లీడ్ రోల్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ 'జై హనుమాన్' సినిమాను నిర్మిస్తున్నారు.

యాక్షన్ జాట్

బాలీవుడ్‌లోని సీనియర్ హీరోల్లో ఒకరైన సన్నీ డియోల్ తెలుగులో సినిమా చేస్తున్నారు. 'జాట్' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ప్యాక్ మూవీకి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ మొదలైంది. పీటర్ హెయిన్స్, అన్ల అరసు, రామ్-లక్ష్మణ్, వెంకట్.. ఇలా నలుగురు యాక్షన్ కొరియోగ్రాఫర్స్ ఈ సినిమాకు అసోసియేట్ కావడం చూస్తే యాక్షన్ సీక్వెన్స్‌లు నెక్ట్స్ లెవల్‌లో ఉండబోతున్నాయని ఊహించవచ్చు. రణ్‌దీప్ హుడా, వినీత్‌కుమార్, సయామీ ఖేర్, రెజీనా ఈ సినిమాలో ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్న ఈ 'జాట్' సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. హిందీలో 'గదర్ 2' వంటి బ్లాక్‌బస్టర్ కొట్టిన వెంటనే సన్నీడియోల్ తెలుగులో 'జాట్' చేయడానికి అంగీకరించడం విశేషం. ఈ సినిమాను తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. 'జాట్' కాకుండా హిందీలో 'బోర్డర్ 2, లాహోర్ 1947' సినిమాలతో బిజీగా ఉన్నారు సన్నీడియోల్. 'జాట్' విజయం సాధిస్తే ఆయన తదుపరి సినిమాలైన 'బోర్డర్ 2, లాహోర్ 1947' చిత్రాలు కూడా తెలుగులో రిలీజ్ అవుతాయని ఊహించవచ్చు.

ఈ తరహాలో మరికొంతమంది ఇతర భాషల హీరోలు టాలీవుడ్ దర్శక- నిర్మాతలతో సినిమాలు చేస్తున్నారు. ఇంకొందరు ఆసక్తి చూపిస్తూ, కథలు వింటున్నారు.

రవితేజ ఆవేశం?



మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఆవేశం' (2024) తెలుగు రీమేక్‌కు సన్నాహాలు మొదలయ్యాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులు హీరో రవితేజ సొంతమయ్యాయని, త్వరలోనే ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకువెళ్లే ఆలోచనలో రవితేజ ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అయితే ఈ రీమేక్‌లో రవితేజ హీరోగా నటిస్తారా? లేక ఆయన నిర్మాణ సంస్థ ఆర్‌టీటీమ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మిస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ముగ్గురు విద్యార్థులు కాలేజీలో తమ సీనియర్లను కొట్టించేందుకు ఓ లోకల్ రౌడీని కలుస్తారు. అయితే ఆ లోకల్ రౌడీ కారణంగా ఈ ముగ్గురు విద్యార్థులే చిక్కుల్లో పడతారు. ఆ తర్వాత ఏం జరిగింది అన్నది 'ఆవేశం' కథ. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం 'మాస్ జాతర' అనే సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు రవితేజ. ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం 2025 మే 9న విడుదల కానుంది.

అది నా అదృష్టం!

ప్రముఖ నటుడు కమల్ హాసన్ గురువారం తన 70వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తండ్రికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేశారు ఆయన కుమార్తె, హీరోయిన్ శ్రుతీహాసన్. ''హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అప్పా. ఇలాంటి బర్త్ డేలు మీరు మరెన్నో చేసుకోవాలి. ఈ ప్రపంచంలోనే అరుదైన రత్నం మీరు. మీ కుమార్తెగా పుట్టడం నా అదృష్టం. నాకెంతో ఇష్టమైన వాటిల్లో మీ పక్కన నడవడం కూడా ఒకటి. మీరు దేవుణ్ణి నమ్మరని నాకు తెలుసు.. కానీ, మీపై ఎల్లప్పుడూ ఆయన ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా. మీరు ఇలానే ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటూ మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుండాలి. మీ కలలన్నీ నిజం కావాలి. లవ్ యూ నాన్న'' అంటూ నాన్నపై తనకున్న ప్రేమను పంచుకున్నారు శ్రుతీహాసన్. ఇదిలా ఉంటే.. 'డెకాయిట్: ఎ లవ్ స్టోరీ, కూలీ, చెన్నై స్టోరీ' వంటి సినిమాలకు శ్రుతీహాసన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.


తండ్రి కమల్ హాసన్‌తో శ్రుతీహాసన్


ప్రభాస్

మూడో సారి?

హీరో ప్రభాస్, డైరెక్టర్ పూరి జగన్నాథ్ మూడో సారి కలసి పని చేయనున్నారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రభాస్ హీరోగా 'బుజ్జిగాడు'(2008), 'ఏక్ నిరంజన్'(2009) వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు పూరి జగన్నాథ్. అయితే మూడోసారి మాత్రం ప్రభాస్ చిత్రాన్ని డైరెక్షన్ చేయడం లేదు పూరి. 'స్పిరిట్' చిత్రానికి పూరి జగన్నాథ్ డైలాగులు అందించబోతున్నారని టాక్. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే పాన్ ఇండియా సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. కాగా 'స్పిరిట్' సినిమాకి డైలాగ్స్ రాసే బాధ్యతను పూరి జగన్నాథ్‌కు సందీప్ రెడ్డి అప్పగించినట్లు సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. సందీప్ స్వయంగా అడగడంతో పూరి కూడా పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రభాస్‌తో తనకున్న స్నేహ బంధం ఓ కారణం అయితే.. సందీప్ స్టోరీకి డైలాగులు రాస్తే అది మరింతగా రీచ్ అవుతుందన్నది మరో ఆలోచన అట. అందువల్లే ఆయన అంగీకరించి ఉంటారని భోగట్టా. అయితే ఈ విషయంపై స్పష్టత రావాలంటే యూనిట్ అధికారికంగా ప్రకటించే వరకూ వేచిచూడాల్సిందే. ఇదిలా ఉంటే.. 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తర్వాత పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించే సినిమాపై స్పష్టత రావాల్సి ఉంది.


పూరి జగన్నాథ్


అనన్యా పాండే

రొమాంటిక్ ఎంటర్‌టైనర్

లక్ష్య, అనన్యా పాండే జంటగా తెరకెక్కుతున్న హిందీ చిత్రం 'చాంద్ మేరా దిల్'. వివేక్ సోని దర్శకత్వంలో ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణ్ జోహార్ నిర్మిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది. ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఇద్దరు తమ ప్రేమను గెలిపించుకోవడం కోసం పడే తపన నేపథ్యంతో ఈ సినిమా ఉంటుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సంగతి ఇలా ఉంటే... విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'లైగర్' సినిమాతో అనన్యా పాండే తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఆ సినిమా తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదామె.


'చాంద్ మేరా దిల్'లో లక్ష్య, అనన్యా పాండే

నేపథ్యం మారిందా?

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఈ చిత్రం తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం, నేపథ్య సంగీతం అందించారు. అయితే 'పుష్ప: ది రైజ్' సినిమాకు కొనసాగింపుగా 'పుష్ప 2: ది రూల్' రూపొందుతోంది. ఈ సినిమాకి కూడా దేవి శ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు. అయితే పాటలకు మాత్రమే దేవి శ్రీ సంగీతం అందిస్తున్నారని, నేపథ్య సంగీతాన్ని మ్యూజిక్ డైరెక్టర్స్ తమన్, అజనీష్ లోకనాథ్, సామ్ సీఎస్ రెడీ చేస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో తెరపైకి వచ్చింది. దేవి శ్రీకి, సుకుమార్‌కు మధ్య విభేదాలు రావడం వల్లే ఇలా జరిగిందని నెట్టింటి వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేమీ లేదని, సినిమా విడుదల సమయం దగ్గర పడుతున్న తరుణంలో నేపథ్య సంగీతానికి దేవి శ్రీ సరైన సమయం కేటాయించలేకపోతున్నారట. పూర్తిగా పాటలపైనే దృష్టి పెడుతున్నారట. దీంతో 'పుష్ప 2: ది రూల్' సినిమా బ్యాగ్రౌండ్ స్కోర్‌కు కొత్త మ్యూజిక్ డైరెక్టర్స్‌ను తీసుకోవాలని దేవి శ్రీ, సుకుమార్ కలిసే నిర్ణయించుకున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్, జగపతి బాబు, అనసూయ, సునీల్, ధనుంజయ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'పుష్ప: ది రూల్' డిసెంబరు 5న విడుదల కానుంది.


దేవి శ్రీ ప్రసాద్


తమన్

సాక్షి ప్లస్
శుక్రవారం। 8-11-2024

బిజినెస్ రీల్

భారత్‌లో డాయిష్ బ్యాంక్ రూ. 5,113 కోట్ల పెట్టుబడులు

ముంబై: భారత్‌లో కార్యకలాపాలను పటిష్టం చేసుకునేందుకు అదనంగా రూ. 5,113 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు జర్మన్ దిగ్గజం డాయిష్ బ్యాంక్ తెలిపింది. కార్పొరేట్ బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ప్రైవేట్ బ్యాంకింగ్ తదితర విభాగాల విస్తరణకు ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొంది. డాయిష్ బ్యాంక్ దాదాపు 45 ఏళ్లుగా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది. 2024 మార్చి 31 నాటికి బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ. 1.45 లక్షల కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 17 శాఖలు ఉన్నాయి.



స్పెక్ట్రం అంశంలో మస్క్ వైపే కేంద్రం మొగ్గు..

న్యూఢిల్లీ: శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ స్పెక్ట్రంను అంతర్జాతీయంగా పాటిస్తున్న విధానాలకు తగ్గట్లే కేటాయిస్తామే తప్ప వేలం వేయబోమని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరోసారి స్పష్టం చేశారు. అయితే దీన్ని ఉచితంగా ఇవ్వబోమని, టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ నిర్ణయించే ధరను కంపెనీలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు ఉపయోగించే స్పెక్ట్రంను కేటాయించాలే తప్ప భారతీయ టెల్కోలు కోరుతున్నట్లుగా వేలం వేయరాదని కోరుతున్న స్టార్‌లింక్ చీఫ్ ఎలాన్ మస్క్‌కు ఈ పరిణామం సానుకూలం కానుంది. ఈ స్పెక్ట్రంను వేలం వేయాలని దేశీ దిగ్గజాలు జియో, ఎయిర్‌టెల్ కోరుతున్నాయి.

ఆంధ్రా షుగర్స్ ప్లాంటులో ఎఫ్‌డీఏ తనిఖీలు పూర్తి

హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని తమ ఆస్పిరిన్ తయారీ ప్లాంటులో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) తనిఖీలు పూర్తయినట్లు ది ఆంధ్రా షుగర్స్ వెల్లడించింది. ప్లాంటు విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని ఎఫ్‌డీఏ నిర్ధారించినట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి ఇన్‌స్పెక్షన్ రిపోర్టు (ఈఐఆర్)ను జారీ చేసినట్లు పేర్కొంది. తాము నిర్దేశిత ఉత్తమ తయారీ (సీజీఎంపీ) నిబంధనలను పాటిస్తున్నామనడానికి ఇది నిదర్శనమని కంపెనీ పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	555-00
వరంగల్	557-00
రిటైల్ ధర	6.15

నేటి బోర్డు సమావేశాలు

ఎస్‌బీఐ, అశోక్ లేలాండ్, టాటా మోటార్స్, ఎల్‌ఐసీ ఇండియా, ఓలా ఎలక్ట్రిక్, ఎంఆర్‌ఎఫ్, ఆర్తి ఇండస్ట్రీస్, అలెంబిక్ ఫార్మా, ఫోర్టిస్ హెల్త్‌కేర్, వర్ల్‌పూల్, ఈక్విటాస్ బ్యాంక్, ఐనాక్స్ ఇండియా, ఖాదీం ఇండియా, రిలాక్సో ఫుట్‌వేర్, ఇండియా సిమెంట్స్, ఓరియంట్ సిమెంట్.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,409.95	6.34
SBIN	858.35	0.42
HDFCLIFE	711.5	0.4
TCS	4,146.00	0.15
COALINDIA	435.55	-0.06

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	648.6	-8.42
TRENT	6,530.00	-6.12
GRASIM	2,564.75	-3.07
SHRIRAMFIN	3,071.00	-2.96
ADANIENT	2,962.65	-2.74

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,475
ఎన్‌ఎస్‌ఈ	1,01,311
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,86,301
ఎఫ్‌ఐఐ	- 4,889
డీఐఐ	+ 1,787

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.69	$ 71.69
బ్రెంట్	75.99	$ 74.92

ఇక రిలయన్స్ 'స్నాక్స్'!

- పంపిణీదార్లకు భారీ మార్జిన్లు
- సూపర్ స్టాకిస్టులకు రెట్టింపు
- రిటైలర్లకు ఏకంగా 20 శాతం

ముంబై: పంపిణీదార్లకు అధిక మార్జిన్లను అందిస్తూ క్యాంపాతో సాఫ్ట్‌డ్రింక్స్ మార్కెట్లో సంచలనం సృష్టించిన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) తాజాగా స్నాక్స్ మార్కెట్‌పైనా గురిపెట్టింది. చిప్స్, బిస్కెట్స్ మొదలైన వాటి విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తోంది. సూపర్ స్టాకిస్ట్‌లకు మిగతా బ్రాండ్స్ అందించే 3–5 శాతంతో పోలిస్తే (పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు కూడా కలిపి) దాదాపు రెట్టింపు ఇస్తున్నట్లు మార్కెట్ వర్గాలు వివరించాయి. ఆర్‌సీపీఎల్ 6.5 శాతం ట్రేడ్ మార్జిన్‌ను ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఇక డిస్ట్రిబ్యూటర్ల స్థాయిలో చూస్తే 8 శాతం మార్జిన్లతో పాటు అదనంగా 2 శాతం (పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు సహా) ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది. సాధారణంగా డిస్ట్రిబ్యూటర్లకు ఇతర స్నాక్ బ్రాండ్స్ 6–6.5 శాతం ఆఫర్ చేస్తుంటాయి. ఆర్‌సీపీఎల్ అటు రిటైలర్లకు ఏకంగా 20 మార్జిన్‌ను ఆఫర్ చేస్తోంది. ఈ సెగ్మెంట్లో చాలాకాలంగా ఆధిపత్యం కొనసాగిస్తున్న బ్రిటానియా, పెప్సీకో, స్థానిక కంపెనీలు, ఇతర బ్రాండ్లు ఇచ్చేది 8–15 శాతంగా (మార్జిన్లు, స్కీములు కలిపి) ఉంటోంది. ఆర్‌సీపీఎల్ ప్రస్తుతం చిప్స్, నమ్‌కీన్స్ వంటి స్నాక్స్‌కి సంబంధించి అలాన్ బ్యూగుల్స్, స్నాక్‌ట్యాక్ బ్రాండ్లను, ఇండిపెండెన్స్ పేరిట బిస్కట్ బ్రాండ్‌ను విక్రయిస్తోంది.



42 వేల కోట్ల మార్కెట్..

అధ్యయనాల ప్రకారం దేశీయంగా స్నాక్స్ మార్కెట్ 2023లో సుమారు రూ. 42,695 కోట్ల స్థాయిలో ఉంది. ఇది వార్షికంగా 9.08 శాతం వృద్ధి చెందుతూ 2032 నాటికి రూ. 95,522 కోట్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. దేశీ ఎఫ్‌ఎంసీజీ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లుగా ఆర్‌సీపీఎల్ 2022లో ప్రకటించింది. ఆ తర్వాత నుంచి కంపెనీ క్రమంగా కోలా మార్కెట్లోకి చొచ్చుకుపోయే వ్యూహాలను అమలు చేయడం మొదలెట్టింది. పోటీ సంస్థలతో పోలిస్తే ఉత్పత్తులను తక్కువ ధరకే అందించడం, పంపిణీదార్లకు అధిక మార్జిన్లు ఇవ్వడం మొదలైనవి అమలు చేసింది. అమెరికాకు చెందిన అలాన్ బ్యూగుల్స్ బ్రాండ్‌ను భారత్‌కి తెస్తున్నట్లు గతేడది మే నెలలో ప్రకటించింది. సాల్టెడ్‌తో పాటు టొమాటో, చీజ్ తదితర ఫ్లేవర్లలో రూ. 10కే అందించనున్నట్లు పేర్కొంది. సాధారణంగా పెద్ద సంస్థలు మార్కెటింగ్ కోసం కేటాయించే దానిలో 10–15 శాతం కూడా ఖర్చు చేయకుండానే అమ్మకాలను పెంచుకునేందుకు సేల్స్ వ్యవస్థను కూడా ఆర్‌సీపీఎల్ పటిష్టం చేసుకుంటోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రిటైల్ స్టోర్స్‌లో వినియోగదార్ల దృష్టిని ఆకర్షించేందుకు మరిన్ని లాంచ్ ప్రమోషన్లను ఆఫర్ చేస్తోందని పేర్కొన్నాయి.

సగానికి పడిపోయిన పండుగ డిమాండ్

ప్రస్తుత ఏడాదిలో 15 శాతమే • బ్రోకరేజీ సంస్థ నోమురా వెల్లడి

ముంబై: ప్రస్తుత ఏడాది పండుగల సందర్భంగా డిమాండ్ సగానికి క్షీణించి 15 శాతంగా ఉన్నట్లు జపాన్ బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేసింది. 2023లో పండుగల సీజన్‌లో డిమాండ్ 32 శాతం పెరగ్గా, 2022లో 88 శాతం వృద్ధి చెందినట్లు గుర్తు చేసింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిటైల్ అమ్మకాలు పండుగల సీజన్‌లో పెరిగినప్పటికీ, మొత్తం మీద వృద్ధి నిదానంగానే ఉన్నట్లు పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలు, టైర్-2, 3 పట్టణాల్లో డిమాండ్ స్థిరంగానే ఉండగా.. మెట్రోల్లో, పారిశ్రామిక డిమాండ్ బలహీనంగా ఉన్నట్టు వివరించింది. పట్టణ డిమాండ్ బలహీనంగా ఉన్నట్టు గత నెలలో కేంద్ర ఆర్థిక శాఖ సైతం ప్రకటించడం గమనార్హం. డిసెంబర్ నెలలో వివాహాలు అధిక సంఖ్యలో ఉండడం డిమాండ్‌కు ఊతం ఇవ్వొచ్చని నోమురా అంచనా వేస్తోంది. రిటైల్ అమ్మకాల వృద్ధి 2023లో ఉన్న 36.4 శాతం నుంచి.. 2024లో 13.3 శాతానికి పరిమితం కావొచ్చన్న అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) అంచనాలను తన నివేదికలో నోమురా ప్రస్తావించింది. మరోవైపు రిటైల్ ఆటో విక్రయాలు 14 శాతం పెరగ్గా.. హోల్‌సైల్ వైపు ప్యాసింజర్ అమ్మకాలు, మధ్యశ్రేణి వాణిజ్య వాహనాల అమ్మకాలు బలహీనంగా ఉన్నట్టు తెలిపింది. ఆర్థిక వ్యవస్థలో తాత్కాలిక మందగమనం కొనసాగుతోందంటూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 7.2 శాతం ఉండొచ్చన ఆర్‌బీఐ అంచనాలు మరీ ఆశావాహంగా ఉన్నట్టు నోమురా అభివర్ణించింది.



నాలుగు ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్

- మొత్తం రూ. 3,000 కోట్ల సమీకరణ
- లిస్టులో సాయి లైఫ్ సైన్సెస్, మెటల్‌మ్యాన్ ఆటో

న్యూఢిల్లీ: దాదాపు రూ. 3,000 కోట్ల సమీకరణకు సంబంధించి నాలుగు కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు (ఐపీవో) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాయి లైఫ్ సైన్సెస్, రూబికాన్ రీసెర్చ్, సనాతన్ టెక్స్‌టైల్స్, మెటల్‌మ్యాన్ ఆటో వీటిలో ఉన్నాయి. ఇవి జూలై–ఆగస్టు మధ్యకాలంలో తమ ముసాయిదా ఐపీవో పత్రాలను సెబీకి సమర్పించాయి. అక్టోబర్ 31న సెబీ ఆమోదం లభించింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ ప్రతిపాదిత ఐపీవో కింద రూ. 800 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుంది. ప్రమోటరు, ఇన్వెస్టర్ షేర్‌హోల్డర్లు, ఇతరత్రా షేర్‌హోల్డర్లు 6.15 కోట్ల షేర్లను ఓఎఫ్‌ఎస్ విధానంలో విక్రయించనున్నారు. ఐపీవో ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 600 కోట్ల మొత్తాన్ని రుణాల చెల్లింపునకు, మిగతా నిధులను కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది.



రూబీకాన్ రీసెర్చ్ రూ. 1,085 కోట్లు ..

ఔషధాల ఫార్ములేషన్ కంపెనీ రూబీకాన్ రీసెర్చ్ రూ. 1,085 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ. 500 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, రూ. 585 కోట్లు విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) విధానంలో ప్రమోటర్ విక్రయించనున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం జనరల్ అట్లాంటిక్‌కు రూబీకాన్ రీసెర్చ్‌లో 57 శాతం పైగా వాటాలు ఉన్నాయి. ఐపీవో నిధుల్లో రూ. 310 కోట్ల మొత్తాన్ని, రుణాల చెల్లింపు కోసం, మిగతాది ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం రూబీకాన్ వినియోగించుకోనుంది. మరోవైపు, సనాతన్ టెక్స్‌టైల్స్ రూ. 500 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు.. ప్రమోటర్ గ్రూప్ సంస్థలు రూ. 300 కోట్ల వరకు విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించనున్నాయి. తాజాగా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 210 కోట్ల మొత్తాన్ని .. అనుబంధ సంస్థ సనాతన్ పాలీకాట్‌కి సంబంధించి దీర్ఘకాలిక మూలధన అవసరాల కోసం ఇన్వెస్ట్ చేయనుంది. అలాగే రూ. 175 కోట్లను రుణాల చెల్లింపు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగించుకోనుంది. అటు మెటల్‌మ్యాన్ ఆటో సంస్థ రూ. 350 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఓఎఫ్‌ఎస్ విధానంలో ప్రమోటర్లు 1.26 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఐపీవో ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 25 కోట్ల మొత్తాన్ని మధ్యప్రదేశ్‌లోని పిథంపూర్‌లో 2వ యూనిట్‌లో యంత్రపరికరాల కొనుగోలు తదితర అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు Q2 RESULTS

సెయిల్ లాభం నేలచూపు

- క్యూ2లో రూ. 897 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం సెయిల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెలువరించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 31% క్షీణించి రూ. 897 కోట్లకు పరిమితమైంది. ఇతర ఆదాయం తగ్గడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో దాదాపు రూ. 1,306 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 29,858 కోట్ల నుంచి రూ. 24,842 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 27,769 కోట్ల నుంచి రూ. 23,824 కోట్లకు నీరసించాయి. ముడిస్టీల్ ఉత్పత్తి యథాతథంగా 4.76 మిలియన్ టన్నులుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో సెయిల్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 123 వద్ద ముగిసింది.

మ్యాక్స్ హెల్త్ కేర్ లాభం 282 కోట్లు

న్యూఢిల్లీ: ఆస్పత్రుల నిర్వహణ సంస్థ మ్యాక్స్ హెల్త్‌కేర్ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.282 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలానికి వచ్చిన లాభం రూ.277 కోట్లతో పోల్చితే 2 శాతమే పెరిగింది. కానీ, అదే కాలంలో స్థూల ఆదాయం 25% ఎగసి రూ. 1,707 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో వ్యయాలు సైతం రూ.1,042 కోట్ల నుంచి రూ. 1,375 కోట్లకు పెరిగాయి. న్యూఢిల్లీలోని మ్యాక్స్ బాలాజీ హాస్పిటల్, మ్యాక్స్ స్మార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మ్యాక్స్ సాకేత్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫలితాలు కన్సాలిడేటెడ్‌లో కలపలేదని మ్యాక్స్ హెల్త్‌కేర్ ప్రకటించింది.



ఇండియన్ హోటల్స్ లాభం హైజంప్

- కలిసొచ్చిన కేటరింగ్ విభాగం స్థిరీకరణ
- రెండంకెల వృద్ధి అంచనాలు కొనసాగింపు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి పటిష్ట పనితీరు చూపించింది. లాభం మూడు రెట్లు పెరిగి రూ.583 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.179 కోట్లుగానే ఉంది. విమానయాన, సంస్థాగత కేటరింగ్ సేవల విభాగం 'తాజ్‌శాట్స్' స్థిరీకరణతో ఏకీకృత ఆర్జన (రూ.307కోట్లు) తోడు కావడం లాభంలో అధిక వృద్ధికి దారితీసింది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే రూ.1,433 కోట్ల నుంచి రూ.1,826 కోట్లకు పెరిగింది. వ్యయాలు సైతం రూ.1,249 కోట్ల నుంచి రూ.1,502 కోట్లకు పెరిగాయి. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో డిమాండ్ బలంగా పుంజుకుంది. దీంతో ఆదాయం 28 శాతం పెరిగింది. హోటల్ విభాగంలో ఆదాయం 16 శాతం వృద్ధి చెందింది. దీంతో క్యూ2లో ఇప్పటి వరకు అత్యుత్తమ ఎబిట్డా మార్జిన్ 29.9 శాతం నమోదైంది''అని ఐహెచ్‌సీఎల్ ఎండీ, సీఈవో పునీత్ ఛత్వాల్ తెలిపారు. 2024–25 సంవత్సరానికి రెండంకెల ఆదాయ వృద్ధి అంచనాలను కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఢిల్లీలోని ల్యాండ్‌మార్క్ హోటల్ 'క్లారిడ్జ్'ను 2025 ఏప్రిల్‌లో స్వాధీనం చేసుకోనున్నట్టు తెలిపారు.

రాణించిన ఇమామీ

- లాభంలో 19 శాతం వృద్ధి
- షేరుకు రూ.4 డివిడెండ్



కోల్‌కతా: ఎఫ్‌ఎంసీజీ సంస్థ ఇమామీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో పనితీరు పరంగా రాణించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 19 శాతం వృద్ధితో రూ.213 కోట్లకు చేరింది. ఆదాయం 3 శాతం వృద్ధితో రూ.891 కోట్లుగా నమోదైంది. దేశీయ వ్యాపారం 2.6 శాతం రాణించగా, అంతర్జాతీయ ఆదాయం 6 శాతం వృద్ధి చెందింది. స్థూల మార్జిన్లు 0.60 శాతం పెరిగి 70.7 శాతానికి మెరుగుపడ్డాయి. వ్యయ నియంత్రణకు కంపెనీ తీసుకున్న చర్యలు ఫలించాయి. ఎబిట్డా 7 శాతం పెరిగి రూ.250 కోట్లుగా నమోదైంది. ఎబిట్డా మార్జిన్ 1.1 శాతం ఎగసి 28.1 శాతానికి చేరింది. హీలియోస్ లైఫ్‌స్టయిల్ (మ్యాన్ కంపెనీ బ్రాండ్ తయారీ సంస్థ)లో వాటాను 50.4 శాతం నుంచి 98.3 శాతానికి పెంచుకున్నట్టు మారికో ప్రకటించింది. కొత్తగా 11 ఉత్పత్తులను విడుదల చేసినట్టు తెలిపింది. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.4 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. దేశీ విక్రయాల్లో 26.6 శాతం సంఘటిత ఆధునిక అంగళ్లు, ఈ–కామర్స్ ద్వారా నమోదవుతున్నట్టు కంపెనీ వైస్ చైర్మన్ మోహన్ గోయెంకా తెలిపారు. అధిక సింగిల్ డిజిట్ ఆదాయ వృద్ధి, రెండంకెల ఎబిట్డాను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నమోదు చేస్తామని ప్రకటించారు.

ఎన్‌సీసీ ఆదాయం రూ. 5,224 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎన్‌సీసీ లిమిటెడ్ ఆదాయం (కన్సాలిడేటెడ్) రూ. 5,224 కోట్లుగా నమోదైంది. గత క్యూ2లో ఇది రూ. 4,746 కోట్లు. మరోవైపు, నికర లాభం రూ. 77 కోట్ల నుంచి సుమారు రూ. 163 కోట్లకు చేరింది. అటు ప్రథమార్ధంలో ఆదాయం రూ. 9,153 కోట్ల నుంచి రూ. 10,783 కోట్లకు పెరగ్గా, లాభం రూ. 251 కోట్ల నుంచి రూ. 373 కోట్లకు చేరింది. రెండో త్రైమాసికంలో రూ. 4,760 కోట్ల విలువ చేసే ఆర్డర్లను పొందినట్లు సంస్థ ఎండీ ఏఏవీ రంగరాజు తెలిపారు. దీంతో సెప్టెంబర్ ఆఖరు నాటికి ఆర్డర్ బుక్ విలువ రూ. 52,370 కోట్లకు చేరినట్లు వివరించారు.



ట్రూకాలర్ ఇండియా కార్యాలయాల్లో ఐటీ సోదాలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ కాలర్ ఐడీ ప్లాట్‌ఫాం ట్రూకాలర్ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్‌లో లొసుగులు, పన్ను ఎగవేతల ఆరోపణలకు సంబంధించి సమాచారాన్ని సమీకరించేందుకు, పత్రాలను పరిశీలించేందుకు సోదాలు చేసినట్లు అధికారులు తెలిపారు. విచారణకు పూర్తిగా సహకారం అందిస్తున్నట్లు కంపెనీ వర్గాలు వివరించాయి. ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విషయంలో అంతర్జాతీయంగా ఆమోదయోగ్యమైన విధానాలనే పాటిస్తున్నట్లు పేర్కొన్నాయి. స్వీడిష్ కంపెనీ అయిన ట్రూకాలర్‌కు భారత్‌లో ముంబై, గురుగ్రామ్, బెంగళూరులో కార్యాలయాలు ఉన్నాయి.



ఎయిర్‌టెల్‌లో భారతీ టెలికం వాటా పెంపు

న్యూఢిల్లీ: ప్రమోటర్ భారతీ టెలికం.. మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌లో తాజాగా 1.2 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ నుంచి ఆఫ్ మార్కెట్ లావాదేవీ ద్వారా ఈ వాటాను సొంతం చేసుకున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. అయితే డీల్ విలువను వెల్లడించనప్పటికీ.. ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ప్రకారం వాటా విలువ రూ. 11,680 కోట్లుగా అంచనా. కాగా.. ఈ లావాదేవీ తదుపరి భారతీ ఎయిర్‌టెల్‌లో భారతీ టెలికం వాటా 40.33 శాతానికి చేరింది. మరోవైపు ఇండియన్ కాంటినెంట్ వాటా 3.31 శాతానికి పరిమితమైంది. భారతీ టెలికంలో సునీల్ భారతీ మిట్టల్ వాటా 50.56 శాతం కాగా.. సింగ్‌టెల్ 49.44% వాటాను కలిగి ఉంది.



ఎంఎస్‌సీఐ ఇండెక్స్‌లో బీఎస్‌ఈ


ఈ నెల 25 నుంచి ఐదు కంపెనీలకు చోటు

న్యూఢిల్లీ: నవంబర్ 25 నుంచి ఎంఎస్‌సీఐ ఇండియా ఇండెక్స్‌లో ఐదు కంపెనీలు చోటు సాధించనున్నాయి. జాబితాలో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈసహా.. ఒబెరాయ్ రియల్టీ, వోల్టాస్, కల్యాణ్ జ్యువెలర్స్, ఆల్కెమ్ ల్యాబొరేటరీస్ చేరాయి. ఎంఎస్‌సీఐ గ్లోబల్ స్టాండర్డ్ ఇండెక్సులలో భాగంగా తాజా సవరణలకు తెరతీయనుంది. ప్రపంచ ఇన్వెస్టర్ కమ్యూనిటీకి కీలక సర్వీసులందించే సంస్థ గ్లోబల్ స్మాల్ క్యాప్ ఇండెక్సులలోనూ మార్పులు చేపడుతోంది. ఈ నెల 25 నుంచి 13 కంపెనీలకు చోటివ్వడంతోపాటు.. 7 సంస్థలను తొలగిస్తోంది. జాబితాలో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, అనుప్ ఇంజినీరింగ్, బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్, డీసీఎం శ్రీరామ్, ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్, యురేకా ఫోర్బ్స్, గణేశా ఎకోస్ఫియర్, ఇండిజీన్, జేఎస్‌డబ్ల్యూ హోల్డింగ్స్, పీసీ జ్యువెలర్స్, రీఫెక్స్ ఇండస్ట్రీస్, సిగ్నేచర్ గ్లోబల్, బొండాడ ఇంజినీరింగ్ చేరాయి.

లాజిస్టిక్స్ పార్కులపై మ్యాక్రోటెక్ కన్ను

బెయిన్ క్యాపిటల్ నుంచి వాటాల కొనుగోలు

న్యూఢిల్లీ: వార్షిక అద్దె ఆదాయాన్ని పెంచుకునే బాటలో రియల్టీ రంగ దిగ్గజం మ్యాక్రోటెక్ డెవలపర్స్ తాజాగా లాజిస్టిక్స్ పార్క్ సంస్థలలో వాటాలు కొనుగోలు చేసింది. వీటి విలువ రూ. 307 కోట్లుకాగా.. సెప్టెంబర్‌లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్స్‌లో ఇవాన్‌హో వేర్‌హౌసింగ్ ఇండియా ఇంక్‌కు చెందిన వాటాను రూ. 240 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ బాటలో ప్రస్తుతం బెయిన్ క్యాపిటల్ నుంచి రూ. 307 కోట్లకు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్స్‌లో వాటాలను కొనుగోలు చేస్తోంది.



కైలాక్ ఎస్‌యూవీని ఆవిష్కరించిన స్కోడా

ముంబై: యూరోపియన్ సాంకేతికతతో దేశంలో తయారైన కైలాక్ ఎస్‌యూవీ కారుని స్కోడా ముంబైలో ఆవిష్కరించింది. కుషాక్, స్లావియా తర్వాత స్థానికంగా స్కోడా అభివృద్ధి చేసిన మూడో కారు ఇది. ఇందులో 25 కంటే ఎక్కువ భద్రతా ప్రమాణాలున్నాయని స్కోడా సీఈఓ క్లాస్ జెల్మెర్ వివరించారు. విశాలంగా ఉండే ఇంటీరియర్‌తో 446 లీటర్ల బూట్ స్పేస్, సిక్స్–స్పీడ్ మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ తో ఈ కారు లభిస్తుంది. గరిష్టంగా గంటకు 188 వేగంతో ప్రయాణిస్తుంది. ఐదు రంగుల్లో సింగిల్, డ్యూయల్ టోన్ లో లభించే ఈ కారు కేవలం 10.5 సెకన్లలో నే 0 నుండి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 2025 జనవరిలో మార్కెట్లోకి రానున్న ఈ కార్ ప్రారంభ ధర రూ.7.89 లక్షలు. 10.1–అంగుళాల (25.6 సెం.మీ.) ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లేతో పాటు ఆరు ఎయిర్ బ్యాగ్ లు అత్యాధునిక సాంకేతికత ఈ కారు సొంతమని స్కోడా ఆటో బోర్డు సభ్యుడు జోహన్నెస్ నెఫ్ట్ వెల్లడించారు.



ఈవీలపై హీరో మోటోకార్ప్ మరింత దృష్టి

అందుబాటు ధరలో మోడల్స్‌ను ప్రవేశపెట్టడంపై కసరత్తు

మిలాన్ (ఇటలీ): వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ తమ ఎలక్ట్రిక్ టూ–వీలర్ల వ్యాపార విభాగాన్ని మరింత పటిష్టం చేసుకోవడంపై దృష్టి పెడుతోంది. వచ్చే కొద్ది నెలల్లో అందుబాటు ధరల్లో మరిన్ని మోడల్స్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా ఈ విషయాలు తెలిపారు. 'వచ్చే ఆరు నెలల్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విభాగం చాలా సందడిగా ఉండబోతోంది. విడా శ్రేణికి సంబంధించి అందుబాటు ధరల్లో మోడల్స్‌ను కూడా ప్రవేశపెట్టబోతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం విడా ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు రూ. 1–1.5 లక్షల శ్రేణిలో (రాష్ట్రాలు ఇచ్చే సబ్సిడీలతో కలిపి) ఉన్నాయి. 230 నగరాలు, పట్టణాల్లో విడా స్కూటర్లను కంపెనీ విక్రయిస్తోంది. 32 రోజుల పాటు సాగిన పండుగ సీజన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు మంచి స్పందన కనిపించిందని, 11,600 యూనిట్లు విక్రయించామని గుప్తా వివరించారు. క్షేత్రస్థాయిలో భౌతికంగా సేల్స్, సర్వీస్ మౌలిక సదుపాయాలు ఉంటే కస్టమర్‌కి మరింత నమ్మకం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో కార్యకలాపాలు ఉండటం తమకు కలిసి వచ్చే అంశమని వివరించారు. ఈవీల విభాగంలో ధర, కస్టమర్ సర్వీసు అంశాలే దీర్ఘకాలికంగా ఏ కంపెనీకైనా కీలకం అవుతాయని పేర్కొన్నారు. ఇక దేశీ మార్కెట్లో మొత్తం వాహన విక్రయాలపరంగా చూస్తే పట్టణ ప్రాంతాలు మెరుగ్గా ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాలు కూడా క్రమంగా పుంజుకుంటున్నాయని గుప్తా చెప్పారు. ఈ ఏడాది పండుగ సీజన్‌లో హీరో మోటోకార్ప్ విక్రయాలు గత సీజన్‌తో పోలిస్తే 13 శాతం పెరిగి 15.98 లక్షల యూనిట్లకు చేరాయి. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో బ్రిటన్, ఇటలీ, స్పెయిన్ తదితర దేశాల్లోకి కూడా విస్తరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.



అనూహ్యాలేమీ లేకుండా...

- అగ్రశ్రేణి ప్లేయర్లను అట్టి పెట్టుకున్న జట్లు
- మహిళల ప్రీమియర్ లీగ్ రిటెన్షన్ జాబితా విడుదల


డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో ఐదు జట్ల కెప్టెన్లు బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ (ఫైల్)

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 వేలానికి ముందు ఐదు జట్లు కూడా తమ ప్రధాన ప్లేయర్లను అట్టి పెట్టుకున్నాయి. భారత స్టార్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్‌లతో పాటు మెగ్ లానింగ్, మరిజాన్ కాప్, అమెలియా కెర్, అనాబెల్ సదర్లాండ్‌లను కూడా ఆయా టీమ్‌లు అట్టి పెట్టుకున్నాయి. డబ్ల్యూపీఎల్ వేలం డిసెంబర్ నెల మొదటి వారంలో జరిగే అవకాశం ఉంది. ప్లేయర్లను తీసుకోవడం కోసం లీగ్ టీమ్‌లకు గత సీజన్‌లో గరిష్టంగా రూ.13 కోట్ల 50 లక్షల పరిధి విధించగా... ఇప్పుడు మరో కోటిన్నర పెంచి దానిని రూ. 15 కోట్లు చేశారు. ఒక్కో టీమ్‌లో 18 మంది చొప్పున మొత్తం 90 మందికి డబ్ల్యూపీఎల్‌లో అవకాశం ఉంది. ఇప్పుడు మొత్తం 71 మందిని టీమ్‌లు రీటెయిన్ చేసుకున్నాయి. దాంతో 19 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. టీమ్‌లు వదిలేసుకున్న ఆటగాళ్లలో పూనమ్ యాదవ్, స్నేహ రాణా, తహుహు, క్యాథరీన్ బ్రైస్, వేద కృష్ణమూర్తి, హీతర్ నైట్, ఇసీ వాంగ్, హైదరాబాద్ ప్లేయర్ చొప్పదండి యషశ్రీ ఉన్నారు.

రీటెయిన్ చేసుకున్న భారత ప్లేయర్ల వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్: జెమీమా, షఫాలీ, రాధ యాదవ్, అరుంధతి రెడ్డి (హైదరాబాద్), శిఖా పాండే, తానియా భాటియా, మిన్ను మణి, స్నేహ దీప్తి (ఆంధ్రప్రదేశ్), టిటాస్ సాధు.

గుజరాత్ జెయింట్స్: హేమలత, తనూజ, షబ్నమ్ షకీల్ (ఆంధ్రప్రదేశ్), ప్రియా మిశ్రా, త్రిష పూజిత, మన్నత్, మేఘనా సింగ్.

ముంబై ఇండియన్స్: హర్మన్‌ప్రీత్, అమన్‌దీప్, అమన్‌జోత్, జింతిమణి, కీర్తన, పూజ వస్త్రకర్, సజన, సైకా ఇషాఖ్, యస్తిక భాటియా.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన, రిచా ఘోష్, సబ్బినేని మేఘన (ఆంధ్రప్రదేశ్), శ్రేయాంక పాటిల్, ఆశ శోభన, రేణుకా సింగ్, ఏక్తా బిస్త్, కనిక.

యూపీ వారియర్స్: కిరణ్ నవ్‌గిరే, శ్వేత సెహ్రావత్, దీప్తి శర్మ, సైమా ఠాకూర్, అంజలి శర్వాణి (ఆంధ్రప్రదేశ్), గౌహర్ సుల్తానా (హైదరాబాద్), ఉమా ఛెత్రి, రాజేశ్వరి గైక్వాడ్, పూనమ్ ఖెమ్నార్, వృంద దినేశ్.



విజేత ప్రియాంక

సాక్షి, హైదరాబాద్: స్విస్ క్వీన్స్ అంతర్జాతీయ ఆన్‌లైన్ బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) నూతక్కి ప్రియాంక విజేతగా నిలిచింది. 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రియాంక, రష్యా గ్రాండ్‌మాస్టర్ వాలెంటీనా గునీనా 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ప్రియాంకకు అగ్రస్థానం ఖరారైంది. గునీనా రన్నరప్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన సవితా శ్రీ 8 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ప్రియాంక ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని ఒక గేమ్‌లో ఓడిపోయింది. విజేతగా నిలిచిన ప్రియాంకకు 300 డాలర్ల (రూ. 25 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది మొత్తం ప్రతి బుధవారం ఆన్‌లైన్‌లో స్విస్ క్వీన్స్ పేరుతో 1000 డాలర్ల ప్రైజ్‌మనీతో టోర్నీని నిర్వహిస్తున్నారు.



హరియాణా స్టీలర్స్ నాలుగో విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో హరియాణా స్టీలర్స్ నాలుగో విజయం సాధించింది. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో హరియాణా స్టీలర్స్ 35–22 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. హరియాణా స్టీలర్స్ తరఫున వినయ్ 9 పాయింట్లు, రెజా 6 పాయింట్లు సాధించారు. గుజరాత్ తరఫున గుమాన్ సింగ్ 11 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 33–30 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ 10, వినయ్ 8 పాయింట్లతో సత్తాచాటారు. నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 8 గంటలకు), దబంగ్ ఢిల్లీతో తమిళ్ తలైవాస్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

క్వార్టర్స్‌లో కిరణ్ జార్జి

ఇక్సాన్ సిటీ: కొరియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ కిరణ్ జార్జి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 44వ ర్యాంకర్ కిరణ్ జార్జి 21–17, 19–21, 21–17తో ప్రపంచ 31వ ర్యాంకర్ చి యు జెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు.



హంపి గేమ్ 'డ్రా'

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి కోనేరు హంపి ఖాతాలో నాలుగో 'డ్రా' చేరింది. అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి 54 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. పది మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. భారత్‌కే చెందిన జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఖాతాలో ఏడో 'డ్రా' చేరింది. స్తవ్‌రులా సొలాకిడూ (గ్రీస్)తో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను దివ్య 55 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఎనిమిదో రౌండ్ తర్వాత హంపి, దివ్య 4 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో ఉన్నారు.

రాహుల్ రాదేశ్ సెంచరీ



జైపూర్: వికెట్ కీపర్ రాహుల్ రాదేశ్ (268 బంతుల్లో 100; 7 ఫోర్లు) సెంచరీతో చెలరేగడంతో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు చేసింది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా రాజస్తాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 144 ఓవర్లలో 410 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 261/5తో రెండో రోజు గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ సాధికారిక ఆటతీరు కనబర్చింది. మిడిలార్డర్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రాహుల్ శతకంతో యాంకర్ రోల్ పోషించగా... చామా మిలింద్ (48; 6 ఫోర్లు, ఒక సిక్సర్), అజయ్ దేవ్ గౌడ్ (35; 4 ఫోర్లు) రాణించారు. ఆఖర్లో తనయ్ త్యాగరాజన్ (22), అనికేత్ రెడ్డి (16) కూడా తమవంతు పరుగులు చేయడంతో హైదరాబాద్ 400 పరుగుల స్కోరును దాటగలిగింది. రాజస్తాన్ బౌలర్లలో అజయ్ సింగ్ 5 వికెట్లు పడగొట్టగా... దీపక్ చహర్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ప్రారంభించిన రాజస్తాన్ ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 117 పరుగులు చేసింది. మహిపాల్ లొమ్రోర్ (61 బంతుల్లో 58 బ్యాటింగ్; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించగా... అభిజీత్ తోమర్ (96 బంతుల్లో 44 బ్యాటింగ్; 7 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. ఒక ఎండ్‌లో అభిజీత్ పాతుకుపోగా... మరో ఎండ్‌లో లొమ్రోర్ వన్డే తరహాలో వేగంగా ఆడాడు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 2.84 రన్‌రేట్‌తో పరుగులు రాబడితే... దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించిన రాజస్తాన్ 3.77 రన్‌రెట్ నమోదు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో అజయ్ దేవ్ గౌడ్ ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న రాజస్తాన్... హైదరాబాద్ స్కోరుకు ఇంకా 293 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) లొమ్రోర్ (బి) అజయ్ సింగ్ 40; అభిరత్ రెడ్డి (బి) అజయ్ సింగ్ 21; రోహిత్ రాయుడు (ఎల్బీ) (బి) అజయ్ సింగ్ 21; హిమతేజ (బి) దీపక్ చహర్ 24; రాహుల్ సింగ్ (సి) అజయ్ సింగ్ (బి) అరాఫత్ ఖాన్ 66; రాహుల్ రాదేశ్ (బి) దీపక్ హుడా 100; అజయ్ దేవ్ గౌడ్ (సి) కునాల్ సింగ్ రాథోడ్ (బి) దీపక్ చహర్ 35; చామా మిలింద్ (సి) రామ్ చౌహాన్ (బి) అజయ్ సింగ్ 48; తనయ్ త్యాగరాజన్ (ఎల్బీ) (బి) అనికేత్ 22; అనికేత్ రెడ్డి (ఎల్బీ) (బి) అజయ్ సింగ్ 16; రక్షణ్ రెడ్డి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17, **మొత్తం (144 ఓవర్లలో ఆలౌట్) 410. వికెట్ల పతనం:** 1–33, 2–70, 3–95, 4–137, 5–206, 6–262, 7–331, 8–365, 9–396, 10–410, **బౌలింగ్:** దీపక్ చహర్ 22–5–60–2; అనికేత్ 24–4–68–1; అజయ్ సింగ్ 47–3–139–5; అరాఫత్ ఖాన్ 21–2–43–1; దీపక్ హుడా 12–4–28–1; జుబైర్ అలీ 12–1–42–0, మహిపాల్ లొమ్రోర్ 2–0–4–0; శుభమ్ గర్వాల్ 4–0–14–0.



పోరాడి ఓడిన సాకేత్–రామ్ జోడీ

మత్సుయామ (జపాన్): యూనిచార్మ్ ట్రోఫీ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ 3–6, 6–4, 9–11తో 'సూపర్ టైబ్రేక్'లో థామస్ ఫ్యాన్‌కట్ (ఆస్ట్రేలియా)–రే హో (చైనీస్ తైపీ) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్‌కుమార్ కీలకదశలో పాయింట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకున్నారు. కేవలం ఒక ఏస్ సంధించిన భారత జోడీ నాలుగు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేసింది. ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు ఏడుసార్లు అవకాశం వచ్చినా ఒక్కసారి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. మరోవైపు ఫ్యాన్‌కట్–రే హో ద్వయం భారత జోడీ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని అందుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్–రామ్‌కుమార్‌లకు 950 డాలర్ల (రూ. 80 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 16 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



ఆరన్ జార్జి డబుల్ సెంచరీ

సాక్షి, హైదరాబాద్: గోవా జట్టుతో జరుగుతున్న కూచ్ బెహార్ ట్రోఫీ అండర్–19 క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు పరుగుల వరద పారించింది. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌ను 136 ఓవర్లలో 9 వికెట్లకు 604 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఓపెనర్ ఆరన్ జార్జి (258 బంతుల్లో 219; 33 ఫోర్లు) డబుల్ సెంచరీతో మెరిశాడు. వన్‌డౌన్ బ్యాటర్ చెప్యాలా సిద్ధార్థ్ రావు (195 బంతుల్లో 101; 15 ఫోర్లు), ఎనిమిదో నంబర్ బ్యాటర్ యశ్‌వీర్ (113 బంతుల్లో 111 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. సీహెచ్ నిశాంత్ రెడ్డి (66; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 139 పరుగులు సాధించింది.

సాయికార్తీక్ జోడీ ఓటమి

నాక్స్‌విల్లె (టెనెస్సీ): నాక్స్‌విల్లె ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ గంటా సాయి కార్తీక్ రెడ్డి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. అమెరికాలోని టెనెస్సీ రాష్ట్రంలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాయికార్తీక్ రెడ్డి (భారత్)–ఫ్రాన్సిస్ కేసీ అలకంటారా (ఫిలిప్పీన్స్) ద్వయం 7–6 (7/3), 6–7 (4/7), 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో ఐడన్ మాయో–గోవింద్ నందా (అమెరికా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది.

ఆంధ్ర ఎదురీత

- తొలి ఇన్నింగ్స్‌లో 92/4
- ఉత్తరాఖండ్ 338 ఆలౌట్


లలిత్ మోహన్

సాక్షి, విజయనగరం: ఆరంభంలో ఆకట్టుకోలేకపోయిన బౌలర్లు... ఆఖర్లో రాణించి ప్రత్యర్థిని కట్టడి చేసినా... బ్యాటర్లు విఫలమవడంతో ఆంధ్ర జట్టు వెనుకబడింది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఉత్తరాఖండ్‌తో విజయనగరం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర టాపార్డర్ విఫలమైంది. ఫలితంగా గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 35.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (64 బంతుల్లో 35; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... మారం రెడ్డి హేమంత్ రెడ్డి (18), కెప్టెన్ షేక్ రషీద్ (0), కరణ్ షిండే (19) విఫలమయ్యారు. ప్రత్యర్థి ప్లేయర్లు క్రీజులో పాతుకుపోయిన చోట ఆంధ్ర ఆటగాళ్లు అదే పట్టుదల కనబర్చలేకపోయారు. రాజస్తాన్ బౌలర్లలో దీపక్ ధాపోలా రెండు వికెట్లు పడగొట్టగా... స్వప్నిల్ సింగ్, మయాంక్ మిశ్రా చెరో వికెట్ తీశారు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 246 పరుగులు వెనుకబడి ఉంది. మాజీ కెప్టెన్ హనుమ విహారి (15 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 232/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 135.2 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ప్రియాన్షు ఖండూరి (299 బంతుల్లో 112) సెంచరీ తర్వాత ఎక్కువసేపు నిలవలేకపోగా... కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (59; 7 ఫోర్లు) అర్ధశతకం చేశాడు. స్వప్నిల్ సింగ్ (38; 4 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించాడు. అఖిల్ రావత్ (0), యువరాజ్ చౌధరి (2), ఆదిత్య తారె (1) విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ 4, శశికాంత్, త్రిపురాణ విజయ్, సత్యనారాయణ రాజు తలా రెండు వికెట్లు పడగొట్టారు.


స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్: అవ్‌నీశ్ (సి) షేక్ రషీద్ (బి) లలిత్ మోహన్ 86; ప్రియాన్షు ఖండూరి (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 112; రవికుమార్ సమర్థ్ (బి) లలిత్ మోహన్ 59; అఖిల్ రావత్ (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 0; యువరాజ్ (బి) సత్యనారాయణరాజు 2; ఆదిత్య తారె (సి) శ్రీకర్ భరత్ (బి) సత్యనారాయణ రాజు 1; స్వప్నిల్ సింగ్ (సి) విహారి (బి) విజయ్ 38; అభయ్ నేగీ (ఎల్బీ) (బి) విజయ్ 15; మయాంక్ మిశ్రా (సి) శశికాంత్ (బి) లలిత్ మోహన్ 1; దీపక్ (సి) హేమంత్‌రెడ్డి (బి) లలిత్ మోహన్ 11; దేవేంద్ర సింగ్ బోరా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13, **మొత్తం (135.2 ఓవర్లలో ఆలౌట్) 338. వికెట్ల పతనం:** 1–157, 2–242, 3–242, 4–254, 5–258, 6–282, 7–312, 8–327, 9–327, 10–338, **బౌలింగ్:** స్టీఫెన్ 29–8–64–0; శశికాంత్ 28–13– 40–2; సత్యనారాయణ రాజు 22–5–75–2; లలిత్ మోహన్ 42.2–6–104–4; త్రిపురాణ విజయ్ 11–1–40–2; హేమంత్ రెడ్డి 3–0–6–0.

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (సి) యువరాజ్ (బి) స్వప్నిల్ సింగ్ 35; హేమంత్ రెడ్డి (సి) ఆదిత్య (బి) దీపక్ 18; షేక్ రషీద్ (బి) దీపక్ 0; కరణ్ షిండే (సి) ఆదిత్య (బి) మయాంక్ మిశ్రా 19; హనుమ విహారి (బ్యాటింగ్) 15; ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం (35.5 ఓవర్లలో 4 వికెట్లకు) 92. వికెట్ల పతనం:** 1–54, 2–54, 3–58, 4–92, **బౌలింగ్:** దీపక్ 10–5–13–2; అభయ్ నేగీ 8–3–16–0; దేవేంద్ర సింగ్ బోరా 10–3–40–0; స్వప్నిల్ సింగ్ 4–1–11–1, మయాంక్ మిశ్రా 3.5–0–8–1.

'శత'క్కొట్టిన కింగ్, కార్టీ

ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో వెస్టిండీస్ విజయం • 2–1తో సిరీస్ సొంతం



బ్రిడ్జ్‌టౌన్: బ్రాండన్ కింగ్ (117 బంతుల్లో 102; 13 ఫోర్లు, ఒక సిక్సర్), కేసీ కార్టీ (114 బంతుల్లో 128 నాటౌట్; 15 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో విజృంభించారు. ఫలితంగా ఇంగ్లండ్‌తో జరిగిన చివరిదైన మూడో వన్డేలో వెస్టిండీస్ 8 వికెట్లతో నెగ్గింది. సిరీస్‌ను 2–1తో దక్కించుకుంది. మొదట ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (108 బంతుల్లో 74; 4 ఫోర్లు, ఒక సిక్సర్), డాన్ మోస్లీ (70 బంతుల్లో 57; 5 ఫోర్లు, ఒక సిక్సర్), స్యామ్ కరన్ (40), జేమీ ఓవర్టన్ (32), జోఫ్రా ఆర్చర్ (17 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. వెస్టిండీస్ బౌలర్లలో ఫోర్డ్ 3 వికెట్లు, అల్జారీ జోసెఫ్, షెఫర్డ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం వెస్టిండీస్ 43 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 267 పరుగులు చేసి గెలిచింది. కింగ్, కేసీ కార్టీ రెండో వికెట్‌కు 209 పరుగులు జోడించడం విశేషం. బ్రాండన్ కింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', మాథ్యూ ఫోర్డ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఆదివారం నుంచి 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభమవుతుంది.

శ్రేయస్ అయ్యర్ 233

- ముంబై తొలి ఇన్నింగ్స్ 602/4 డిక్లేర్డ్
- ఒడిశా తొలి ఇన్నింగ్స్ 146/5




ముంబై: టీమిండియా ఆటగాడు శ్రేయస్ అయ్యర్ (228 బంతుల్లో 233; 24 ఫోర్లు, 9 సిక్సర్లు) డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా ఒడిశాతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌ను 602/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్‌కు ఇదే తొలి డబుల్ సెంచరీ కాగా... సిద్ధేశ్ లాడ్ (169 నాటౌట్; 17 ఫోర్లు) కూడా భారీ సెంచరీ బాదడంతో ముంబైకి తిరుగు లేకుండా పోయింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 354 పరుగులు జోడించారు. ఓవర్‌నైట్ స్కోరు 385/3తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై... మరో 217 పరుగులు జోడించింది. సూర్యాంశ్ (36 బంతుల్లో 79 నాటౌట్; 7 ఫోర్లు, 6 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఒడిశా ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది.



డాక్టర్‌పై అఘాయిత్యం కేసు
విచారణ బెంగాల్‌లోనే

బదిలీకి సుప్రీంకోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసు దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై చోటుచేసుకున్న అఘాయిత్యంపై దర్యాప్తు కొనసాగిస్తున్న సీబీఐ ఆరో స్టేటస్ రిపోర్టును సుప్రీంకోర్టులో సమర్పించింది. వైద్య సిబ్బంది భద్రత కోసం ప్రోటోకాల్ రూపొందించడానికి ఏర్పాటైన నేషనల్ టాస్క్‌ఫోర్స్(ఎన్‌టీఎఫ్) సైతం తమ నివేదికను అందజేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ... ఈ నివేదికను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పంచుకోవాలని ఎన్‌టీఎఫ్‌కు సూచించింది. 10 మంది సభ్యులతో ఎన్‌టీఎఫ్‌ను సుప్రీంకోర్టు గతంలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసు దర్యాప్తును పశ్చిమబెంగాల్‌లోనే కొనసాగించాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై కోల్‌కతా కోర్టులో ఈనెల 4న అభియోగాల నమోదయ్యాయని, ఈ నెల 11 నుంచి రోజువారీ విచారణ కొనసాగుతుందని వెల్లడించింది.





ఛాత్ పూజ ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బిహార్ రాజధాని పట్నాలో గంగా ఘాట్‌కు వేలాదిగా తరలివచ్చి స్నానాలాచరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) కోల్‌కతాలోని గంగా ఘాట్‌లో సూర్యాస్తమయ సమయంలో పూజలు చేస్తున్న మహిళలు

16 ఏళ్లలోపు టీనేజర్లు
సోషల్ మీడియా వాడొద్దు

త్వరలో చట్టం తేనున్న ఆస్ట్రేలియా



మెల్‌బోర్న్: గంటల తరబడి సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్న టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై ఆస్ట్రేలియా ప్రభుత్వం దృష్టిసారించింది. 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియాను వాడకుండా నిషేధం విధించబోతున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ గురువారం ప్రకటించారు. ''మన పిల్లలకు సోషల్‌మీడియా హాని చేస్తోంది. ఈ దుష్ప్రభావాలకు మేం ముగింపు పలకబోతున్నాం. ఈ విషయమై ఇప్పటికే వేలాది మంది తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో మాట్లాడా. అందరిదీ ఒకటే విజ్ఞప్తి. ఆన్‌లైన్ భూతం చెర నుంచి తమ పిల్లల్ని విడిపించాలని ఆశిస్తున్నారు. పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ సేవలపై భరోసా ఇస్తున్నా. 16ఏళ్లలోపు చిన్నారుల సోషల్‌మీడియా వాడకంపై నిషేధం విధిస్తాం. నవంబర్ 18 నుంచి మొదలయ్యే పార్లమెంట్ సెషన్ చివరి రెండువారాల్లో సంబంధిత బిల్లును ప్రవేశపెడతాం. ఏడాదిలోగా నిషేధం అమల్లోకి వస్తుంది''అని అల్బనీస్ మీడియాతో చెప్పారు. ఏడాదికాలం గడువు ఇచ్చిన నేపథ్యంలో ఆలోపు ఆస్ట్రేలియా పిల్లలు మాత్రం ఎక్స్, టిక్‌టాక్, ఇన్‌స్టా గ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి మాధ్యమాలను వాడకుండా ఎలా నిరోధించాలనే దానిపై సామాజికమాధ్యమ సంస్థలు కసరత్తు చేయనున్నాయి. రోజూ స్మార్ట్‌ఫోన్లు, సోషల్‌మీడియాలో బ్రతుకుతూ పిల్లలు వాస్తవ ప్రపంచాన్ని మర్చిపోతున్నారని అన్ని దేశాల్లో తల్లిదండ్రులు ఆందోళనచెందుతున్న వేళ ఆస్ట్రేలియా ఈ దిశగా ఒక అడుగు ముందుకేయడం విశేషం.

మద్యం అక్రమార్కుల ఆటకట్టు

జాగిలాలను రంగంలోకి దించిన గుజరాత్ పోలీసులు

అహ్మదాబాద్: సుశిక్షిత పోలీసులు జాగిలాలు డ్రగ్స్, ఆయుధాలు, బాంబులను కనిపెడతాయన్న విషయం అందరికీ తెలిసిందే. వాసనను బట్టి మద్యం, సంబంధిత ఉత్పత్తులను కూడా ఇవి పసికట్టగలిగితే? ఇంకేముంది? పోలీసుల పని మరింత తేలికవుతుంది. దశాబ్దాలుగా గుజరాత్‌లో సంపూర్ణ మద్య నిషేధం అమలవుతున్న విషయం తెలిసిందే. అయితే, మందు బాబుల కోసం మద్యం అక్రమ తయారీ, రవాణా అక్కడ మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. మద్యం అక్రమార్కుల ఆటకట్టించేందుకు పోలీసులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం కనిపించడం లేదు. మద్యం రవాణాలో అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త దారులు కనిపెడుతూ తమ పనిని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అందుకే, మద్యం తయారీ, నిల్వతోపాటు రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు జాగిలాలకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని కె 9 పోలీస్ డాగ్ స్క్వాడ్ సభ్యులు మొట్టమొదటిసారిగా ఏడాదిన్నర వయస్సున్న అడ్రైవ్, సెమ్రి అనే లాబ్రడార్ రకం కుక్కలకు 9 నెలలపాటు అహ్మదాబాద్‌లోని నరోడాలో ఉన్న పోలీస్ డాగ్ ట్రైనింగ్ స్కూల్‌లో తర్ఫీదు ఇప్పించారు. మద్యం ఆనవాళ్లు కనిపించిన వెంటనే ఇవి మొరగడం లేదా కాలుపైకెత్తి సంజ్ఞ చేస్తాయి. అడ్రైవ్‌ను ఇటీవల రాజ్‌కోట్‌లోని మద్యం కేసులు అధికంగా నమోదయ్యే ధెబర్ కాలనీకి తీసుకెళ్లారు. అడ్రైవ్ ఓచోట మద్యం జాడ కనిపెట్టడంతో కవితా సోలంకి అనే మద్యం తయారీదారుపై కేసు నమోదు చేశారు. మరో జాగిలం సెమ్రికి రాజస్తాన్ సరిహద్దులోని బనస్కాంత జిల్లాలో విధులు కేటాయించారు.

రాజీపడ్డారని కేసు మూసివేస్తారా?

లైంగిక వేధింపుల కేసులో దర్యాప్తు కొనసాగించాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల కేసు విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి నిందితుడు, బాధితురాలి పక్షం రాజీపడినప్పటికీ కేసును మూసివేయలేమని తేల్చిచెప్పింది. ఇలాంటి ఉదంతాలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. దర్యాప్తు కొనసాగించాల్సిందేనని, దోషులను గుర్తించి శిక్ష విధించాల్సిందేనని స్పష్టంచేసింది. రాజస్తాన్ హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. రాజస్తాన్‌లోని సవాయ్ మాధోపూర్ జిల్లాలో 16 ఏళ్ల బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు పెట్టారు. తర్వాత బాధిత బాలిక కుటుంబ సభ్యులతో నిందితుడికి రాజీ కుదిరింది. తాము అపార్థంతో ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశామని, అతడిపై చర్యలు తీసుకోవద్దని, కేసు కొట్టివేయాలని బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. దాంతో పోలీసులు కింది కోర్టులో ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. కింది కోర్టు దాన్ని కొట్టివేయడంతో నిందితుడు రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించాడు. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ ఓ సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రాజస్తాన్ హైకోర్టు ఉత్తర్వుపై అసంతృప్తి వ్యక్తంచేసింది. రాజీపడ్డారన్న కారణంతో కేసును ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించింది. లైంగిక వేధింపుల కేసును మళ్లీ దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది.

భారత్-భూటాన్ సరిహద్దుల్లో
తొలి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్

సాక్షి, న్యూఢిల్లీ: భారత్-భూటాన్ సరిహద్దుల్లో మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ గురువారం అసోంలోని దర్రాంగా వద్ద మొదలైంది. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, భూటాన్ ప్రధానమంత్రి దషో త్సెరింగ్ టొబ్గే కలిసి ప్రారంభించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా కార్యక్రమంలో పాల్గొన్నారు. కీలక ప్రాంతం దర్రాంగాలో మొదలైన ఈ చెక్‌పోస్ట్‌తో రెండు దేశాల మధ్య అనుసంధానత, వాణిజ్య కార్యకలాపాలు మరింత సులభతరం కానున్నాయి. ఇతర దేశాల పౌరుల రాకపోకలకు సంబంధించిన ఇమిగ్రేషన్ తనిఖీలకు ఇక్కడ ఏర్పాట్లున్నాయి. 'మూడో దేశ పౌరులు భూటాన్‌లోకి ప్రవేశించడానికి/నిష్క్రమించడానికి భూటాన్‌లోని పారో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జైగావ్-ఫుయంత్‌షోలింగ్ భూ సరిహద్దుల ద్వారా మాత్రమే ఇప్పటి వరకు, అనుమతించేవారు. కొత్త ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌తో కనెక్టివిటీ మరింత పెరిగి, పర్యాటకంతోపాటు ప్రజల మధ్య సంబంధాలు మెరుగవుతాయి'అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సరిహద్దులకు 700 మీటర్ల దూరంలో 14.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ చెక్‌పోస్ట్‌ను 27వ నంబర్ జాతీయ రహదారితో అనుసంధానించారు.

పప్పూ యాదవ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపు

న్యూఢిల్లీ: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడొకరు తనను చంపుతానని బెదిరించాడంటూ బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం తన సెల్ ఫోన్‌కు రెండు బెదిరింపు మెసేజీలు వచ్చాయన్నారు. కన్నాట్ ప్లేస్ పోలీస్‌స్టేషన్‌లో ఎంపీ పప్పూ యాదవ్ వ్యక్తిగత సహాయకుడు సాదిఖ్ అలం గురువారం ఫిర్యాదు అందించారు. దీనిపై న్యూఢిల్లీ డీసీపీ దేవేశ్ కుమార్ స్పందించలేదు. ఈ నెల 2న జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ మనిషినంటూ పప్పూ యాదవ్‌కు బెదిరింపులు రావడం, ఢిల్లీకి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బిహార్ పోలీసులు ప్రకటించడం తెలిసిందే.

2024.. అత్యుష్ణ ఏడాది!

యూరప్ వాతావరణ సంస్థ అంచనా

షికాగో: గ్లోబల్ వార్మింగ్, వాతావరణ కాలుష్యం దెబ్బకు భూమి నానాటికీ ఊహాతీతంగా వేడెక్కిపోతోంది. ఉష్ణోగ్రతలు రికార్డులు బద్దలు కొడుతున్నాయి. ఫలితంగా అత్యంత వేడి సంవత్సరంగా 2023 సృష్టించిన రికార్డు ఏడాదికే బద్దలైంది. మానవాళి చరిత్రలో ఇప్పటిదాకా అత్యంత వేడి ఏడాదిగా 2024 నిలవనుందని యూరప్ వాతావరణ సంస్థ కోపర్నికస్ పేర్కొంది. గురువారం విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు అంచనా వేసింది. అంతేకాదు, పారిశ్రామికీకరణ ముందు నాటితో పోలిస్తే తొలిసారిగా భూమి సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పైగా పెరిగిన ఏడాదిగా కూడా 2024 నిలిచిందని వెల్లడించింది! గ్రీన్ హౌజ్ వాయు ఉద్గారాలు, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ కాలుష్యానికి తోడు ఎల్‌నినో పరిస్థితులు తలెత్తడం వంటి కారణాలతో 2024లో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీని దాటవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ గత డిసెంబర్‌లోనే హెచ్చరించింది. అదిప్పుడు అక్షరాలా నిజమైంది.

ముంచింది బైడెనే

డెమొక్రాట్ల అంతర్మథనం

- ఆ నీడను వదిలించుకోలేదు
- హారిస్ తీరుపైనా విమర్శలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని డెమొక్రాట్లు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై పార్టీ నేతల్లో తీవ్ర అంతర్మథనం జరుగుతోంది. ఓటమికి అధ్యక్షుడు జో బైడెనే ప్రధాన కారణమంటూ వారిలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. అధ్యక్ష రేసు నుంచి ఆయన ఆలస్యంగా తప్పుకోవడం పార్టీ పుట్టి ముంచిందంటూ మండిపడుతున్నారు. హారిస్ తీరునూ పలువురు నేతలు తప్పుబడుతున్నారు. ''ఉపాధ్యక్షురాలిగా బైడెన్ మానసిక సంతులనం సరిగా లేదని ముందే తెలిసి కూడా సకాలంలో బయట పెట్టలేదు. దానికి తోడు బైడెన్ స్థానంలో అధ్యక్ష అభ్యర్థిగా ఖరారైన తర్వాత కూడా ఆయన నీడ నుంచి బయట పడలేదు''అంటూ వారు ఆక్షేపిస్తున్నారు. ''దాంతో బైడెన్ విధానాలపై రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ పదేపదే తీవ్ర విమర్శలు చేసినా సమర్థంగా తిప్పికొట్టలేకపోయారు. వాటిలో లోటుపాట్లను సరిచేసుకుంటామని స్పష్టంగా చెప్పి ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమయ్యారు''అంటూ వాపోతున్నారు. ఈ దారుణ ఓటమితో డెమొక్రటిక్ పార్టీ భవితపై నీలినీడలు కమ్ముకున్నాయన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

81 ఏళ్ల బైడెన్ తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తానని 2023 ఏప్రిల్లోనే ప్రకటించారు. వయోభారం దృష్ట్యా తప్పుకోవాలని పార్టీ నేతలు చెప్పినా ససేమిరా అన్నారు. పార్టీలో ట్రంప్‌ను ఓడించగల ఏకైక నేతను తానేనని వాదించారు. మరో నాలుగేళ్లు అధ్యక్షుడిగా కొనసాగే సత్తా తనకుందని, దేవుడు తప్ప ఎవరూ తనను తప్పించలేరని చెప్పుకున్నారు. కానీ ట్రంప్‌తో తొలి డిబేట్‌లో ఆయన దారుణంగా తడబడటం, ప్రసంగం మధ్యలో ఆగి పదాల కోసం తడుముకోవడం డెమొక్రాట్లను హతాశులను చేసింది. బైడెన్ మానసిక సంతులనంపై అనుమానాలు పెరిగాయి. అభిప్రాయానికి పార్టీ నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో ఎట్టకేలకు జూలైలో పోటీ నుంచి తప్పుకుని హారిస్‌కు దారిచ్చారు. దాంతో ప్రచారానికి ఆమెకు తక్కువ సమయం లభించింది. దానికి తోడు అప్పటికే ట్రంప్ గెలుపు ఖాయమనే తరహా వాతావరణం నెలకొని ఉంది. దాన్ని మార్చేసి ట్రంప్‌ను గట్టిగా ఢీకొట్టేలోపే పోలింగ్ తేదీ ముంచుకొచ్చింది. ఇదంతా ఆయనకు బాగా కలిసొచ్చిందని డెమొక్రాట్లు ఇప్పుడు తీరిగ్గా నిట్టూరుస్తున్నారు.

బైడెన్ నీడలోనే...

అమెరికాలో గత 70 ఏళ్లలో అత్యంత తక్కువ ప్రజాదరణ పొందిన అధ్యక్షుడు బైడెనేనని గాలప్ పోల్ సర్వే తేల్చింది. ప్రజల మనసులు గెలవలేకపోయిన రిచర్డ్ నిక్సన్, జిమ్మీ కార్టర్ కంటే కూడా ఆయనకు తక్కువ మార్కులు పడ్డాయి. అలాంటి అధ్యక్షుడి నీడ నుంచి హారిస్ బయటపడలేకపోవడం కూడా ఓటమికి గట్టి కారణంగా నిలిచిందని ఆమె సహాయకులే అంటున్నారు. ''ఉపాధ్యక్షురాలిగా బైడెన్ నిర్ణయల్లో తాను భాగమేనని ఆమె భావించారు. అందుకే బైడెన్ విధానాలపై ట్రంప్ విమర్శలను తిప్పికొట్టడంలో వెనకాముందయ్యారు. అలాగాక బైడెన్ విధానాల్లో లోటుపాట్లను సమీక్షించి దేశ ప్రయోజనాలకు అనుగుణంగా సవరించుకుంటామని స్పష్టంగా చెప్పి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది''అని వారంటున్నారు. ఎకానమీ, వలసల వంటి కీలక విధానాలపై ట్రంప్ దూకుడుకు హారిస్ నుంచి గట్టి సమాధానమే లేకపోయిందని గుర్తు చేస్తున్నారు. కనీసం వాటికి దీటైన ఇతర అంశాలను తెరపైకి తేవడంలో కూడా ఆమె విఫలమయ్యారంటున్నారు. అంతేగాక అధ్యక్షుడి మానసిక ఆరోగ్యం, ఫిట్‌నెస్ గురించి తెలిసి కూడా ముందే చెప్పకుండా తమను, అమెరికా ప్రజలను హారిస్ మోసగించారని పలువురు డెమొక్రాట్లు ఆక్రోశిస్తున్నారు. పైగా 78 ఏళ్ల ట్రంప్‌తో పోలిస్తే కొత్త ఓటర్లను ఆకట్టుకోవడంలో 60 ఏళ్ల హారిస్ విఫలమయ్యారని వారు విశ్లేషిస్తున్నారు. తమ ప్రచార తీవ్రత చాలలేదని హారిస్ ప్రచార కమిటీ సీనియర్ సలహాదారు డేవిడ్ ప్లోఫ్ అంగీకరించారు. ఇది దారుణమైన ఓటమేనంటూ ఎక్స్‌లో వాపోయారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పంట వ్యర్థాలు దహనం చేస్తే
భారీ జరిమానా

- రెండెకరాల లోపు రైతులకు రూ. 5వేలు.. ఆపై వారికి రూ.30 వేలు
- కాలుష్యం కట్టడికి కేంద్రం నిర్ణయం.. గురువారం నుంచే అమలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో కాలుష్యాన్ని అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లోని రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్లే గాలి కాలుష్యం ఎక్కువైందన్న ఆరోపణలొస్తుండటం తెలిసిందే. దీనిని కట్టడి చేసేందుకు రైతులపై జరిమానాలను భారీగా విధించాలని గురువారం కేంద్రం నిర్ణయించింది. పంట వ్యర్థాలకు నిప్పుపెట్టే రైతులకు జరిమానాలను భూ విస్తీర్ణం ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు విధించనున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ శాఖలు తెలిపాయి. తాజా నిబంధనల ప్రకారం.. రెండెకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతు తన పొలంలోని వ్యర్థాల్ని కాలిస్తే రూ.5వేలు పెనాల్టీ కట్టాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఇది రూ.2,500 మాత్రమే ఉంది. అదేవిధంగా, 2 నుంచి 5 ఎకరాల భూమి గల రైతు ఇదే పనిచేస్తే రూ.5 వేలు బదులు ఇకపై రూ.10వేలు కట్టాల్సిందే. అయిదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతు పంట వ్యర్థాలకు నిప్పు పెడితే రూ.30వేల వరకు వసూలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ నిబంధనలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయని కేంద్రం ప్రకటించింది. ఇవి 'కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చట్టం -2021'లో భాగమని పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 మార్క్‌ను దాటడంతో జనం పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్యం కట్టడికి తీసుకుంటున్న చర్యలు ఏమిటంటూ గత నెలలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పర్యావరణ పరిరక్షణకు కేంద్రం సరైన చట్టాలను రూపొందించలేకపోతోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే జరిమానాలను విధించేందుకు ఉద్దేశించిన నిబంధనలను కేంద్రం ప్రకటించింది.

పంజాబ్ రైతు సంఘాల నిరసన

పంట వ్యర్థాల నిర్వహణకు అవసరమైన యంత్రాలను అందించడానికి బదులుగా కేంద్రం జరిమానాలను భారీగా పెంచడంపై పంజాబ్‌లోని రైతు సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. వ్యర్థాల నిర్వహణకు యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో మరోమార్గం లేక దహనం చేస్తున్నామే తప్ప, ఉద్దేశపూర్వకంగా కాదని వారంటున్నారు. కాలుష్యానికి కారణమంటూ రైతుల వైపు వేలెత్తి చూపుతున్న కేంద్ర ప్రభుత్వం, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమలపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోవడం లేదని భారతీయ కిసాన్ యూనియన్(ఏక్తా ఉగ్రహన్) ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం 30 శాతం మంది రైతులకు మాత్రమే పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలను అందజేసిందని వివరించారు. పంట వ్యర్థాల వల్ల జరిగే కాలుష్యం కంటే పరిశ్రమలు, రవాణా రంగం వల్లే గాలి కాలుష్యం ఎక్కువని పర్యావరణ నిపుణురాలు సునీతా నారాయణ్ తెలిపారు.

సొంతబిడ్డల్లా సంరక్షిస్తా

నియోజకవర్గ ప్రజలను పరిరక్షిస్తా


- వయనాడ్‌లో ప్రచారసభలో ప్రియాంకాగాంధీ



వయనాడ్(కేరళ): కేరళలో వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో యూడీఎఫ్ అభ్యర్థిగా బరిలో దిగిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. పిల్లల ఆలనాపాలనా తల్లి ఎంత శ్రద్ధగా, జాగ్రత్తగా చూస్తుందో అదేరీతిలో తాను పౌరుల బాగోగులను పట్టించుకుంటానని ప్రియాంక వ్యాఖ్యానించారు. మలప్పురం జిల్లాలోని ఎరనాడ్, నిలాంబూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అకంపదం, పొథుకల్లు పట్టణాల్లో ప్రియాంక ప్రసంగించారు. ''గెలిపించి నాకొక అవకాశం ఇస్తే మీ సమస్యలపై ఒక్క పార్లమెంట్‌లోనేకాదు వేర్వేరు సందర్భాల్లో ప్రతి ఒక్క భిన్న వేదికపై పోరాడతా. గతంలో గెలిపించిన రాహుల్‌పై వయనాడ్ ప్రజలకు ఎంత ప్రేమ ఉందో నాకు తెలుసు. నన్ను గెలిపిస్తే నా కుటుంబానికి ఇంత మద్దతుగా ఉన్న మీకందరికీ సాయపడతా''అని ఓటర్లనుద్దేశించి అన్నారు. ''మోదీ ప్రభుత్వం సాయం అందక వయనాడ్‌లోని కొండలు, గ్రామీణ ప్రాంత రైతులు, చిరువ్యాపారులను ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. బీజేపీ విభజన, విద్వేష రాజకీయాలే ఇందుకు కారణం''అని అన్నారు. వయనాడ్ స్థానానికి నవంబర్ 13వ తేదీన పోలింగ్ జరగనుంది.

● వ్యాపారానికి కాదు..
గుత్తాధిపత్యానికే వ్యతిరేకం

- వ్యాపారాలను కొందరు వ్యక్తులు చెరబట్టడం సరైంది కాదు
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం



న్యూఢిల్లీ: వ్యాపారానికి తాను వ్యతిరేకిని అంటూ బీజేపీ తప్పుడు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. వ్యాపారానికి తాను ఎంతమాత్రం వ్యతిరేకిని కాదని.. గుత్తాధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నానని తేల్చిచెప్పారు. వ్యాపారాలన్నీ కేవలం కొందరు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాహుల్ గురువారం ఒక వీడియోను 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశంలోని ముఖ్యమైన వ్యాపారాలను కేవలం ఒక్కరు లేదా ఇద్దరు లేదా ఐదుగురు వ్యక్తులు చెరబట్టడం, వారే పూర్తిగా ఆధిపత్యం చెలాయించడం సరైంది కాదని పేర్కొన్నారు. తొలుత మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించానని, ఒక వ్యాపారం విజయవంతం కావాలంటే ఏం కావాలో తనకు తెలుసని చెప్పారు. వ్యాపారాన్ని వ్యతిరేకిస్తున్నానంటూ బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని తెలిపారు. ఉద్యోగాలకు, వ్యాపారాలకు, పోటీ తత్వానికి, నూతన ఆవిష్కరణలను తాను పూర్తిగా అనుకూలమేనని స్పష్టంచేశారు. వ్యాపారాల్లో గుత్తాధిపత్యానికి తావులేకుండా అందరికీ తగిన స్వేచ్ఛ, పారదర్శకత, సమాన అవకాశాలు ఉంటే దేశ ఆర్థిక రంగం అభివృద్ధి చెందుతుందని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ''పత్రికలో నా వ్యాసం ప్రచురితమైన తర్వాత కొందరు వ్యాపారవేత్తలు నాతో మాట్లాడారు. వారంతా నిజాయతీగా వ్యాపారం చేస్తున్నవారే. కేంద్రంలోని ఓ సీనియర్ మంత్రి పిలిపించి ప్రధాని నరేంద్ర మోదీ గురించి, మోదీ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల గురించి సోషల్ మీడియాలో మంచిగా చెప్పాలంటూ ఒత్తిడి చేశారని వారు నాతో అన్నారు''అని మరో పోస్టులో రాహుల్ గాంధీ వెల్లడించారు.

రాహుల్ గాంధీ రాసిన వ్యాసం ఇటీవలే ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ప్రచురితమైంది. ఈస్టు ఇండియా కంపెనీ 150 ఏళ్లపాటు భారతదేశాన్ని దోచుకుందని, ఇప్పుడు కొత్త తరహా గుత్తాధిపత్యం ప్రారంభమైందని, కొందరు వ్యక్తులు దేశాన్ని లూటీ చేస్తున్నారని తన వ్యాసంలో ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాసంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీపై ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తున్నారని మండిపడింది. నిజాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయొద్దని హితవు పలికింది. వ్యాపారాలను వ్యతిరేకించడం మానుకోవాలని సూచించింది.

రూ.100 కోట్ల ముడుపుల కలకలం

తిరువనంతపురం: కేరళలోని ఎన్సీపీ (శరద్)కి చెందిన ఏకైక ఎమ్మెల్యే థామస్ కె.థామస్ అధికార ఎల్డీఎఫ్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల చొప్పున ఇవ్వజూపారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జనాధిపత్య కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆంటోనీ రాజు, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ(లెనినిస్ట్) ఎమ్మెల్యే కోవూర్ కుంజుమోన్‌లకు థామస్ ఈ ఆఫర్ ఇచ్చారని అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎల్డీఎఫ్‌లో భాగస్వాములు. ప్రతిగా ఈ ఎమ్మెల్యేలిద్దరూ ఎన్సీపీ(అజిత్)లో చేరడం, పినరయి విజయన్‌పై ఒత్తిడి తెచ్చి కేబినెట్‌లో స్థానం దక్కించుకునేందుకు పథక రచన జరిగిందని ఆరోపణలున్నాయి. జూన్ 5న థామస్ నుంచి ఈ మేరకు తమకు ప్రతిపాదన వచ్చిందని మాజీ మంత్రి కూడా అయిన రాజు సీఎం విజయన్ చెవిన వేశారు. దీనిపై ఆయన కుంజుమోన్‌ను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదంటూ కొట్టిపారేశారు. ఈ వ్యవహారం అక్టోబర్ 25న త్రిసూర్‌లో జరిగిన సీపీఎం సమావేశం సందర్భంగా బయటకు వచ్చింది. ఎల్డీఎఫ్ మిత్ర పక్షం ఎన్సీపీ(శరద్)వర్గం ఎమ్మెల్యే థామస్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోడానికి గల కారణాలను ఈ సమావేశంలో సీఎం విజయన్ చెప్పినట్లు కూడా తెలుస్తోంది. వాస్తవానికి థామస్ కేబినెట్‌లో అటవీ శాఖను కోరుతున్నారు. అయితే, సీఎం విజయన్, సీపీఎంతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్న మంత్రి శశీంద్రన్ ఆ శాఖను వదులుకునేందుకు ససేమిరా అంటున్నారు. అందుకే, ఒక రకంగా సీఎం విజయన్‌పై ఒత్తిడి తేవడం ద్వారా కేబినెట్‌లో చేరేందుకు థామస్ వేసిన పథకంగా భావిస్తున్నారు. ఎన్సీపీ (అజిత్), బీజేపీలు మహారాష్ట్రలో మిత్రపక్షాలే కాబట్టి.. ఈ పథకమే ఫలించి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎన్సీపీ(అజిత్)లో చేరితే కేరళలో బీజేపీకి పరోక్షంగా లాభం కలిగి ఉండేది. ఏదేమైనప్పటికీ, మంత్రివర్గంలో చేరే అవకాశాన్ని ప్రస్తుతానికి థామస్ కోల్పోయినట్లుగానే భావిస్తున్నారు. ఈ పరిణామాలపై తమకెలాంటి సంబంధం లేదని కేరళలో ఎన్సీపీ(అజిత్) నేత మహ్మద్‌కుట్టి స్పష్టం చేశారు. ఆరోపణలపై విచారణకు ఏర్పాటైన ఎన్సీపీ(శరద్) కమిటీ ఎదుట ఇటీవల థామస్ హాజరై, ముడుపుల వ్యవహారంతో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కమిటీ త్వరలోనే ఎన్సీపీ(శరద్) జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పీసీ చాకోకు నివేదిక ఇవ్వనుంది.

సముద్రగుప్తుడికి సమకాలీకుడైన వాకాటక రాజు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

శాతవాహన అనంతర యుగం

1. కీసర సమీపంలో 'ఘటకేశ్వరం' అనే ఘటికా స్థానాన్ని నెలకొల్పిందెవరు?
   1) మాధవవర్మ 2) ఇంద్రభట్టారకవర్మ
   3) విక్రమేంద్రవర్మ
   4) విక్రమేంద్ర భట్టారకవర్మ
2. ఇంద్రభట్టారక వర్మ తన కూతురు ఇంద్ర భట్టారికను ఎవరికిచ్చి వివాహం చేశాడు?
   1) ఈశాన్యవర్మ 2) మొదటి అరికేసరి
   3) మొదటి కీర్తివర్మ 4) శర్వవర్మ
3. గోవిందవర్మ భార్య పేరుపై నిర్మించిన మహాదేవ విహారానికి విక్రమేంద్ర భట్టారక వర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
   1) పేణ్కపర 2) ఇరుణ్డెరో
   3) రాయగిరి 4) భువనగిరి
4. 'జనాశ్రయుడు' అనే బిరుదున్న విష్ణుకుండిన రాజు ఎవరు?
   1) ఇంద్రభట్టారకవర్మ
   2) విక్రమేంద్రవర్మ
   3) రెండో గోవిందవర్మ
   4) నాలుగో మాధవవర్మ
5. పొలమూరు శాసనం వేయించింది?
   1) ఇంద్రభట్టారకవర్మ
   2) నాలుగో మాధవవర్మ
   3) రెండో గోవిందవర్మ
   4) విక్రమేంద్రవర్మ
6. నాలుగో మాధవవర్మ వేయించిన పొలమూరు శాసన కాలం?
   1) క్రీ.శ. 619 2) క్రీ.శ. 620
   3) క్రీ.శ. 621 4) క్రీ.శ. 622
7. విష్ణుకుండిన వంశ చివరి రాజు ఎవరు?
   1) మంచన భట్టారకుడు
   2) రెండో గోవిందవర్మ
   3) మూడో మాధవవర్మ
   4) ఇంద్రభట్టారక
8. నాలుగో మాధవవర్మ ఏ కాలంలో రాజ్యానికి వచ్చాడని బి.ఎన్. శాస్త్రి అభిప్రాయం?
   1) క్రీ.శ. 560 2) క్రీ.శ. 570
   3) క్రీ.శ. 563 4) క్రీ.శ. 573
9. మొదటి గోవిందవర్మ పృథ్వీమూలుడి సహాయంతో ఎవరిని తుదముట్టించాడు?
   1) శాలంకాయనులు
   2) ఆనందగోత్రికులు
   3) రెడ్డి రాజులు 4) బాదామీ చాళుక్యులు
10. మొదటి గోవిందవర్మ భార్య మహాదేవి ఏ మతానికి చెందింది?
    1) జైనం 2) శైవం
    3) బౌద్ధం 4) వైష్ణవం
11. ఇంద్రపురిలో బౌద్ధ మహా విహారానికి మొదటి గోవిందవర్మ అగ్రహారంగా ఇచ్చిన గ్రామం ఏది?
    1) భువనగిరి 2) పేణ్కపర
    3) మోత్కూర్ 4) కొలనుపాక
12. పేణ్కపర అగ్రహారాన్ని ప్రస్తుతం ఏ పేరుతో పిలుస్తున్నారు?
    1) మోత్కూర్ 2) రాములబండ
    3) రాయగిరి 4) పనకబండ
13. పదకొండు అశ్వమేథ యాగాలు, వేయి క్రతువులను చేసినవారు?
    1) మొదటి గోవిందవర్మ
    2) విక్రమేంద్రవర్మ
    3) రెండో మాధవవర్మ
    4) దేవవర్మ
14. ఇంద్రపాలనగరం నుంచి అమరావతికి రాజధానిని మార్చిన విష్ణుకుండిన రాజు?
    1) మొదటి మాధవవర్మ
    2) రెండో మాధవవర్మ
    3) మొదటి గోవిందవర్మ
    4) రెండో గోవిందవర్మ
15. కీసరలోని రామలింగేశ్వరాలయం ఎవరి కాలం నాటిది?
    1) బాదామీ చాళుక్యులు
    2) రాష్ట్రకూటులు 3) విష్ణుకుండినులు
    4) వేములవాడ చాళుక్యులు
16. వాకాటక రాజ్యం ఎవరి పాలన తర్వాత విష్ణుకుండిన సామ్రాజ్యంలో చేరింది?
    1) రెండో పృథ్వీసేనుడు
    2) దామోదరసేనుడు
    3) రెండో రుద్రదేవుడు
    4) దివాకరసేనుడు
17. కీసర రామలింగేశ్వర, చెరువుగట్టు జడల రామలింగేశ్వర, ఇంద్రపాలనగర అమరేశ్వర ఆలయాలను నిర్మించింది ఎవరు?
    1) మొదటి గోవిందవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) రెండో మాధవవర్మ 4) కీర్తివర్మ
18. ఇంద్రపాలనగర తామ్రశాసనాన్ని వేయించినవారు?
    1) విక్రమేంద్రవర్మ
    2) విక్రమేంద్రభట్టారకవర్మ
    3) ఇంద్రభట్టారక వర్మ 4) మాధవర్మ
19. 'ధర్మామృతం' ఏ మతానికి సంబంధించిన కావ్యం?
    1) బౌద్ధం 2) హిందూ
    3) శైవం 4) జైనం
20. ఇక్ష్వాకులను తుదముట్టించి కృష్ణానది దక్షిణ ప్రాంతాన్ని వశపరుచుకున్నవారు?
    1) వాకాటకులు 2) విష్ణుకుండినులు
    3) పల్లవులు 4) రెండో పులోమావి
21. ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల మధ్యకాలంలో తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన రాజవంశం ఏది?
    1) వాకాటకులు 2) పల్లవులు
    3) బృహత్పలాయనులు
    4) ఆనందగోత్రికులు
22. వాకాటకుల రాజధాని ఏది?
    1) విదర్భ 2) ప్రవరపుర
    3) విజయపురి 4) కోటిలింగాల
23. వాకాటక రాజ్య స్థాపకుడు ఎవరు?
    1) మొదటి ప్రవరసేనుడు
    2) మొదటి రుద్రసేనుడు
    3) మొదటి పృథ్వీసేనుడు 4) వింధ్యశక్తి
24. వాకాటకులు ఉత్తర భారతదేశానికి చెందిన వారని పేర్కొన్నదెవరు?
    1) వి.వి.మిరాసి 2) డాక్టర్ జైస్వాల్
    3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎన్.శాస్త్రి
25. వాకాటకులు దక్షిణ భారతదేశానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
    1) వి.వి.మిరాసి 2) జైస్వాల్
    3) ఆర్.సి. మజుందార్ 4) బి.ఎన్.శాస్త్రి
26. ప్రభావతి ఎవరి భార్య?
    1) రెండో రుద్రసేనుడు
    2) మొదటి ప్రవరసేనుడు
    3) వింధ్యశక్తి 4) రెండో చంద్రగుప్తుడు
27. శాతవాహనుల తర్వాత దక్కన్ ప్రాంతాన్ని ఐక్యం చేసి పాలించిన రాజు?
    1) వింధ్యశక్తి 2) రెండో చంద్రగుప్తుడు
    3) ఒకటో ప్రవరసేనుడు
    4) రెండో ప్రవరసేనుడు
28. వాకాటకులపై విస్తృత పరిశోధన చేసినవారు?
    1) కె.సి. చౌదరి 2) ఎ.ఎస్. అల్టేకర్
    3) ఆర్.సి. మజుందార్ 4) జైస్వాల్
29. తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన ఏ రాజుల చరిత్ర మరుగునపడింది?
    1) శాతవాహనులు 2) వాకాటకులు
    3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
30. సముద్రగుప్తుడికి సమకాలీకుడైన వాకాటక రాజు ఎవరు?
    1) మొదటి పృథ్వీసేనుడు
    2) మొదటి ప్రవరసేనుడు
    3) హరిసేనుడు
    4) మొదటి రుద్రసేనుడు
31. వాకాటక మహాదేవి ఎవరి కుమార్తె?
    1) మొదటి పృథ్వీసేనుడు
    2) రెండో పృథ్వీసేనుడు
    3) రెండో రుద్రసేనుడు
    4) దామోదరుడు
32. వాకాటక మహాదేవిని వివాహమాడిన విష్ణుకుండిన రాజు?
    1) రెండో మాధవవర్మ 2) గోవిందవర్మ
    3) విక్రమేంద్రవర్మ 4) రెండో రుద్రసేనుడు
33. వాకాటక రాజవంశంలో పరాక్రమవంతుడిగా ప్రసిద్ధి పొందిన రాజు ఎవరు?
    1) విక్రమేంద్రవర్మ
    2) రెండో మాధవవర్మ
    3) గోవిందవర్మ 4) హరిసేనుడు
34. వాకాటకులు ఏ వర్ణానికి చెందినవారు?
    1) క్షత్రియులు 2) బ్రాహ్మణులు
    3) వైశ్యులు 4) శూద్రులు
35. 'మేఘదూతం' కావ్య రచయిత ఎవరు?
    1) రెండో ప్రవరసేనుడు
    2) సర్వసేనుడు
    3) కాళిదాసు 4) సేతుబంధు
36. 'యాజ్ఞవల్క్య', 'నారదీయకాత్యాయన' అనే స్మృతులను ఎవరి కాలంలో రచించారు?
    1) విష్ణుకుండినులు 2) వాకాటకులు
    3) ఇక్ష్వాకులు 4) పల్లవులు
37. ప్రాకృతంలో 'సేతుబంధం' అనే కావ్యం రాసింది ఎవరు?
    1) కాళిదాసు 2) సర్వసేనుడు
    3) భవభూతి
    4) రెండో ప్రవరసేనుడు
38. ప్రాకృత భాషలో 'హరివిజయం' అనే కావ్యాన్ని రాసినవారెవరు?
    1) కాళిదాసు 2) సేతుబంధు
    3) భవభూతి 4) సర్వసేనుడు
39. వాకాటకుల కాలం నాటి గొప్ప సాంస్కృతిక కేంద్రం ఏది?
    1) రామగిరి 2) రాంటేక్
    3) వత్సగుల్మ 4) కొండాపురం
40. అజంతా, ఎల్లోరా గుహల్లో వాకాటకుల విహార గుహలేవి?
    1) 16, 17వ గుహలు
    2) 16, 15వ గుహలు
    3) 16, 18వ గుహలు
    4) 18, 19వ గుహలు
41. సర్వసేనుడు దేన్ని రాజధానిగా చేసుకొని పాలించాడు?
    1) రాంటేక్ 2) వత్సగుల్మ
    3) రాయగిరి 4) పిల్లలమర్రి
42. విష్ణుకుండినులపై లోతైన పరిశోధన చేసిన వారెవరు?
    1) డాక్టర్ బిరుదురాజు రామరాజు
    2) రాపాక ఏకాంబరాచార్యులు
    3) పి. శ్రీరామశర్మ 4) బి.ఎన్. శాస్త్రి
43. కింది వాటిలో విష్ణుకుండినుల కాలం నాటి నాణేలు దొరికిన ప్రాంతం ఏది?
    1) కీసరగుట్ట 2) నార్కట్‌పల్లి
    3) మౌలాలి 4) ఏలేశ్వరం
44. విష్ణుకుండినులు తెలంగాణ ప్రాంతంలో రాజ్యానికి వచ్చిన కాలం?
    1) క్రీ.శ. 4వ శతాబ్దం చివర
    2) క్రీ.శ. 5వ శతాబ్దం చివర
    3) క్రీ.శ. 6వ శతాబ్దం
    4) క్రీ.శ. 3వ శతాబ్దం
45. విష్ణుకుండిన వంశ స్థాపకుడు ఎవరు?
    1) గోవిందవర్మ 2) విక్రమేంద్రవర్మ
    3) మహారాజేంద్రవర్మ
    4) మాధవవర్మ
46. విష్ణుకుండినుల తొలి రాజధాని వినుకొండ కాదని చరిత్రకారులు తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
    1) భువనగిరి 2) ఇంద్రపాలనగరం
    3) ఏలేశ్వరం 4) విజయపురి
47. విష్ణుకుండినుల తొలి రాజుల్లో అగ్రగణ్యుడు ఎవరు?
    1) మహారాజేంద్రవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) మొదటి గోవిందవర్మ
    4) రెండో మాధవవర్మ
48. మూలరాజు వంశస్థుడైన పృథ్వీమూలుడి కుమార్తె 'మహాదేవి'ని ఎవరు వివాహం చేసుకున్నారు?
    1) మహారాజేంద్రవర్మ
    2) మొదటి మాధవవర్మ
    3) రెండో మాధవవర్మ
    4) మొదటి గోవిందవర్మ
49. ఇంద్రపాలనగర తామ్రశాసనంలో 'మహాకవి'గా ఎవరిని పేర్కొన్నారు?
    1) మాధవవర్మ
    2) ఇంద్రభట్టారకవర్మ
    3) విక్రమేంద్ర భట్టారకుడు
    4) విక్రమేంద్రవర్మ
50. ఈశాన్యవర్మ చేతిలో ఓడిపోయిన విష్ణుకుండిన రాజు?
    1) విక్రమేంద్రభట్టారక
    2) ఇంద్రభట్టారక వర్మ
    3) మాధవవర్మ 4) విక్రమేంద్రవర్మ
51. విష్ణుకుండినుల అనంతరం తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలోకి వెళ్లింది?
    1) రాష్ట్రకూటులు 2) వేంగీ చాళుక్యులు
    3) బాదామీ చాళుక్యులు
    4) వేములవాడ చాళుక్యులు
52. తెలంగాణలో అతి ప్రాచీన శాసనం ఏ ప్రాంతంలో ఉందని చరిత్రకారుల అభిప్రాయం?
    1) ఏలేశ్వరం 2) ఇంద్రపురి
    3) రాయగిరి 4) భువనగిరి

సమాధానాలు

1) 2;	2) 4;	3) 2;	4) 4;	5) 2;
6) 3;	7) 1;	8) 4;	9) 1;	10) 3;
11) 2;	12) 4;	13) 3;	14) 2;	15) 3;
16) 1;	17) 3;	18) 2;	19) 4;	20) 3;
21) 1;	22) 2;	23) 4;	24) 2;	25) 1;
26) 1;	27) 3;	28) 2;	29) 2;	30) 4;
31) 2;	32) 1;	33) 4;	34) 2;	35) 3;
36) 2;	37) 4;	38) 4;	39) 3;	40) 1;
41) 2;	42) 4;	43) 1;	44) 1;	45) 3;
46) 2;	47) 3;	48) 4;	49) 4;	50) 2;
51) 3;	52) 1.			

Spelling వేరైనా Pronunciation ఒకేలా!

Homophones

Two or more words that have different spellings, different meanings but the same pronunciations are called 'Homophones'. (Homophones అనగా వేర్వేరు spelling, వేర్వేరు meaning ఉన్నప్పటికీ, ఒకేలా pronunciation గల పదాలు.)


i) Lead is the heaviest metal.

ii) The teacher led me to the principal's cabin.

పై రెండు వాక్యాలలోని lead, led అనే పదాలను గమనిస్తే, రెండిటినీ ఒకే రకంగా పలుకుతున్నప్పటికీ, వీటి స్పెల్లింగ్, అర్థం రెండు వేర్వేరుగా ఉన్నాయి. మొదటి వాక్యంలోని 'lead'కి 'సీసం'అనే అర్థం, రెండో వాక్యంలోని led కి 'తీసుకొనిపోవు' అనే అర్థాలు ఉన్నాయి. కాబట్టి, ఈ రెండు పదాలని Homophones అంటాం.

ఇప్పుడు ఇలాంటి కొన్ని *Homophones*ని తెలుసుకుందాం.

1. » Incite (verb) = kindle/ encourage (ప్రేరేపించు)
   » Insight (Noun) = intuition, awareness (అంతర్‌దృష్టి/ అవగాహన)
   Eg: The leader was arrested for trying to incite violence.
   Eg: Srinivas has a good insight into the syllabus of this exam.
2. » aid (Noun) = help/assistance (సహాయం)
   » Aide (Noun) = a person who helps (సహాయకుడు)
   Eg: During every Ramzan, Saber gives aid to those who are less fortunate.
   Eg: Saber worked as a tourists' aide in Mecca.
3. » Council = an assembly(సమావేశం /సభ)
   » Counsel = advice (సలహా)
   Eg: He was a member of the Legislative Council.
   Eg: He gave me a very sane counsel.
4. » Born = given birth to. (జన్మించిన)
   » Borne = carried(మోయడం, భరించడం)
   Eg: Srinivas was born on the eleventh of December.
   Eg: Rani's stomachache had to be borne until it finally went away.
5. » aisle (N) = space between rows (మధ్య దారి)
   » isle (N) = island (దీవి)
   Eg: The aisle was crowded with people looking for seats.
   Eg: The British Isles are a great place to visit.
6. » adapt (V) = to make suitable (అనుకూలంగా చేయు)
   » adept (Adj) = skilled (నైపుణ్యం గల)
   » adopt (V) = accept as your own (స్వీకరించు, దత్తత తీసుకొను)
   Eg: I quickly adapted to living away from home.
   Eg: Sheela is adept at speaking languages.
   Eg: It was difficult to adopt only one puppy from the animal shelter.
7. » all ways = by every means or method (అన్ని విధాలుగా)
   » always(Adverb)=forever (ఎల్లప్పుడూ)
   Eg: Lavanya tried all ways to convince me.
   Eg: I always responded calmly during emergency situations.
8. » Cite (V) = quote (ఉదాహరణగా చూపించు)
   » Site (N) = local position (స్థలం, ప్రదేశం)
   » Sight (N) = view; scene (దృశ్యం)
   Eg: I can cite a parallel stanza.
   Eg: This is an ideal site for building a house.
   Eg: It was a horrible sight.
9. » Apposite (Adj) = proper; suitable (సరైనది)
   » Opposite (Preposition) = standing in front of (ఎదురుగా, వ్యతిరేకంగా)
   Eg: He made some very apposite observations on our system of education in his speech.
   Eg: Our school is opposite the church.
10. » Advice (Noun) = recommendation/suggestion (సలహా)
    » Advise (Verb) = to recommend/ to suggest (సలహా ఇవ్వడం)
    Eg: I need your advice on this matter.
    Eg: I advise my students to get first rank.
11. » Complement (Noun) = that which completes (పూరక)
    » Compliment (Noun) = salute; regards (అభినందన, పొగడ్త)
    Eg: This verb must take a complement after it.
    Eg: I offer my sincere compliments to you.
12. » Canvas(N) = a kind of rough cloth (ఒక రకమైన గుడ్డ)
    » Canvass(V) = to solicit votes (ప్రచారం)
    Eg: The tent is made of white canvas.
    Eg: I shall not canvass for any political party.
13. » Brake (N) = a lever; an instrument to stop a wheel (వాహనాలను ఆపునది)
    » Break(v)= to make apart (పగలగొట్టు)
    Eg: The brakes of my scooter are loose.
    Eg: Don't break the mirror.
14. » Bough(N) = a branch of a tree (చెట్టు కొమ్మ)
    » Bow (V) = bend a contrivance to shoot arrows (విల్లు)
    Eg: The monkey sits on the bough of a tree.
    Eg: He came with a bow and arrows.
15. » Duel (N) = a fight between two (ఇద్దరి మధ్య జరిగే పోరాటం)
    » Dual (Adj) = double (రెండు)
    Eg: There was a duel between the two combatants.
    Eg: This machine serves a dual purpose.
16. » Desert = a waste tract of sandy land (ఎడారి)
    » Desert = to leave (వదిలిపెట్టు)
    » Dessert = sweet served after dinner
    Eg: There is little rain in a desert.
    Eg: He deserted his family.
    Eg: There must be a course desserts after dinner.
17. » Eminent = distinguished (ప్రముఖ)
    » Imminent = impending; approaching (జరగబోవు)
    Eg: Many eminent personalities were there.
    Eg:There is imminent danger of war.
18. » Hart = a male deer
    » Heart = an organ of the body
    Eg: He has been arrested for shooting the hart.
    Eg: His heart beat is normal.
19. » Ingenious = clever (తెలివైన)
    » Ingenuous = frank and simple (దాపరికం లేని)
    Eg: He is a very ingenious teacher.
    Eg: I like her for her ingenuous nature
20. » Lightening (V) = making lighter, reducing (తేలిక చేయుట/ బరువు తక్కువ చేయు)
    » Lightning(N) = electric discharge or flash in clouds. (మెరుపు)
    Eg: He has appealed to the High Court for



lightening the sentence.
    Eg: There was fierce lightning and thunder.
21. Cease = stop, discontinue, (ఆపు)
    Seize = catch; hold tightly (స్వాధీన పరుచుకొను)
    Siege = state of being surrounded (ముట్టడి)
    Eg: He ceases to be a Government counsel.
    Eg: He seized the first opportunity.
    Eg: The fort lay in siege for.
22. » ate (verb) = తినెను
    » eight (noun) = ఎనిమిది
    Eg: I ate entire biryani.
    Eg: I will wake up at eight o'clock tomorrow morning.
23. » bare (verb) = ఓర్చుకొను
    » bear (noun) = A large mammal (ఎలుగుబంటి)
    Eg: I can't bear the pain of the wound.
24. » to buy (verb) = కొనుట "to purchase."
    » by (preposition) = చేత
    » bye (exclamation) = short form of "goodbye.
    Eg: I went to a shop to buy a pair of shoes.
    Eg: The food is served by him.
    Eg: I've got to go now, so bye! See you on Sunday!
25. » stationary = standing still (స్థిరమైన/ కదలిక లేని)
    » stationery = writing paper (లేఖన సామగ్రి)
26. » capital = major city (రాజధాని)
    » capitol = government building (ప్రభుత్వ భవనం)
27. » board = piece of wood (చెక్క బల్ల)
    » bored = uninterested (అనాసక్తి)
28. » coarse = rough (మోటుగా వుండే)
    » course = path (మార్గము); series of lectures (ఉపన్యాసాలు)
29. » corps = regulated group (పటాలం, దండు)
    » corpse = dead body (మృతదేహం)
30. » dairy = place where milk products are processed (పాల ఉత్పత్తి క్షేత్రం)
    » diary = personal journal (దినచర్య పుస్తకము)
31. » descent =downward movement (దిగడము)
    » dissent = disagreement (విరోధం, భిన్నాభిప్రాయము)
32. » discreet = modest, prudent
    » behavior (వివేచనగల, తెలివిగల)
    » discrete = a separate thing, distinct (విలక్షణ, ప్రత్యేక)
33. » die = to lose life; (చనిపోవడం)
    » dye = to change or add color (రంగులు అద్దడం)
34. » dyeing = changing or adding color (రంగులు అద్దడం)
    » dying = losing life (చనిపోవడం)
35. » envelop = to surround (verb) (చుట్టుట, కప్పుట)
    » envelope = container for a letter (noun) (letters పంపుటకు ఉపయోగించు కవర్)
37. » forth = forward (ముందుకు)
    » fourth = number four in a list (నాలుగవ)
38. » hoard = a hidden fund or supply, a cache (పోగుచేయు, కూడబెట్టు)
    » horde = a large group or crowd, swarm (అల్లరిమూక, గుంపు)
39. » knew=past tense of "know" (తెలుసు)
    » new = fresh, not yet old (కొత్త)
40. » know = to comprehend (తెలుసు)
    » no = negative (లేదు /కాదు)
41. » loose = unbound, not tightly fastened (వదులుగా వుండే)
    » lose = to misplace (కోల్పోవు, పోగొట్టుకొను)
42. » meat = animal flesh (జంతుమాంసం)
    » meet = to encounter (కలయిక)
    » mete = to measure; to distribute (కొలత, లేదా పంచియిచ్చు)
43. » miner = a worker in a mine (గని తవ్వేవాడు)
    » minor = underage person (noun) (18 సంవత్సరములు నిండనివాడు); less important (adj.) (అప్రధానమైన)
44. » peace = absence of war (శాంతి)
    » piece = part of a whole; (చిన్న ముక్క)
45. » peak = point, pinnacle, maximum (పర్వతశిఖరం, అత్యున్నతి, ఆధిక్యం, కొన, అగ్రం)
    » peek = to peer through or look furtively (దొంగతనముగా లేదా రహస్యంగా చూచుట)
46. » personal = intimate; owned by a person (వ్యక్తిగతమైన)
    » personnel = employees (ఉద్యోగులు)
47. » plain = simple, unadorned (స్పష్టమైన/అలంకారములేని/సాధారణమైన)
    » plane = to shave wood; aircraft (noun) (చదును/విమానం)
48. » right = correct; opposite of left (సరైన /కుడి)
    » rite = ritual or ceremony (ఆచారసంబంధమైన)
    » write=to put words on paper(రాయడం)
49. » road = way, path (దారి /మార్గం)
    » rode = past tense of "to ride" (స్వారిచేసెను)
50. » scene = place of an action; segment of a play (ఒక పని జరిగిన ప్రదేశం /నాటకంలో ఒక దృశ్యం)
    » seen = viewed; past participle of "to see" (చూసెను)


Practice Questions

1. Fill in the blanks with the correct words.
   You need to pay the ____ to go to the ____
   1) fare, fair 2) Fare,fear
   3) Fair, fire 4) Fair, fare
2. Please ______the newspaper over the table.
   1) Lay 2) Lie 3) Lain 4) laid
3. Fill in the blank with a suitable word.
   They had dates for.____
   1) desert 2) Desart
   3) Dessert 4) Deserrt
4. Before the bell rang, the class was ____ to go home.
   1) Already 2) All ready
   3) Allredy 4) Allready
5. The student received a wonderful ____ after his speech.
   1) complement 2) Compliment
   3) Compiyment 4) Camplemant

Answers

1) 1 2) 1 3) 3 4) 2 5) 2

ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. జతపరచండి.
   జాబితా - I
   a) ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు
   b) రాష్ట్రాల్లో ద్వంద్వ పాలన
   c) పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం
   d) మొదటి లా కమిషన్ ఏర్పాటు
   జాబితా- II
   i) భారత ప్రభుత్వ చట్టం - 1935
   ii) భారత భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   iii) భారత ప్రభుత్వ చట్టం - 1919
   iv) చార్టర్ చట్టం - 1883
   ఎ) a-iv, b-ii, c-iii, d-i
   బి) a-ii, b-iii, c-i, d-iv
   సి) a-ii, b-iv, c-iii, d-i
   డి) a-i, b-ii, c-iv, d-iii
2. కింది వాటిలో సరికానిది ఏది?
   1) భారత రాజ్యాంగం 1935 చట్టం జిరాక్స్ కాపీ - కె.టి. షా
   2) భారత రాజ్యాంగం ఒక అందమైన అతుకుల బొంత - మారిస్ జోన్స్
   3) భారత రాజ్యాంగం ఐరావతం లాంటిది - హెచ్.వి. కామత్
   4) భారత రాజ్యాంగ పరిషత్ ఒక హిందువుల సభ - చర్చిల్
   ఎ) 1, 3 బి) 1, 4
   సి) 1, 2, 4 డి) 2, 4
3. కింది వారిలో రాజ్యాంగ పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన వారెవరు?
   ఎ) జవహర్ లాల్ నెహ్రూ
   బి) బి.ఆర్. అంబేడ్కర్
   సి) గోపాలస్వామి అయ్యంగార్
   డి) గణేశ్ వాసుదేవ మావళంకర్
4. జతపరచండి.
   జాబితా - I
   a) రాష్ట్రపతి ఎన్నిక విధానం
   b) రాజ్యాంగ సవరణ విధానం
   c) ఉమ్మడి జాబితా
   d) అవశిష్ట అధికారాలు
   జాబితా- II
   i) కెనడా ii) ఆస్ట్రేలియా
   iii) దక్షిణాఫ్రికా iv) ఐర్లాండ్
   ఎ) a-iv, b-ii, c-iii, d-i
   బి) a-ii, b-iii, c-i, d-iv
   సి) a-iv, b-iii, c-ii, d-i
   డి) a-i, b-ii, c-iv, d-iii
5. కింది వాటిలో సరైనవి ఏవి?
   1) సమాఖ్య ప్రభుత్వ ప్రధాన లక్షణం - కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
   2) పార్లమెంట్ ప్రధాన లక్షణం- శాసన నిర్మాణ శాఖకు కార్య నిర్వాహక బాధ్యత వహించడం
   3) పార్లమెంటరీ విధానంలో మంత్రి మండలి సమష్టి బాధ్యత, వ్యక్తిగత బాధ్యత అనే సూత్రాలతో పని చేస్తుంది
   4) అధ్యక్ష తరహా ప్రభుత్వం సుస్థిర కాలం ఉంటుంది
   ఎ) 1, 2 బి) 3, 4
   సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4
6. రాజ్యాంగ ప్రవేశికకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   1) ఇప్పటి వరకు ఒకేసారి సవరించారు
   2) రాజ్యాంగానికి ఉపోద్ఘాతం
   3) ప్రవేశికకు మూలం నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాలు, ఆశయాల తీర్మానం
   4) రాజ్యాంగ ఆశయాలు - న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం
   ఎ) 1, 2 బి) 1, 4
   సి) 1, 2, 4 డి) 1, 2, 3, 4
7. 'రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను సవరించడానికి గానీ, కుదించడానికి గానీ పార్లమెంటుకు ఎలాంటి అధికారం లేదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
   ఎ) గోలక్ నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్
   బి) కేశవానంద భారతీ Vs స్టేట్ ఆఫ్ కేరళ
   సి) ఎస్.ఆర్. బొమ్మై Vs భారత ప్రభుత్వం
   డి) సరళ ముద్గల్ Vs భారత ప్రభుత్వం
8. పౌరులు ప్రాథమిక హక్కులను వదులుకోవడానికి న్యాయస్థానం అనుమతించదు. ఈ ప్రక్రియను న్యాయ పరిభాషలో ఏమని పేర్కొంటారు?
   ఎ) డాక్ట్రిన్ ఆఫ్ సెపరబిలిటీ
   బి) డాక్ట్రిన్ ఆఫ్ వేవర్ సి) డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్
   డి) డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్
9. ప్రాథమిక విద్యను నిర్బంధ విద్యగా గుర్తించాలని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు వెలువరించింది?
   1) ఉన్నికృష్ణన్ Vs ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
   2) మోహినీ జైన్ Vs కర్ణాటక ప్రభుత్వం
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) 1, 2 డి) ఏదీకాదు
10. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    1) అంబేడ్కర్ ఆదేశిక సూత్రాలను 1935 చట్టం ద్వారా వెలువడిన Instruments of Instructionsతో పోల్చాడు
    2) ఆదేశిక సూత్రాలను సరిగా అమలు చేస్తే భారతదేశం భూతల స్వర్గం అవుతుంది - ఎం.సి. చాగ్లా
    3) ఆదేశిక సూత్రాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం చెందితే రాబోయే ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయినట్లే - బి.ఆర్. అంబేడ్కర్
    4) ఆదేశిక సూత్రాలు..ఒక బ్యాంకు తనకు అనుగుణంగా చెల్లించే చెక్కు లాంటివి - కె.టి. షా
    ఎ) 1, 4 బి) 1, 3, 4
    సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4
11. జతపరచండి.
    జాబితా - I
    a) రామ రాజ్యం, గ్రామ స్వరాజ్య స్థాపన
    b) సంపద వికేంద్రీకరణ
    c) పని హక్కు, నిరుద్యోగ భృతి
    d) భారత సంస్కృతి, వారసత్వ పరిరక్షణ
    జాబితా- II
    i) అధికరణ - 49 ii) అధికరణ - 41
    iii) అధికరణ - 39 iv) అధికరణ - 40
    ఎ) a-i, b-ii, c-iii, d-iv
    బి) a-iv, b-iii, c-ii, d-i
    సి) a-ii, b-iv, c-iii, d-i
    డి) a-i, b-ii, c-iv, d-iii
12. కింది వారిలో ఉప రాష్ట్రపతి కాకుండా రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి ఎవరు?
    ఎ) వి.వి. గిరి బి) జాకిర్ హుస్సేన్
    సి) నీలం సంజీవ రెడ్డి డి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
13. రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
    1) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, విధాన సభ సభ్యులు ఉంటారు
    2) ఎన్నికల గణంలో పార్లమెంట్ సభ్యులు, రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు
    3) ఎన్నికల గణంలో ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విధాన సభ సభ్యులు ఉంటారు.
    4) 16వ రాష్ట్రపతి ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా లోక్‌సభ సెక్రటరీ జనరల్ అనూప్ మిశ్రా కొనసాగాడు
    ఎ) 1, 2 బి) 3, 4 సి) 1, 3, 4 డి) 3
14. జతపరచండి.
    జాబితా - I
    a) లోక్‌సభ రద్దు వాయిదా
    b) పార్లమెంట్ ఉమ్మడి సభల సమావేశం
    c) రాష్ట్రపతి అత్యాదేశాల (ఆర్డినెన్స్) జారీ
    d) రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం
    జాబితా- II
    i) అధికరణ - 85 ii) అధికరణ - 123
    iii) అధికరణ - 143 iv) అధికరణ - 108
    ఎ) a-i, b-ii, c-iii, d-iv
    బి) a-i, b-iv, c-ii, d-iii
    సి) a-ii, b-iv, c-iii, d-i
    డి) a-i, b-ii, c-iv, d-iii
15. కింది వారిలో సభలో సభ్యుడు కాకపోయినప్పటికీ సభాధ్యక్షుడిగా కొనసాగేదెవరు?
    ఎ) లోక్‌సభ స్పీకర్ బి) విధాన పరిషత్ చైర్మన్
    సి) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
    డి) రాజ్యసభ చైర్మన్
16. జతపరచండి.
    జాబితా - I
    a) మైనార్టీ ప్రభుత్వం
    b) జాతీయ ప్రభుత్వం
    c) సంకీర్ణ ప్రభుత్వం
    d) అత్యధిక మెజార్టీ ప్రభుత్వం
    జాబితా- II
    i) జవహర్ లాల్ నెహ్రూ
    ii) మొరార్జీ దేశాయ్
    iii) పి.వి. నరసింహా రావు
    iv) రాజీవ్ గాంధీ
    ఎ) a-i, b-ii, c-iii, d-iv
    బి) a-iii, b-i, c-ii, d-iv
    సి) a-ii, b-iv, c-iii, d-i
    డి) a-i, b-ii, c-iv, d-iii
17. మంత్రి మండలికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    1) మంత్రి మండలి సంఖ్యపై 91వ సవరణ ద్వారా పరిమితి విధించారు
    2) సమష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించి రాజీనామా చేసిన మొదటి మంత్రి బి.ఆర్. అంబేడ్కర్
    3) మంత్రి మండలి సమష్టిగా రాష్ట్రపతికి, వ్యక్తిగతంగా పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తుంది
    4) రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలిని ఏర్పాటు చేసేది, శాఖలు కేటాయించేది ప్రధాన మంత్రి
    ఎ) 1, 4 బి) 1, 2, 3,
    సి) 2, 3, 4 డి) 1, 2
18. కింది వారిలో 1947లో నెహ్రూ మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందని వారు?
    ఎ) అంబేడ్కర్ బి) శ్యామా ప్రసాద్ ముఖర్జీ
    సి) షణ్ముగం శెట్టి డి) పై వారందరూ
19. 'అటార్నీ జనరల్‌కు పార్లమెంట్‌లో సభ్యత్వం లేకపోయినా చర్చల్లో, సమావేశాల్లో పాల్గొనే అధికారం ఉంటుంది' అని తెలిపే అధికరణ ఏది?
    ఎ) అధికరణ - 76 బి) అధికరణ - 88
    సి) అధికరణ - 165 డి) అధికరణ - 78
20. భారత పార్లమెంట్‌కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    1) భారత పార్లమెంట్ పితామహుడిగా ఇంద్రజిత్ గుప్తాను పేర్కొంటారు
    2) మొదటి మధ్యంతర ఎన్నికల ద్వారా 5వ లోక్‌సభ ఏర్పడింది
    3) లోక్‌సభ 3వ స్పీకర్ - హుకుం సింగ్
    4) రెండు దశాబ్దాల తర్వాత పూర్తి మెజార్టీతో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది
    ఎ) 1, 4 బి) 1, 3, 4
    సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4
21. జతపరచండి.
    జాబితా - I
    a) ప్రభుత్వ ఖాతాల సంఘం
    b) ప్రభుత్వ అంచనాల సంఘం
    c) సభా వ్యవహారాల సంఘం
    d) అర్జీలపై కమిటీ
    జాబితా- II
    i) మంత్రులకు కూడా సభ్యత్వం ఉంటుంది
    ii) అతిపెద్ద పార్లమెంటరీ కమిటీ
    iii) సమావేశాల అజెండా రూపకల్పన
    iv) అతి ప్రాచీన పార్లమెంటరీ కమిటీ
    ఎ) a-iv, b-ii, c-iii, d-i
    బి) a-iv, b-iii, c-ii, d-i
    సి) a-ii, b-iv, c-iii, d-i
    డి) a-i, b-ii, c-iv, d-iii
22. ఆర్థిక బిల్లుకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) రాష్ట్రపతి పూర్వ సమ్మతితో లోక్‌సభలో ప్రవేశ పెట్టాలి
    2) లోక్‌సభలో ఆమోదం పొందకపోతే ప్రభుత్వం కూలి పోతుంది
    3) లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభకు పంపితే, ఆమోదించి లేదా వ్యతిరేకించి 14 రోజుల్లోగా తిప్పి పంపాలి
    4) రెండు సభల ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే శాసనం అవుతుంది
    ఎ) 1, 2 బి) 3, 4
    సి) 1, 2, 3 డి) 1, 2, 3, 4
23. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) ప్రవేశ పెట్టేందుకు లోక్‌సభలో 50 మంది సభ్యుల మద్దతు ఉండాలి
    2) తీర్మానం నెగ్గేందుకు లోక్‌సభలో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
    3) లోక్‌సభకు హాజరై, ఓటు వేసిన సభ్యుల్లో సాధారణ మెజార్టీ ఆమోదించాలి
    4) హాజరైన సభ్యుల్లో ప్రత్యేక మెజార్టీ ఆమోదించాలి
    ఎ) 2, 4 బి) 1, 3 సి) 2, 3 డి) 1, 4
24. లోక్‌సభ స్పీకర్‌గా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
    ఎ) నీలం సంజీవ రెడ్డి బి) బలిరాం భగత్
    సి) బలరాం జాకర్ డి) సర్దార్ హుకుం సింగ్
25. జతపరచండి.
    జాబితా - I
    a) అమరేశ్వరీ దేవి b) లీలా సేత్
    c) ఫాతిమా బీవీ d) అన్నా చాందీ
    జాబితా- II
    i) సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
    ii) హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
    iii) ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
    iv) హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి
    ఎ) a-iii, b-iv, c-i, d-ii
    బి) a-iv, b-iii, c-ii, d-i
    సి) a-ii, b-iv, c-iii, d-i
    డి) a-i, b-ii, c-iv, d-iii
26. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం సుప్రీంకోర్టు ఏ అధికార పరిధిలోనిది?
    ఎ) ప్రారంభ అధికార పరిధి
    బి) అప్పీళ్ల విచారణ పరిధి
    సి) సలహాపూర్వక పరిధి డి) పైవేవీ కాదు
27. కింది వాటిలో సరైంది ఏది?
    1) మన రాష్ట్ర విధాన పరిషత్ విరామ కాలం 22 ఏళ్లు
    2) విధాన పరిషత్ ఏర్పాటు లేదా రద్దు న్యాయశాఖ పరిధిలోకి వస్తుంది
    3) విధాన పరిషత్ రద్దు గురించి ఆర్టికల్ 169 తెలియజేస్తుంది
    4) ప్రస్తుతం విధాన పరిషత్ 7 రాష్ట్రాల్లో అమల్లో ఉంది
    ఎ) 1, 3 బి) 2, 4
    సి) 2, 3, 4 డి) 1, 2, 3, 4
28. ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేసిన వారెవరు?
    ఎ) యడ్యూరప్ప బి) జగదాంబిక పాల్
    సి) నాదెండ్ల భాస్కర్ డి) జానకీ రామచంద్రన్
29. రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్లు కేటాయించాలని సిఫారసు చేసిన కమిటీ?
    ఎ) సర్కారియా కమిటీ బి)రాజమన్నార్ కమిటీ
    సి) సంతానం కమిటీ డి) పైవేవీ కావు
30. ప్రణాళికలు, సాంఘిక సంక్షేమం ఏ జాబితాలోకి వస్తాయి?
    ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా
    సి) ఉమ్మడి జాబితా డి) అవశిష్ట అంశాలు
31. కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం కోసం సూచనలు చేయడానికి ప్రత్యేకంగా నియమించిన తొలి కమిటీ ఏది?
    ఎ) పరిపాలన సంస్కరణల సంఘం
    బి) రాజమన్నార్ కమిటీ
    సి) రంజిత్ సింగ్ సర్కారియా కమిటీ
    డి) ఎం.ఎం. పూంఛీ కమిటీ
32. భారతీయ జనతా పార్టీని ఎప్పుడు స్థాపించారు?
    ఎ) 1951 బి) 1976
    సి) 1980 డి) 1984

సమాధానాలు

1) బి	2) డి	3) డి	4) సి	5) డి
6) డి	7) ఎ	8) బి	9) సి	10) డి
11) బి	12) డి	13) బి	14) బి	15) డి
16) బి	17) డి	18) డి	19) బి	20) డి
21) ఎ	22) సి	23) ఎ	24) బి	25) ఎ
26) ఎ	27) డి	28) బి	29) బి	30) సి
31) సి	32) సి			

How many floors are there between..

MODEL QUESTIONS



BANK EXAMS

REASONING

Directions (Q.No. 1-5): Study the information and answer the given questions:

There are eight persons A,B,C,D,E, F, G and H seated in a circle all facing away from the centre but not necessarily in the same order. F is third to the left of D. G is immediate neighbour of D. A is second to the right of B. C is immediate neighbour of neither A nor B. There are three persons between E and G. E is immediate neighbour of B. F is not the neighbour of B.

1. Who is second to the left of B?
   1) F 2) E 3) C
   4) D 5) None of these
2. Who is between E and H?
   1) F 2) B 3) C
   4) D 5) None of these
3. If F and G interchange their positions, then who will be second to the right of E?
   1) F 2) G 3) C
   4) D 5) None of these
4. In which of the following pairs is the second person to the immediate left of first person?
   1) CF 2) EG 3) BA
   4) GD 5) None of these
5. How many persons are seated between F and H?
   1) Three 2) Two 3) One
   4) None 5) None of these

Directions (Q.No.6 -10): In these questions, the relationship between different elements is shown in the statements.

Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows.
4) If neither conclusion nor II follows.
5) If both conclusion I and II follow.

6. Statements: $D < M > P, B \le D, Q \le P$
   Conclusion: I. $Q < B$
   II. $Q = B$
7. Statements: $K > L \ge P \le S, Q < P, L < O$
   Conclusion: I. $O > K$ II. $L > Q$
8. Statements: $X=P \ge C < Z, B > X$
   Conclusion: I. $B > C$ II. $B < Z$
9. Statements: $Q > Y \ge D, P = Q, P \le C$
   Conclusion: I. $C > D$ II. $D < Q$
10. Statements: $M \le L < D, M \ge N, P = N$
    Conclusion:I. $M \ge P$
    II. $N < D$

Directions(Q.No. 11-16): Read the questions carefully and answer them.

There are eight persons M, N, O, P, Q, R, S and T stay in a same building that has eight floors numbered one to eight (the ground floor is numbered 1, the floor above it is numbered 2 , and so on, and the top most floor is numbered 8). But these people do not necessarily stay in the same order given. Each one has a different occupation - Doctor, Professor, School Teacher, Musician, Business Person, Bank Manager, Accountant and Engineer, again not in the same order. Each one plays a different game - hockey, volleyball, basketball, badminton, chess, cricket, football and tennis.

There are two floors between the floors of R and Q. R does not play volleyball and does not live on even numbered floor.

There is one floor between the floor of Accountant and the one who plays football.

Accountant plays badminton and lives on even numbered floor, but not on the top floor.

Professor plays basketball and lives on third floor.

R is not professor. S does not play either football or basketball. S does not live on a floor immediately above or immediately below the floor on which P lives. P is not bank manager and he does not play tennis, volleyball or hockey

M, a school teacher, lives just above the floor of business person and just below the floor in which accountant lives. T, a musician, who plays chess, lives on the floor above the R's floor but not on the Top floor. There is only one floor above the floor in which Engineer lives. Business person plays cricket and lives on fourth floor. M does not play volleyball or hockey. O is not an Engineer and neither plays badminton nor plays football.

11. Which of the following games School Teacher plays?
    1) Volleyball 2) Tennis 3) Hockey
    4) Football 5) None of these
12. On which of the following floors does S live?
    1) 1.8th 2) 3rd 3) 6th
    4) 5th 5) None of these
13. Which of the following games Engineer plays?
    1) Volleyball 2) Tennis 3) Hocke
    4) Football 5) None of these
14. Who among the following lives on the topmost floor, i.e floor number 8?
    1) N 2) P 3) S
    4) O 5) None of these
15. How many floors are there between the floors on which P & O live?
    1) One 2) Two 3) Three
    4) Four 5) None of these
16. Who among the following is Bank Manager?
    1) N 2) P 3) R
    4) O 5) None of these

Directions (Q.No. 17-22): Study the information and answer the given questions:

There are ten persons A, B, C, D, E, F, G, H, I and J seated in a line all facing north direction, but not necessarily in the same order.

J is fourth from the right end . B is third to the left of D who is second to the left of J. There are two persons between E and G. There is only one between F and D.

There are two persons between A and C. G and E are not the neighbours of I. C is not the neighbour of J. B is not seated next to G. H is eighth from the left end.

17. Who is seated between G and A?
    1) None 2) D 3) H
    4) G 5) J
18. What is C's position with respect to D?
    1) Second to the left
    2) Fourth to the right
    3) Fourth to the left
    4) Third to the left 5) Fifh to the left
19. Four of the following five are alike in a certain way based on their seating position in the line and so form a group. Which is the one that does not belong to the group?
    1) BE 2) HC 3) JA
    4) DG 5) AI
20. Who is fourth to the right to the one who is immediate left of B?
    1) None 2) D 3) A
    4) G 5) J
21. Who is as away from A as A is placed from I?
    1) J 2) D 3) G
    4) F 5) B
22. Which of the following pair sits at the extreme corners of the row?
    1) D, E 2) E, A 3) A, C
    4) E, I 5) None of these

Directions (Q.No. 23-27): Read the information carefully and answer the following questions.

Seven members D, G, A, E, C, F and B represent different places viz, Hyderabad, Guntur, Kurnool, Visakhapatnam, Suryapet, Vijayawada and Siddipet; each one competing for a different sport, viz. Volleyball, Archery, Rifle Shooting, Tennis, Boxing, Basketball and Football. The order of persons, places and games is not necessarily the same.

D represents Guntur for Archery.

G represents Hyderabad but not for Volleyball or Rifle Shooting.

E represents Vijayawada for Basketball.

A competes for Volleyball but not from Kurnool.


F competes for Rifle Shooting.

The one who represents Siddipet competes for Boxing. The one who represents Suryapet competes for Tennis. C does not represent Kurnool or Siddipet.

23. Which of the following combinations is correct?
    1) B-Boxing-Visakhapatnam
    2) F-Tennis-Suryapet
    3) A-Tennis-Visakhapatnam
    4) C-Tennis-Suryapet
    5) None of these
24. Which of the following combination is correct?
    1) A - Suryapet 2) F-Visakhapatnam
    3) C- Kurnool 4) B-Siddipet
    5) None of these
25. 'A' represents which place?
    1) Visakhapatnam
    2) Suryapet 3) Siddipet
    4) Kurnool 5) None of these
26. The one who competes for Rifle Shooting, represents which place?
    1) Visakhapatnam
    2) Kurnool 3) Siddipet
    4) Hyderabad 5) None of these
27. For which game does G compete?
    1) Boxing 2) Football
    3) Tennis
    4) Cannot be determined
    5) None of these

Key with Solutions

(1 - 5):



1) 4; 2) 2; 3)2;
4) 1; 5) 1;

(6-10):

6) 4; $B \le D < M > P \ge Q$
B and Q cannot be compared. Hence, neither I nor II follows.

7) 2; $K > L < O$. Hence, K and O cannot be compared.
$L \ge P > Q \Rightarrow L > Q$. Hence, Conclusion II is true.

8) 1; $B > X = P \ge C < Z$
Hence, $B > C$. So, conclusion I is true. B and Z cannot be compared. So, conclusion II is not true.

9) 5; $C \ge P = Q > Y \ge D$
Hence, $C > D$. Conclusion I is true.
Hence, $Q > D$. Conclusion II is also true.

10) 5; $M \ge N = P$. Hence, conclusion I is true.
$D > L \ge M \ge N$. Hence, conclusion II is also true.

(11-16):

Floor	Person	Profession	Game
8	P	Doctor	Football
7	N	Engineer	Volleyball
6	S	Accountant	Badminton
5	M	Teacher	Tennis
4	Q	Business person	Cricket
3	O	Professor	Basketball
2	T	Musician	Chess
1	R	Bank manager	Hockey

11) 2; 12) 3; 13) 1;
14) 2; 15) 4; 16) 3;

(17 -22):

E B F G D A J H C I

17) 2; 18) 2; 19) 5;
20) 2; 21) 5; 22) 4;

(23 - 27):

Person	Place	Game
A	Visakhapatnam	Volleyball X Kurnool
B	Siddipet	Boxing
C	Suryapet	Tennis X Kurnool/Siddi
D	Guntur	Archery
E	Vijayawada	Basketball
F	Kurnool	Rifle
G	Hyderabad	Football X VB/Rifle

23) 4; 24) 4; 25) 1;
26) 2; 27) 2.